భారతి

సాహిత్య మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

జూన్ 1959

సంపుటము 36 : : సంచిక 6

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

జూన్ 1959

జూలైనెల సంచికలో

విశ్వనాథ మధ్యాక్కఱలు : శ్రీగిరి శతకము

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

శ్రీనీరధి నిషంగ, భక్తజనతతి శ్రేయోఽనుషంగ!
మానాథశరసంగ, ప్రౌఢ వృషభరాణ్మాద్యత్తురంగ!
క్ష్మానూతన శతాంగ! సంగతోష్ణీష సారాంబుభంగ!
శూలాభిషంగ! శ్రీశైలమల్లికార్జున మహాలింగ!

నాలోన శుష్కతృణంబు ముట్టించినావు దృగ్వహ్ని
నీలలోహిత! దైన్యభావనామంజులోహిత! నీవు
జ్వాల తానది వేలు, నిద్దివేలుగా సంతరించకు వె
శూలాభిషంగ! శ్రీశైల మల్లికార్జున మహాలింగ!

నాలోన నెంతగాఁ ద్రవ్వుకొన్నఁ బినాకి! కన్పడవు
ఆలోకరమణీయ శారదాంభోధరాస్నిగ్ధమూర్తి
నీలోనఁ ద్రవ్వి నీలోఁతు తెలియగానేర, నిన్నెంచి
సోలిపోఁజాల! శ్రీశైల మల్లికార్జున మహాలింగ!

నాతల, నర్మమంజీర! నీపాద నాళీకమందుఁ
బ్రాఁతిగా నిచ్చలు, నడుము వంచుచు వ్రాల్చినయట్లు
చేతోఽంబుజాతంబునందు నాకు భాసించుచుండెడిని
జోతలుగాఁగ, శ్రీశైలమల్లికార్జున మహాలింగ!

ఆ మానసికమైన మూర్తి, అట్లు నిరంతంబు గాఁగ
స్వామి! దీపించుచునుండి, కొంతలాభంబు కావచ్చు
ఈమేన శిలగాఁగ నచట నున్నచో నెల్లకాలంబు?
సోమకిరీట! శ్రీశైల మల్లికార్జున మహాలింగ!

నా గుండె తీసి నీపాదమూలంబునం బెట్టుమనుము
మాఁగువారిన శ్రద్ధ సుంత మసలిన మార్పేరఁ బిలుము
ఊగులాడితినేని పందజన్మ లిటొగ్గకు! నీదు
జోగిని నేను! శ్రీశైల మల్లికార్జున మహాలింగ!

నేనెంత! నా బ్రదుకెంత! సృష్టిలో నిజము నావంటి
మానవుల్ మూఁడుకాలములఁ బుట్టుచు మడియుచున్నారు
కానగా సర్వదేశములయందు, జగం బొకపెద్ద
సూనాపణంబు శ్రీశైల మల్లికార్జున మహాలింగ!

కోరి, కబేలాకు, మందగాఁ దోలికొనిపోవుచుండ
దారి ప్రక్కనయున్న పచ్చిగడ్డిపైఁ దారాడుపసుల
తీరుగా నున్నది జనుల భోగాశ! తెలివి సర్వమ్ము
చూఱపుచ్చెదవు, శ్రీశైల మల్లికార్జున మహాలింగ!

మానసం బింతయుఁ గొల్లవోయి నీ మహనీయమూర్తి
లోని, వెల్గు పిసరు, తోచనీనంత లోఁకువైపోతి
వీనినిఁ బెట్టెడుబాధ వేనినిఁ బెట్టవు నీవు
సూనాస్త్రవైరి! శ్రీశైల మల్లికార్జునమహాలింగ!

ఒకరెల్లగా వత్తువో యటంచు నే నోగి నిశీథముల
ముకుళించుకొన్న నెన్నుదురు నడుమ నీమూర్తికై వేతు
నకట! తా నరుదెంచు నంధకుఁడు, వాని వారింపనంత
సుకరంబుగాదు శ్రీశైలమల్లికార్జున మహాలింగ!

వికృతి వివేక కర్తృత్వము

శ్రీ తూమాటి దోణప్ప

వికృతి వివేక మథర్వణకృతము గాదనియు, కవిశిరోభూషణ కర్తయగు అహోబల పండితుడే దీనిని రచించి గ్రంథప్రామాణ్యసంసిద్ధికయి అథర్వణుని పేరుపెట్టెననియు పెక్కురు పరిశోధక పండితుల అభిప్రాయము.[1] అంతరంగికములగు మరికొన్ని సాక్ష్యముల మూలమున పై అభిప్రాయమును బలపఱుచుటయే ఈ వ్యాసప్రధానోద్దేశము. అవ్యయక్రియాస్వత్వాది ఆంధ్రశబ్దచింతామణి సూత్రోపదిష్ట భావములను విస్తృతము సేయు తలంపుతో వికృతి వివేకకర్త 'భావిక్రియాసు యస్య స్యాత్ విత్వమేవ ప్రయోగితః, ... డోలాభూషోత్తరీయాణి విత్వైత్వం నాస్తి మస్యయః' (అథర్వణకారికావళి, సంజ్ఞ 14–15పుటలు, వావిళ్ళ, 1955) అను కారికలను రచించినాడనుట సిద్ధసాధకాంశము. డోలాభూషోత్తరీయ శబ్దార్థకములగు ఉయ్యెల, తాయెతు, పయ్యెద–శబ్దములందక్క తక్కిన నామపదములలో మస్యగత యకారముమీద విత్వ ముండదని డోలేత్యాదికారిక తాత్పర్యము. దీనిమూలముగా వైయాకరణలోకమున చెలరేగిన వాదప్రతివాదముల సమీక్ష కిది అవసరము కాదు. మీది డోలేత్యాదికారికను, అందును ముఖ్యముగా భూషాశబ్దార్థకము 'తాయెతు'ను గూర్చి చర్చించుట వరకే ఈ వ్యాసపరిధి పరిమితమయినది.

నా రెఱిగినంతమేర 'తాయెతు' శబ్ద సంబంధి చర్చను సాగించిన లాక్షణికులలో ముద్దరాజు రామన (క్రీ. శ. 1570–1600) మొదటివాడు. "తాయెతును నుయ్యెలయును బయ్యెదయును దక్క–గలుగ దెత్వంబు మస్యయాకారములకు–గుదురు గియదక్క నెత్వంబుగదియ దాది—నత్వ మొందదు తెనుగుల నబ్జనాభ" 2 (కవిజన సంజీవని, ప్రథమ తరంగము, యతిపద్ధతి, 117వ ప.—వావిళ్ళ, 1920). ఏతద్విషయక పరామర్శ మొనర్చిన తరువాతి లాక్షణికు లెల్లరును భూషాశబ్దమును 'తాయెతు' అనియే అనువదించుచు వచ్చిరి. కాకునూరి అప్పకవి (క్రీ. శ. 1656) "గంటి నుయ్యెల పయ్యెద తాయెతు లను–గల యకారంబులకు వక్రములని జంబు–ముద్దరాజు రామనవాని మాటిని బడ–మస్యయాలని చెప్పె నిమ్మాట మిథ్య" (అప్పకవీయము, 2 ఆశ్వా. 184వ ప... వావిళ్ళ, 1951), "ఊచు నెల కాకగుటచేత నుయ్యెలయ్యె, బయిని వెడపున్క వక్రోక్తి బయ్యెదయ్యె–దల్లి కాపునకై కట్టనగిన యెత్తు—దేలకల్క గ దాయెతు దేశ్యమునను" (పైది. 2–185) అని వ్యాఖ్యానించినాడు. గణపవరపు వేంకటకవి (క్రీ. శ. 1676–1700) "ఊయెలపయ్యెద, తాయెతుల నడిమి యెత్వమునకు యత్వమేత్వమునను" (ఆంధ్రకౌముది, సర్వలక్షణ శిరోమణి యందలి సీసమాలిక, 2వ పుట, ఆంధ్రసాహిత్య పరిషత్తు, కాకినాడ, 1935) అని వివరించినాడు. కూచిమంచి తిమ్మకవి (క్రీ.శ.1700–1757) "తాయతయు నుయ్యెలయు బయ్యెదయు ననంగ–గలుగ దత్వంబు మస్యయాకారమునకు – ననుచు మును ముద్దరాజు రామన వచించె–గాని యత్వంబు గృతులందు గలదు శర్వ" (సర్వలక్షణ సారసంగ్రహము, 1–190, మంజువాణీ ముద్రాక్షరశాల, ఏలూరు, 1914) అని రామనను నవరింప నెంచి కొవలయు వలయు ప్రయోగముల

---

1. పాడి వేంకటస్వామి గారు, "త్రిలింగ శబ్దానుశాసనము, అథర్వణకారికలు," ఆంధ్రపత్రిక, ఉగాది సంచిక, 211–214 పుటలు. 1911 ఏప్రిలు నెల 12; కందుకూరి వీరేశలింగము పంతులు గారు, ఆంధ్రకవుల చరిత్రము, ప్రథమ భా. 256–274 పుటలు, రివైజ్డ్ ఎడిషన్; కొమర్రాజు వేంకటలక్ష్మణరావు గారు, అథర్వణాచార్యులు, ఆంధ్రవిజ్ఞానసర్వస్వము, మొదటి సంపుటము. 455–461 పుటలు; చాగంటి శేషయ్య గారు, ఆంధ్రకవి తరంగిణి, 3వ సంపు. 75—88 పుటలు.

2. తాయెతాది శబ్దోదాహృతులయొక్క రామనాదుల కృతులలోని పద్యముల పాఠాంతర ప్రదర్శన మిట ప్రసక్తము కాదు—వివరములకు లింగముకుంట తిమ్మకవి కృతసులక్షణసారము, రావూరి దొరసామి శర్మ గారిచే పరిష్కృతము, 95—96 పుటలు.

సెత్తి నూపినాడు. ద్వితింత్రిణీ సీతారామకవి (క్రీ. శ. 18వ శతాబ్ది ?) “ఉయ్యాల, తాయెతు, పయ్యెదలను శబ్దంబులందప్పఁ బనముగ్య యకారమునకు నేత్వము లేదు.” (కవి జనరంజనము, వికృతి వివేకటీక, 15వ పు. వావిళ్ళ, 1955) అని వికృతి వివేకస్థిత డోలేత్వాది కారికకు అర్థము చెప్పినాడు. చిన్నయసూరి (క్రీ. శ. 1806—1862)యు “ఊయేల పయ్యెద తాయెతులం ద్రిక్క నామంబులందు యాకుం దాలవ్యవక్రయోగంబు లేదు” (బాలవ్యాకరణము, ప్రకీర్ణక. 3వ సూ.) అని పూర్వలాక్షణికుల ననువదించినాడు. పాలపర్తి నాగేశ్వరశాస్త్రిలు (క్రీ. శ. 1869) “ఉయ్యెల–పయ్యెద–తాయెతు. అను శబ్దములయందుఁ దక్క మధ్య యకారంబున కేత్వంబు లేదు. ఈ మూఁడుపదములందున్న మధ్య యకారి మకారముగా సత్కవిప్రయోగంబులయం దొకానొకచోటఁ గానంబడుటవలన నదియు సాధువుగానే గ్రహింపవలయును”—(సటీకాంధ్రశబ్దచింతామణి, 14వ పు, పసల—పార్థసారథినాయనిచే విద్వన్మోదతరంగిణీ ముద్రాక్షరశాలలో ముద్రితము, ప్రచురితము, 1869) అని అద్యక్రియాస్వేత్వాది సూత్రమునొద్ద వివరణము వ్రాసిరి. పిల్లలమఱ్ఱి నాగలింగశాస్త్రిలు (క్రీ. శ. 1888) తాతంభట్టు పేర ప్రకటితమయిన సులక్షణసారమను ఛందోగ్రంథమున ‘యావడి’ యను శీర్షిక క్రింద నుదాహృతమయిన ‘తాయెతును నుయ్యెలయు...’ అను ముద్దరాజు రామనపద్యమునకు వ్యాఖ్య వ్రాయుచు “...తాయెతు నుయ్యెల పయ్యెద యను పదంబు లేకపదంబులని యీ కవికి తాత్పర్యంబు గాన నీ మూఁడు పదములయందును మధ్యనున్న యకారమెత్వవిశిష్టమైనదే కాని అత్వవిశిష్టంబైనది కాదనియును భూతార్థక్రియాంత్యమందుఁ గనియె వినియె చనియె ననుచోట నటువలెనే అత్వంబు గాదనియుం దాత్పర్యము” అని వివరించిరి. (శ్రీ వాణీ వినోద మందిర, కవిరంజనీ, గీర్వాణ భాషా రత్నాకర ముద్రాక్షరశాలలయందు మదరాసులో 1888న ముద్రితము, ప్రచురితము. 54-55 పుటలు. తరువాతి ముద్రణము–చెన్నపట్టణం పమ్మి అరుణాచలం శెట్టివారి స్వకీయ శ్రీ వెంకటేశ్వర ముద్రాక్షరశాలయందు 1900లో ముద్రితము, ప్రచురితము—నందును ఇట్లే కలదు. 1924 నాటి వావిళ్ళవారి ప్రతియు దీనికి నకలు.) వెంకయ్య వ్యాకరణమునందును “ఉయ్యెల–పయ్యెద–తాయెతు ఈ మూఁడుశబ్దములయందున్న మధ్య యకారమెత్వముగలది” (తే. వెంకయ్య, ఆంధ్ర వ్యాకరణము, సంజ్ఞా. 17, సూ, వావిళ్ళ, 1916) అని వివృతిమయినది. ‘తాయెతు’ను గూర్చి ఇదీ మనలాక్షణికులు చెప్పిన సంక్షిప్త చరిత్ర.

‘తాయెతు’ అనఁగా రక్షార్థము గాని, అలంకారార్థము గాని సిగనో, కంఠమునో, చందిటనో, మొలనో కట్టికొను వస్తువిశేషమని నిఘంటువుల నిర్వచనము. ఆంధ్రనిఘంటువులలో ఈ పదము తాయిత, తాయితు, తాయిత్తు, తాయెత, తాయెతు, తాయెత్తు, తాయెదు, తావిత, తావితు, తావీజు, తావీజా, దాయితి అను రూపములతో ఉల్లేఖింపబడినది.[3] ఆంధ్ర సాహిత్యమున అర్వాచీనములగు రచనలయందే ఇది కనబడుచున్నది. శ్రీనాథకృతముగా ‘నైలామణి’ యను చున్న పల్నాటి వీరచరిత్రము దీనికి తొలి ఆకరము. ఆ వెనుక రాయలయుగమునుండియు దీనికి విశేషవ్యాప్తి కలిగినది. కొన్ని ఆకరములను పరిశీలించినచో ఆయాదేశకాలములలోని దీనివ్యాప్తి తెల్లము కాగలదు. “మేనికి రక్షయైమించు తాయెతులు” (పల్నాటి వీర చరిత్ర. 17, పు. క్రీ. శ. 1440), “దండడికడియములు దంట తాయెతులు” (పైది. 72, పు.), “తాయెతుల బాహులు” (మనుచరిత్ర. 6 ఆశ్వా. 44 ప. క్రీ. శ. 1509-1530), “మందుల తాయెత్తులు” (కాళహస్తి మాహా. 3-32, క్రీ. శ. 1509-1530), “సందితాయెతుల దండ” (అష్టమహిషీకల్యా. 1-49, క్రీ. శ. 1530-1570), “నెలవంక తాయెతుల్” (ద్వి. పరమయోగి. చతుర్థాశ్వా. 274, పు, క్రీ. శ. 1530-1570), “తాయెతులఁజుట్టి” (చంద్రభానుచ. 1-89, క్రీ. శ. 1585-1614), “తాయెతు చేరుఁజుట్టి” (పైది. 3-73), “పసిఁడి తాయెతల” (శుకసప్తతి. 1-99, క్రీ. శ. 1650-1790), “పసిండి తాయెతులు” (రసికజన. 1-88, క్రీ. శ. 1700-1757), “నిగరాల తాయెతుల్”

---

3. గాగరా, పావడ అను నర్థముకల తావేదు, తాబందు రూపములు తఅవీజ్ అను అరబ్బీ మూల రూపమునుండి నిష్పన్నములయినటులు ఆంధ్రభాషా చరిత్రకారులు పేర్కొనిరి. చూ. ఆంధ్రభాషా చరిత్రము–మొదటి సంపుటము 583 పు. కాని ‘తహ్‌బంద్’ అను పారసీక పదము దీనికి మూలమనుట యుక్తము. చూ. అండె పారసి: తహ్‌బంద్–నుచ్చెళ్ళపోని మొలకు కట్టుకొను బట్ట, 590 పుట.

(రాధికాసాంత్వన. 1-88, క్రీ. శ. 1730-1765), "సందిటి తాయెతుల్" (హంసవింశతి. 5-99, క్రీ. శ. 1750 - 1790, శృంగారకావ్యగ్రంథమండలి, మచిలీపట్టణమువారి ప్రతి), "వెండితాయతుల్" (పైది 5-140), "సందితాయెతుల్" (పైది. 5-168), "కేయూరనామంబు తాయెతనంగను" (ఆంధ్రభాషార్ణవము. 2-150, క్రీ. శ. 1769-1789.) 4

తాయెతు శబ్దమున కప్పకవి సేసిన విలుపును, చెప్పిన వివరణయు శాస్త్రీయరీతికి విపరీతము. అప్పకవి మతమునజేరి కొంద ఱిద్దానిని దేశ్యముగ భావించి వ్యవహరించుట అవిచార మూలకము. అప్పకవి సవరణయు, వివరణయు శాస్త్రసమ్మతము కావని ప్రత్యాఖ్యాతము సేయబడినవి. 5 చారిత్రికముగ శబ్దవ్యుత్పత్తిని నిర్ణయించుట రూపసాధన ప్రక్రియా బుద్ధులగు వ్యాకర్తల పనికాదు. 'తాయెతు' రూపనిష్పాదనము పట్ల అప్పకవి ప్రదర్శించిన ప్రక్రియాలాఘవము అతని పాండితీపటిమను ప్రకటించుట వినా, అతని చర్చ యంతయు నేలవిడిచిన సాముగానున్నది. ఇది దేశ్యము కాదు. దీని పరంపర వేరు. అసలిది అరబ్బీ పదము. "ఈ పదము తెనుగు పదమే కాదని నా భావము. ఇది తావీజ్ అను అరబ్బీపదమై యుండును. ఖురాన్ మంత్రాలను వ్రాసి రక్షగా తురకలు కట్టుకొందురు. దానినే మనవారు స్వీకరించినట్లున్నది" 6. తెనుగుతోబుట్టువులగు తమిళాది భాషలయందును ఈ పదమన్యదేశ్యముగను, అర్వాచీనముగను ఉట్టంకింపబడినది. తమిళ్: తాయిత్తు, వి. (ఉర్దూ-తాఇత్) వెండి, లేక బంగారుతో జేయబడిన రక్షాకవచము; భూషావిశేషము (మాండలికము) (Tamil Lexicon, 1841 page), కన్నడము: తాతి, తాయిత, తాయితి రక్షాకవచము (కిట్టెల్ కన్నడ-ఇంగ్లీషు నిఘంటువు 707, 709 పుటలు), కురుఖ్: తావీజ్ మెడలనో, మణికట్టునకో, కంఠమునకో ధరించు రక్షాకవచము (గ్రిగ్నార్డు కురుఖ్-ఇంగ్లీషు నిఘంటువు 686 పు.), బ్రాహుయీ: తావీజ్, తావీత్ రక్షాకవచము (అరబ్బీ తఅవీజ్ నుండి) (బ్రాహుయీ-ఇంగ్లీషు నిఘంటువు 287 పు.). అన్నిభాషలలో దీనికి వ్యాప్తిగాని, ఉన్నచోట కావ్యప్రయోగములు గాని లేవు. ఈ పై రూపముల నన్నిటిని బాగుగా బద్దించి చూచినచో తెనుగునందలి రూపమే కొంతలో కొంత ప్రాతిదని తోపకమానదు.

అరబ్బీలో 'తఅవీజ్' అనగా రక్షణార్థము సర్వేశ్వరుని ప్రార్థించుట, ఆశ్రయించుట అని అర్థము. పారసీకుల ఇస్లాము మతావలంబనముతో ఇది వారి భాషలో ప్రవేశించినది. పారసీయందును ఇది 'తఅవీజ్' రక్షణార్థము ప్రార్థించుట, ఆశ్రయమును కోరునట్లు చేయుట; యహూదీ దేశీయులు ధరించెడి యొకరకపు రక్ష; సమాధి అను వర్థములలో విస్తరించియున్నది. (Steingass పారసీ-ఆంగ్ల కోశము 301 పు.) అరబీ పారసీభాషావాహినిలో తలమునకలుగా మునిగిన ఆనుదేశికములగు ఔత్తరాహభాషలలో ఈ 'తాయెతు' స్థానమును నిరూపించుట అప్రస్తుతము కాదు. హిందీ: తవీజ్, తావీజ్ రక్షాకవచము, మంత్రకవచము; పరమేశ్వరు నాశ్రయించుట (హిందీ శబ్దసాగర్, ద్వి. సంపు. 1405 పు.), ఉరుదూ: తఅవీజ్ పరమేశ్వరు నాశ్రయించుట, రక్షణ వర్థించుట; రక్షాకవచము (ఉర్దూ-ఇంగ్లీషు కోశము, 199, పు.), మరాఠీ: తావీజ్ రక్షాకవచము (కులకర్ణి మరాఠీ కోశము, 378 పు.), నేపాలీ: తావిక్ సందిదండె; రక్షాకవచము (టర్నర్-నేపాలీ నిఘంటువు, 279 పు.), కాశ్మీరీ: తావిజ్ భూషావిశేషము; ముస్లిం స్త్రీల శిరోభూషణము; తొల్లి యంత్ర విశేషము; పిశాచాది భయనివారణార్థము ధరించు కాపు రేకు (గ్రియర్సన్-కాశ్మీరీ నిఘంటువు. 4 భాగము, 1048 పు.), అస్సామీ: తాబిజ్ సందిదండె; ఆకర్షక కవచము; రక్ష (హేమచంద్రబారువా-హేమకోష్, 464 పు.), బెంగాలి: తాబిజ్ రక్షాకవచము (బాంగ్లా-ఆంగ్లకోశము, 268 పు.), ఒడియా: తాబిజ బాహుపురి, సందిట గాని కంఠమునగాని ధరించు భూషణ విశేషము (జి. సి. ప్రహరాజ్-పూర్ణచంద్ర ఉడియా భాషాకోశము, 3 వ సంపుటము), బలూచి: తఅవిజ్ (గిల్బర్ట్‌సన్-ఇంగ్లీషు బలూచి నిఘంటువు, 24 పు.). ఇట్లు సోప

---

4. కొన్ని వ్రాతప్రతులలో తాయతి, తెయతి, తాయెద-రూపములును కనుపట్టుచున్నవి.

5. శ్రీ వజ్ఝల చినసీతారామస్వామి శాస్త్రిగారి ఆంధ్ర వ్యాకరణ సంహితా సర్వస్వము ద్వితీయ సంపుటము 1752-1756 పుటలు.

6. సురవరం ప్రతాపరెడ్డిగారి ఆంధ్రులసాంఘిక చరిత్ర, కాకతీయుల యుగము 97 పు. ఆంధ్ర సారస్వత పరిషత్తు ద్వితీయ ముద్రణము 1950.

ప్రత్తికముగా నిరూపితమయినందున దీనిని అన్యదేశ్య మనుటలో విప్రతిపత్తి యుండరాదు.

తెనుగున 'తాయెతు' పుట్టుక నిన్న మొన్నటిది. పన్నెండవ శతాబ్దమునకు పూర్వ మిది మన భాషలో నుండెననుట కాధారములు లేవు. ఇదియే కాదు, అరబ్బీ, తురుష్క, పారసీకాద్యన్య భాషా పదము లేవియు ఆనాటి సాహిత్యమున గాని, శాసనముల గాని కానరావు. "ఆంధ్రుల చరిత్రమునకును నీ పదములకును సంబంధ మున్నదని వేఱ చెప్పనక్కఱ లేదు. అట్టి యన్యదేశ్యములలోఁ జాలనుట్టుకు పాలక పాలిత సంబంధమునుబట్టియు, వాణిజ్యాది సంబంధములనుబట్టియు ముఖ్యముగ హిందూస్థానీ యింగ్లీషు భాషలనుండి తెనుఁగునఁ బ్రవేశించినవి." 7 భిన్న భిన్న భాషావ్యవహర్తలకు రాజకీయార్థిక సాంస్కృతికాది సంబంధము లేర్పడినపుడు ఆ యా భాషలలో పరస్పరము భావ వినిమయము, పదవినిమయము సంభవించుట చారిత్రిక సత్యము. ఇదియును చిరకాలసాహచర్యమున గాని సాధ్యపడని పరిణామము. ఒక భాష యందలి ఒకానొక పదము మఱి యొక భాషలో జనుల వ్యవహారవశమున ప్రవేశించి తద్భాషాపర్యాయ శబ్దాభావమువనో, నూతన భాషా గతివ్యామోహము మూలమువనో కవి పండిత సమ్మతిని బడసి కావ్యముల కెక్కి, లక్షణకర్తల పరిష్కారమున బడుట కెన్ని యంతరువు లుండునో భాషా తత్త్వవేత్త లెఱుగని యంశము కాదు. వికృతి వివేకకర్తగా భావింపబడున్న అథర్వణుడు పంద్రెండు, పదుమూడు శతాబ్దులనాటి వాడని పరిశోధకుల నిర్ణయము. ఆనాటికి ముస్లిం దండు తెనుగు గడ్డపై అడుగుపెట్టలేదు.8 క్రీ. శ. 1309 నాటికి గాని వారు ఓరుగల్లు పైకి రాలేదు. క్రీ. శ. 1323 లో ఓరుఁగల్లు ఢిల్లీ సులతానుల వశమయినది. క్రీ. శ. 1336 లో విజయనగర సామ్రాజ్యమునకు శంకుస్థాపన జరిగినది. క్రీ. శ. 1347 లో బహమనీ రాజ్య సంస్థాపనమునయినది. దాదాపు ఇన్నూఱేండ్లు ఈ రెండు రాజ్యములును ఎడతెగని పోరాటములతో వృద్ధి క్షయముల బొందుచు వచ్చినవి. ఈ యుగమున నే పారసీకాద్యన్యభాషావ్యవహర్తలతో తెనుగువారికి ప్రత్యక్షసంబంధ మేర్పడినది. క్రమక్రమముగా తెనుగునాట అన్యదేశభాషలకు—నేఁ డాంగ్లమునకువలె—రాజకీయాంగమున ఎనలేని అధికారము సంక్రమించినది. రాజకార్య నిర్వాహకులు పారసీకాది భాషలను విధిగా నేర్చెడివారు. భీమేశ్వర పురాణ కృతిపతియును పీఠభద్రేశ వేమ పృథ్వీశ్వరుల కనుగు మంత్రియును నగు బెండపూడి 'అన్నయ మంత్రిశేఖరుఁ (క్రీ. శ. 1426-1440) డిహామ్మదుసేను వదాన్య ధరామిత్రత్సన్నిధిన్...పారసీభాష వ్రాసినన్ గన్నులపండువై యనుచుఁ గాకితి మండలి వర్ణపద్ధతుల్' (భీమ. 1-71). ఇంతే కాదు. 'అరబీభాష తురుష్కభాష...... గాంధార ఘూర్జర భాషల్ ... మఱియుం భాషావిశేషంబు లచ్చెరువై వచ్చునటి యన్నకి గోష్ఠీ సంప్రయోగంబులన్' (పైది. 1-73). తదనంతరము 'అరబి పారసి గుజరాతి యూరదు మచ్చ— తెనుఁగు కన్నడి మొదలుగాఁ దలిపి వ్రాయ దారి గన్నట్టి...' (యయాతి. 1-47) వారందఱును దమ యేలికల తలపరిసి వర్తించుటలో పెట్టినది పేరుగా పొగడ్తనందిరి. తిన్నాళ్ళమున పారసీకాద్యన్యభాషా పదములు వేనూర్లు తెనుగున చోటుచేసికొనినవి. రాగా రాగా ప్రభువులును, తదాశ్రితులును వేయించిన శాసనాదులను ఈ పదములు ప్రత్యక్షమయినవి. నూతనప్రియులగు కవులును వీనిని ధారాళముగా తమ కృతుల ప్రయోగించి వీనికి శాశ్వతస్థితిని సంపాదించి పెట్టిరి. లక్ష్యము సాహిత్యమును, శాసన సంచయమును పరికించినచో ఈ యూహాపోహాలు యుక్తియుక్తములని నిర్ధారణము కాగలవు.

వాద సౌలభ్యమునకు వికృతి వివేక మథర్వణ కృతమని అంగీకరించి పరిశీలించినను ద్రోలేత్యాది కారికను రచింపవలయుచో అథర్వణున కనుపక్షము నూరు నూటయేబది యేండ్లకు పూర్వమే 'తాయెతు' తెనుగున ప్రవేశించియుండవలెను. అనగా అది పది నొకొండు, పంద్రెండు శతాబ్దుల నాటికథ. ఉత్తర హిందూస్థానమున గజనీ (క్రీ. శ. 1001-1030), గోరి (క్రీ. శ. 1175-1193) దండయాత్రలు సాగుచుండిన తొలినాళ్ళవి. రాజ్యదాహముతో తహతహలాడుచుండిన ఈ విజేతలకును, సామాన్యప్రజలకును సరా

---

7. డా. చిలుకూరి నారాయణరావుగారి ఆంధ్ర భాషా చరిత్రము, మొదటిసంపుటము. "తెనుఁగునఁ జేరిన యన్యదేశీయ శబ్దజాలము", 575 వ పుట.

8. Dr. N. Venkataramanaiah, Further Sources of Vijayanagara History, Introduction, Vol. I.

…రి సంబంధము లుండినట్లు సాక్ష్యములేదు—వీరంద రును అఫ్ఘనులు. ఆనాటి అఫ్ఘనుల భాష——భారతీయభాషలను స్వీకృత ప్రభావపరిపుష్టము చేయజాలినంత ప్రత్యేక ప్రతిపత్తి కలదికాదు. అరబ్బు వర్తకులలో, తురుష్క యాత్రికులలో, పారసీక రాయబారులలో తత్పూర్వము వచ్చి యుండరాదా యని ఆక్షేపణ రావచ్చును. వచ్చిననూట వాస్తవము. పంజాబును పాలించిరన్న రెండవ సైరయస్ మొదలగు పారసీక చక్రవర్తుల విలువబడి క్రీస్తునకు పూర్వము అయిదారు నూరేండ్ల నాటిమాట. ఒకానొక అజంతా చిత్రమునందు పారసీక రాయబారి యొకడు చిత్రింపబడినాడని పరిశీలకుల నిర్ణయము. ప్రాచీన కాలమునుండియు అరబ్బులు భారతదేశముతో వర్తకము చేయుచుండిరని నిర్ధారింపబడినది. విదేశ వాణిజ్యనిర్వహణమున అరబ్బులు సాటిలేనివారు. ఇస్లాము మతస్వీకారముతో అరబ్బులలో నూతనోత్తేజ ముదయించినది. వారి నిసర్గతీవ్రత్వమునకు మతవిస్తరణ కాంక్ష, రాజ్యవిస్తరణకాంక్ష తోడుపడినవి. క్రీస్తు శకము ఎనిమిదవ శతాబ్దము నుండియు భారతదేశమున వారి దాడులు మొదలయినవి. దేశ వాయవ్యభాగమున చెదరుచెదరుగా జరిగిన ఈ మెఱపుదాడులు దాదాపు రెండువందల యేండ్లు (క్రీ. శ. 711-948) కొనసాగినవి. ఇంతచేసి అరబ్బులు సింధునద పరిసరములను దాటి యీవల కాలిడలేకపోయిరి. వారి యేలుబడిక్రిందికి వచ్చిన కొలది భూభాగమును కొంతకాల మయినను కుదురుగా వారి చేతులలో నుండలేదు. అడపదడప చేతులు మారుచుండెడిది. సందుమాపికొని దేశీయ ప్రభువులు అరబ్బుల నెదిరించి పారద్రోలుచుండిరి. 9 ఇంత దీర్ఘకాలము నిరంతర సైనిక సన్నాహములతో సాగినందునను, క్రమక్రమముగా ఖలీఫాల ప్రభ అంతరించినందునను క్రీస్తుశకము పదియవ శతాబ్దము పరిసగము గడచుసరికి అరబ్బులు భారతరంగమునుండి నిష్క్రమించిరి. భారతదేశమున అరబ్బులు సాధించినది అత్యల్పమయినను, ఆనాటి అరబ్బీ భూగోళ శాస్త్రవేత్తలు భారతదేశమునుగూర్చి సేకరించి భద్రపరచిన చారిత్రక సామగ్రీ సంపద అమూల్యమయినది. 10 క్రీ. శ. 848 నుండి 1335 దాక సుమారైదు శతాబ్దుల వ్యవధిలో ఇంచుమించు ఇరువదిమంది అరబ్బీ భూగోళ శాస్త్రజ్ఞులు భారతదేశమునుగూర్చి అరబ్బీలో వ్రాసిరి. 11 పదియవ శతాబ్దాంతము మేర వీరు వ్రాసిన విషయములు చాలపాలు వారివలన వీరివలన విని కూర్చిన కట్టుకథల కట్టలు. స్వయముగా భారతదేశమున పర్యటించి ప్రత్యక్ష పరిశీలనమున విషయ సంగ్రహణ మొనర్చినవారి సంఖ్య చాల స్వల్పము. మూన్నాళ్ళముచ్చటగా దేశపర్యటన నిమిత్త మరుదెంచిన విదేశబృందముల ప్రభావమువలన భాషాదికములలో పరిణామములు సంభవించుననుట శాస్త్రసమ్మతము కాదు. కావున 'తాయెతు' ఆతొలినాళ్ళలో ఎరవుతెచ్చిన పదమని ఊహించుట యుక్తిసహము కాదు. ఒకవేళ, ఎట్లో వచ్చినదని సమాధానము పడినను, ఎన్నెన్నో పదములుండగా ఈ యొక్క 'తాయెత్తు' మాత్రమే ఒంటెత్తుగా తెనుగున జొరబడినదనుట శాస్త్రీయ పరిశీలన విధానమునకు విరుద్ధము దీనితోపాటు మఱికొన్ని పదములును వచ్చియుండవలెనుగదా! ఇట్లు వచ్చినట్లు గుఱుతులేదు. చారిత్రకముగను, శాస్త్రీయముగను ఆనాటి తెనుగున దీని యునికి సందేహాస్పదమయి, ప్రాచీన కావ్యసందోహమునను, శాసన సంచయమునను కన్పట్టని ఈ పదమును గూర్చి ద్వితీయాచార్యుడని పేర్కొనబడిన అథర్వణుడు చర్చించెననుట విశ్వాస్యము గాదోపగు. అట్లయిన తెనుగు జనులు వాడు పదసామస్త్యమంతయు కావ్యాగుల కెక్కనగా యను ఎగురువాదము ఎగురుకాక మానదు. కావ్యాగుల పరిమితమగు పదజాలమే ప్రదర్శితమగుటను కాదనలేము. అప్రసిద్ధములును, గ్రీడా జాగుప్సామంగళకరములును నగు శబ్దములను కావ్యాగుల గానరాని మాట నిజము! కాని 'తాయెతు' శబ్ద మీకోవకు చేరినది కాదు. మత విశ్వాసముల ననుసరించిగాని, సాంఘిక సంప్రదాయముల ననుసరించిగాని నిషిద్ధము కాదు; అతిప్రసిద్ధమయినది. ఇంకొకటి. అస్తిత్వమువలె అభావము ప్రామాణ్యము కాజాలదని పూర్వపక్షము పలుకవచ్చును. కాని బలీయములగు ఇతర యుక్తుల సన్నిధిలో ఈ శంకకు తావులేదు. అలనాటి వ్యాకరణము కావ్యభాషామాత్రానుశాసనమని పండితులు నిర్ణయించినపుడు సామాన్యలోకవ్యవహారముపట్ల ఈ విధి వర్తింపదు.

---

9. Dr. R. C. Majumdar. Arab Invasion of India.

10. Dr. S. Md. Husayn Nainar, Arabs knowledge of Southern India.

11. Prof. K. A. Nilakanta Sastri, Foreign Notices of South India.

ఇక, రామనాగులన్నచో ఇటీవలివారు. మహమ్మదీయ సంసర్గము ముక్కుబంటిగా ముదిరిన దశనాటివారు. కావున రామన 'తాయెతు'ను గూర్చి వివరించుటయు, అప్పకవ్యాదులు సవరించుటయు, తిరువాతివారు తలస్పర్శముగాఁ జర్చించుటయు సహేతుకము. వీరికి పూర్వులగు లక్షణకర్తలు - మూలఘటిక కేతన (క్రీ. శ. 1220—1280), విన్నకోట పెద్దన (క్రీ. శ. 1407) మొదలగువారు దీని ప్రసక్తిని గొని రాలేదు. అసలు వారిట్టిదాని నెఱిఁగియుండినఁగదా తద్విషయక విచారము. ఇట్టిచో అంత ప్రాచీనునిగ మనము నిర్ణయించిన అథర్వణునకు ఇంత అర్వాచీనమగు 'తాయెత' శబ్దసిద్ధికయి డోలేత్యాదిక కారికను రచించుటెట్లు జరిగినపడినది? కారికావళి కర్తృత్వమును అథర్వణునకే కట్టిపెట్టు గట్టికాంక్షతో ఈ కారికను అర్వాచీనకృతి ప్రక్షిప్త మను పక్షమున డోలా ఘూషత్త్రీ-కూర్థిక శబ్దములలో ఉయ్యెల, సయ్యద - శబ్దము లగతికములు కాక తప్పదు. విశేషించి యెత్త్వోత్వ సంజ్ఞానిర్ణాయకమగు 'భావిక్రియాస్వి' త్యాదికారికా రచనమునందలి వికృతి వివేక కారుని యత్నముగ వ్యర్థమై పోవునుగదా! అంతేకాదు. "అహేయ మన్యదేశీయం యత్తదేవ ప్రయుజ్యతే" (వికృతి వివేకము. సంజ్ఞా. 9 సూ.) కారికకు సమాధానము రావలయును. అన్యదేశ్యము లనుచోట వైయాకరణ నిర్వచనము ను చూడుడు. "తురుష్కాది భాషా శబ్దము లన్యదేశ్యము లనుట నిర్వివాదము." 12 అహేయ మిత్యాది కారికా వ్యాఖ్యానపరమగు సంజీవని వ్యాఖ్యలో సుదాహృతములయిన ప్రయోగముల మూలమున అన్యదేశ్యముల స్వరూప స్వభావములు స్పష్టము లగుచున్నవి. నింద్యము కానట్టి యనగా వ్యాకరణాది విరుద్ధము కానట్టి అన్యదేశ్య శబ్దము 'రోజా' మున్నగునది ప్రయోగింపబడు చున్నదని కల్పతరువ్యాఖ్య. 13 "సయి రీతి నథర్వణాచార్యు డంగీకరించియున్నను నర్వాచీన మహాకవులు ప్రయోగించియున్నను భారత ప్రయోగ రాహిత్యమువను, జింతామణ్యంగీకృతియు కొఱవడుటను గావలయు మారి యన్యదేశ్యము సహించె" నని సంజీవని నిర్ణయించినది. 14 తురుష్కాద్యన్యభాషా పదములగు అన్యదేశ్యములనుటలో సందేహప్రాయములు లేవు. అహేయమిత్యాది కారికాభిప్రేతము నిదియే యని విస్పష్టముగా నిర్ధారింపబడినప్పుడు వికృతి వివేక మాథర్వణీక మగుట అసంభవము. మీదుమిక్కిలి పూర్వ లాక్షణికు లెవరును అన్యదేశ్యముల ప్రస్తావనను తేలేదు. ఆంధ్రభాషాస్థితములగు శబ్దముల విభజనలోగాని, తదనంతరమున సుదాహృతములయిన పద పట్టికలలోగాని అన్యదేశ్యములను గూర్చిన నామమాత్రపు సూచనయు గానరాదు. 15 ఈ కారికను పైతము ప్రక్షిప్తమందురా కొబోలు. తమవాదమునకు బాధకములగు కారికల నన్నిటిని ప్రక్షిప్తముల పేర, పాఠాంతరముల పేర నిరాకరించుచు వచ్చినచో కారికావళిలో శేషించునది శూన్యము. అందుచే వీనిని ప్రక్షిప్తములనుట పొసగదు. కాగా వికృతివివేక మాథర్వణ కర్తృకము గాదని సారాంశము. అహోబల పండితుడే దీనిని సృష్టించి, తత్కర్తృత్వము నథర్వణున కంటగట్టెనను ఊహ త్రోసివేయరానిది. లేక అథర్వణు డంత ప్రాచీనుడు కాక అప్పకవ్యాదులకు దరిదాపుల సమకాలికుడు సుండురా! అప్పుడింత రగడ యేల? అథర్వణునకు నాల్గయిదు శతాబ్దులు మనవైపు నడచి వచ్చినచో వికృతివివేకకర్తృత్వము వాయనకే కట్టిపెట్టుటలో నేను మొట్టమొదటివాఁడను.

---

12. శ్రీ వఝల చిన సీతారామశాస్త్రి గారి ఆంధ్ర వ్యాకరణసంహితా సర్వస్వము, 1 భాగ. 174 పుట.

13. పైది 61 III విషయము, 173 పు.

14. పైది. 61, IV విషయము, 173. పు.

15. కేతన ఆంధ్రభాషాభూషణము, 19-27 పద్యములు. విన్నకోట పెద్దన, కావ్యాలంకార చూడామణి, నవమోల్లాసము, 6, 11-21 పద్యములు.

తారలక్ష్మణునితో

శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు

[సుగ్రీవుని కార్యము సిద్ధించినది. అతడు సుఖలుబ్ధుడై, రాముని కార్యమును విస్మరించెను. సీతా విరహ తప్తుడైన రాముడు లక్ష్మణునితో సుగ్రీవునకు సందేశ మంపెను. సౌమిత్రి సహజశాంతుడు, అతనికిని వానరరాజుపై కోపమువచ్చెను. కిష్కింధను ప్రవేశించి యతడు ధనుష్టంకారమొనర్చెను. భీత భీతుడగు సుగ్రీవుడు, "నీవేగి లక్ష్మణుని కోప మాపు"మని, తారను ప్రార్థించినాడు. తార యొక విచిత్ర మైన వ్యక్తి. ఆమె యప్సర. క్షీరోదధిలో నామెపుట్టుక. సుషేణు డామెను వాలికిచ్చియుండెను. సుగ్రీవుని ఆ ప్రార్థనతో నామె యప్సరోభావము చెలరేగెను. తార సౌందర్యసారమై సౌమిత్రిని దరిసినది]

ఆ మాటలతో నంతర్హృదయ
ప్రణిహితాప్సరోభావము తన్నం
దినయటులై తుందిలతారుణ్య మ
యాక్షులకొనలు చకచకలై.

ఒక మహర్షి తప ఉద్యోగ సము
న్మేషము గూల్పగ, భాసురగతి భా
వించు నప్సరసవిధమున ధారా
ధరమున జిఱువెన్నెల జిలికెన్.

కలకలమని చిఱుగంటల మేఖల
పలికె, కలికి నవ్వుల కనుగలమై,
అందెల రవళులు గ్రందుకొనె, మహో
దార సురద్రుమ వాసనలై.

కదలె తార, ప్రస్ఖలత్పదమ్ముల
క్షీరోదధివీచిక వీచిన బెడ
గై, కనుదమ్ముల నైరావత దం
తకుంతధవళాపాంగములై.

స్తనమండల సాతౌల్యకృతపీయూ
షమయ శనైశ్చంచల కలశభ్రమ
మై, చిరత్న రత్నాంచిత కుండల
రుచికృత సితఘోట్టాణకమై.

తార నడచె, కందర్పుని యాఱవ
బాణము నకువున, పలునాళ్లకు సౌ
మిత్రి యెడదలో జిత్రముగా నూ
ర్మిళా రూపములు మెదలాడెన్.

అఱనిముసం బా యానందంబున
గను మొగిచిన లక్ష్మణుని యెదుట, మై
థిలి గనుపించిన దలనల్లన దన
చూపు లామె యడుగుల వ్రాలెన్.

'ఓయి!మఱది! మాయూర్మిళ నెఱుగుదు
వా!' యని యడిగిన యట్లై లక్ష్మణు
డీషద్వికసిత హృదయంబున జిఱు
నగవులు, పెదవుల గదియించెన్.

అంతలోననే యా కల కనుచా
లై, లజ్జాభర మలమి, యన్నవే
దన మది బారాడిన లక్ష్మణు ప్రా
ణమ్ములవెత గుతకుత మనియెన్.

కటీరమండల కాంచీ దామము
చలియింపగ, లజ్జాతిగ మదవి
హ్వాలలోచన, రామానుజు దరిసెను
తార, యందములు గ్రందుకొనఁ.

తరుణీ సాన్నిధ్యమ్మున కోపము
లుడిగిన లక్ష్మణు డుదాసీనుఁడై
తలనువంచి, భూతలమును జూచుచు
నిలిచె, గండరువు బొమ్మవలెఁ.

ధీరచిత్త యగు తార, లక్ష్మణుని
యాదర మేదురమైన చూపు, గమ
నించి, పానవశనిహ్నుతలజ్జా
భరమై, యల్లన నిట్లనియెఁ.

"పరపీడనపాపమ్ముల కెన్నడు
గానివావి, లక్ష్మణస్వాములకు
నమస్కార, మన్నలకు, రాములకు
దయామూర్తులకు సేమమ్మె?

కాదయ్యా! నిష్కలుషమూర్తి! మీ
యాపు నమ్మికొని, హరిపతి జీవిం
పగ, మీ యడియరిపైనా చాపము
మ్రోయించుట గుండెలు బెదరఁ?

పరులెత్తిన, మీ ప్రాపు మాకు బె
ట్టని కోటగ నుండిన దగుగానీ!
సెలసి కంచెయే చేనుమేసిన
ట్లు ప్రవర్తించిన నెట్లయ్యా!

మిమ్ముల గాదని మిత్రతనూజుడు
చేసిన దోసగేమీ! శమ దమములు
విడి, తెలిదమ్ముల వితమగు కన్నుల
గెందమ్ముల చాయలు దాల్పఁ.

ఎండిన వనమున కెరగలి జుట్టిన
నెదురునడచు దుర్మదుడొక డుండునె!

దాశరథుల క్రోధమ్మును దలపై
కెత్తికొనునటే కపిరాజూ!

కలకాలము కొండలలో విరహము
ననుభవించిన వసిన వాడవుట గ
పీనుడు, కొంచెము, దూసిన ప్రేమల
తాకుల కగపడి తను మఱచెన్.

అంతమాత్రమున నధర్మ మేము
న్నది? కామసుఖం బఖిలజీవులకు
నైజముగాదా! నారీ విరహా
కులరాముల కిది తెలియదటే!

శిలలకు గిలిగింతలు జెల్లక పో
యిన బోవును గాకేమి! మనసుగల
మగలకు జెల్లవా! మగువల కనువే
దురులకుఁ జిక్కని దేవఁడయ్యా?

ఏ నిటు లంటకు నెద గోపింపకు
మన్నా! హరిపతి ననుకంపామతి
దలచి పనులుగొనవలె, దిక్కెవ్వరు
రవిజునకును మీరలు దక్కఁ!

అన్నగోలుపడి,యన్నయు దండ్రియు
నన్ని రాముడే యనుకొన్న కపీ
శ్వరుపై నెత్తిన, చాపమె యది సా
కార మధర్మమె! యోచింపూ.

వలదు తండ్రి! నవ్వులతో బలుకగ
వలిసిన వారలపై గసికోతలు!
యెవరిది శాశ్వత మీభువి! ఋతుపరి
వర్తనములు, జీవుల బ్రదుకుల్."

తన చెలియలు శాంతాదేవికి దా
రకు ఖేదమ్ములు, రవ గమనింపని
రామానుజునెద నామాటలు గడు
తీయని ప్రేమల మేల్కొలిపెన్.

(కిష్కింధా కాండమునుండి)

మాధవవర్మ : అతని సంతతి

శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ

[గతసంచిక తరువాయి]

మాధవవర్మ పొలమూరు శాసనమును ప్రాగ్దిశను, అనగా కళింగమును జయించుటకు గోదావరి నదిని దాటినపిదప ఫాల్గుణపౌర్ణమి చంద్రగ్రహణ నిమిత్తమున — ప్రాయికముగ ఋగ్వేదశాఖాధ్యయనార్థము — శివశర్మ అను చతుర్వేద పారంగతునికి ఇచ్చియున్నాడు. పూర్వచాళుక్యరాజ్య సంస్థాపనము క్రీ. శ. 624 లో జరిగియుండుటవలన అంతకుపూర్వమే విష్ణుకుండి భూవరుల రాజ్యపరిపాలన మంతమొంది యుండవలెను; లేదా అంతకు కొంచెము తరువాతనైనను ముగిసియుండవలెను. ఈ కారణమున ఫాల్గుణ మాసమునందలి చంద్రగ్రహణము క్రీ. శ. 624 సంవత్సరమున కించుకపూర్వమో, అటుతరువాతనో వచ్చియుండవలెను. ఫాల్గుణమాసములో చంద్రగ్రహణము క్రీ. శ. 575, 593, 594, 612, 621, 630, 639, 640 సంవత్సరములలో పట్టినది. శ్రీ కొమర్రాజు లక్ష్మణరావు పంతులుగారు ఈ మాధవవర్మ పొలమూరు శాసనమును ప్రకటించునాటికి వేంగిలో పూర్వచాళుక్య రాజ్య సంస్థాపనము క్రీ. శ. 615 లో అని డాక్టరు ఫ్లీటు చేసిన సిద్ధాంతమే యంగీకృతమైనది. అందువలన శ్రీ లక్ష్మణరావుగారు క్రీ. శ. 575 క్రీ. శ. 615 కు చాల పూర్వమగుటచేత దానిని, 621 క్రీ. శ. 615 కు ఆరుసంవత్సరములు తరువాతి దగుటచేత — అప్పటికి విష్ణుకుండి రాజ్యము అంతరించియుండును గనుక — దానిని పరిగణనములోనికి దీసికొనరైరి. క్రీ. శ. 630, 639, 640 సంవత్సరములలోకి ఫాల్గున మాసమునవచ్చిన చంద్రగ్రహణములను గురించి వారాలోచింపవలసిన యవసరమే లేకపోయినది. ఇక మిగిలిన క్రీ. శ. 593, 612, 594 సంవత్సరములు మూడింటిలో 593, 612 లలో చంద్రగ్రహణములు సూర్యుడు క్షితిజముపై నుండినప్పుడు పట్టుటవలన అవి మనకు కానరావని వానిని నిరాకరించి తుదకు క్రీ. శ. 594 ఫాల్గున చంద్రగ్రహణ సమయమునందే మాధవవర్మ శాసనోక్తదానమునుచేసి యుండునని నిర్ధరించియున్నారు. కాని వేంగిలో పూర్వ చాళుక్య స్వతంత్రరాజ్య స్థాపనము క్రీ శ. 624 లో నని ఇటీవల బయలుపడిన శాసనములవలన నిర్ధారితమగుటవలన ఇప్పుడు మనము క్రీ శ. 621, 630, 639 640 సంవత్సరములలో ఫాల్గున మాసమున పట్టిన చంద్రగ్రహణములను గురించికూడ ఆలోచింపవలసియుండును. వీనిలో క్రీ. శ. 621, 640 ల లోని గ్రహణములు మనకు కనబడనివి. అందువలన వానిని వదలివేయవలసియుండును. ఇక 630, 639 లలోనిది కాని క్రీ శ. 594 లోనిది కాని దానకాల చంద్రగ్రహణము కావలెను.

పూర్వ చాళుక్యరాజ్య స్థాపకుడు సత్యాశ్రయ ఇమ్మడి పులకేశి వల్లభుని సోదరుడు కుబ్జవిష్ణు వర్ధనుడు. ఇతడు క్రీ శ. 624 లో స్వాతంత్ర్యమును ప్రకటించి పదునెనిమిదేండ్లు, అనగా క్రీ. శ. 641 వరకు రాజ్యమేలెను. అతని యనంతరము రాజ్యమునకు వచ్చినవాడు అతని జ్యేష్ఠతనయుడు (మొదటి) జయసింహవల్లభుడు. కుబ్జవిష్ణు వర్ధనుని శాసనములు కళింగదేశమున మాత్రమే కాన్పించుటవలన అతని రాజ్యము కళింగమునకు పశ్చిమమున వేంగియందుకూడ నుండెనా లేదా యన్నది అనుమానాస్పదముగనున్నది. కాని అతని రాణి అయ్యణమహాదేవి బెజవాడ యందలి నడుంబివసతియను జినాలయమునకు దానము చేసినట్లు మూడవ విష్ణువర్ధనుని (కుబ్జవిష్ణు వర్ధనుని ప్రపౌత్రుని తనయుడు) ముశిణికొండ శాసనమువలన తెలియ వచ్చుటచేత కుబ్జవిష్ణు వర్ధనుని కాలముననే వేంగి దేశమంతయు, అదియేకాదు కమ్మనాడుకూడ పూర్వ చాళుక్యుల యధికారము క్రిందికి వచ్చియుండవలెను. పులకేశివల్లభుని కొప్పరము శాసనముకూడ ఈవిషయమునే స్థిరపరచుచున్నది. అచ్చటచ్చట విష్ణుకుండి రాజన్యులు పరిపాలించుచుండినను మొదటి జయ

సింహ వల్లభుని నాటికి సముద్రతీరస్థ ప్రాగాంధ్ర దేశమునందలి వారందరు పరాజితులై అది పూర్తిగ పూర్వచాళుక్య రాజ్యములో చేరిపోయినది. అందు వలననే జయసింహ వల్లభుడు తైత్తిరీక సబ్రహ్మచారియు, వేదవ్యయాలంకృత శరీరుడును, గౌతమ గోత్రుడును అయిన శివశర్మ కుమారుడును పూర్వాగ్రహారిక రుద్రశర్మకు తన ద్వైదవరాజ్య సంవత్సరములో మరల పొలమూరు గ్రామము నగ్రహారము చేసి యిచ్చెను (క్రీ. శ. 645-46). ఈకాల నిర్ణయము ననుసరించి రుద్రశర్మ తండ్రి క్రీ. శ. 620 లో నుండి యుండవలెను. క్రీ. శ. 620 మాధవవర్మ శివశర్మకు పొలమూరు గ్రామమును దానమిచ్చినకాల మను కొన్నచో మాధవవర్మ రాజ్యారంభకాలము క్రీ. శ. 573-74 (620-47) అగుచున్నది. మాధవవర్మగాథ జరిగిన క్రీ. శ. 592 అతని రాజ్యకాలములోనే పడు చున్నది.

ఆంధ్రదేశ క్షత్రియులలో పురాతన కాలము నుండి పరంపరగా వచ్చుచుండిన యొకగాథ కలదు. ఈ గాథను విశ్వసించునెడల శకవర్షము 514, అనగా క్రీ. శ. 592 ప్రాంతమున వసిష్ఠ, ధనంజయ, కౌండిన్య, కాశ్యపగోత్రులైన క్షత్రియులు మాధవవర్మ నాయకత్వమున తెలుగుదేశమునకు వచ్చిరి. ఈ విషయమే క్రీ. శ. 1540 నాటిదగు శ్రీకృష్ణ విజయమను తెలుగు ప్రబంధమునను తెలుపబడినట్లు తెలియుచున్నది. క్షత్రియగోత్ర పీఠమాలిక పరిచ్ఛేదులు వసిష్ఠగోత్రులని, కోటవారు ధనంజయ గోత్రులని, కాకతీయులు కాశ్యప గోత్రులని, వర్ణాటులు (వర్ణాటకులు) కౌండిన్య గోత్రులని తెలుపుచున్నది. పరిచ్ఛేదులు, కోటవారు, కాకతీయులు—వీరు మధ్యయుగమున ఆంధ్రదేశమును పరిపాలించిన ప్రముఖ రాజవంశజులు. వర్ణాటు లెవ్వరైనదియు నింకను స్పష్టముగ తెలియ లేదు. విష్ణుకుండి మాధవ వర్మలలో రెండటి జయసింహ వల్లభునికి చాల పూర్వుడొకడు, అతనికి కొద్ది కాలము ముందుండిన వాడొకడు—ఇద్దరు మాధవ వర్మలు-పెద్దమాధవవర్మ, పినమాధవవర్మ యుండియుండ వలెను. ఇదివరలో నుడివినట్లు విష్ణుకుండి మహీపతుల వంశావతార క్రమముకాని, వారి పరిపాలన క్రమము కాని ఇంతవరకు నిస్సంశయముగ నిర్ణీతము కాలేదు. అందువలన మాధవవర్మల కాలమును అనిర్ధారితమే.

శ్రీ కొమర్రాజు లక్ష్మణరావు పంతులుగారు విష్ణుకుండి యన్నది ఈ రాజుల గోత్రమై యుండు ననియు, శాలంకాయనులవలెనే వీరును గోత్రము పేరె తమ యింటిపేరుగా గ్రహించి యుండురనియు వ్రాసి యున్నారు. కాని వారే ఏ ప్రవరకాండలోను ఈ గోత్రముపేరు కన్పించలేదని తెలిపినారు. ఈ విష్ణుకుండి వంశజులు రాజ్యము చేసిన కాలమున కెనిమిది శతాబ్దముల యనంతరము తాము మాధవవర్మ సంతతి వారమని చెప్పుకొన్న వారిది వసిష్ఠ గోత్రము. అందువలన విష్ణుకుండి యన్నది గోత్రముగునా యని సంశయింపవలసి వచ్చుచున్నది. కొందరది సంస్కృతిము కావించిన దేశీయ నామమని, వినుకొండకు, విష్ణుకుండికి దగ్గర సంబంధమున్నట్లు కనబడుటవలన ఈ వంశము వారు వినుకొండ ప్రాంతీయులన్నారు. వీరి కులదైవము 'శ్రీపర్వతస్వామి.' వినుకొండకు శ్రీపర్వతము సమీపస్థముగుటచేత అదియే వీరి ఆదిమ నివాసస్థానము కావచ్చునని కొందరూహచేసిరి. మొత్తముమీద విష్ణుకుండి రాజచరిత్ర మింకను నిర్మాణాత్మక దశలోనే యున్నది.

* * *

మరల మాధవవర్మ వంశ్యులను గురించి మనకు తెలియవచ్చునది విజయనగర యుగముననే. అంతవరకు వీరెచట నుండిరో, ఎవరికి సామంతులుగ నుండిరో, ఏ సీమలను పరిపాలించిరో తెలిసికొనుట కాధారము లేవియు లేవు. కాని యిదివరలో నుడివినట్లు వసిష్ఠ గోత్రులైన పరిచ్ఛేదులే మాధవవర్మ సంతతివారైనచో వీరు క్రీ.శ. పండ్రెండవ, పదమూడవ శతాబ్దులలో గుంటూరు మండలములోని ఓంకారనదీప్రాంతము-ఓంగేరు మార్గమును పరిపాలించినట్లు శాసనములు తెలుపుచున్నవి. ఓంగేరన్నది ఎప్పటి ఓగేరే—చిన్న యేరు. శాసనముల ననుసరించి వీరి బిరుద ప్రశస్తి యిది :

"స్వస్తి! సమధిగత పంచమహాశబ్ద మహామండలేశ్వర, వీరమాహేశ్వర, విరజాపుర వరేశ్వర, రిపుపుర త్రిపుర మహేశ్వర, దుర్జయ కులాచల మృగేంద్ర, సత్య హరిశ్చంద్ర, శ్రీకృష్ణ వేణ్ణానదీ దక్షిణ షట్సహస్రావనీవల్లభ, కొల్లిపాక సప్తసహస్రావనీవల్లభ, మల్లికావల్లభ, పరాంగనాదుర్లభ, ఎలడాయరక్కస, పరబలకర్కశ, గండ ధనంజయ, ఆహవభీమ, అరిబల గండ, ప్రచండ మార్తండ, రణరంగ భైరవ, సహ

కార బాంధవ, 'చలమఱ్ఱుపార్థ' (?), చంపకామోద, కుంత కౌంతేయ, వీరముఖదర్పణ, విబుధసంతర్పణ, దానకానీన, విలాస విద్యాధర, భోగపురందర, పతి మెచ్చుగండ, పరహితాచరణ, చోడకటక వజ్ర ప్రాకార, రట్టకటక రక్షపాలక, చాళుక్య రాజ్య మందిర మూల స్తంభ, విజయలక్ష్మీ పరిరంభ."

దీనికిని, ఈ బిరుద నిచ్చిన వసిష్ఠగోత్ర క్షత్రియ బిరుదావళికిని చాల పోలిక గలదు, చూడుడు:—

"స్వస్తి! పంచమహాశబ్ద మహా మండలేశ్వర, రాజ పరమేశ్వర, దుర్జయవైరి కులాచలమహేంద్ర, మత్తవైరిగజ మృగేంద్ర, శౌర్య గాంగేయ, కుంత కౌంతేయ, మలరాజ రక్కస, పరబలరక్కస, మల్లికా వల్లభ, త్రైలోక దుర్లభ, రణరంగ భైరవ, రాజన్య గౌరవ, సమర జయోత్సవ, సహకార బాంధవ, చండికాప్రియ, గండ ధనంజయ, ఆహవభీమ, హరిబల రామ, విమత రౌద్రక, విక్రమశూరక, బహుశాస్త్ర పరిరక్షక, కలుష వీరభద్ర, కరవాల రుద్ర, హరిరాయపురి గరుడ దయావల్లభ, హరిగిరి కులిశాయుధ, శౌర్యచక్రాయుధ, పుత్తవు గజవా...రోహణ, జలదగంభీర, జగదేకవీర, గర్విత రిపురాయ కదనసంహార, మేదినీరాయమృగవేటకార, మండలీకరగండ మహిత ప్రచండ, సమరదోర్దండ, తైలమెచ్చుగండ, వసబిరుదర గండ, బిరుద రాయ రాహుత్త రాయ మానవేశ్యా భుజంగ, గుంగి మంగి తల గుండుగండ, చాళుక్య రాజ్య ప్రతిష్ఠాపనాచార్య, ఒడ్డియరాయ మానజాల, కళింగరాజ్య ప్రళయాంతక, కిమిడేరాయ మాన వేశ్యాభుజంగ, పాండ్య గజరాజ సింహ, చోళభల్లాణ గోధూమ ఘట్టన ఘరట్ట, భోజ రాజాధీశ పట్టణ అద్రిదావానల, నెల్లూరెలమంచిలి కంచి ద్వారకాపురి నిర్ధూమధామ, లాటగౌళ నేపాళ పురిస్సర్వస్వాపహరణ, కృష్ణవేణీ జలక్రీడా వినోద పరాయణ, అష్టసహస్రదంతి దశలక్షవాహినీవల్లభ, సేతుశితాద్రి హేమాద్రి బిరుద శాసన స్తంభ, పరమ వైష్ణవ, శ్రీ మనోనాథ నారాయణసేవ దివ్య శ్రీపాద పద్మారాధకులైన శ్రీ వసిష్ఠగోత్ర పవిత్ర అనుజనార్దన బెజవాడ పాతినిల్పిన బుద్ధవర్మ మాధవవర్మ దేవ వర్మ చిక్కభీము మొదలగు పూసపాటి రాజులాన్వయ విజయ బిరుద ప్రశస్తి! విజయీభవ, విజయీభవ! శ్రీ శ్రీ శ్రీ."

ఈ ప్రశస్తి నిచ్చినవారు మాననీయులైన శ్రీ బుర్రా శేషగిరి రావుగారు. ఇది వారి 'మిత్రులును, గురువర్యులును అగు శ్రీ గురుజాడ అప్పారావు పంతులవారి విద్యాకటాక్ష ప్రసాదిత'మని వారే తెలిపి యున్నారు. ఈ ప్రశస్తిలో చాలా దోషములున్నట్లు తోచుచున్నది. వీనిలో కొన్ని బిరుదములందలి దోషములను శాసనోక్త పరిచ్ఛేది రాజప్రశస్తి ననుసరించి సవరించ వచ్చును. ఇతర ప్రశస్తులలోని బిరుదములు కూడ ఇందు చేరిన వేమో యని యనుమానముగ నున్నది. యిది యెట్లున్నను క్రీ. శ. పదుమూడవ శాబ్దికి తరువాత సంక్రమించిన బిరుదములను ఇందు చేరియున్నవి.

విష్ణుకుండి మాధవవర్మ వంశ్యులే మధ్యయుగమునందలి వసిష్ఠగోత్రులగు పరిచ్ఛేది భూవరులయినచో వీరు చాళుక్య, చాళుక్యచోళ, కాకతీయాన్వయులకు సామంతులుగ నుండి ఆంధ్రదేశమునందు వేరు వేరు ప్రాంతములను పాలించుచుండియుండవలెను. మధ్య యుగము నాటికి వీరికి జ్ఞాపకముండిన వంశగాథల ననుసరించి వీరిది విరజాపురము కాబోలు. దానం జేసియే వీరికి విరజాపురవరేశ్వరులని ప్రఖ్యాత నామము కలిగినది. రాష్ట్రకూటనృపాలురు రట్టబూరు పురవరాధీశ్వరులును, కాకతీయులు కాకతి పురాధినాథులును, చోళులు ఒరయూరు పురవరేశ్వరులును అయినట్లే పరిచ్ఛేదులు విరజాపురవరేశ్వరులు. ఈ విరజాపురి యెచ్చటిదో సరిగా తెలియవచ్చుట లేదు. ఇది కళింగ దేశముననో తత్సీమావధుల దగ్గరనో ఉండియుండునని కొందరి యూహ. వీరి బిరుద ప్రశస్తినిబట్టి చూచినచో మధ్యయుగమునందు వీరు కొల్లిపాక సప్తసహస్రావనిని, కృష్ణానదికి దక్షిణమునం దున్న షట్సహస్రావనిని (ఆరువేలనాడు) పరిపాలించిరి. కొల్లిపాక యనునది కొలనుపాక—తెలంగాణాలోని ఇప్పటి కుల్పాక్. వీరపుడు శైవ మతావలంబులైన వీర మాహేశ్వరులు.

ఈ పరిచ్ఛేదులు తాము మాధవవర్మ వంశ్యులే యైనచో ఏ కారణముచేత ఆ విషయమును తమ బిరుద ప్రశస్తిలో చెప్పుకొనలేదో తెలియదు. మాధవవర్మ ప్రస్తావనము లేకుండ వారు తాము దుర్జయ కులాచల మృగేంద్రులమని, దుర్జయకుల కుముద చంద్రులమని చెప్పుకొని యున్నారు. దక్షిణాపథమున పూర్వ

కాలమునందు పరిపాలనము నెరపిన భూపతులకు వంశకర్తలైన దుర్జయు లిరువురున్నారు. వీరిలో ఒక దుర్జయుడు క్షత్రియుడు-వసిష్ఠ, కాశ్యపగోత్ర క్షత్రియులకు మూలపురుషుడు. కాశ్యపగోత్రులైన కాకతీయ క్షత్రియులు తాము సూర్యవంశజులమని, కరికాలచోళుని సంతతివారమని చెప్పుకొనినప్పటికి కరికాలచోడుని వంశమున దుర్జయుడొకడు పుట్టినట్లును, అతని యన్వయమునందే కాకతి బేతరాజు ప్రభవించినట్లును తమ శాసనములందు వ్రాయించుకొని యున్నారు. కాకతీయులే కాదు, కృష్ణజిల్లా నందిగామ తాలూకాలోని గుడిమెట్ట నగరమును రాజధాని కావించుకొని నాతవాటి (నాతివాడి) దేశమును క్రీ. శ. 1161-62, 1293-94 సంవత్సరముల నడుమ పరిపాలించిన త్యాగి వంశ క్షత్రియులకును మూలపురుషుడు దుర్జయుడే. ఈ త్యాగి వంశజులకే చాగివారని పేరు. మరియొక దుర్జయుడు చతుర్థాన్వయుడు; దుర్జయుని సంతతివారమని చెప్పుకొన్న చతుర్థ కులజులను గలరు. క్షత్రియుల, చతుర్థాన్వయుల మూలపురుషు లిరువురును దుర్జయ నామధేయులే యగుటచేత కొందరు చరిత్రకారులు క్షత్రియులను చతుర్థకులమువారన్నవారును గలరు; మరికొందరు కులాభిమానులు చతుర్థకులమువారు క్షత్రియు లన్నవారును గలరు. మొత్తముమీద పరిచ్ఛేదులు వారి శాసనోక్త బిరుద ప్రశస్తినిబట్టి దుర్జయక్షత్రియ కుల కుముదచంద్రులనుటకు సందియము లేదు. పూర్వోదాహృత వసిష్ఠగోత్ర క్షత్రియ బిరుద ప్రశస్తిలో ఉదాహృతులైన బుద్ధవర్మ, మాధవవర్మ, దేవవర్మ, చిక్కభీములలో చిక్కభీమరాజు పరిచ్ఛేది వంశజుడే. ఈతని శాసనములు కూడ నున్నవి. మాధవవర్మను గురించి యిదివరకే తెలుపబడినది. దేవవర్మయు, విష్ణుకుండి వంశజుడే—ఈ విషయము క్రిందటి వ్యాసమున నిచ్చిన వంశవృక్షములను జూచిన తేటతెల్లము కాగలదు. ఇక బుద్ధవర్మ విష్ణుకుండి వంశ్యులలో కానరాలేదు. పరిచ్ఛేదులలో నుండెనేమో విచారింపవలసి యున్నది.

* * *


విజయనగరయుగమునందలి మాధవవర్మ సంతతి వారినిగురించి తెలుపు ముఖ్యశాసనము విజయవాడ కనకదుర్గాలయము దగ్గర పగిలిపోయిన శిలాస్తంభముమీద చెక్కియున్నది. ఇది శాలివాహనశకము 1440 బహుధాన్య సంవత్సర వైశాఖమాసమున కర్ణాటాధీశ్వరుడైన శ్రీ కృష్ణదేవరాయల రాజ్యకాలమున పాపరాజు, వల్లమదేవుల కుమారుడు సింగయ్యదేవ మహారాజు తన తలిదండ్రులకును, తన అన్న బసవరాజునకును పుణ్యముగాను, తన కీర్తి సుకృతాలు ఆచంద్రార్కముగా నుండునట్లును చేసిన ధర్మములను తెలుపుటకు పుట్టినది. ఈ శాసనమున అతని ధర్మములను వివరించు పట్టున ఒకటి రెండు పంక్తులు కొంత చెడిపోయినవి. ఈ శాసనమువలన వీరి పూర్వనాయంకరము చాంగలమర్రిసీమయని విదితమగుచున్నది. చాంగలమర్రి-ఇప్పటి చాగలమర్రి-కర్నూలుజిల్లా శిరువెళ్ళ తాలూకాలో నున్న గ్రామము. ఈ గ్రామమునకు చుట్టుపట్టుల నుండు ప్రదేశమే చాంగలమర్రిసీమ.

సింగయదేవ మహారాజు చాంగలమర్రిలో కేశవదేవరకు గోపురమును...కు గోపుర ప్రాకారాలను... గుడియు, చాంగలమ్మ గుడియు, తన తల్లి వల్లమదేవులంగారి పేరను తిరుమలదేవర గుడి మంటపమును వీథియు కట్టించి, తన అన్న తిరుమలరాజు పెట్టిన గుండ్లమడుగు తిమ్మసముద్రమను అగ్రహారమునందు వినాయక, శివ, విష్ణు దేవాలయములను, తటాకారామములను, బ్రహ్మప్రతిష్ఠలను ప్రతిష్ఠించి బెజవాడ వద్దను తన తాత మాధవవర్మకు ప్రత్యక్షమైన దుర్గాదేవికి "తొలి నిర్మితమై వుండిన గర్భగృహము ముందరి అంతరాళికమున్ను పదిలం చేయించి, ఆ ముందరను తొమ్మిది అంకణాల రంగమంటపమున్ను, ఆ ముందరను భోగ మంటపమయిన మూడు అంకణాల భద్రమున్ను కట్టించి యుప్పను భూమిలోన నుండి వెళ్ళనెత్తిన కేశవనాథునికి మీందం ప్రతిష్ఠ చేయించి, దుర్గిదేవమ్మ వుద్భవమైవుండిన కొండ వుత్తరపుదిక్కు చట్టున్ను తూర్పు పడమర్లు నిడుపు తొంమిది చేతులున్ను, ఆ వెడల్పు యేడు చేతులున్ను, ఆ పొడవు యెనిమిది చేతులున్ను వరకించి భూప అవసరము......ముగాను ధర్మము ప్రతిష్ఠ చేసెను.

ఈ శాసనము సింగయ్యదేవ మహారాజు పూర్వులనుగురించి యిట్లు తెలుపుచున్నది. సూర్యవంశమున మాధవవర్మ తారాగణములోని చంద్రునివలె ప్రకాశించెను. చండికా ప్రసాదమున యశస్వియైన యతడు అష్టాపదమయీవృష్టి (సువర్ణవృష్టి)ని కురిపించెను.

ఈతని వంశములో శత్రునిశేతయైన కంఠమరాజేంద్రు డుదయించెను. ఈతని తనయుడు అన్నల దేవరాజు. ఈతని భార్య కేశవాంబ. ఇతడు గోదావరినదిని దాటు జంతువులు నీటిలోబడి మునిగిపోకుండ ఆ నదికి సేతువును నిర్మించెను. (యాతుం యశాంసి యో జంతూం స్త్రాతుం చాంభసి మజ్జతః । సేతుం బబంధ గోదాయా యా తుంగజలవీచికా) అన్నల దేవకేశవాంబలకు సింగరాజు జనించెను. ఇతని భార్య లక్కమ. ఈదంపతులకు పెదవల్లభ భూపాలుడని, పినవల్లభ భూపాలుడని యిరువురు పుత్రులు కలిగిరి. పెదవల్లభ భూపాలునికి అన్నలదేవి, రాయకమ్మ అని యిరువురు భార్యలు. పెదవల్లభ నృపాలునికి అన్నలదేవి వలన సింగరాజేంద్ర, తిమ్మభూవిభులని యిరువురు కుమారులు కలిగిరి; రాయకమ్మ పుత్రులు పాపరాజ, ప్రభాకర రాజులు. వీరిలో ప్రభాకర మహీపతి ప్రభాకర పట్టణమును కట్టించెను. ఇది నెల్లూరు జిల్లా ఆత్మకూరు తాలూకాలోని ఇప్పటి ప్రభగిరి పట్టణము కావచ్చును. పాపరాజు వల్లమాంబికను పరిణయమాడెను. వీరి తనయుడు సింగభూవరుడు. తిమ్మరాయలకు దేమమ, పిన్నలదేవి, లక్కమ అని ముగ్గురు భార్యలు. వీరిలో దేమమకు బసవరాజును, పిన్నలదేవికి తిమ్మ (తిరుమల) రాజును, లక్కమదేవికి వల్లభరాజును కలిగిరి. మాధవ వర్మ వంశ్యుల ఈ సంతతి క్రమముగ ఈ క్రింది వంశ వృక్షమున తేటపరుపబడినది.

సూర్యవంశజులు, వసిష్ఠగోత్రులు



పాపరాజు కొండరాజు బసవరాజు వల్లభరాజు నాగరాజు బేతరాజు.

ఈశాసనమునం దిచ్చిన మాధవవర్మ వంశజుల బిరుదప్రశస్తి యిది: "హాసబిరుదరగండ, సహకారభాండవ, మల్లికా వల్లభ, రణరంగ భైరవ, గండధనంజయ బిరుదాంకులైన బెజవాడ దుర్గా వరప్రసాదులైన మాధవవర్మ. వంశోద్భవులు."

పాపరాజు భార్యవల్లమదేవి ధనంజయ గోత్రులైన కీర్తిపాటి సిరిగిరిరాజుంగారి కొమారిత యట.

సింగరాజుంగారు పూర్వోక్త ధర్మములను మాత్రమేకాక "రామారి శ్రీరంగరాజుల గుడిన్ని బావిన్ని కట్టించి చలివంద్రిని తీ ంటాను పెట్టించి ఆ రంగనాథుని అంగరంగ వైభవాలకు బొమ్మనపల్లి అనే గ్రామము ధారవోసియిచ్చి అహోబిల ప్రాంతమందు సింగవరముల అగ్రహారమున్ను కొండవీటి రాజ్యములోను తమ పూర్వనాయంకరమైన వుల్లసంగంటి సీమలోని కొమ్మవరానకు ప్రతి నామకమైన సింగవరమని గ్రామమున్ను అగ్రహారాలు చేసి సప్త సంతానాధీశ్వరుండై విజయనగరమందు విరూపాక్షదేవుని గుడి పడమటి పట్టిక ... దుర్గగుడిన్ని, రామచంద్రదేవుని రథోత్సవ మంటపమున్ను కనక - గణపతి శివాలయములున్ను కట్టించిరి; విద్యానగర రక్షకుండైన రణమండలము భైరవేశ్వర దేవుని ముఖమంటపమున్ను, మీంది ఉప్పరిగాను కట్టించిరి." ఇంకను ఈ శాసనమున అనేక దానధర్మములు సింగయదేవ మహారాజు తనయులు అతని పూర్వులు చేసినవి వివరింపబడినవి.

తిమ్మరాజ తనూభవుడైన బసవ భూపాలుడు యుద్ధమునందు సకల బలయుతుడైన పారసీక క్షితీంద్రుని, మల్లికా వల్లభాది అనుపమ బిరుదములు కలిగిన ఇతర క్షోణీభృతులను జయించి, తన యవార్య బాహు విక్రమమువలన ఉగ్ర శత్రువశమునందుండిన దుర్గములను బట్టుకొనెను.

పాపరాజ తనయుడైన సింగయదేవ మహారాజు కృష్ణదేవరాయలు క్రీ. శ. 1518 నాటికి పూర్వ దిగ్విజయము కావించి పొట్నూరిలో జయ స్తంభ మెత్తించి విజయనగరము చేరినపిదప చెక్కించిన శాసన మిది. దీనివలన కంక మహారాజు మొదలుకొని సింగయదేవ మహారాజువరకు గల మాధవవర్మ సంతతివారిని గురించి తెలియుచున్నది.

(సశేషము)

తాతయ్యా మురిపెం!

శ్రీ పురాణం సూర్యప్రకాశరావు

సుబ్బయ్య తాతయ్యని అంతా డబ్బుల తాతయ్య అని పిలుస్తూండేవాళ్ళం. బంగుకోటిలో ఎవరింట ఏ ముచ్చట జరిగినా పనిమంది చేరినప్పుడు పిల్లలంతా ఆయనకోసం గాలిస్తూండే వాళ్ళం. "సుబ్బయ్య ఇంకా రాలేదూ?" అని మాతోపాటు పెద్దవాళ్ళు కూడా పదిసార్లు అనుకుంటూండేవాళ్ళు. ఆయన రాగానే పిల్లలందర్నీ చుట్టూతా కూర్చోబెట్టుకుని కోటుజేబులోంచి గుప్పెళ్ళకొద్దీ చిల్లర తీసి ఎదురుగ్గా పోసుకుని మిఠాయిపంచిపెట్టే పట్టుగా పిల్లలకి పంచిపెట్టేవాడు. ఆయనవున్న నాలుగు రోజులూ మాకు చిరుతిండి దండిగా పడుతూండేది. ఒక్క నిమిషం ఆయన్ని విడిచిపెట్టి వుండేవాళ్ళం కాం. ఆఖరికి భోజనందగ్గరకూడా అంతా పంతాలు పడి ఆయన చుట్టూతా కూచుని తలో ముద్దా ఆయన చేత చేతిలో వేయించుకుని తింటే గాని మాకు తృప్తిగా ఉండేదికాదు. పిల్లల్తో సమానంగా ఆడుతూ పాడుతూండేవాడు. తాతయ్యదగ్గర పేకముక్కలు ఉండేవి. వాటితో గారడీలు చేస్తూండేవాడు. అమ్మమ్మదగ్గర చనువు వుండేది గాని తాతయ్య దగ్గరున్న ఆకర్షణ ఉండేదికాదు.

డబ్బుల తాతయ్యకు ఇద్దరు మగపిల్లలూ, ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. ఏడాది రెండేళ్ళు పెరిగి ఇద్దరాడపిల్లలు, ఒక మొగపిల్లవాడు పోయారు. ఇక మిగిలిందల్లా ఆఖరివాడు సూర్యనారాయణ ఒక్కడే. వాడు నాకంటె నాలుగేళ్ళు పెద్ద.

"ఒరే నీపేరేమిటిరా?" అని ఎవరైనా అడుగుతే "తూల్యం" అని చెప్పేవాడు.

"అదేమిటి తాతయ్యా వాడు అలా అంటాడు?" అని తాతయ్యని అడుగుతే "చిన్నపిల్లవాడు గద్రా పాపం. మాటలు ఇంకా బాగా రాలేదు" అనేవాడు తాతయ్య.

మామటుకు మాకు వల్లమాలిన ఆశ్చర్యం వేసేది. వాడు మాకంటె నాలుగయిదేళ్ళు పెద్దయినా తాతయ్య ఇలా అంటాడేమిటా అని ఆశ్చర్యపోయే వాళ్ళం.

అమ్మమ్మమటుకు ఊరుకునేదికాదు. "తాతయ్య అలాగే అంటార్రా. గారంమప్పి అలాగే వాడ్ని పాడు చేస్తున్నారు. వాడికి ఒక్క మాటే ఏమిటి, అన్నీ అవలక్షణాలూ ఉన్నాయి." అనేది అమ్మమ్మ.

తాతయ్య సూర్యాన్ని ఒళ్ళోకూర్చోబెట్టుకుని "పాపం. పండులాంటి వాణ్ణి పట్టుకుని లేనిపోని పేర్లు పెడతావు. అవలక్షణాలు నీకున్నాయి. వాడికేం లేవు. కదరా బాబీ......" అంటూ ముద్దు పెట్టుకునేవాడు. సూర్యం బుగ్గలుకుడుచుకుని బుంగమూతిపెట్టుకుని అమ్మమ్మవైపు కోపంగా చూస్తూండేవాడు. తాతయ్యంటే మాకు ఎంతఅభిమానమున్నా ఈ విషయంలో అమ్మమ్మ చెప్పిందే నిజం అని మేం అంతా అనుకునే వాళ్ళం. సూర్యం ఏంచేసినా ఎబ్బెట్టుగా అనిపించేది. వాడు నడుస్తూంటే అటూ ఇటూ తాగినవాడిలా ఊగిపోయేవాడు. అది నడక అని చెప్పటానికి లేకుండా పరుగు అని చెప్పటానికి లేకుండా ముందుకు పడబోయి ఆపుకున్నట్టుగా తమాషాగా నడిచేవాడు. ఆటలో పాటలో కలిసేవాడుకాదు. కలిసినా భరించలేని బాధలు పెట్టేవాడు. అందరి కళ్ళల్లోనూ దుమ్ముచల్లి పారిపోయేవాడు. కళ్ళు నలుపుకుంటూ ఏడుస్తూ తాతయ్యతో పోయి ఫిర్యాదుచేస్తే ఓ అర్ధణా కాసు చేతులో పెట్టి బుజ్జగించి పంపేసేవాడు తాతయ్య. అమ్మమ్మ చెయ్యి చేసుకోబోతె తాతయ్య వాడ్ని వాటేసుకుని మాదగ్గరికి తీసుకొచ్చేసేవాడు. సూర్యం మాట్లాడుతుంటే నోటివెంబడి చొంగకారుతూండేది. అరిచేత్తో తుడుచుకుని ఒంటికి పూసుకునేవాడు. మాకంటె పెద్దయినా పగల్లా ఒంటిమీద గుడ్డయినా లేకుండా మొండిమొలతో తిరుగుతూండేవాడు. తొడుగుతే ఉంచుకునేవాడు కాడు. వాడి ప్రతిచర్యనీ మేం వింతగా గమనిస్తూండే వాళ్ళం. వాడు ఏక్షణంలో ఏపనిచేస్తాడో ఎవరికీ తెలిసేదికాదు. ఎత్తైన ప్రహారీ గోడమీంచి ఉన్నట్టుండి కింద ఇసకలో ఆడుకునే పిల్లలమీదికి ఉరికేవాడు. ఒక్కొక్కప్పుడు తాతయ్యజేబులో పెన్ను తీసుకుని

అరచేతులంతా పిరాపూసుకుని బుగ్గలు చరుచుకుంటూ అందర్నీ భయపెడుతూండేవాడు.

అన్నిటికంటె వాడు నీళ్ళుపోసుకునే ఘట్టం చాలా రసవత్తరంగా ఉండేది. అమ్మమ్మ తాతయ్య వాడికి తినటాని కేదయినా పెట్టి మంచిమాటలాడి, బతిమాలి, మెల్లగా భావిపళ్ళెం దగ్గరికి తీసుకుపోయేవారు. తీరా అక్కడిదాకా వెళ్ళింతర్వాత, శివం ఎత్తినట్టుగా బిర్రబిగుసుకుపోయి చిందుకుతొక్కి పెనుగులాడి విడిపించుకుని పారిపోయేవాడు. తాతయ్య వాడ్ని పట్టుకుని లాలిస్తూ మళ్ళీ భావిదగ్గరకు తీసుకొచ్చేవాడు. మేం పళ్ళెంచుట్టూ నిలబడి చోద్యం చూస్తూండేవాళ్ళం. నీళ్ళు పోసుకోవటమన్నది మాకు సమస్యకాదుగా మరి. అమ్మమ్మ వాడిరెక్కలు పట్టుకుని తీసుకుపోతుంటే తాతయ్య వెనకాలే తుండుగుడ్డా, సబ్బుబిళ్ళా పట్టుకుని వాళ్ళిద్దర్నీ అనుసరించే దృశ్యం ఇప్పటికీ నాకళ్ళముందు మెదల్తూంటుంది.

భావిపళ్ళెంలో వాడు వెల్లకితలాపడి కాళ్ళు తపతపా బాదుతున్నా తాతయ్య వాడ్ని గట్టిగా పట్టుకుని అలాగే ఒళ్ళంతా రుద్ది వాడి ఒళ్ళుతుడిచి వాడికి బట్టలుతొడిగి ఆ తతంగం పూర్తయేసరికి తాతయ్యకీ, అమ్మమ్మకీ ముఖాలు కందిపోయి నానా హైరానా అయి కోపవచ్చినంత పనయేది. అప్పుడప్పుడు సూర్యాన్ని ఏ చెట్టుకో పుట్టకో తాడుపెట్టి కట్టేసి మరీ నీళ్ళు పోస్తూండేవాళ్ళు కూడాను. ఈ విషయంలో మటుకు తాతయ్య బాధ్యతంతా అమ్మమ్మ మీద వదిలిపెట్టేసేవాడు. ఆవిడ నయానచెప్పినా, భయానచెప్పినా, దండించినా అతను నోరు మెదిలే వాడు కాడు. కాని లోపల్లోపల వాడి వంటిమీద పడుతున్న ప్రతిదెబ్బా తనమీద పడుతున్నట్టుగానే బాధపడుతున్నాడని స్పష్టంగా ఆయనముఖం చూస్తే తెలుస్తూనే ఉండేది. అయినా ఏమీ అనేవాడు కాడు.

అప్పుడప్పుడు అమ్మమ్మ వాడ్నిగురించి కన్నీటితో ఏదో చెబుతూండటం తాతయ్య చప్పరించేసి తేలిగ్గా తోసిపారేస్తూండటం మేం గమనిస్తూండే వాళ్ళం.

ఆ తర్వాత కొన్నాళ్ళకి మేమంతా విశాఖపట్నం వెళ్ళిపోయాం. నాన్నకి ఆవూరు బదిలీ అయింది. మమ్మల్ని సాగనంపటానికి తాతయ్య, అమ్మమ్మ స్టేషనుకి వచ్చారు. ఇంకో పదినిముషాలకి బండి కదుల్తుందనగా ఓ తమాషా జరిగింది. అంతవరకూ స్టేషనులో తాతయ్య చెయ్యిపట్టుకుని తిరుగుతున్న వాడల్లా సూర్యం తప్పిపోయి పార్సిలుగదిలో తలుపు చాటున దాక్కుని తాతయ్యని చూసికూడ బయటికి రాకుండా 'తాతయ్యా' అని పిలుస్తూ దాగుడుమూతలాడిన వైనమంతా తాతయ్య బండికదిలేముందు తమాషాగా పెద్దగా నవ్వుతూ చెప్పుకొచ్చాడు.

"ఊరుకోండి. ప్రతాపం బాగా పేరుండి." అని అమ్మమ్మ విసుక్కుంది.

సూర్యం కేవిగా నిటారుగా నిలబడి పైమాపులు చూస్తున్నాడు. బండి కదిలిపోయింది.

2

అయిదు సంవత్సరాల తర్వాతమాట. నేను నాలుగోఫారం పాసయి అయిదోఫారంలోకి వచ్చాను. కామాక్షమ్మపిన్నికూతురు పెళ్ళికిఅంతా రాజమండ్రి వెళ్ళాం. నా మనసులో డబ్బుల తాతయ్యని, అమ్మమ్మని, ముఖ్యంగా సూర్యాన్ని చూడాలని మహా తహతహగా ఉంది. ఇదివరకు మల్లే అరుగుమీద పడి ఎదురుతెన్నులు చూడకపోయినా కిటికీవార కూర్చుని వీధి మొగవైపు ఉండి ఉడిగీ చూస్తూనే ఉండేవాడ్ని. డబ్బుల తాతయ్య పరిచయమున్న పిల్లలందరూ పెద్ద వాళ్ళయి పోతున్నారు: కామాక్షమ్మ పిన్నికూతురు రుక్మిణికి అప్పుడే పెళ్ళికూడా అయిపోతోంది. మరి కొంతమంది ఆ యీడుపిల్లలు కాపరానికిక్కూడా వెళ్ళిపోయారు. ఇలా మా జట్టులో నేనొక్కణ్ణే మొగపిల్లల తరఫున తాతయ్యగురించి ఎదురుచూసేవాడ్ని అయిపోయాను. పెళ్ళికూతురు రుక్మిణి వీధిలోకి వచ్చేది కాదు. అది పెద్దాపేరక్కలా పెద్దవాళ్ళమధ్యనే కూర్చుని పెద్ద పెద్ద కబుర్లు చెబుతూండేది.

డబ్బుల తాతయ్య వచ్చాడు. అమ్మమ్మ, సూర్యం కూడా వచ్చారు. కాని ఇదివరలా 'డబ్బుల తాతయ్య వచ్చాడు' అని గెంతుకుంటూ పోవటానికి నాకు సిగ్గేసింది. ఆయన్ని చూడగానే అంత ఉత్సాహమూ వచ్చిందిగాని బయటికి ప్రదర్శించటానికి ఏదో అడ్డుపడినట్టయి 'తాతయ్యా' అని మటుకే పలుకరించాను.

తాతయ్య వెన్నుతట్టి "ఏరా మనవడా? ఉత్తి తాతయ్య అనిపిలిచి ఊరుకున్నావేం?" అన్నాడు.

"డబ్బుల తాతయ్య అని పిలవాలిరా ?" అంది అమ్మమ్మ తాతయ్యకి ఎదురువస్తూను.

సూర్యం బాగా ఎదిగాడు. వాడిలో వచ్చిన మార్పుల్లా అదొక్కటే అని నేను మొదటి చూపులోనే పసిగట్టేశాను.

తాతయ్యని పలకరించటానికి వచ్చిన రుక్మిణి వెనకాలే ఒంగి ఒంగి వెళ్ళి ఆమె వీపుపైన పూలజడని పట్టుకొని ఒక్క గుంజు గుంజాడు సూర్యం.

రుక్మిణి 'అమ్మ బాబోయ్!' అంది ఒక్కమాట.

అందరూ అదిరిపడి అటు తిరిగారు.

తాతయ్య వాణ్ణి దగ్గరగా తీసుకొని 'తప్పురా వెధవాయి' అంటూ మందలించాడు గాని అమ్మమ్మ ముఖంమీద కత్తివేటుకు నెత్తురుచుక్క లేదు.

కామాక్షమ్మ పిన్ని "అరి భడవా ఇంకా అల్లరి మానేసురా" అంటూ నవ్వేసింది గాని ఆ తర్వాత 'తాడిలా ఎదిగి ఇంకా ఏమిటా పిచ్చిపన్లు' అని గొణుక్కోవటం నేను విన్నాను.

సూర్యం నా దగ్గరకు వచ్చాడు. ఎదురుగ్గా కుర్చీ చూపించి కూర్చోమన్నాను. వాడు కుర్చీమీద గొంతుక్కూర్చుని వెకిలిగా నవ్వుతూ "నీకు దాగుడుమూత లాడటం వచ్చా?" అన్నాడు.

సమాధానం ఏం చెప్పాలో నాకు బోధపడలేదు.

సూర్యం "పోనీ ఎక్కాలు వచ్చా? నాకు అయిదో ఎక్కంవరకూ వచ్చు" అన్నాడు.

దానికీ ఏం చెప్పాలో బోధపడలా.

ఇంతలో తాతయ్య పొడుంపీల్చుకుంటూ అక్కడికి వచ్చాడు. తాతయ్య రాగానే సూర్యం కుర్చీ మీంచి కిందకు ఒక్క గెంతుగెంతి తాతయ్య ఒళ్ళో ఎక్కి కూర్చుని "చూడు నాన్నా. వీడికి దాగుడు మూతలాడటం రాదుట. ఎక్కాలు చదవటం రాదుట. హీ ! హీ !!" అంటూ నవ్వసాగాడు.

తాతయ్య వాడ్ని యింకా దగ్గరగా తీసుకొంటూ "అది కాదురా పిచ్చినాన్నా. వాడు నీకంటె మంచి ఆటలే ఆడుతాడు. చదువులో కూడా నీకంటె బాగా పై చదువులోకి వెళ్ళాడురా." అన్నాడు.

"పైకంటె ఆకాశం మీదికా?" అంటూ వేళా కోళంగా అనేసి సూర్యం ఉడుంగుమని అక్కడ్నించి పారిపోయాడు.

వాడి విషయంలో తాతయ్య ప్రవర్తన నాకు విచిత్రంగా తోచేది. ఆ పందడి సమయంలోకూడా వాడికి ఏ ఇబ్బందీ రాకూడదని తాతయ్య ఉద్దేశ్యం. ఎవరు తిన్నా తినకపోయినా వేళకి వాడి భోజనం అయిపోవాలి. వాడు ఫలానా పదార్థం కావాలంటే అది మడిలో ఉన్నా సరే ఏ ముసలావిడో మడిగట్టుకొని అది వాడిచేతిలో పడెయ్యాల్సిందే. అంతవరకూ వాడెంత ఆగం చేస్తాడో తాతయ్య దానికి రెట్టింపు చేసేస్తాడు.

"ఇంటి దగ్గర ఏం చేసినా బాగుంటుంది. ఇది పందిడి సమయం. మనం ఇక్కడ గారంచేస్తే బాగుండదు. వాడ్ని కొత్త మందలిస్తూండండి. వాడుచేసే పనులు నాకు తలవంపులుగా ఉన్నాయి" అంటూండేది అమ్మమ్మ.

"పోవే. పిల్లలు అల్లరి చెయ్యకపోతే నువ్వూ నేనూ చేస్తావేఁటే?" అనేవాడు తాతయ్య.

"వాడికంటె చిన్నవాళ్లు ఎలా ఒద్దికగా ఉన్నారో చూడండి. మన ఖర్మకాకపోతే..." అని అమ్మమ్మ వాపోయేది. పెళ్ళయిన మర్నాడు నేను వీధిగదిలోకూచుని పత్రిక చదువుకుంటున్నాను.

ఉన్నట్టుండి మధ్యగదిలోంచి రుక్మిణిగొంతు తారస్థాయిలో వినిపించసాగింది. దబ్బున లోపలికి వెళ్ళాను. రుక్మిణి మంచంకమ్మీకి కట్టేసిఉన్న జడని విప్పుకుంటూ సూర్యాన్ని తిట్టిపోస్తూంది. కామాక్షమ్మ పిన్ని రుక్మిణి నోరుమూసి "బాగుండదు. తిట్టకు. ఊరుకో." అంది.

అదృష్టవశాత్తు అమ్మమ్మ, తాతయ్య అక్కడ లేకపోవటంవల్ల సూర్యంచేసినపని ఆగం కాలేదు. రుక్మిణి నోరుపారేసుకోవటంతో సూర్యం కిలకిలా నవ్వుకుంటూ పెరట్లోకి పారిపోయాడు. ఎలా తెలిసిందో ఆ నోటా ఆ నోటా ఈ విషయం అమ్మమ్మ చెవినిపడింది. సాయంత్రం పెళ్ళికూతురు జడవెయ్యటానికి దువ్వెన్న తలమీద పెట్టగానే 'అబ్బా!' అంది రుక్మిణి. అదేమని చూడబోతే నిమ్మకాయంత బొప్పి చేతికి తగిలింది.

"అబ్బా ఎంత బొప్పికట్టిందే. ఉండు వాడిపని చెబుతా" అంటూ అమ్మమ్మ శివం పూనినట్టుగాలేచి పందిరిరాటల కెగబాకుతూన్న సూర్యాన్ని చరాచరా కిందకిలాగి నాలుగుదెబ్బలు వేసింది. సూర్యం అమ్మ

మ్మతో పేనుకులాడుతూ ఆవిడ ఖరీదయిన చీర చెరగు పట్టుకుని లాగటంలో అది పరపరా చిరిగిపోయింది. దాంతో ఆవిడ ఆవేశం కట్టలుతెగి కోపకి చేతకానితనంగా మారి కన్నీరు గ్రుక్కుకుంటూ "ఒక చదువూ లేదు. చట్టు బండలూ లేదు. పైగా ఈ వెర్రి అల్లరేవిఁటిరా?" అంటూ ఆమె గదిలోకి వెళ్ళిపోయింది.

సాయంత్రం తాతయ్య వాణ్ణి వెనక వేసుకుని "ఎందుకే వాణ్ణి కొట్టావుట?" అంటూ అమ్మమ్మని సంజాయిషీ అడిగాడు.

"కొట్టక ముద్దు పెట్టుకుంటారేవిఁటి. చూడండి. వాడేం చేశాడో" అని అమ్మమ్మ చిరిగిపోయిన చీర పట్టుకువచ్చి చూపించింది.

"ఆ మాత్రానికి వాణ్ణి పట్టుకుని అంతంత దెబ్బలు కొడతావా?" అంటూ లేచాడు తాతయ్య.

ఇక ఈ ధోరణి ఎంతవరకూ పోతుందో అమ్మమ్మకి తెలుసు. ఇంతమందిలోనూ ఆయన చేతి దెబ్బలు కూడా తినాల్సి వస్తుందనే పరిస్థితి రాకుండా ముందే జాగ్రత్తపడుతూ "రుక్మిణి నిద్రపోతుంటె దాని జడ మంచం కమ్మీకి కట్టేశాడు. అది లేవబోయి తల మంచంకోడుకు కొట్టుకుని ఇంత బొప్పికట్టింది. ముట్టుకుంటే పుండులా బాధపడుతూంది పాపం" అంది అమ్మమ్మ.

తాతయ్య తగ్గిపోయి రుక్మిణిని పలకరించి సూర్యాన్ని మందలించాడు. "ఒరేయ్. ఇల్లాంటి పనులుచేస్తే ఇక నీకు బిళ్ళలు కొనియ్యను. నీకు సినిమాలు చూపించను. తెలిసిందా?" అంటూను.

ఆ మాత్రానికే సూర్యం బావురుమంటూ బాకా ఎత్తాడు.

నాకంటె పెద్దవాడు అలా ఏడుస్తుంటె నాకే సిగ్గనిపించి యివతలకి వచ్చేశాను. లోపల్నించి తాతయ్య వాణ్ణి బుజ్జగించటం వినిపించింది.

సూర్యం ఈపాటికి కాలేజీ చదువు చదువుతూండాల్సినమాట. వాడి చదువింకా ఎక్కాల స్థాయిలోనే ఉన్నదంటే ఒక్కొక్కప్పుడు వాణ్ణి చూస్తుంటే జాలి వేస్తూండేదికూడాను. అమ్మమ్మద్వారా విన్నదేవిఁటంటే వాడి చదువుకోసం ఎన్ని ప్రయత్నాలు చేసినా అవి సాగనివ్వకుండా తాతయ్య వాడూ కలిసి పాడుచేస్తున్నారని. బడికి పంపుతే పంతులు కొడుతున్నాడని వాణ్ణి తాతయ్య బడి మానిపించేశాట్ట. ఇంటివద్దర ప్రయివేటు పెడితే ఒకపూట చదివీ ఒకపూట చదవకా ఆయన్ని ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తే ఆయన వేగలేక మానుకున్నాట్ట. ఇంటిముందే ఒకాయన వీధిబడి పెడితే కంటిముందు ఉంటాడు గదా అని అందులో జేర్పిస్తే, చదువులేదు సరికదా చిన్నచిన్న దొంగతనాలు మొదలుపెడితే అవి రుజువయి పంతులుగారే తాతయ్యతో ఇక మీ వాణ్ణి నా దగ్గరకు పంపవద్దని చెప్పేశారుట. ఇలా అయిదారు గట్టిప్రయత్నాలని యిద్దరూ కలిసి ధ్వంసం చెయ్యటంతో అమ్మమ్మే వాడికి నాలుగు అక్షరమ్ముక్కలు చెప్పాలని ప్రయత్నించింది గాని అదికూడా సాగలేదు. వాడి చదువు విషయం ఎత్తితే "పోనిద్దూ, వాడే చదువుకుంటాడు. ఇప్పుడు వాడు బి. ఎ. పాసయి నీకు సంపాదించి పొయ్యాలా?" అనేవాట్ట తాతయ్య. ఈ విషయాలన్నీ అమ్మమ్మ కన్నీరు మున్నీరుగా విలపిస్తూనే చెప్పింది. వాడి భవిష్యత్తుగురించి అమ్మమ్మకున్న ఆందోళన తాతయ్యకెందుకు లేదా అనిపించింది. "అయితే, ఆడదాని మాట ఆలకించే దెవరూ? మంచయినా చెడయినా చెప్పింది చెయ్యటానికేగాని చెప్పటానికి ఆడదెవత్తి?" అనికూడా అమ్మమ్మే అంది.

ఈ మారు సెలవుల తాతయ్యకి మరోక పిల్లలజట్టు పరిచయం అయింది. మేమంతా దూర దూరంగా మసులుతుంటె "మీరంతా పెద్దవాళ్ళయిపోయారుట్రా అప్పుడే? అవున్లే. అందరికంటె నేనే చిన్నవాణ్ణి. సరే.. సరే .." అంటూ తాతయ్య తల పూపుతూ నవ్వుతూండేవాడు.

నాకు ఎంతసేపూ పుస్తకాలు చదవటంతో సరిపోయేది. అన్ని పత్రికలూ పోగుచేసి చదువుతూండేవాణ్ణి. తాతయ్య చిల్లరడబ్బులు కుప్పగా ముందుపోసుకుని పిల్లలకి పంచిపెడుతూనే ఉండేవాడు. ఆ దప్పళ్ళు వింటుంటె చెయ్యి చాపటానికి సిగ్గగా అనిపించినా తాతయ్య నాకూ ఇస్తే బాగుండును అనిపించేది. తాతయ్య మాసంగతే పట్టించుకునేవాడు కాదు.

పెళ్ళయిన వారానికల్లా మేం మళ్ళీ విశాఖపట్నం వెళ్ళిపోయాం.

3

నేను అనర్సు పూర్తిచేశాను. ఇంకా పైకి చదవాలని ఉందిగాని నాన్న ఒక్కరెక్కమీద సంపా

దించారు. ఇక ఇక్కడితో చాలు అనుకున్నాను. అనువైన ఉపాధ్యాయ పదవికి పోవాలని కాలేజీ లన్నిటికి దరఖాస్తులు పెట్టుకొన్నాను. క్లాసులో పాసయ్యాను కనక ఏదో ఓ కాలేజీ అవకాశ మిస్తుందని ఎదురు చూస్తున్నా.

రుక్మిణి ఆమె భర్త ఇద్దరు పిల్లలతో విశాఖపట్నం వచ్చింది. అదిసి ఆడబడుచు పెళ్ళికని వచ్చింది. రెండు రోజులు మాయింట్లో ఉంది. ఆ మాటా ఆ మాటా చెబుతూంటే డబ్బుల తాతయ్య ప్రసక్తి వచ్చింది.

నేను చదువుతూన్న పుస్తకాన్ని చట్టున మూసి వాళ్ళదగ్గరకు పోయి కూర్చున్నాను.

"తాతయ్య పరిస్థితి మునుపట్లా లేదు పాపం. సంపాదించినన్నాళ్ళూ వెనకా ముందూ చూసుకోకుండా ఖర్చుచేసేశాడు. అమ్మమ్మ మొదట్నుంచీ చెబుతూనే ఉంది. అదిసమాట వింటేనా? రిటైరయ్యాడు. ఒచ్చిన ప్రావిడెండు ఫండుతో చిన్న ఇల్లు మాత్రం కొనుక్కున్నాడు. గృహప్రవేశానికి ఎవర్నీ పిలవలేక పోయానే అని చాలా బాధపడ్డాడు. ఉండటానికి నీడయితే ఉంది. భుక్తిమాట?".

"అయితే సూర్యంచేతి కందలా?"

"అయ్యోరాత. వాడి సంగతే చెప్పకోవాలి. ఖర్మ!" అంటూ నోరు నొక్కుకుంది రుక్మిణి.

"అదేమిటే అలాగంటావు. వాడు మన లక్ష్మణరావు ఈడువాడు కాదూ? ఎంతవరకూ చదివా డేమిటి?" అంది అమ్మ.

"చదువూ లేదు. చట్టుబండలూ లేదు. తినటం. తిరగటం." అంది రుక్మిణి పిల్లవాడ్ని కాళ్ళమీద వేసుకుని జో కొడుతూను.

"అయితే వాడిక ఎందుకూ పనికిరాడంటా వేమిటే?" అంది అమ్మ ఆందోళనగా.

రుక్మిణి నోరు చప్పరించి "అలాగే ఉంది చూస్తుంటే" అంది.

వాడిలా కావటానికి బాధ్యు లెవరో నాకు తెలుసు. రుక్మిణికూడా ఆ మాటే అంది. "పిల్లల్ని అందరం ముద్దు చేస్తాం. అంతగా నెత్తి కెక్కించుకుంటే అలాగే అవుతారు. పిల్లల పెంపకంలో ముద్దు చేసినప్పుడు ముద్దూ చెయ్యాలి. మందలించాల్సినప్పుడు మందలించాలి. పిల్లలకి ఏం తెలుస్తుంది పాపం! మనమే వాళ్ళని ఓ మార్గంలో పెట్టాలి."

అఖరికి నేనూ రుక్మిణీకూడా తాతయ్యని విమర్శించేవాళ్ళం అయిపోయాం. ఒకప్పుడు మేం ఇద్దరమూ ఆయన వీపులమీదఎక్కి ఆట్లాడిన వాళ్ళమే. ఆయనదగ్గర డబ్బులుకోసం ఆరాట పడినవాళ్ళమే.

రుక్మిణి ఇంకా చాలా విషయాలు చెప్పింది.

సూర్యాన్ని అ మధ్య ఓ వర్క్‌షాపులో చేర్పించారట. చేరినమర్నాడే ఇనపదూలం కాలిమీద వేసుకుని, కాలు విరిగినంతపనయితే షాపుకి వెళ్ళటం మాన్పించేశారట.

"చిన్నప్పట్నుంచి కాస్త భయభక్తుల్లో పెంచి ఉంటే నలుగురిలో పాటే వాడూ నాలుగుముక్కలు నేర్చుకుని బాగుపడేవాడా? నువ్వన్నట్టు వాడ్ని అనుకుని ఏం ప్రయోజనంలేదే. అంతా మనతప్పు. పాపం! నూరేళ్ళు నెట్టాలి. ఏమయిపోతాడో!" అంటూ వాపోయింది అమ్మ.

4

విజయవాడ కాలేజీవాళ్ళు ఇంటర్వ్యూకి రమ్మనమని ఆహ్వానించారు. చిన్న బెడ్డింగుతో బయల్దేరాను. బయల్దేరేముందు తాతయ్యకు ఓ కార్డుకూడా వ్రాశాను. అనుకున్నట్టుగాను స్టేషన్లో దిగగానే తాతయ్య ప్లాట్ ఫారంమీద హాజరు! నేను దిగకుండానే గట్టిగా కౌగలించుకుని "ఎంతవాడివై పోయావురా!" అంటూ వల్లమాలిన అభిమానంతో ఉక్కిరి బిక్కిరి చేసేశాడు. నా మనసంతా ఆర్ద్రభావాలతో నిండిపోయింది. తాతయ్య బాగా కుదించుకుపోయి ఒడిలిపోయాడు. తల బాగా నెరిసిపోయింది.

"పెద్దవాడివి. స్టేషనుకి శ్రమపడి దేనికిరావటం?" అన్నాను, బెడ్డింగు బండివాడికి అందిస్తూ.

"అదేమిటేరా. నా మనసు ఆగుతుందా" అన్నాడు తాతయ్య.

బండి ఇంటికి చేరేసరికి వీధి గుమ్మంలో నిలబడి అమ్మమ్మ ఎదురు చూస్తోంది. "ఒచ్చావా నాయనా. ఎన్నాళ్ళయిందిరా నిన్ను చూసి" అంటూ పలకరించింది.

ఇల్లు కుదుమట్టంగా ఒక చిన్న సంసారం ఉండటానికి అనువుగానే వుంది. చుట్టూ అందంగా మొక్కా మోటూ పెంచుకుందుకు విశాలమైన పెరడు కూడా వుంది.

భోజనందగ్గర తాతయ్య తను రిటైరు కావటం, తోటిఉద్యోగులు తనకి ఘనంగా విందు చెయ్యటం, ఈ ఇల్లు కొనటం అంతా వర్ణించి చెప్పుకుపోతున్నాడు.

అమ్మమ్మ వడ్డన చేస్తూంది మధ్య మధ్య తాతయ్య మాటలకి నవ్వుతూనాను.

ఇంతవరకూ నేను సాహసించి సూర్యం ప్రసక్తి తీసుకురాలేదు. తాతయ్య కూడా ఆ ప్రసక్తి తీసుకు రాలేదు. చివరికి నేనే "సూర్యం ఎక్కడికి వెళ్లాడు?" అన్నాను.

ఈ ప్రశ్నలో ఏముందో గాని అమ్మమ్మ ముఖం ముడుచుకుపోయింది. తాతయ్య చేతిలో ముద్ద చేతిలోనే పట్టుకుని "వాడి సంగతే అడిగావ్రా? ఒట్టి అప్రయోజకుడై వీధుల వెంట బలాదూరు తిరగటానికి పోయాడు. వాడ్ని నా కొడుకని చెప్పుకుంటే కూడా పరువు తక్కువ." అంటూ మొదలుపెట్టాడు.

అమ్మమ్మ చట్టున పొయ్యిముందునించి తాతయ్య వైపు తిరిగి "ఎందుకలా వాడ్ని ఆడిపోసుకుంటారు. చిన్నప్పుడు నేను చెవిని ఇల్లుకట్టుకుని పోరితే విన్నారూ? గారంచేసి, వాడి చదువుసంగతే పట్టించుకోక వాడ్నిలా చేసింది మీరే. వాడ్నెందుకు తిట్టటం?" అంది.

"ఊ! సర్లెద్దూ. నీకు నేనొకడ్ని దొరికాను. గడి గడికీ ఇలా నువ్వు అంటుంటె నా కెంత కష్టంగా ఉంటుందో నీకు తెలిసినట్టు లేదు." అన్నాడు తాతయ్య.

"పదిమంది ముందూ అలా వాడ్ని చులకనచేసి మాట్లాడితే నాకు మటుకు కష్టంగా ఉండదూ?"

"వాడు నీకే కాదు. నాకూ కొడుకే. ఆ విషయం మర్చిపోయినట్టున్నావు" అంటూ తాతయ్య గోడకి చారబడ్డాడు.

"అందుకే కాబోలు వాడ్ని గురించి అంత తేలిగ్గా మాట్లాడుతున్నారు."

తాతయ్య నావైపు తిరిగి "బరితెలా పాతికేళ్ళు పైబడ్డాయి. అక్షరజ్ఞానం లేదు. వేళకి భోజనానికి మటుకు హాజరౌతాడు. నేనా పెద్దవాడ్నైపోతున్నాను. ఎన్నాళ్ళని సంపాదించగలను చెప్పు. సంపాదించగలిగి నన్నాళ్ళు సంపాదించాను. ఉండటానికి నీకోసం ఓ ఇల్లు ఏర్పాటుచేశాను. ఇంకా సంపాదించాలంటే ఒంట్లో శక్తి ఉండద్దూ? ఈ వయసులో తండ్రికి చేదోడువాదోడుగా ఉండి బాధ్యత నెత్తిని వేసుకోవాల్సినమాట. ఇలా పనీపాటూ లేకుండా తింటూ కూర్చుంటే నేను మటుకు ఎక్కడ్నించి తేగలను చెప్పు." అన్నాడు.

అమ్మమ్మ కళ్లు తుడుచుకుంటూ "నాయనా వింటున్నావా? అప్పుడా వరస. ఇప్పుడీ వరస. అప్పుడు వాడ్ని పల్లెత్తుమాట అనటానికి వీలుండేదా? కొట్టినంతపని చేసేవారు. ఇప్పుడు ఆ నోటితోనే వాడ్ని ఇలా అంటున్నారు. వాడు వింటే ఎంత బాధపడతాడు చెప్పు." అంది.

"పడితే పడతాడు. అప్పటికైనా బుద్ధివస్తుందేమో చూస్తాను." నావైపు తిరిగి "నేను గారంచేసి పాడుచేశానంటుందేమిట్రా వాడ్ని. నేను చదువుకోవద్దన్నానా?" అన్నాడు తాతయ్య.

అసలీ ప్రసక్తి ఎందుకు తెచ్చానా అనిపించింది నాకు. నేను గబగబా భోజనం ముగించేశాను. "అబ్బాయ్. బడలికమీద ఉన్నావు. హాయిగా కాసేపు పడుకో" అని అమ్మమ్మ మధ్య గదిలో పక్క వేసింది.

పడుకుని ఆలోచిస్తూ ఉండిపోయాను; అమ్మమ్మ వంటగదిలో చేసే చప్పుళ్లు వింటూనే. చిన్నప్పుడు సూర్యాన్ని అంతగా గారంచేసిన తాతయ్య ఇప్పుడెందుకిలా అసహ్యించుకుంటున్నాడు? అమ్మమ్మలో లేనిమార్పు తాతయ్యలోనే ఎందుకు కలగాలి? డబ్బు ఒడుదుడుకులా? వయసుమీరి శక్తి ఉడిగి రాబడి తగ్గిపోయేసరికి ఆదుకునే వయసు ఉన్నా కొడుకు అప్రయోజకుడైయాడనే ఆవేదనా? ఆ విషయం తాతయ్యకి ఇప్పుడే తెలిసివచ్చిందా? ఆ దూరదృష్టి ముందే ఉంటే అసలు వ్యవహారం ఇంతవరకు వచ్చేదే కాదుగా. ఇలా ఆలోచిస్తూనే నిద్రపోయాను. తిరిగి నాకు మెలకువ వచ్చేసరికి అమ్మమ్మ తాతయ్య మాటలు వినిపించాయి. అలా పడుకునే వినసాగాను.

"రాత్రికి ఉత్తిపచ్చడి మెతుకులా చేసిపెట్టనా. బాగుంటుందా?" అంది అమ్మమ్మ.

"ఒక్కపూట ఎలాగో సర్దుదూ. దగ్గర చిల్లిదమ్మిడీ లేదు. రేపు అప్పుపుట్టించుకురావాలి ఎక్కడయినా" అంటున్నాడు తాతయ్య.

"మనలో మనం అయితే ఉన్నదేదో తింటాం. అతను..."

తాతయ్య అడ్డుపడుతూ "సర్లెద్దూ. ఒక్కపూటకి ఫర్వాలేదులే" అంటూ ఇవతలకి వచ్చాడు.

ఆ మాటలు వింటుంటె గుప్పిళ్ళకొద్దీ చిల్లర కోటుజేబులోంచి తీసి ముందు పోసుకుని పిల్లలకి పంచిపెట్టే తాతయ్యేనా ఈ తాతయ్య అనిపించింది. అమ్మమ్మ ఎప్పుడూ ఒక లాగానే ఉంది. సంసారాలు ఎప్పుడూ ఒకలాగే ఉండవు. అందుకనే కాస్త ముందుచూపు అవసరం. "డబ్బు వస్తున్నప్పుడు ఎంత ఖర్చు చేసినా మనకి తెలిసిరాదు. అది లేనినాడు గాని అసలు స్వరూపం బయటపడిపోతుంది." అని మనసులోనే అనుకుని వంటగదివైపు నడిచాను.

మధ్యాహ్నం ఎండ మిట మిట లాడుతోంది. సూర్యం అప్పుడే లోపలికి వస్తూ 'ఏరోయ్' అంటూ భుజం మీద చెయ్యివేసి ఒక్క గుంజు గుంజాడు.

వాడ్ని చూస్తుంటే చిన్నప్పుడు వాడు చేసిన అల్లరంతా గుర్తుకు వచ్చింది.

తాతయ్య హాలులోపల గుర్రుపాడిచి నిద్రపోతున్నాడు. అమ్మమ్మ పెరట్లో బట్టలు ఉతుక్కుంటూంది. సూర్యం కంచం వేసుకుని తానే అన్నం వడ్డించుకుని భోజనం చేస్తూ రారా ఇలా వచ్చి కూర్చో" అంటూ నన్ను పిలిచాడు.

"ఒరేయ్ నువ్వు లెక్చరరు వయితే నాకు ఊరికే చదువు చెబుతావట్రా?" అన్నాడు సూర్యం ఉన్నట్టుండి.

"ఏం? నీకు చదువుకోవాలనుందా?" అన్నాను.

"ఆహా! చెబుతావా? అసలు ఎన్నాళ్లు పడుతుందంటావ్?"

"శ్రద్ధగా చదువుకుంటె రెండు మూడు సంవత్సరాల్లో వచ్చేస్తుంది."

"పుస్తకాలకీ వాటికీ డబ్బు బాగా కావాలా?"

"అక్కర్లేదు. పుస్తకాలు నేతెచ్చి పెడతాగా."

అమ్మమ్మ తడిబట్టలు భుజానవేసుకుని రొప్పుకుంటూ లోపలికొచ్చి "నన్ను పిలవకపోయావా నాయనా. నేనొచ్చి అన్నం పెట్టేదాన్నిగా." అంది కొడుకుతో.

సూర్యం మాట్లాడకుండా తల వంచుకున్నాడు.

"ప్రతిరోజూ ఇలా వేళాపాళా లేకుండా అన్నంతింటే ఆరోగ్యం పాడయిపోదూ?" అంటూ గొణుక్కుంటూ అమ్మమ్మ బట్టలు ఆరెయ్యటానికి ముందు దొడ్డిలోకి వెళ్ళింది.

సూర్యం భోజనంచేసి ముందు వరండాలోకి పోయి కటికి నేలమీద పడుకున్నాడు. అమ్మమ్మ వాడ్ని సమీపించి ఏదో చెప్పటం వాడు చేతులు ఊపుతూ నిర్లక్ష్యంగా గోడవైపుకి వత్తిగిలటం నేను కిటికీలోంచి గమనిస్తూనే ఉన్నా. అమ్మమ్మ తల మొత్తుకుంటూ లోపలికివచ్చి పక్క బట్టలు తీసుకుని వాడికివ్వబోయింది. వాడు తిరస్కరిస్తూ అక్కడ్నించి లేచి కొద్ది దూరంగాపోయి పడుకున్నాడు.

సాయంత్రం చల్లబాటు వేళ నేను ఊరు చూద్దామని బయల్దేరాను. సూర్యం అంతకుముందే బయటికి వెళ్ళిపోయాడు. చిన్నప్పుడు ఎప్పుడో చూసిన పట్నం. ఇప్పుడు బాగా మారిపోయింది. నేను తిరిగి తిరిగి చీకటి పడేవేళకి యింటికి చేరుకున్నాను. తాతయ్య ఇంట్లో లేడు. అమ్మమ్మ వక్కతీ వంటగదిలో కూర్చుని భజన పాటలు పాడుకుంటూంది.

నేను ఆమె ఎదురుగ్గా పీట వేసుకుని కూర్చున్నాను.

అమ్మమ్మ భగ భగ మండే పొయ్యిముందునించి నావైపు తిరిగి "చూస్తున్నావుగా నాయనా ఆ తండ్రీ కొడుకుల వరస. ఈడొచ్చినవాడ్ని అలా అంటుంటె వాడికి అభిమానంగా ఉండదూ? ఇప్పు డిద్దరికీ మాటల్లేవు. వాడు ఆ వరండాలోనే గడుపుతున్నాడు. ఇంట్లోకి రాడు. నా కడుపు తరుక్కుపోతోందంటె నమ్మ." అంది.

నేను ఏమనగలను? "అవు నమ్మమ్మ. అంతా చూస్తూనే ఉన్నా." అనిమాటుకు సమాధానం చెప్పాను.

అమ్మమ్మ కంఠం తగ్గించి "పెద్దవారు. ఆయన మీద నేరం చెబుతున్నానని కాదుగాని వాడి విషయంలో ఆయన పద్ధతి మొదట్నించి నాకు నచ్చటం లేదనుకో. ఆయన వల్లనే వాడు ఇలా అప్రయోజకుడయ్యాడు. ఇప్పుడు వాడ్ని ఓ దారిలో పెట్టి వాడి జీవితం మనం కాపాడాలిగాని వాడ్ని పట్టుకుని అడ్డమయిన మాటలూ అంటే ఒరిగేదేమిటి? ఆయనధోరణి నాకు భయంగాకూడా ఉంది." అంది.

మసి బారిపోయిన గోడవారగా పైపైకి పోతున్న పొగవైపు చూస్తూ ఈ తాతయ్య మనస్తత్వాన్ని గురించి ఆలోచిస్తూ ఉండిపోయాను. అమ్మమ్మ ఏవేవో తలపులతో కళ్లు చెమర్చుకుంటూ, చీర చెరగుతో వత్తుకుంటూ వంటపనిలో నిమగ్నురాలయిపోయింది.

5

మొర్నాడు ఉదయం నా ఇంటర్వ్యూ పూర్తయింది. తృప్తిగా సమాధానాలిచ్చాను. ఫలితం తర్వాత తెలియబరుస్తామన్నారు. తప్పకుండా సెలక్టవుతాననే ధైర్యం నాకుంది. ఆ ఉత్సాహంతోనే యింటికి వచ్చానుగాని తాతయ్య ముఖం చూసేసరికి అంతా అణిగిపోయింది. తాతయ్య ఎర్రబడిన ముఖంతో అగ్గిరుద్రుడయిపోయి "పోనివ్వవే. వాడెలా ఛస్తే ఎవడికి కావాలంట. పోతేపోనీ. ఉండి వాడు ఉద్ధరించే దేమిటి?" అంటూ అరుస్తున్నాడు.

అమ్మమ్మ కన్నీరు గ్రుక్కుకుంటూ గుమ్మం వార కూచునిఉంది.

నన్ను చూడగానే తాతయ్య "అబ్బాయి. నీతో ఓవిషయం మాట్లాడాలిరా. ఇలా గదిలోకిపోయి కూర్చుందాం పద" అన్నాడు.

గదిలో తాతయ్య దగ్గరగా వచ్చి కూర్చుని "నాన్నతో నాకు ఓ చిన్న ఉద్యోగం ఏదయినా చూసి పెట్టమని చెప్పాలిరా. కనీసం ఏభయిరూపాయిలొచ్చినా చాలు. మరీ మరీ అడిగానని చెప్పు." అన్నాడు.

ఆ ముఖంలో దైన్యం చూడలేక "మళ్ళీ ఉద్యోగం చెయ్యటానికి ఓపిక ఉందా తాతయ్యా?" అన్నాను.

"లేదనుకో. అయినా తప్పదుగా మరి. సంసారం గడవద్దూ?" ఇక నేను మాట్లాడలేకపోయాను. "అలాగే చెబుతాను" అనిమటుకు అన్నాను.

"అయితే ఇంతకీ నీ ఇంటర్వ్యూ సంగతి చెప్పలేదు. ఏమయింది?"

"మూడువంతులు సెలక్టవుతానని నా నమ్మకం" అన్నాను.

"మంచిదినాయనా. మీ నాన్న అదృష్టవంతుడు" అన్నాడు తాతయ్య.

అవును తాతయ్య దురదృష్టవంతుడే. అయితే అది స్వయంకృతం. తాతయ్య వెళ్ళిపోగానే అమ్మమ్మ గదిలోకివచ్చి "నాయనా ఒక్క సహాయం చేసిపెట్టాలిరా" అంది ఆత్రంగా.

"ఏవిటమ్మమ్మా?"

"అబ్బాయికి తాతయ్యకి మాటామాటావచ్చింది. తాతయ్య వాడ్ని తిట్టకూడని తిట్లన్నీ తిట్టారురా. కొట్టటానికి మీదకికూడా వెళ్ళారు. ఇక మీగుమ్మం తొక్కనంటూ వెళిపోయాడ్రా. కొస్త వాడ్ని వెతికి బుజ్జగించి యింటికి తీసుకురా నాయనా. ఏమయిపోతాడో నాబిడ్డ. మనసు కుళ్ళిపోతోంది నాయనా."

నేను వీధిలోపడి వీధివీధి గాలించసాగాను. ఎక్కడున్నాడని వెతకను? ఇంతపెద్ద పట్నంలో వాడి జాడ ఎలా తెలుసుకోగలగటం? అయినా అమ్మమ్మ తృప్తికోసం వాడ్ని ఎలాగయినా పట్టుకుని యింటికి తీసుకురావాల్సిందే అనే పట్టుదలతో తిరుగుతున్నా.

ఒక పెద్దహోటలుముందు గుంపుగా జనం చేరి వుంటే అక్కడికి వెళ్ళాను. జనంమధ్య పధ్నాలుగుసంవత్సరాల కుర్రవాడొకడు తల వంచుకుని నిలబడి వున్నాడు. వాడిని దగ్గరికి తీసుకుంటూ ఓస్త్రీ కళ్ళు వత్తుకుంటూంది. హోటలు యజమాని చెబుతున్నాడు. "ఇకనైనా జాగ్రత్తగా పెంచుకోతల్లీ. కుర్రవాడు మంచివాడు. బుద్ధిమంతుడూను. తండ్రి వాడ్ని పట్టుకుని అంతలా హింసిస్తే వాడు ఇల్లువిడిచి పారిపోక ఏంచేస్తాడు? అంతా మనలో వుంటుందమ్మా. అవసరమయితే పిల్లల్ని అందరం మందలించుకుంటాం. మరీ ఇంతచేటు బాదుకుంటే పసివాళ్లు తట్టుకోగలరా?"

అంటూ హితబోధచేసి ఆతల్లీ కొడుకుల్ని ఓ బండి ఎక్కించి పంపించాడు. ఆనోటా ఆనోటా నేనువిన్నది ఆకుర్రవాడ్ని వాడితండ్రి విపరీతంగా హింసించేవాట్ట. భయపడిపోయి తట్టుకోలేక ఆకుర్రాడు పారిపోయి ఈ వూళ్ళో హోటల్లో క్లీనర్ గా చేరాట్ట. ఆతల్లి వూరు వూరూ గాలించుకుంటూ వచ్చి యిక్కడ పట్టుకోడం జరిగింది. అదీకథ.

నిట్టూర్చి అక్కడ్నించి కదిలాను. అమ్మమ్మ ప్రాధేయపూర్వకమైన స్వరం నా చెవిలో మళ్ళీ మళ్ళీ వినిపిస్తోంది.

ఊరివెలపల పాక•మధ్యనించి పోతున్నాను. ఎండ భగభగ మంటూంది. కాళ్ళు తీపులు పుడుతున్నాయి. ఒళ్ళంతా ఎండవేడికి కమిలిపోతూంది. నుదురు వత్తుకుంటూ గుట్టలూ మెట్టలూ దాటుకుంటూ మనిషిమనిషినీ పరిశీలిస్తూ సాగిపోతున్నాను. ఆ పసికుర్రవాడి దీనవదనం, ఆ తల్లి చారికలు కట్టిన ముఖం నా కంటిముందు మెదుల్తున్నాయి. సూర్యం దొరక్కపోతే, వాడు పంతగించి ఇక ఇంటికి రాకపోతే, తాతయ్య మటుకు జీవించగలడా?

మురుగువాసన ముక్కు బద్దలు చేస్తుంటే గబగబా ఆ ప్రదేశాన్నుంచి తప్పుకుని పెద్దవీధిలో కొచ్చి పడ్డాను. మొగలో పెద్దపాకలో వీధిబడి సాగుతోంది. మాస్టరుగారు ఎత్తయిన అరుగుమీద కూర్చున్నారు చుట్టకాలుస్తూను. పిల్లలు గోణగోణ చదువుకొంటున్నారు.

గోడవార పంపుదగ్గర నీళ్ళు తాగుదామని వంగాను. నాలుక పిడుక్కుపోతోంది. అరుగువారగ నీడలో పిల్లల మధ్య ఓ పెద్దవ్యక్తి కనుపించాడు. గొంతు తడారిపోతున్నా చప్పున పంపుమీంచి చెయ్యితీసి పాకలో దూరబడ్డాను.

మాస్టరు కునికిపాట్లు పడుతున్నాడు. పిల్లలు చప్పున పుస్తకాలు, పలకలూ మాని నావైపు ప్రమాదంగా చూస్తూ ఉండిపోయారు.

ఆ వ్యక్తి నన్ను చూసి చేతిలో పుస్తకాన్ని కింద పడేసి తలవంచుకుని వెక్కివెక్కి ఏడవటం విన్నాను. సూర్యాన్ని పోల్చగలిగాను.

"సూర్యం. నీ భవిష్యత్తుగురించి నేను హామీ ఇస్తున్నాను. దిగులుపడకు. నీకు చదువు నే చెబుతాను. మంచి ఉద్యోగం నే ఇప్పిస్తాను. నా మాటనమ్ము. రా ఇంటికి పోదాం." అన్నాను. వాడు మాట్లాడలేదు. వాడి చేతిలోంచి జారి క్రిందపడ్డ తెల్లకాగితాల పుస్తకంతీసుకుని "లెఖ్ఖలుచేస్తున్నావా?" అన్నాను.

సూర్యం అవునన్నట్టుగా తలవూపాడు. మాస్టరుగారు అప్పుడే మేల్కొన్నారు కాబోలు—కళ్ళు నలుపుకుంటూ మావైపు చూడసాగారు అయోమయంగా.


కళాప్రపంచములో నటరాజు పికాసో

శ్రీ ఆమంచర్ల గోపాలరావు


కళా ప్రపంచాన్నంతా కుదిలించి వేసిన మహా కళా కోవిదుడు పికాసో: ఆధునిక ఐరోపా కళలో విజృంభించిన మహా ఝంఝామారుత మితడు. నిజంగా దాదా పాక వంద సంవత్సరములకుపూర్వము పరాసు దేశంలో అంకురించి, నేడు లోకమంతటా వ్యాప్తమైన ఆధునిక కళాస్వరూపమే [MODERN ART] సామాన్యమానవునకు అనుభవాతీతమై, దిగ్భ్రమింప జేయుచున్న దన్నమాట వాస్తవము. ఈ మహత్తర నవ్యకళాసాగరమందొక పెనుతుపాను పికాసో.

పికాసో నెరుగుటకు, ఐరోపా కళావాహిని యందొక పెద్ద వెల్లువగా వచ్చిన మహాపరివర్తనమయిన ఆధునిక కళను ఎరుగుట ఎంతయు సహాకారి కాగలదు. పంతొమ్మిదవ శతాబ్దారంభమువరకు ప్రకృతి అభాసమే చిత్రకళ పరమావధి అను భావమే యూరపునందు ప్రబలియున్నమాట వాస్తవము. ప్రకృతి ముఖము నే అభాసించుచూ, ప్రకృతిని మించగలుగు వర్ణ వికాసములతోను, ఉద్వేగ చలనములతోను, ప్రకృతి నే మరిపించు అద్భుత చిత్రములను కల్పన చేయగలుగు మహా నిపుణు లెందరో నాటివరకు పాశ్చాత్యకళా రంగము నలంకరించిరి. ఇంతలో కెమేరా (Camera) యను యంత్రమొకటి ప్రవేశించెను. ఈ కెమేరా ఒక త్రుటిలోనే ప్రకృతిని అదేరీతిన ఆభాసింపగలుగును. నిజముగా ఈ కెమేరా కొంతకాలమునకు చిత్రకళనే రూపుమాపునేమోయను సంశయము, భయము కూడ కలిగెను.

మానవుని ఆత్మజ్వాలాశేషమయిన పరమ విభూతి చిత్రకళ. అట్టి దివ్యజ్వాలను ఒక యంత్రము హరింపగలదా? కెమేరాను మించురీతిన, ప్రకృతిని ఆభాసించగలుగు మహాయోధులు వెంటనే కళారంగమున ప్రవేశించిరి. వీరే మానె [MANET] మొదలయిన ఇంప్రెషనిష్టులు [Impressionists]. ప్రకృతి యందు రూపకల్పన చేయునది వెలుగేనని, వెలుగు నన్వేషించుటే చిత్రకళ పరమావధి యని వీరి ఉద్దేశములు. అందుచేత వెలుగునే అన్వేషించి, వెలుగు భాగములయిన వర్ణములనే భాగభాగములోనర్చి, రూపురేఖల భ్రమను సైతము విసర్జించి, అత్యద్భుత చిత్రములను నిర్మించి, వీరు కళా చరిత్రను అలంకరించిరి.



ఎంబ్రాయిజ్ వొలార్డ్ రూపచిత్రం:
పారిస్-1915 ఆగస్టు.



ముగ్గురు గాయకులు: ఫాంటెన్‌బ్లో-1921 పేవవి.


ఇంతలో చెజాన్ [CEZANNE] అను ఒక మహాపురుషుడు ఐరోపా కళారంగమం దవతరించెను. నేటి ఆధునిక కళకంతటికి మూలపురుషు డితడేయని అనవలయును. ఇతనియుద్దేశ మేమన చిత్రకళ ప్రకృతిని ఆభాసింపదు ; సంక్షేపించును [Abstracts]. ఇతని తర్వాత ఈ సంక్షిప్త మార్గమునే అనుసరిస్తూ, ఉత్తీర్ణ లయిన రేనాయ్ [RENOIR], వాన్‌గాగ్ [VAN-GOGH], గొగా[Gauguin], రూసో[Rousseau] సూరె [SEU-RAT], మాతీస్ [Matisse], కొకొష్కా[KOKOSCHKA], బ్రాక్ [Braque] మొదలయిన కళాకోవిదు లందరూ ఆధునిక కళారూపమును స్థిర మొనర్చిరి.

ప్రప్రథమమున స్థూలప్రకృతికి భిన్నమయిన ఈ నవ్యకళాస్వరూపము, యూరపునందు సయితము అనేకమంది పండితులను, విమర్శకులను, తత్వవేత్తలనుకూడ తికమక పెట్టినదన్నమాట వాస్తవము. కాని మానవాంతర్జ్వాలావిశేషము చిత్రకళ. కొంతకాల మవుసరికి ఆధునిక కళాస్వరూపమందలి సత్యమును గ్రహించి, దానినైజము నెరిగి, దాని స్వరూప క్రమన్యాయములను ఐరోపాయందలి పండితులు సిద్ధాంతీకరించిరి. ఆక్రమలక్షణములను షెల్డన్ షేనే [SHELDON CHENEY] అను ఒకగొప్ప విమర్శకుడు అరింటిగా ఈ దిగువరీతిన వర్ణించెను.

1. కళ ఆభాసమను అరిస్టాటిల్ [ARISTO-TLE] సిద్ధాంతమును ఆధునిక కళాకారుడు ఒప్పుకొనడు. ఆభాసించునది కళ కానేకాదు. అందుచేత మానవచరిత్రయందలి ఘట్టములు ఎంత భావభరితము లైనను, వాటిని సూటిగా కాని, ప్రతీకపరముగా కాని దృష్టాంతీకరించుట ఈ కళాకర్తకు అనవసరము. నీతులను బోధించుటకూడ ఇతనికవసరములేదు. ఏలనన చిత్రకళయందు కళావస్తువున కేమాత్రము ప్రాధాన్యము లేదు. కల్పనావిశేషమే కళ. అయినప్పటికి, ప్రకృతి యందలి దృష్టరూపములను ఇతడు పూర్తిగా విసర్జించడు. తన కల్పనావసరత కొరకు తద్విభావరూపములను ఉచితరీతిగా దిద్దికొనును. ప్రకృతియందలి వర్ణరూపము లన్నియు ఇతనికి పట్టి భావనాంకురములే.

2. ఆధునిక కళాకారుడు స్థూలదృష్టి నంతగా పాటింపడు. సూక్ష్మదృష్టియే ఇతనికి ప్రధానము. అందుచేత ప్రకృతి బాహ్యరూపమునుండిగాక, అంతర్లయములనుండియే తన కల్పనాంశముల నతడు గ్రహించును. అందుచేత ప్రకృతి హృదయమును శోధించి, విశ్వస్థితికి మూలమయిన పరమలయను గ్రహించుటకు కూడా ప్రకృతిముఖమందలి ఒక చిన్న భాగ మతనికి చాలును. ఇందుమూలముగా లయపరమయిన ఒకనవీన భావనా రూపమాతని సూక్ష్మదృష్టికి గోచరించును. ఈ నవ్య రూపమందు, లోలుత నాతడు స్థూలదృష్టిని పరికించిన ప్రకృతి రూపము పూర్తిగా మాసిపోవును.

8. సూక్ష్మదృష్టిని కనుగొనిన రూపమును నిర్దేశించుటకై, యాతడు అనేక నవ్యరూపములను సృష్టించు



మృతాశ్వాన్ని మోసుకొనిపోతున్న కింపురుషుడు: (మినోటర్) పారిస్ - 6-5-1936.



జలక్రీడారతలు ; (గ్రాఫైట్) బేరిట్జ్ - 1918.

కొనును. ఈ నవ్యరూపములు, మనము గమనించు బాహ్యప్రకృతి రూపములను ఏరీతిగను పోలక పోవచ్చును. అందుచేతనే, నేటి అధునిక కళాకారులను రూపాన్వేషకులు [Form Seekers] అని కూడ అందురు.


4. ఈ రూపాన్వేషకులు అనేకవిధములు. కొందరు పూర్తిగా సంక్షిప్తమార్గముననే అన్వేషించుచు, సంగీతాలాపనలందు విదితమవు లయభావముచే తమ కల్పనలందు విదితమొనర్చుటకై స్వచ్ఛరూపములను [Pure Form] సృష్టింతురు. కొందరు అధునిక కళాకారులు ప్రకృతి బాహ్యదృశ్యముచే ఆధారమొనర్చుకొని, సంక్షేపించి, ఒక లయభావమున, అదృశ్యముచే తమ భావనాపరముగా ఉద్దేశించి నిర్దేశింతురు. ఈ రెండు రకములకు మధ్య అధునిక కళాకారులనేక విధములుగ నున్నారు.

5. ఈ సంక్షిప్త రూపానుభవమును హేతుమూలముగా విమర్శించి వ్యాఖ్యానముచేయుట కష్టము. ఈ నవ్యరూపమునకు కల్పితమయిన సౌందర్య వికాసమంతయు, ఆకళాకారుని హృదయములో అంకురించిన ఒక దివ్యజ్వాలా పరిణామమే. ఇది నిజముగా స్వయంభువు. అందుచేత అధ్యాత్మికము. దీని రహస్యము పూర్తిగా ఆ కళాకారుడే ఎరుగు. అందుచేత ఈ కళాకల్పనలను సామాజికుడు అనుభవించవలసినదే! వ్యాఖ్యానింప పనిలేదు.

6. ఇట్లు అనుభావితమయిన ఈ చిత్రములందు ఒక నిర్ణీత గతిలయలు సంపూర్ణముగా వ్యక్తమవుతాయి. ఇట్లు సృష్టించబడిన ఈ కళాస్వరూపమునకు కళాకారుడు ఒక చిత్రరాగమున మేళవింపును [Plastic orchestration] కల్పిస్తాడు. అప్పుడీ చిత్రమందు, చిత్రకోశము [Picture Spacc] రూపములు, తలములు [Planes], రేఖలు, వర్ణములు, నేతి

[Texture] మొదలగునవన్నియు ఒకనిశ్చితగతిని లయప్రదముగా ఏర్పరుచును. ఈగతి ననుసరించి సామాజికుని దృష్టి చిత్రము చెచ్చోటను నిలిచిపోక, చిత్రమందలి ప్రతియాంశము పైనను, తల్లయపరముగా కలయదిరుగును. ప్రాచీనవాస్తవిక [Realistic] చిత్రములందీ గుణము అంతగా కానరాదు. ఆ చిత్రములందు సామాజికుని దృష్టి ఏకలయపరముగా చిత్రమంతటిని కలయదిరుగదు. నేటి ఆధునిక కళాకారుల చిత్రములు ఈ చిత్రరాగ ప్రాధాన్యము గలవి. ఈ చిత్రరాగము ననుసరించే సామాజికుడు కళాకారుడు అనుభవించి, ఉద్దేశించిన విశ్వలయమును అనుభవింపగలడు.

ఈ లక్షణము లన్నియు సూక్ష్మ దృష్టితో నే ప్రకృతినివీక్షించి విశ్వహృదయమును శోధించి, యోగరీతి ననుసరించి, దివ్యకళాస్వరూపములను కల్పించిన, ప్రాచీన హైందవశిల్పయోగుల కల్పనా



నారీ శిరస్సు: (తైలవర్ణచిత్రం) పారిస్ - 1935.

క్రమపద్ధతులను చాలవరకు పోలియున్నవనవచ్చును. మూలప్రకృతికి చెందిన వాస్తవిక రూపములకే అలవడి, సూక్ష్మదృష్టి ప్రభావ మెరుగని పాశ్చాత్య విమర్శకులకు, వారి నే అనుసరించిన మన దేశీయులకు, ప్రాచీన హైందవ శిల్పము విరసముగా గోచరించిన రీతి నే, ఆధునిక కళాస్వరూపములు సయితము అనేక మందికి విచిత్రముగాను, విరసముగాను, విడ్డూరముగా కూడ తోచుట సహజము. ప్రాచీన హైందవకళ సంపూర్ణముగ ఆధ్యాత్మికము. నేటి నవ్యఆధునిక కళకూడ నంతియే. ఐరోపాయందలి ప్రకృతి స్వరూపము, మానవ నైజము, నేడు మానవుని కలవరపెట్టుచున్న విశ్వక్షోభ మున్నగునవన్నియు, మానవ జీవితలక్షులను భిన్నమొనర్చుటజేసి, ఆధునిక కళాస్వరూపము సయితము, ప్రాచీన హైందవ కళాస్వరూపమును పోలక భిన్నమయినది. "Form is the manifestation of Spirit" ఆత్మ చేష్టయే రూపము. ఇది ప్రాచీన హైందవ కళా సిద్ధాంతము. నేటి ఆధునిక కళా సిద్ధాంతము కూడనదియే.

ఈ ఆధునిక కళా ప్రపంచమందు ఉజ్వలిస్తున్న ఒక మహాజ్యోతి పికాసో. ఈతని జననము 1881 సంవత్సరంలో, స్పెయిను దేశములో ఇతని తాత ముత్తాతలు బంగారు పనిచేసెడివారు. తండ్రి డ్రాయింగు మాస్టరు. పసితనంలో తండ్రివద్ద నే పికాసో చిత్రలేఖన మభ్యసించెను. పదమూడవ ఏటనే ఇతి డిగ్భ్రతముగా చిత్రరచనలు చేయుచుండెడివాడు. నాటికే అతని హస్తనైపుణ్యమతిశయము. పంతొమ్మిది ఏండ్లవయసరికి చిత్రలేఖనమందు నిపుణత ఇతనికి సిద్ధించినదని చెప్పవచ్చును. దాదాపు 1904 వ సంవత్సరంలో ప్రపంచ కళా కేంద్రమయిన పారిసు నగరములో తనవాసమేర్పరచుకొనియెను. చిత్రరచనలో తనంత హస్తనైపుణ్యమును ప్రదర్శింపగలవారు లేరని నాడీతడు గర్వపడుచుండెను.

నాడు పారిసునగరమందు లూత్రే [Lautrec] స్టీనలెన్ [Steinlen] అను చిత్రకారులు ప్రసిద్ధికెక్కియుండిరి. వీరిశైలి, చిత్రరచనావిధానములు ప్రకృతి నాభాసించెడి ప్రాచిన కళాకారుల శైలీపద్ధతులకు భిన్నమయినది. ప్రప్రథమమున వీరిచిత్రములు పికాసోను ఆకర్షించినవి. అప్పుడే పారిసునగరమును కలవరపెట్టుచున్న ఇంప్రెషనిష్టుల చిత్రముల నితడు చూడుట తటస్థించినది. కాని కొలది కాలములోనే ఆధునిక కళకు మూలపురుషులయిన సెజాను, డామియర్, గూగా, వాన్ గాగ్ మొదలయిన మహా కళాకారుల చిత్రములు ఇతనిని ప్రబలముగా ఆకర్షించి, ఇతని మనసు లగ్నమయినవి. ఇంతేగాక స్పెయిను దేశమునకు

చెందిన, మహా కళాకారులయిన గోయా [Goya], ఎల్ గ్రీకో [El Greco]-చిత్రములు సయితము ఇతనిమన్ననకు పాత్రము లైనవి. కొద్ది కాలములోనే ఆధునికకళాతత్వము ఇతని నావేశించినది. ఇప్పటికే ఇతని చిత్రములందు వాస్తవికత [Realism] క్షీణింపసాగినది. తన చిత్రములందు ఇతడు, స్థూలదృష్టి కగపడు దృశ్యమునకు గాక సంకలన సమ్మేళనములకే ప్రాధాన్యము నివ్వసాగెను. చిత్రములందు వెనుక భాగమును [Back ground] తీయ మొనర్చుట, రూపములను తేటపరచుట [Simplification], స్వస్థానములు తప్పించి వేరు స్థానములందు రూపముల చేర్పరచుట, ఉద్దేశానుసారముగా విరూప మొనరించుట [Distortion] మొదలగు భావానుగతులనే అనుసరించుచు, నాటితడు చిత్రకల్పనలు చేయసాగెను.

1903 వ సంవత్సరమునుంచి దాదాపు రెండు సంవత్సరములు ఇతని 'బ్లూ పిరీయడ్' (Blue Period) అని అందురు. ఆకాలమందు ఇతడు రచించిన చిత్రములు ఒక విషాద రాగమాలపించుచున్నటు లుండును. కాని నాటితడు తన చిత్ర రచనలందు నీలి రంగు ఎక్కువగా వాడినందువల్ల, ఈ పేరు వచ్చినదని పండిత వాక్యము. ఆనాటికే పికాసో ఆధునిక కళా ప్రపంచములో అతి మహత్తర చిత్రములను సృష్టింప సాగెను.

1905 వ సంవత్సరములో పికాసో హాలెండు (Holland) దేశమును చూచివెళ్ళెను. అప్పటిప్పుడే ఇతని చిత్రలేఖనమందు మరొక మార్పు వచ్చినది. తన చిత్రరచనలందు నాజూకుతనము వితడు వర్జించెను. గడచిన బ్లూ పిరీయడ్ పోయి, ఒక రోజ్ పిరీయడ్ (Rose Period) ఇతని చిత్రలేఖనయందుదయించినది. ఇప్పుడు ఇతని కల్పనలందు ఘనమును సూచింప గలుగు ఒక విరివి (Monumental quality) అందు కొనసాగినది. నాటికే ప్రాచీనమయిన ఇంప్రెషనిష్టు పద్ధతులు ఇతని కల్పలనలందు నశించినవి. రూపురేఖలు ఇతని చిత్రములందు ప్రాధాన్యము నందుకొన సాగినవి. హాస్యనైపుణ్యమున ఇత డసమానుడని ఎప్పుడో పేరువడినది. అయినప్పటికిని ఈ రోజ్ పిరీయడ్ లోనే ఇతని చిత్రములు చాల విరివిగా అమ్ముడు పోసాగినవి. తనచిత్రములకు వెలవచ్చుచున్న దన్న సంతోషమేకాబోలు, ఆ రోజ్ పిరీయడ్ చిత్రములలో ఒక అనిర్వచనీయ రాగమాలాపించు చున్నట్లుండును.

1907 వ సంవత్సరంలో పికాసో క్యూబిసమ్ (Cubism) పద్ధతులను అనుకరింప మొదలిడెను. [ప్రకృతియందలి వివిధరూపములను సంక్షేపించి, స్వచ్ఛరూపములను (Purc forms) సృష్టించి కల్పన



నగ్నసుందరి: (నీటిరంగుల చిత్రం) బార్సెలోనా-1902

లొనరించు చిత్రకళా విధానము క్యూబిసమ్.] అప్పుడే ఆఫ్రికా నీగ్రోల శిల్పకళ సయితము ఇతనిని ప్రబలముగ నాకర్షించినది. వెంటనే పికాసో చిత్రకళయందొక తీవ్రశోధన మొదలెట్టెను. ఈ శోధన పరిణామము, అనేక నవ్యరూపవ్యూహముల (Patterns) సృష్టి. ఈ చిత్ర వ్యూహములందు విరూప మొనర్చిన (Distorted) మానవ ముఖములను కేంద్రీకరించి, తను ఉద్దేశించిన రీతి నివర్ణములను, రేఖలను, తలములను కల్పించి పికాసో చిత్రించెడివాడు. కొద్ది కాలములోనే ఈ నవ్యశోధన పరిణామ మతి తీవ్ర రూపము వహించినది. రూపములను, తలములను భిన్న మొనర్చి, మరల తనభావనాపరముగా కల్పించి చిత్రింపసాగెను. ఈ చిత్రములందు ఒక్కొక్కప్పుడు ఒకేముఖము రెండుముఖములై రూపభాగములన్నియు భిన్నమై ఒకేతలమున కల్పనలై ఏకరూపు వహించి కనుపడును. పికాసో మొదలిడి సాధించిన



జేమ్ సబార్టే: (తైలవర్ణచిత్రం) రాయన్. 22-10-1939

ఈనవీనపద్ధతిని ఎనలిటికల్ క్యూబిజమ్ (Analytical-Cubism) అని, ఫెసెట్ క్యూబిజమ్ (Facet-Cubism) అని పండితులు నిర్వచించిరి.

ఆధునిక కళలో క్యూబిజమ్ పద్ధతులందు బ్రాక్, డెరెయిన్ మొదలయిన కళాకారులు చేసినకృషి అపారము. కాని క్యూబిజమ్ పద్ధతులలో పికాసో చేసిన శోధన, కృషి అన్నిటిని మించినది. నిజముగా క్యూబిజమ్ చిత్రకళలో సంక్షిప్త మార్గము నే అనుసరించును. సెజాను, సూరె మొదలయిన మహామహుల శోధనలందు అంకురించిన ఈ క్యూబిజమ్ పికాసో చేతిలో ఉత్తీర్ణమైనది. మూలరూప భావములను, సంక్షిప్త అంశములను నిర్దేశించుటకిది ఒక మార్గమయినది.

పికాసో శోధనలు క్యూబిజమ్‌తో అంతమొందలేదు. 1918 వ సంవత్సరంలో, అనగా ప్రథమ ఐరోపా సంగ్రామానంతరము ఇతని చిత్రకళ మరొక రూపము దాల్చినది. ప్రకృతి బాహ్య రూపములనే ఆభాసిస్తూ, తత్తుల్యముగానే కెమెరా ననుకరించురీతిని చిత్రలేఖనమున కితడు మరల నుపక్రమించెను. కాని కల్పనయే ఇతని పరమోద్దేశము. అందుచేత ఈ చిత్రములందు సయితము రూపములను తనభావనల ననుకరించు ఒక చిత్రగతిని అమర్చి లయప్రదముగనే ఇతడు కల్పనలు చేసెను. 1919 వ సంవత్సరము వచ్చుసరికి, ఈరీతిన కల్పితమగుచున్న ఇతని చిత్రములందు ప్రాచీన గ్రీకుసంస్కృతి ఛాయలు గోచరింపసాగినవి. పికాసో కళాసృష్టియంతయు ప్రబల ఉద్రేక పూరితము. అందుచేత భావన ననుసరించిన వికారవిధానములు సయితము ఇందు నెలసినవి. ఈ చిత్రములందు మానవరూపముల కాళ్ళు, చేతులు అతి లావుగాను, తలలు చిన్నవిగాను కన్పడును. ఈ చిత్రములను తిలకించునపుడు నేటి మానవుని అంతరంగమున అతి రహస్యముగ దాగియున్న పశువును ఇతడనుభవించి అనుభావించెనేమో యని తోచును.

నిశ్చయముగా 1919 వ సంవత్సరమునుంచి, 1925 వ సంవత్సరమువరకు ఇతని కళాజ్యోతి అతి ఉత్తేజితమయి ప్రజ్వలించినది. అతీతములైన మహత్తర చిత్రములను ఆకాలమందు ఇతడు రచించెను. అతి ప్రాచీన గ్రీకుకళావిధానముల నే ఆధారమొనర్చుకొని ఆ కళాస్వరూపవ్యాఖ్యానముల నన్నింటిని హరించి మించి, అత్యద్భుత ఆధ్యాత్మిక కల్పనలు చేసిన ప్రాచీనస్పెయిను కళాకారుడైన ఎల్ గ్రీకో చిత్రకళా శిల్ప మితనిని ఆవాహమై ఆవేశించినదని పండిత వాక్యము.

అటుతర్వాత గడచిన కాలమందు ఇతని చిత్రకళారీతులు అతిబహుశాఖములయినవి. ఆధునిక కళారంగమందు అనంతము విభిన్నమై, పొంగివచ్చుచున్న జీవముతో ప్రకాశించు పసిబిడ్డవలె రూపములతో ఇతడు బంతులాటలాడెను. ఇతని శోధనలు, పరిణామములు అనేకము. ప్రకృతి రూపములందు తానుగా గనుగొనిన అనేక నవ్యనిబద్ధ వ్యాఖ్యానముల నే అనుకరిస్తూ మానవుడెన్నడు కనిఎరుగని చిత్రవిచిత్ర గతులందు ఇతని కల్పనలు రూపొందినవి. మానవాంతర్యమున సుషుప్తమైన అవ్యక్తావ్యక్త [Sub conscious] మనోరహస్యమును సయితము విన్యాసితముగా శోధించి, అధివాస్తవికత [Sur-realism] ననుభావించు రూపములతో సహా ఒక ఆట ఆడెను. కొంతకాలమువరకు చిత్రలేఖనము సయితము మాని చిత్ర శిల్పములు చేయసాగెను. అప్పుడితని ఆవేదనావేశములు అత్యద్భుతములు. కొయ్యలు, అట్టముక్కలు, కాగితములు మొదలయిన చెత్తవాటితోనెల్ల, అద్భుతములైన చిత్రశిల్పముల నాడాతడు నిర్మించెను.

1920 వ సంవత్సరమునుంచి 1930 వ సంవత్సరమువరకు పికాసో రచనలలో వికారము అంత విషమంగా కనుపించదు. ఆకాలమందు స్థావర వస్తువులను ఆధారమొనరించుకొని, ఇతడనేక చిత్రకల్పనలు చేసెను. ఈ చిత్రము లతి చిత్రవ్యూహ కల్పనలు. ఈ వ్యూహములందు వర్ణములు ప్రకాశిస్తూ, అలంకారయుతముగాకూడ కన్పడును. ఇంతేగాక ఈవ్యూహముల అల్లికలు, గీతలు అతి చిత్రమయినవి. ఇట్లు రచితమైన ఈ నవ్యవ్యూహ చిత్రములందు,


కాలేజ్ క్యూబిజమ్ [College Cubism] లక్షణములు వయితము గోచరించును. ["కాలెజ్" (College) అనునది ఫ్రెంచిపదము. "కాలెజ్" అనగా జిగురుతో అంటించుట. ఆధునిక కళాకారులు కొందరు, కాగితము మీదనో, కాన్వాసు మీదనో, మరేదయిన వస్తుల పదార్థముమీదనో, వివిధ వస్తువులను ఒక్కొక్కప్పుడు న్యూసుపేపర కట్టింగులతో సహా అంటించి, చిత్ర కల్పనలు చేసెడివారు. ఇలా జిగురుతో అంటించి, చిత్రములను తయారుచేయు రీతిని, "కాలెజ్" అని యూరపులో అనవము పరిపాటి అయినది. నాడు పికాసో కూడా అనేక కల్పనలందు "కాలెజ్" పద్ధతులను కూడ వాడినాడు] ఇట్లు కల్పన అయిన ఈ చిత్రములు నాడు లోకము నతిగా నాకర్షించినవి.

1927 వ సంవత్సరమునకు రూపముల తత్వ విూత నికి పూర్తిగా అవగాహన మైనట్లు తోచును. ఈతత్వా న్వేషణమే, అతి తీవ్రరూపమువాల్చి, నాడీతని కల్పన లందతిభీభత్సగతిని రూపొందినదని చెప్పవచ్చును. నాడు పికాసో తన కల్పనలందు స్థూల ప్రకృతి రూపములనే వినియోగించెను. కాని ఆ రూపముల నతి వికృత మొనర్చి రూపములను భిన్న మొనర్చి వీటన్నిటిని భాగ భాగములుగా ఛేదించి, స్వస్థానములనుంచి వేరుచేసి, తలములను సయితము చిందర వందరగా పెదజల్లి, మరల నన్నిటిని క్రోడీకరించి ఏకత్వమునిచ్చి, ప్రబలచిత్రముల నీతడానాడు కల్పించి రచించెను. ఈ చిత్రములందు ఉద్వేగ చలనములతిరయై ప్రాణము పూరించుకొని, అత్యుద్రిక్తముగ భీభత్సరాగ ముల నాలాపించుచుండును.

1937 వ సంవత్సరములో నాజీఫాసిస్టులు అతిగా విజృంభించి, యూరపు నంతటిని కలవర పెట్టుచుండిరి. నాజీల దౌర్జన్యమును, ప్రజలక్షోభను అనుభావించుచు పికాసో నాడు కొన్ని దృష్టాంతీకరించు చిత్రములను రచించెను. "డ్రీమ్ అండ్ లైస్ఆఫ్ ఫ్రాంకో" అను చిత్రముల సంపుటియొకటి, గార్నికా (Guernica) యను ఒక మహాతర చిత్రము, చాల ప్రసిద్ధికెక్కినవి. ఈ చిత్రములందలి భీభత్స ప్రణాళిక లతీతములు. నాటి నాజీ ఫాసిస్టుల రాక్షస స్వరూపము, నాశన మగుచున్న గుంపుల ప్రజల క్షోభ ఈ చిత్రములందు అతి చిత్రముగాను, ప్రబలముగాను ప్రదర్శితమైనవి. హత్యకావబడిన శిశువులు, కడుపుకాలి ఏడుస్తున్న తల్లులు, నాశన మొనరించుచున్న అగ్ని, విచ్ఛిన్నమయిన ప్రకృతి, మృత్యుబాధ లోనున్న గుర్రములు, పురుగులు పట్టి కిలకిల లాడుచున్న జంతు కళేబరములు, ఖండ ఖండములై పెదజల్ల బడిన జీవముల రూపము ఇం దతిభీభత్సముగ గోచరించుటె గాక, దీనప్రార్థనలు, క్రోధశాపములు, శోక రోదనములు, రాక్షస హాహాకారములు, ఈ చిత్రముల నుంచి అతితీవ్రముగా వినవచ్చుచుండును. నిజముగా ఇట్టి ప్రళయ భీభత్స దృష్టాంతీకరణ చిత్రములను, ఇంతవరకు నేకళాకారుడును చిత్రించియుండలేదు.

నిజముగా పికాసో సిద్ధహస్తుడు. దృష్టాంతీకరించు చిత్రములకు ఇతనిదె పెట్టినపేరు. ఈ చిత్రములందు ఇతడసమానుడనియే పండితాభిప్రాయము. కాని ఈయన అంతర్జ్యోతి బహుముఖమగుటంజేసి, ఈతని కళాగతులుగూడ అనేకములయినవి. నేడితడు చిత్రలేఖనము, చిత్ర శిల్పములకు కూడ మించి, చిత్ర మృణ్మయ శిల్పమునందు కూడ లగ్నమయినాడు. ఇతని కళా జీవన చరిత్ర పరికించిన పండితులు, కళాలోకమందితడొక "ఊసరవెల్లి" (Chameleon of Art) అని హాస్యము చేయుటకూడ కలదు. కాని నిజముగా ఆధునిక కళాప్రపంచముపై నాట్యము చేయుచున్న నటరాజితడే.

పికాసోచిత్రము లన్నియు వాతని బహుళ ప్రకృతిని స్పష్టపరచును. ఆధునిక కళనుగూర్చి పండిత హెర్బర్టు రీడుగారు (Herbert Read) "ఆధునిక కళయందు ఏ ఒక చిత్రమును గూర్చి వ్యాఖ్యానించుటయు దుర్లభము. కాని ఆధునిక కళ నంతటిని ఏకముగా సమీక్షింపవచ్చు." పికాసోకూడ ఆధునిక కళాకారుడే. అందుచేత ఇతని ఏ ఒక చిత్రమును వ్యాఖ్యానింప తగదు. ఇతని కళనంతటిని సమీక్షింప వలెను. నిజముగా పికాసో కళాప్రకృతిని అభావార్థముగా మనకు తెలియజేయును. పికాస్సో అన్నరీతినే అతని కళ ప్రకృతి కానిదేదో, అద్దానిని అనుభావిత మొనర్చగలడు. "Through Art we express our conception of what Art is not-" పరమాత్మ ప్రకృతి కాదు. పికాసోకళకూడ నంతియే.



కోడి - కత్తి: (తైలవర్ణ చిత్రం) 21-3-1947

ఇరవై ఐదో శతాబ్దంలో చంద్రుడు!

శ్రీ మాదిరాజు రంగారావు

అనాదినుండి మొన్నటివరకు
నే నొక దేవతని, అంటే చెబుతా
మీ మనస్సులో కలిగే భయానికి రూపాన్ని
నిన్నటినుండి ఇవాల్టిదాకా
పుట్టుమచ్చ అందం మరచిపోయిన
కవుల కావ్యాల్లో; ఇన్నియేండ్లుగా
రాత్రులకు రాత్రులు ఆకాశాన
వెలిగే ప్రేయసీ ముఖబింబాన్ని—
కవి ప్రియులకు కొనసాగిస్తూ దాస్యం
వాళ్ళ పద్యాలు విని, పదిహేనురోజులు
మాత్రం హాయిగా నిద్రపోతూ చీకట్లో
వెలుగుపూలు విరిసిన నీలాకాశ
వృక్షం క్రింద ఒంటరిగా జీవితంగడుపుతూ
అలాగే వున్నా కొంచెం మార్పుతో
ఈనాటివరకు.

నడిచే గుహలా, చీకటిలో నిద్రలా
ఎప్పుడూ వెన్నంటి వుంటుంది గతం.
చాలమంది కోరుతారు అందులో నివాసం.
వాళ్ళు నడిచే పిరమిడ్లు, దేవాలయాలు
మ్రోగే చర్చిగంటలు, నిద్రలో పీడకలలు
సరే ఆసంగతి అలావుంచుదాం
రేపు అంటే ఇరవై ఐదో శతాబ్దంలో
నేను—
మేఘం మనస్సులో, సముద్రగర్భంలో
అరణిలో, అగ్నిని దర్శించి
దేవతగా భావించిన కాలంనుండి
జ్ఞానం — విజ్ఞానం — సంస్కారం
రూపంలో, మానవతపై జరిగే
మానవుని మనోగత, మేధాగత
జిజ్ఞాస — పరిశోధన చరమదశ
నా శిరస్సుపై కాలూనడంతో సరి —

హద్దుల అతిక్రమణ జరగడానికి
ప్రక్కన పరాయివాడు వుంటేగా నాకు
ముఖంపై కత్తిగంట్లు పెట్టడానికి
ఎగిరినా అందని ఎత్తులోవున్నా ఇంతవరకు.

ప్రతి మనిషి కాంతిగోళంలా మారి
మనిషి మస్తిష్కం టెలివిజన్ యంత్రమై
గాలి కెరటంలా తేలే మనస్సుతో
బంతిలా ఎగిరే శరీరంతో
మీరంతా నాస్థానం ఆక్రమించి—

పూర్వం నన్ను గురించి మీలోకంలో
వ్యాప్తమైన అతీత కల్పనలరూపం
వింతలు — విశేషాలకు బదులు; రేపు
కదలిక ఎరుగని నాపై, సాగించి
పరిశోధనలు ఆయుర్దాయం తేల్చి
కొండజాతి మంచుమనిషినని నిశ్చయించి
నా చుట్టూ రక్షణకోసం యంత్రాలు

ఇరవై ఐదో శతాబ్దంలో చంద్రుడు !

సోల్జర్లు - విమానాలు - బాంబులు
ధ్వనులు - ధ్వనులు, ప్రతిధ్వనులు
మాటలు - మాటల కత్తిపోట్లు
ఆటలు - ఆటల పోట్లాటలు
గాయాలు - బాధలు - చికిత్సలు
రాజకీయ వైద్యుల మార్పులు - మృత్యువు!!
తెలియని భాషలో సాగే ఓదార్పులు
అప్పుడు మీరూ నేనూ ఒకటి అన్నమాట.

హద్దులు వుంటేగా దేశాలయొక్క ఉనికి
హక్కులు కావాలి స్తేగా ఆలోచనలో భిన్నత్వం
మనస్సులో అరలుంటేగా ఏర్పడేది జాతులు
రాత్రి ఉన్నంతవరకు సూర్యుడిలో కలసిపోను

ఓటుహక్కు జ్ఞప్తికివుండదు మరుస్తారు జనం
నోటిమాటలతోనే నడుస్తుంది తతంగం
నన్నుగురించి ఆలోచిస్తేనే సంకుచితత్వం
మరచిపోతే అప్పుడు విశాల విశ్వదృక్పథం.

నమ్మనంతగా మారుతుంది నాపూర్వరూపం
కాంతిగోళాల్లా తిరుగుతుంటారు మీరు
ఎవడికి వాడే స్వయం వ్యక్తి సంపూర్ణంగా
తెలివిజ్ఞ మస్తిష్కంతో మనుషులు.

కాలం ముద్రలు — చెల్లిపోయిన
చెల్లని హక్కులపత్రం 'రిన్యూ' వౌతుందా?
కాంతి చక్రం పరిధిలో వెలుగుతప్ప
సాగి వచ్చినంతమేర తిరిగి చీకటేగా !

సాహితీ సుగతుని స్వాగతం

ఆరుసెలల్లో వీరు వారౌతారన్నది నానుడి—సావాస బలం అటువంటిది. ఇక రాజకీయ ప్రాబల్యమూ, సాహిత్య ప్రాచుర్యమూగల భాషలు ఇతర భాషలను, జాతులను లోబరచుకోవడంలో ఆశ్చర్యమేముంది? సహస్రాబ్దాలుగా ఇతర దేశాలతో—ముఖ్యంగా పాశ్చాత్య దేశాలతో— సంపర్కంగల భారత దేశం సంగతి వేరె చెప్పాలా? కౌటిల్యునికి ముందునుంచి మనకు గ్రీకులతో సంబంధం ఉంది. కాల యవనునికథ చూస్తే అంతకుముందునుంచీ ఉందేమో! ఆ గ్రీకు నాగరికతనుంచే నేటి పశ్చిమావని కళా సంస్కృతి సభ్యతలను తీర్చిదిద్దుకుంది. మన గాంధారశిల్పం గ్రీకుల కళా ప్రాభవానికి లోనైన సంప్రదాయమంటారు కళాభిజ్ఞులు. కాని, సాహిత్యంలో వారి ప్రభావం కొన్ని పదాల ప్రయోగంవరకే పరిమితమైంది.

తర్వాత మనకు కలిగిన సంబంధం ముస్లింలతో. మొట్టమొదట మన దేశానికి వచ్చిన ముస్లింలు "తురుష్"లు. వారి సామ్రాజ్యం వెయ్యేళ్ళకుపైగా సాగింది, కొద్దిగనో, గొప్పగనో. కాని, మతాలు వేరు కావడంవల్ల వారి సాహచర్యం భవననిర్మాణాది వాస్తువులలోను, చిత్రకళలోను ప్రతిబింబించినంతగా తాత్త్విక నిర్దేశం ప్రధానంగాఉండే సాహిత్యంలోకి ప్రతిబింబించలేదు. ఢిల్లీ పరిసరాల వ్యవహారభాషగా ఉన్న హిందీశాఖ ఒకటి ముస్లింల మత రాజకీయభాషలైన అరబ్బీ, ఫారసీల సంప్రదాయాలను పాటించి ఉరదూగా అవతారం దాల్చి సూఫీసిద్ధాంతంవంటి తత్త్వలను చూపకపోలేదు. అయితే, తక్కిన ప్రాంతీయ భాషల్లోకి కొన్ని పదాలను మాత్రమే ప్రవేశపెట్టగలిగింది ఇస్లాం. పరిపాలన మార్గంగా తెలుగులోకి చొచ్చుకువచ్చిన ఉరుదూ, ఫార్సీ, అరబ్బీ, తుర్కీ పదాలూ ఎక్కువే—కాని సాహిత్యంలోకి వచ్చినవి చాల తక్కువ. వాటి జాబితా చెప్పడ మేమంత కష్టం కాదు.

విదేశాలతో మనకు కలిసిన మూడవ సంబంధం ఆధునిక పాశ్చాత్య దేశాలతో. ఇది మున్నూరు సంవత్సరాలది. బుడతకీచులు మనదేశానికి ముందుగా వచ్చినా, తర్వాత ఒలాందులు(డచ్) వారిని అనుసరించినా, పిదప పరాసులు పయనమై ఏతెంచినా, హెచ్చు సంబంధం మనకు కలిగింది ఇంగ్లీషువారితోనే. ఇంగ్లీషువారి పరిపాలన మత ప్రాతిపదికపై మనదేశంలో నడవలేదు—లౌకికంగా ఉండేది. వారి పాలనకు పునాది విద్యావిధానం. మెకాలే మాటలే దీనికి నిదర్శనం. కనుక ఇంగ్లీషు విద్య దేశంలో బాగా పాదుకొని,బలిసి, ఇరుదేశాల మధ్య రాకపోకలెక్కువై, సంస్కృతి సంబంధం పెరగను పెరగను మన ప్రాంతీయభాషల్లోను, మన భావనాపద్ధతిలోను, కళల్లోను వారి ప్రభావం ప్రతిభాసించింది; ఇటీవల యాభై యేండ్లుగా, ఈ ఆంగ్ల ప్రభావం—పాశ్చాత్య ప్రభావం—తెనుగు కవిత్వంలో స్ఫుటంగా కనబడుతున్నదని చెప్పవలసి ఉంది. కవిత్వం సంగతే ఎందుకు స్మరిస్తున్నానంటే తెలుగువారి విలక్షణత ఇతర ప్రాంతాల వారితో పోల్చినప్పుడు ఇతర కళలకంటే అందులోనే ఎక్కువ గనుక. వారి కవిత్వంలో ఒక భాగంగా ఉండే "భావ చిత్రణం" (Imagery) మన కవులను ఎలా ముట్టడివేసిందో వివరించడానికిముందు మనకూ, పాశ్చాత్యులకూ ఆలంకారిక సమయంలో ఉండే ఒకటి రెండు భేదాలను మనవి చేస్తాను.

కవిత్వం ప్రాణుల ప్రవృత్తి వీధులను అభివర్ణిస్తుంది. ఇది మనకూ, వారికీ సమానమే. కవిత యెందుకంటే ఆనందంకోస మంటాము మనం. ఆ ఆనందం మనకు రసరూపంగా ధ్యేయం. మన 'సహృదయుడు' పరగతమైన సుఖ దుఃఖాలను భావన చేసి, అనుభవించగలశక్తితో సాత్త్వికుడు. ఈ సత్త్వగుణాన్నే పాశ్చాత్యులు 'మనుష్య సహజమైన ఆసక్తి' (Human interest) అంటారు. కావ్య ఫలంగా మనం కోరేది సద్యఃపర నిర్వృతి రూపమైన ఆనందమైతే, వారు సుఖసంవిద్రూపమైన అనుభవాన్ని (Pleasure) కోరుతారు. అది తాత్కాలిక చిత్తవిస్మృతి రూపమని వారి నమ్మకం. మన ఆలంకారికులు ఈ తాత్కాలిక చిత్తవిస్మృతిని చమత్కార మన్నారు. అయినా చమత్కారమే కావ్య ఫలమని

గాని, నారాయణ భట్టపాదు లన్నట్టు అద్భుత మొక్కటే రసమని కాని ప్రాస్థానికంగా మనవా రొప్పుకోరు. కేవల చమత్కారం అవరమనీ, రసానందమే శ్రేష్ఠమని, అది సుఖ దుఃఖాతీతమైన అఖండానుభవమనీ అంటారు. ఇంతకూ మన అలంకార శాస్త్రం పెరిగినంతగా పాశ్చాత్యుల అలంకార శాస్త్రం (Aesthetics) పెరుగలేదనడం అంత సాహసం కాదు.

మరి కావ్య నిర్మాణాన్ని, దాని ఫలమైన రసానుభూతినిగూర్చి చర్చించే మన అలంకార శాస్త్రం "శాస్త్రం" అయి, నిష్కర్ష ప్రధానమై పోయింది. ప్రయోగించిన ప్రతిపదం, అలంకారం, గుణం, వృత్తి, రీతి, శయ్య, పాకం—అన్నీ రసోపస్కారాలు కావాలి. పాశ్చాత్యులలో, రసచర్చ లేదు గనుక, కావ్య నిర్మాణం విషయంలోను, కావ్యానుభూతి విషయంలోను ఇంత నిష్కర్ష కనిపించదు. ఆ కవులలో ప్రతివాడూ ఒక స్వతంత్ర మార్గంలో నడవడం మామూలు. కాని. మహాకవులుగా పేరుపొందిన అచటి కవులుగూడ కావ్య నిర్మాణ వైచిత్రికి, రామణీయకానికి, తత్త్వదర్శనానికి, ఎక్కువగా ఉపకరించారనడంలో సందేహం లేదు. మనం పాశ్చాత్యులకన్నా ఎక్కువ ప్రత్యయంతో వేదాంతశాస్త్ర విషయాల్లోను కాళిదాసాది మహాకవుల వాక్యాలను ఉదాహరించుకొని కావ్యాలకూ శాస్త్రప్రామాణ్యమిచ్చి గౌరవించుకున్నాము. ఇంతకూ చెప్పవచ్చిందేమిటంటే పాశ్చాత్యుల కవిత్వంలో కవులకు 'స్వేచ్ఛ' హెచ్చని, మన సంప్రదాయ రచనల్లో కొంతవరకూ తక్కువా అని. ఇక భావచిత్రణం సంగతి చూద్దాం.

మనకు నూటికిపైగా అలంకారా లున్నాయి. ఇంగ్లీషులోను ముప్ఫైదాక 'ఫిగర్స్ ఆఫ్ స్పీచ్' అనే పేరుతో అలంకారా లున్నాయి. కాని ఇంగ్లీషు కవిత్వంలోని 'భావచిత్రణ' (Imagery) అనేది ఈ అలంకారాలకు సంబంధించిందే అయినా, అంతమాత్రమే కాదు. కావ్య నిర్మాణంలో అలంకారాలకు ఉన్న ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. మనం కాళిదాసు గొప్పదనాన్ని స్థూలంగా ఉపమాలంకారంతో కొలిచినట్లుగానే, పాశ్చాత్యులతోనూ కవి అయినవాని నిర్మాణ మార్మికతను 'మెటఫర్' (Metaphor)లో కొలిచే అలవాటుంది. ఇంగ్లీషు కవిత్వంలోని ఈ భావచిత్రణ అలంకారాల్లో ఉపయుక్తమయ్యే సామగ్రికి సంబంధించింది. మనలో ఈ 'సామగ్రి'నంతా పరిశీలించి, రసోపస్కారాలైన వాటిని ఏరుకుని, జాతి గుణక్రియా విభాగంతో వింగడించుకుని అలంకారాలుగా తీర్చుకుంటాము. ఇలా తీర్చుకొనే మన అలంకారాల్లో ఉపమా, రూపకం, ఉత్ప్రేక్ష, అతిశయోక్తి దృష్టాంతం వంటివాటి సామగ్రికి సన్నిహితంగా ఉంటుంది పాశ్చాత్యుల భావచిత్రణ సామగ్రి. Image అనేది కవితలో ఉంటే దానిలో భావోద్వేగం, వైషయికత, చెప్పిన అభిప్రాయాన్ని టార్చిలైటు వేసి చూపినట్టుగా వెలుగుపూతలు పూసేశక్తి, ఒక సంవిధాన క్రమం ఉంటాయని పాశ్చాత్య కావ్యజ్ఞులు అనేమాట. 'ఇమాజెరీ' అనే మాటను భావన, మనః కల్పనాసృష్టి, స్వకపోల కల్పన అనే మాటలతో వ్యవహరించవచ్చు. కాని, 'భావచిత్రణ' మనే రెండుమాటల కూర్పులో విశిష్టస్ఫోరకశక్తి ఉందని భావిస్తున్నాను. కనుక ఇమాజెరీని భావచిత్రణమనే సంకేతించుకుందాం. ఈ భావచిత్రణం ప్రయోజనమేమిటి? అదెన్ని రకాలు? అనే విషయమై పాశ్చాత్య విమర్శకులు ఏమంటారో చూద్దాం.

భావచిత్రణ మనేది స్థూలంగా ఐదు విధాలు. ఒకటి:—చెప్పానంటే చెప్పానన్నట్టుగా ఉండవచ్చు (Conceit). దీనిలో సొగసు గాని, చెప్పిన అభిప్రాయం మరింతగా వ్యక్తీకరించే శక్తిగాని, వర్ణిత వస్తు తాత్త్విక వివేచనకు, యాథార్థ్య గ్రహణానికి తోడ్పడడం గాని వుండవు. ఇలాటి భావచిత్రణం అధమం—మన గుణీభూత వ్యంగ్యంలాగ. రెండు: అలంకార ప్రాయంగా ఉండవచ్చు. (Ornamental). అంటే కావ్యగతమైన అర్థముతో సంబంధించక ఏకదేశంగా వుండడం; సొగసు మాత్రం తప్పదు. మూడు: కవి చెప్పిన అభిప్రాయాన్ని వ్యాఖ్యానించినట్టుగా వెలుగు చిమ్మి దాని వ్యక్తీకరణకు తోడ్పడడం (Functional). నాలుగు: కావ్యం సృష్టిలోని ప్రవృత్తి రూపమైన యాథార్థ్యాన్ని (General operative truth) తెలియజెప్పుతుంది గనుక అలాటిదానిని పొదివిపట్టి ఉండడం. అయిదు: సకల సృష్టిలోను సంవిధాన పద్ధతి ఒకటివుంది. దానికి సమగ్రత, అఖండత ఉన్నట్టే కావ్యంలో కూడా ఆ ప్రవృత్తిరూప యాథార్థ్యాన్ని చెప్పడంలో సమగ్రతను, అఖండతను సాధించి, ఆ విశ్వ సృష్టితో సంబ

దింప జెయ్యడం. ఈ భావచిత్రణం ఎంతవరకు సమగ్రముగా తెలుగులోకి వచ్చిందో పరిశీలించే ముందు ఆధునిక కవిత్వానికి, కవులకు, ఈ భావచిత్రణ సామగ్రికి సంబంధించిన ఒకటి రెండు సంగతులు ఉట్టంకించవలసి వుంది.

కాల్పనిక కవితా ప్రస్థానానికి చెందిన కవులు (Romantic poets) మొదలుకొని ఇమేజిస్టులు, ఇంప్రెషనిస్టులు, సింబాలిస్టులు, ఫ్యూచరిస్టులు, సర్రియలిస్టులు, డాడాయిస్టులు దాకా ఆయా ప్రస్థానాలకు చెందిన కవులెందరో వచ్చారు. రాను రాను రచనలో ఈ భావచిత్రణ ప్రధానమై పోయింది. మరి ఆధునిక కవిత్వంలో ఈ భావచిత్రణ ఏ ఉదాత్త ప్రయోజనాన్నీ సాధించలేక పోతున్నదని, సార్వకాలికమైన విషయాలను స్పృశించడం లేదని అప్పటి సహృదయుల విమర్శ. అయినా భాష ఉన్నన్నినాళ్లూ, కవిత్వమంటూ ఉన్నన్నినాళ్లూ ఈ భావచిత్రణ పోయేది కాదు. మరోవైపు విజ్ఞాన శాస్త్రాభివృద్ధితో నాగరక జీవితం బొత్తిగా సంకీర్ణమైపోయి మనకు మన జీవితాలమీదనే పట్టు తప్పిపోతున్నది. ఇట్టి స్థితిలో ఆధునిక కవి సమకాలీన వస్తుసామగ్రి సాహాయ్యంతో భావచిత్రణ చేస్తాడు. లోకంలో ఆ సామగ్రికి లేని క్రమం, నిబంధన కావ్యంలో యేర్పడుతున్నాయి. కాగా, బయట నిగ్రహం లేని లోకాన్ని కావ్యంలో నిగ్రహించి, అదుపులో పెట్టుకొని, పట్టు తప్పకుండా దాచుకుంటున్నామన్న మాట. సంయమాన్ని, సాతత్యానికి సంతరించదలుస్తామన్న మాట. ఆధునిక కవులు వాడే ఈ సామగ్రిలో టెలిగ్రాఫ్ స్తంభాలు మొదలుకొని ఏదైనా ఉండవచ్చు. కాని, ఆ సామగ్రి అంతా మనకు నిత్యజీవితంలో పరిచితమే అయినా, అది కవిత్వంలో వాడినప్పుడు కవితాస్థాయికి అంది వచ్చి పాఠకుని స్పందింపజేయగలదా, లేదా అన్నదే ప్రశ్న. అంటే, వాటికి అనుభవ గోచరత ఉన్నా ఊహాచోదకశక్తి ఏర్పడిందా, లేదా, అనేది కవులు పరిశీలించుకోవలసిన విషయం.

మరి మన కవుల్లో దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు మొదలుకొని దాశరథి కృష్ణమాచార్యులు గారి వరకు ఆంగ్ల కవితా ప్రభావం పడినవారు అనేకులున్నారు. ఆ ప్రభావం మన ఈ కవులమీద ఎలా ప్రసరించిందో, ఆ పద్ధతి ఎంత సమగ్రంగా మనకు అందివచ్చిందో స్పృశిస్తూ పోదాం. మొదట అడివి బాపిరాజుగారి "వరద గోదావరి" గేయంలో భావచిత్రణం దర్శిద్దాం.

ఉప్పొంగిపోయింది గోదావరీ తాను
తెప్పున్న ఎగిసింది గోదావరీ.
....
అడివిచెట్లన్నీని
జడలలో తురుమింది.
ఊళ్లు దండగ గుచ్చి
మెళ్లోన తాల్చింది.

ఇక్కడ వివక్షితమైన భావచిత్రణం ఉప్పొంగి కొండలూ, కోనలూ ఏకంచేస్తున్న గోదావరిని ప్రాకృతిక శక్తి (Primival force)గా వర్ణించడం. నదిని స్త్రీగాను, ప్రళయ బీభత్సభావాన్ని కరాళ శక్తిగాను నిర్దేశించడం మన సంప్రదాయమే. కాని, ఇక్కడ కవి తన వశం తప్పి పెల్లుబికిన నదిని స్త్రీగా, అకల్పరచనాయత్తగా చిత్రించి కావ్య జగత్తులో తన వశవర్తినిగా చేసుకుంటున్నాడు. ప్రయోజనం అంతవరకే. ఇలా సహృదయులే సమన్వయించుకోవాలి.

దినములుపరస్పర ప్రతిధ్వనులు కాగ
ఇరువదై దేండ్ల నా బ్రతుకు కిట్టె గడచె,
ఈ రహోదుఃఖ వీథులందే నెలుంగ
సఖుల యడుగుల జాడ లీపరికిరాన.

అంటారు వేదులవారు "దీపావళి నాడు." దినములు పరస్పరం ప్రతిధ్వనించడమనే సమయం, భావచిత్రణం మన సాంప్రదాయికం కాదు. ఈ చిత్రణపు సారులు పోసింది వెనుకటి

బాణసంచుల ఫెళ ఫెళార్భటులు విరిసి
దశ దిశాంతరముల ప్రతిధ్వనుల నీన
పేదవడియున్న మానవజీవితపుటాశ
లిపుడు మ్రోగించుకొనుచుంటివేల నీవు?

అని చిమ్మటను సంబోధించే పద్యం. బాణసంచులఆర్భటులే ఈ దినాలలో ప్రతిధ్వనించాయి. అలాగే

ఆకొనిన యాశ లెప్పటి కప్పు డెవిరొ
కలయద్రిప్పును స్వప్నసాగర తటాల

అంటారు కవి. ఆశలు సచేతనాలై ఆకలిగొనడం, స్వప్నసాగరతటాలను త్రిప్పడం మన భావనాప్రపంచమా?

"సుప్తాస్థికలు" అన్న శ్రీశ్రీ కవితలో పాశ్చాత్య భావచిత్రణం ఎంతగా పొదివికొన్నదో వినండి.

అవి ధరాగర్భమున
మానవాస్థికా పరంపరలు!
సుప్త నిశ్శబ్ద సంపుటములు.
అట నొకే దీర్ఘయామిని!
ఆ నిశా శ్మశాన శయ్యకు
ప్రాతః ప్రసక్తి లేదు,
ఆ అగమ్యతమో రహస్యాంగణాన
తాండవించును
మృత్యు శైతల్య మొకటె!
అవి నితాంత హేమంత హృదంతరంత
రనుభవాళి
ఘనీభవించిన సమాధులు.
ఆ మనుష్యాస్థికలు
నిద్రలో మునింగి
సంచరించును భైరవస్వప్నవీధి!
అవి చలించును,
తమ చర్మ కవచ మెపుడో
బ్రతికినదినాల తిలపోత బరువుచేత!
నాకనుంగవ కన్నీటిలై కరంగు
అవి ఒనర్చెడి నీరవాహ్వాన మెరిగి;
ఇంత కోపిల్లు నేలా నాహృదయపుటము
వణుకు నేటికో
నా అస్థిపంజరమ్ము!

ఈ భావ చిత్రణం పరమార్థం ధరా గర్భంలోని మానవాస్థి పరంపరలఎడ కవి తన సానుభూతి ప్రదర్శించడం వరకే కనుక అసమగ్ర మంటారు విమర్శకులు. కవి మృత్యువునుగూర్చి ప్రస్తావించాడు. దానిని అర్థాంతర న్యాసంవంటి దానితో ఉల్లేఖించి ఉంటే చిత్రణ సమగ్రమయ్యేది. సుప్త నిశ్శబ్ద సంపుటములు, ఘనీభవించిన సమాధులు, అవి చలించును—మొదలయిన చిత్రణ సామగ్రి అంతా పాశ్చాత్య మత సంప్రదాయంలో తెచ్చుకొన్నదేనని చెప్పనక్కరలేదు.

"ఒక రాత్రి" లోను శ్రీ శ్రీ పాశ్చాత్య కల్పనా ప్రవంతిని పూర్తిగా పుణికి పుచ్చుకున్నారు.

గగనమంతా నిండి
పొగలాగు క్రమ్మి
బహుళ పంచమి జ్యోత్స్న
భయపెట్టు నన్ను!
ఆకాసపు టెడారి
అంతటా అకట!
ఈ రేయి రేగింది
ఇసుక తుపాను.
గాలిలో కనరాని
గడుసు దయ్యాలు
భూదివమ్ముల మధ్య
ఈదుతున్నాయి!
నోరెత్తి హోరెత్తి
నొగులు సాగరము.
కరి కళేబరము లా
కదలదు కొంచె!
ఆకాశపు టెడారి
లో, కాళ్ళు తెగిన
ఒంటరి ఒంటెలా
నుంది జాబిల్లి !
విశ్వమంతా నిండి
వెలిబూదివోలె,
బహుళ పంచమి జ్యోత్స్న
భయపెట్టు నన్ను!

భయసమ్మిళితమైన నైరాశ్య భావ చిత్రణమిది. తత్స్ఫురక సామగ్రి అంతా పాశ్చాత్యం. నైరాశ్యానికి చిహ్నం పొగమంచు. భయపెట్టే వెన్నెల అలాఉంది. శ్రీ శ్రీ చూచిన బహుళపంచమి జ్యోత్స్న మార్గశిర పుష్యమాసాల బహుళపంచమిదేమో! అప్పుడు గాని వాతావరణంలో పొగమంచు కనిపించదు. ఇసుక తుపాను, గాలిలో కనరాని గడుసుదయ్యాలు ఈదడం, ఆకాశపుటెడారి, కాళ్ళు తెగిన ఒంటరి ఒంటె—అవన్నీ క్రైస్తవ, మహమ్మదీయ దేశకాల సంప్రదాయ గతాలు. ఏనుగును కొంచెతో పోలుస్తాము మనం. ఇక్కడ కదలని కొంచె చచ్చిన ఏనుగులాగ ఉందనడం మన సంప్రదాయ భిన్నమైంది. జాబిల్లికీ ఒంటెకూ రూపసాదృశ్యంలేదు; ఆపాతతః కనిపిస్తున్నా. కనుక భారతీయ మనస్సుకో, మస్తిష్కానికో జాబిల్లి ఒంటెలాగ తోచదు. మనం మరుమరీచికలను నైరాశ్యానికి ఉదాహరిస్తాము, పొగమంచును కాదు.

శ్రీ శ్రీ 'ఋతురాణి' తలిరాకు జొంపాలతో, విరుల గుంపులతో కాక పాశ్చాత్యుల మాంత్రికురాలి లాగ 'వసంతకాలం మంత్ర కవాటం తెరచుకొని ప్రవేశిస్తుంది.

ఇక నండూరివారి 'కలతనిదుర'లో
ఆకాశ మొతీరు
అవులించిన రేయి

మనదా? ఇది పూర్తిగా నోరారాచేసిన ఆంగ్లేయుల అవులింత.

అంతో ఇంతో షెల్లీ భావచ్ఛాయలలో విహరించిన కృష్ణశాస్త్రిగారి "అన్వేషణ"లోనిది మన భాషాభావాలతో, ఆలంకారిక సమయాలతో మేళవించిన పాశ్చాత్యభావచిత్రణ పరిపాకమే.

విశ్వనాథవారి 'చిన్నిమబ్బులు' పాశ్చాత్య విమర్శకులు నిర్వచించిన మూడో భావచిత్రణానికి మచ్చుతునక. మేఘాదులు ఉద్దీపన విభావాలు మన కవిసమయంలో. వాటికి వ్యక్తిత్వ మేమీ లేదు. కాళిదాసు దౌత్యం అప్పగించిన మేఘం దానిని వినలేదు, కనలేదు, అనలేదు. తనదారిని తను గాలికి కొట్టుకొనిపోయింది. ఇక్కడ అచేతనమైన మబ్బు సచేతనమై తనకు ప్రకృతితో సమకూడే మార్పుతో నవవధూసాధర్మ్యం పొందడం, కవి వివక్షకు జిలుగులు వెలుగులు చిలికి వ్యక్తీకరించడం సుందరమైన భావ చిత్రణం.

తొలి చిన్ని మాలాలు
కొలకిస్తు ప్రేమతో
విభుని చూచిన వేళ
విన్నబోయిన వేళ
ఒరవు మిన్నులలోన ఒక నీలితెర మబ్బు
సంజలో తారిందిలే!
జాలుగా మారిందిలే!
తొలికాన్పు పసిపాప
సాక నేరని బాల
తెంపోయి పతి చూచి
కళవళించిన వేళ
తూరుపు కోనలో తొంగలించిన మబ్బు
తెగ పరుగులెత్తిందిలే!
సొగసుల్లు పోయిందిలే!

నవ వధువు పోయగాన్ని, నిండుతనాన్ని మబ్బు మచ్చుటతో వెలుగుపూసి వ్యాఖ్యానించారు కవి.

సుళ్ళు తిరిగే కడలి నడుమా
నూపు కందీ అందకుండా
తెప్ప లేసుకు పాము పడుచులు
తేలిపోతారో

అంటారు విశ్వనాథవారు కోకిలమ్మ పాటలో. తరగలను ఉరగఫణాలుగా వర్ణించడం మనకు కొత్త కాదు. ఇక్కడ పైకి లేచిన తరగల తలలను పాము పడుచులుగా, తరగల మొదళ్ల లోని ఒంపును తెప్పగా వర్ణించడం మనకు కొత్త. పాశ్చాత్యులకు మత్స్యాంగనలు (Mermaid) ఉన్నారు.

సవరింతువా అగ్నివీణ
సవరింతువా దిశాంచలము రింగులువార
నవనవాంగార సంభవ కీల బుసదేర
... ...
మనసులో మిన్నాగు ఫణమెత్తి పారాడ
సవరింతువా అగ్నివీణ

అంటారు పుట్టపర్తి నారాయణాచార్యులు. అగ్నివీణ అనడం, మనసులో మిన్నాగు ఫణమెత్తడం, అన్య సంప్రదాయపు మెరుపులు.

"బరువు బండి"లో పిలకా గణపతిశాస్త్రిగారి గుండె బరువు ఆధునిక జీవితగతిలో పడిన పాశ్చాత్య సంబంధపు ఉరువే.

ఎద్దయినా మోయలేని పెద్ద బరువుబండి మిట్ట
మధ్యాహ్నం తారురోడ్డు మంటల్లో ఈడ్చే ఓ
అన్నా! నీపై ఒక చిన్నపాట రాస్తే ఇక
అరుగుమీద కూర్చుని విని ఆనందిస్తుందిలోక
మన్నన్నా! ఈ మోసం మన్నిస్తావా! ఇంకా!
ప్రతిక్షణం దిగలాగే గతుకుల్లో పడి ఆతుకుల
బ్రతుకుబండి లాగి లాగి చితికి తూలిపోతూంటే
అన్నా! నీపై ఒక చిన్నపాట రాస్తానొక
అరుగుమీద కూర్చుని విని ఆనందిస్తుంది లోక
మన్నన్నా! ఈ మోసం మన్నిస్తావా ఇంకా!
విన్నావా! ఈ చిత్రం నిన్ను గూర్చి రాస్తె నట!
చిన్న పెద్దకవులల్లో పేరు మోగిపోతుందిట!
అన్నా! అయింది ఏదో! చిన్నపాట రాశానొక
అరుగుమీద కూర్చుని విని ఆనందించింది లోక
మెన్నటికీ ఈ మోసం మన్నించవులే మరింక!

దీనిలోని వ్యంగ్యం శాస్త్రిగారి జీవితపు లోచూపుల పరిపాకమే.

జగత్తు పోస్టాఫీసు ముద్ర
జగత్తు ఇదే అంటుంది కాలం
ముద్ర కింది వల్లవిరా
మాసిపోదు పసేమిరా.

తపస్సు ముద్రించిన జాబులు
కట్టేసిన సంచికి పీళ్లు.
ఈ సూర్యాద్రిల ఉత్తరాల సంచీ
ఎప్పటికీ పో దిక్కుడనుంచీ.
ఏమంటే ఏరోక టప్పం
ఎప్పటికీ వంతెన మెయిలురాంపం.

సామాన్యుడు రన్నరు పాపం
పోతుంటే పీళ్ళకు కోపం
కానీ పోలేదు వాడు
కానీ ఎవ్వడు పోతాడు?

*   *   *

ఆ ఘడియ మన కొదివారపై కూమింటే సరి
శతాబ్దాల తర్వాతనే మన కది డెలివరీ.

అంటారు శార్వ కృష్ణమూర్తి "నిరీక్షణ" లో. కావ్యం సృష్టిలోని ప్రవృత్తిరూపమైన యాథార్థ్యాన్ని తెలియ జెప్పుతుందనే వాల్లో భావచిత్రణ కిది చక్కని ఉదాహృతి. రచయిత తను జాబుకోసం ఎదురుచూచే మిషతో అనంతకాలంలో ఎన్ని జగత్తులలో, ఎన్ని జన్మలలో కాచుకూర్చోవాలో అనే తత్వ చింతనను—యాథార్థ్యాన్ని ఈ చిత్రణలో మనకు స్ఫురింపజేశారు.

మూడు లోకాలలో
మూడు కాలాల
నినదించు నిజమెరుపు
నిండు మన మెరుపు.
పొడివలోయే ప్రొద్దు
పాల బుగ్గల ముద్దు
కొంచు వచ్చు మరో
ప్రపంచమ్ము నాది.

అంటారు రాంభట్ల కృష్ణమూర్తి. మన సంప్రదాయంలో సత్యం తెలుపు. నిండు మనసూ తెలుపే. ఈయన ఎరుపంటారు పాశ్చాత్య సంప్రదాయ సంగతితో. రెండవ గీతంలో 'ఎరుపు నాది' అనే భావంకూడా పాశ్చాత్య సంస్కృతి జన్యమే. గడ్డకట్టి తమ జీవితానికి గొడ్డలి పెట్టుగా వున్న మంచు—తెల్లని మంచు—దుఃఖదాయకం కావడంవల్ల పాశ్చాత్యులు మంచి వంతా ఎర్రగానే చూస్తున్నా రనుకుంటాను.

విశ్వం 'జవరాలు' 'నా హృదయంలో
చుక్కల మనసుల నెరుగదు
చక్కని పూబాస తెలిసి చావదు మరి యే
చిక్కు సమస్యల నెరుగదు.
తనియించి వైయక్తి
కత బెంచి దంతాల
మేడలో నుంచి పా
రాడ నీనట్టి
బంధనము కాదిమె
ఇంధనము కాని.

చుక్కల మనసు ఎరగడం—వాటికి మనసు అనేది ఉన్నట్టు—పూలబాస తెలియడం, దంతాలమేడలో ఉండడం—ఇలాటివి మన సంప్రదాయానికి విలక్షణమైనవి.

శిశు గృహాలూ బాలోద్యానాలూ
చెక్కు బుక్కుల బరువును బట్టీ
చిక్కే దుర్గతి వశించేదాకా.

దీనిలోని చెక్కుబుక్కుల బరువు ఐశ్వర్యపరముగా పాశ్చాత్య సంకేత మనడం చర్వితచర్వణం.

కాళోజీ గారు 'పోటీ తెన్నులో'లో నేటి విశ్వ మారణాయుస్తుల సర్వసర్వంసహా జఘృతను చిత్రించారు ఇలా :

చాపచింపు—సామ్రాజ్యం
కోడిగుడ్డు—కోహినూరు
పాటిమన్ను—ప్లాటినం
బస్సు సీటు—బ్రహ్మరథం
ఏడ్వలేం! ఏడ్వలేం
పోటీపడి కొట్టులాడ?

ఈ భావచిత్రణంలోని రెండు రెండు జంటలూ పరస్పరం నిమ్నోన్నతాల అంచులు. మన సత్వం ఒక్కటే, మనిషే మీ పెరగలేదనేది విపక్షకవికి.

విజ్ఞానం వేయి చేతులతో మానవజాతిని పరిరంభణం చేసుకొంటున్నది. కనుక కావ్యవస్తువు, కవిసమయాలు మారక తప్పదు. నేటి విజ్ఞానశాస్త్ర వికాస ప్రకాశాన్ని చిదిమి ఎక్కడికక్కడే దివ్వెలు వెలి

గించి, ఆ వెలుగులో తన భావచిత్రాల కాలను తెరుస్తారు దాశరథి. 'పీడిత ప్రజావాణికి మైక్ అమర్చి అభివాదులకున్ వినిపింప జేసెదన్' అంటారు. మైకును మరొకరెవరూ ఇంత యిదిగా వాడలేదను కుంటాను.

జగత్తుకు ప్రాణం ప్రసాదించిన
కార్బన్ పరమాణువు
అందులో సెంట్రల్ న్యూక్లియస్ చుట్టూ
చాంద్రాయణం చేసే అరు ఎలెక్ట్రానులు.

*　　　*　　　*

కాలం అక్కడక్కడే పెరగ్గలదా?
నయాగరా జలపాతం వలె
వసుం విరిగేట్టు దూకంది తప్పదుకదా!

*　　　*　　　*

బ్రతుకు నాగజముడు కూడ
పూలు పూయనీవయ్యా
మెతుకులో ప్రొటీనులు
మిక్కిలిగ రానీవయ్యా

*　　　*　　　*

మథన పడే మేధావుల
శిథిలాశిలలు చివురించే
రస రాజ్యం లేబరేటరీ.

అని 'మస్తిష్కంలో లేబరేటరీ'లో పంక్తులు. కార్బన్ పరమాణువు, ఎలెక్ట్రానులు, ప్రొటీనులు, ఇవన్నీ పలువురికి నిత్య జీవితంలో పరిచితమైన విషయాలే. వాటినే దాశరథి కవితాభావావేశం స్థాయికి తెచ్చి మన హృదయాలను స్పందింపజేశారు. శిథిలాశిలలు చివురించే "రసరాజ్యం లేబరేటరీ" అని ముగింపడంతో మనకు ఆశా సందేశ మిచ్చారు. మరొక మహాద్భుత చిత్రణం "మేల్కొన్న మనిషి."

శవం బతకడం ఎంత విచిత్రమో
మనం మేలుకోవడం అంత చిత్రమే.
ఎవడో కొత్తరకం వైద్యుడు
ఏదో కొత్త తరహా ఔషధం వాడివుండాలి.
లేంది ఇన్నాళ్లీ నల్లమందు మత్తు
ఇంత త్వరగా విడిపోవడం సులభమా?
ఏమైతేం వెళ్లి చూచిరావడం మంచిది.

మేల్కొన్న మనిషిని చూడ్డానికి వెళ్తున్నాను. నిద్రాణమైన జాతి మేల్కొన్నది; నవచైతన్య విలసితమైంది. తంద్రతొలగింది. ఇక జాగ్రదవస్థే కాని సుషుప్తి లేదు. దళితజాతులు ఇక అణగి ఉండవు. లేచి నిలవదొక్కుకుంటాయి అన్న గంభీర సత్య దర్శనతో ఈ చిత్రం సమగ్రమైంది.

ఇలా వెతుకుతూ పోతే పానలు తీరి పసుపచ్చాన రంగురంగుల లోచిస్సులు విరజిమ్మే మణులకు, కలరవాలు కురిపిస్తూ, సంభ్రమంభ్రమా కర్బుర కాంతులీనే కలరవ కంఠాలకు, వివిధ సౌరభాలను వెలార్చే కదంబ ప్రసూనాలకు దీటయ్యే భావ చిత్రణలను తీవలు సాగిస్తూనే పోవచ్చు. ఇది పలువురు రసప్రబుద్ధులు పెక్కుర్కు తరచవలసిన విషయం. అలాటి కృషికి స్వాగతం.

—రామచంద్ర

భారతీయ శిల్ప చిత్రకళా లక్ష్యములు

శ్రీ తిరుమల శ్రీనివాసశర్మ

గ్రీకుల మూర్తి శిల్పమును బరికించిన, వారి విధానము పరిపూర్ణమానవ సౌందర్యమునే ప్రకటించుట యని తెలియును. గ్రీకు దేవతలు ఉత్కృష్టమైన దేహసౌష్ఠవముగల సుందరాకారముతో నెలసిరి. అట్టి మూర్తులలో నెట్టి లోకోత్తరాదర్శముగాని, భావోత్కృష్టతగాని ప్రకటితము కాలేదు.

భారతీయ సంప్రదాయ మిందుకు పూర్తిగ భిన్నమైనది. ఇచటి దేవతలు మానవాకృతులతో నొప్పినను, దేహసౌష్ఠవమే పరమావధిగ పాటింపబడినవి కావు. ఆ యాకారము లెప్పటికి దుర్గకు ఎనిమిది పది భుజములును, శివున కైదు ముఖములును, బ్రహ్మకు నాలుగు ముఖములును ఉండుట సుప్రసిద్ధము. భారతీయ శిల్పులు, చిత్రకారులు మొదలు శాస్త్రవిహిత మగు మూర్తిని ధ్యానింతురు. హైందవ, బౌద్ధదేవతలను ధ్యానించుట యనగా వారిని మనఃపూర్వకముగ నుపాసించుట యని అర్థము. ఉపాసకుడు తన మనఃఫలకమున ఇష్టదేవత నెట్లు ధ్యానమూలమున రూపించుకొనవలయునో మంత్రశాస్త్రములు వివరించును. ఈ విధముగ సాధింపబడిన ఏకాగ్రతవలన ఉపాస్యమూర్తి హృదయమున స్థిరముగ నిలచును. సాధారణముగా మన కభిరుచిగల విషయములపైనను చిత్తమేకాగ్రత వహింపదు. అది ఇతరవిషయములకై సదా సంచరించుచుండును. ఇట్టి చిత్తవృత్తుల నరికట్టి ఏకాగ్రతను బడయుటయే ధ్యానమొక ముఖ్య సాధనము. సంపూర్ణధ్యానయోగమువలననే సమాధిస్థితి యలవడును. ఈ స్థితిలో ఉపాసకుని మనస్సు గురిలో నైక్యమును పొందును. అప్పుడు ప్రత్యక్ష, పరోక్షములగు నితరవిషయముల ప్రభావముల కతడు లోబడడు. ఈ దశలో ఎట్టిప్రయత్నములు ననావశ్యకము. ఉపాసకుని మనస్సు విగ్రహముతో ధ్యేయమును వినా అన్యమును గమనింపదు. ఇష్టదేవతను ధ్యానించు ఉపాసకుడు జ్ఞాననేత్రములను విప్పి ఉపాస్యదేవతామూర్తిని సాక్షాత్కరింప జేసికొనవలెను. ఆయా మూర్తి లక్షణములు వేదములలో సుందరముగ వర్ణింపబడి యున్నవి. ఇట్టి వర్ణనల ననుసరించి శిల్పకళోపాసకులు రూపసృష్టి యొనర్చుకొందురు. ఉదాహరణకు ధ్యానమున్నడకు శివు డే ప్రకారమున శ్రుతులలో వర్ణింపబడెనో గమనించుడు:—

"రక్తాపాండురమైన దేహముతో రజతాద్రివలె నొప్పుచు చంద్రార్ధధారియై ఒకచేత ఖండపరశువు వేరొకట మృగమును గలిగి వరదాభయహస్తములతో ప్రకాశించు మహేశుడు పద్మపీఠముపై ప్రసన్నవదనుడై అమరగణముచే పరివేష్టింపబడి అధివసించి యున్నాడు. శార్దూలచర్మధారియగు శివుని దివ్యమంగళమూర్తిని జూచిన విశ్వమహావృక్షమున కితడు బీజమనియు, విశ్వవ్యాపిత సత్యస్వరూపుడనియు మనకు గోచరించును. ఆయన దివ్యదర్శనము సర్వమానవ భయవిదారణము. అత డైదుముఖములతో, మూడు కనులతో విరాజిల్లుచున్నాడు."

మహేశుడు మానవాకారమున నున్నట్లు వర్ణింపబడినను అతనిది మానవ పరిమితాకృతి కాదు. మానవులెవరు నైదుముఖములు, మూడు కనులు కలిగియున్నట్లు చూడలేదు. అతని యాకృతికి మానవ శరీర మాదర్శము కాదు. మూడుకన్నులు, అయిదుముఖము లున్నంత మాత్రమున నాయాకారమును పరమశివుడనలేము. ప్రతి దేవతయు నొక ప్రత్యేక భావమునకు స్థూలమగు రూపకల్పన మాత్రమే. ధ్యాత తన ఇష్టదేవత స్థూలరూపము ద్వారా ఆ మూర్తి ఏ దివ్యభావమునకు సంకేతమైనదో దానిని గ్రహించి చివరకు తాను సాక్షాత్కరింప చేసికొన్న మూర్తితో, ఎదుటనున్న స్థూలరూపమునకు సమైక్యము సాధించును. ధ్యానమూలమున భౌతిక భావము క్రమముగ నశించి స్థూలరూపముతో నిమిత్తములేని మనోమూర్తితో నైక్యమొందు పారదర్శక స్థితి సాధ్యమగును.

దేవతామూర్తులు ఆధ్యాత్మికతత్వమును బోధించుట కుద్దేశింపబడినవని నమ్మిన భారతీయ శిల్పి గ్రీకులవలె కేవలము మానవ సౌందర్యమునకుగాని, అంగసౌష్ఠ

తమునకుగాని ప్రాధాన్యము నొసగలేదని తేటపడు చున్నది. మానవసౌందర్యమును ప్రదర్శించు పట్టుల కూడ లౌకిక సౌందర్యము నాదర్శముగ నుంచుకొనక ప్రకృతి సహజ రామణీయకము నే యతడు గ్రహించెను. పార్వతియందమును వర్ణించుచు కాళిదాసు "ప్రకృతి యందిమిడియున్న చెలువమును ప్రోవుచేసి సృష్టికర్త యామె సర్వాంగముల సృజించె"నని వర్ణించినాడు. గ్రీకులు ప్రకృతి సౌందర్యమును లక్షించిన వారుకారని చెప్పవచ్చును. భారతీయ కళాహృదయము మాత్రము తన కాదర్శమగు సౌందర్యమును వ్యక్తీకరించుటకు ప్రకృతిపైననే ఆధారపడినది. మహాకవి కాళిదాసుని 'మేఘదూతము'లో యక్షుడు దేశాంతరమున నున్న తన ప్రేయసికి సందేశమునంపుచు మేఘునితో ఇట్లను చున్నాడు : "ఓలావణ్యమయీ! నే ననుదినమును ప్రకృతిలో నీ శుభాంగములను పోల్చుకొని సమాధానము నందుటకు యత్నించుచున్నాను. కాని నీయందము ప్రకృతిని మించినదగుట వలన విఫలుడ నగుచున్నాను. లలితలతికావళులలో నీ తనుసౌభాగ్యమును, చకిత హరిణాలోకములలో నీ కనుల సోయగమును, రాకా చంద్రబింబములో నీ రమణీయ ముఖమును, వనమయూర పుచ్ఛములలో నీ వినీలకుంతలములను నిర్మల వాహినీ తరంగములలో నీ యొయ్యారపు చూపులను పోల్చుకొనుటకు యత్నించి అవన్నియు నీ లావణ్యమునకు దీటురాక వెలవెల పోవుచున్నందున విఫలుడ నగు చున్నాను."

భారతీయ సాహిత్యమున ప్రకృతి సౌందర్యమే మానవ సౌందర్యమున కాదర్శము. ఉత్కృష్టమగు మానవ సౌందర్యము నిసర్గరామణీయకము నాదర్శముగ నుంచుకొని చివరకు దాని నధిగమించుచున్నదనుట గమనార్హము. యవనులు మానవుల ప్రత్యంగసౌష్ఠవమును తరచి ఉత్తమ ప్రమాణములను నిర్ణయించుకొనిరి. వారిదృష్టిలో వారి లక్షణములకు నిలచునదే సుందరమగు మానవాకృతి. భారతీయుల కట్లుకాదు : వారికి ఉత్కృష్ట ప్రకృతి శోభయే మేలుబంతి.

భారతీయులు మానవాకృతులను తీర్చుటలో మాత్రమే ప్రకృతి ననుకరించిరి; కాని వారికి దివ్య సౌందర్యమును కూర్చుటలో స్వతంత్రించిరి. కావుననే భారతీయ దేవమూర్తులు ఉత్కృష్ట మానవాకార వర్ణములతో నొప్పినవి గాక ఆధ్యాత్మిక భావములను, సందేశములను వ్యక్తముచేయు మంగళమూర్తులై యున్నవి. మన శిల్పులు ప్రకృతినుండి రమణీయాంశములను గ్రహించి తమ ఆధ్యాత్మిక తత్వములను వ్యక్తము చేయునట్లు మూర్తికల్పనము చేసిరి. ఈ కారణము చేతనే తాను ధ్యానించు దేవమూర్తిని చెక్కుటలో శిల్పి అంతర్ముఖుడై తన మనోనేత్రములచే నా ప్రతిమను దర్శించి అట్టి రూపమును తీర్చుట తన విధియని తలచెను. ఈ విధముగ శిల్పి తాను ధ్యానించు భావమునకు మూర్తిమత్వము నిచ్చి ఆ బాహ్య రూపము ద్వారా ఇతరులు ధ్యానయోగము నవలంబించి ఆత్మసాక్షాత్కారమును సాధించునట్లు చేయ గలుగుచున్నాడు.

శకుంతలను వర్ణించుచు కాళిదా సిట్లనుచున్నాడు : "సృష్టికర్త తొలుదొల్త శకుంతలను మనసులో మూర్తీభవింపజేసికొని పూర్ణరూపముననున్న యా సుందరమూర్తిని దర్శించి, యానందించి దాని నందరును కనుగొనునట్లు సృష్టించెను కాబోలు! అతడు తప్పక ప్రకృతిలోని సౌందర్య సర్వస్వమును ప్రోగు చేసి తన మనస్సులో నా మూర్తిని కల్పించుకొని యుండును."

ఉత్తమ సాహిత్య స్రష్టయగు కాళిదాసు సర్వోత్కృష్టసౌందర్యము మనస్సుననే ఉద్భవించునని తలచెను. శాకుంతలమున నొకచోట దుష్యంతుడు చిత్రించిన శకుంతలా వర్ణచిత్రపద్ధతులనుసరించి వర్ణించుచు "దుష్యంతుడు సున్నితములగు రేఖల ద్వారా శకుంతలా రూపచిత్రణ మొనర్పజాలుటకు అతని వ్యక్తిత్వమనోభావములలో ఆ రూప సౌందర్యము సాక్షాత్కరించి యుండును—" అన్నాడు. ఇదే ధ్యానలక్షణము. ఈ సాధనయందే శిల్పి తన్మయత్వముతో ఆనందాంశను సాధించి తన ఆధ్యాత్మిక భావముల కనుగుణమగు రూపకల్పనమును వెలయించుట కర్హుడగును.

మనసులోని భావనా మూర్తిని వెలువరించుటయే భారతీయ కళాతత్వమని తలచుట పొరపాటు. ఏలయన- హైందవశిల్పులు సకలవస్తు సంకుల మగు భౌతిక ప్రపంచముచే నశ్వరమని తలచి ఏది అనివార్యమో దానిని మాత్రమే గ్రహించిరి. దుష్యంతునిచే చిత్రింపబడిన శకుంతలా చిత్రపట లక్షణముల కనుగొన్న మనకు శకుంతల మొగము చుట్టు తిరుగుచున్న గండు తుమ్మెద మిక్కిలి సహజముగ చిత్రింపబడినట్లు గాన

వచ్చును. దానిని జూచి విదూషకుడు సత్యమని భ్రమించి తన చేతికఱ్ఱతో కొట్టబోయెనట! చిత్రపటమునందలి పృష్ఠభూమిక సహజసౌందర్య విలసితమై చిత్తాకర్షణముగ రూపింపబడినది. కావున భారతీయ కళాకారుడు ప్రధానాంశముతోపాటు పరిసరముల ప్రాముఖ్యమును గూడ గమనించెనని చెప్పవచ్చును.

కలాకుశలుని లక్ష్యము కేవలము ప్రకృతి ననుకరించుట మాత్రమే కాదు; దాని నధిగమించుట. ఈ యధిగమనము కళాకారుని భావవీచికలలో దేలి రూపించబడు విషయముల కనుగుణ్యముగ నుండును. కావున కేవలము ప్రకృతి ననుకరించుటయే కళ కాదు. సృజనాత్మకము స్వయంప్రతిభచే కళాకుశలుఁడు సత్యము నాకళించుకొని ప్రకృతియొక్క బాహ్యాంతరిక స్వరూపస్వభావముల నుత్తరించి శిల్పసృష్టి యొనర్చి దానికి తన ఆధ్యాత్మికశక్తిని ధారవోసి అమరత్వమును గూర్చును. ఇదియే బాహ్యాంతర జీవధ్వని సంగమము. కళాకారుని కళ చైతన్యరహితమగు రూపసృష్టి మాత్రమే కాదు. రూపకల్పనమందలి ప్రత్యణువును మనుజుని నుండి ప్రకృతికి ప్రసరించు జీవప్రవాహముల రూపించువదై యుండవలెను. అది పరిమితావరణముచే ప్రబోధింపబడి రాను రాను అపరిమితమై సాగరమున సంగమించవలెను. ఇది ప్రవాహముగ రూపింపబడిన జీవప్రదర్శనము. అంతరంగము నుండి బహిరంగమునకు బహిరంగమునుండి అంతరంగమునకు ఎడతెగక పారు జీవప్రవాహము నిది పరిమితముగ ప్రకటించుచున్నది. కలాకారుని కూర్పు, భూమికకై వస్తువుల చేరికొను నేర్పుపై యుద్దేశ్యములను సాధింపజాలును. ప్రాణులను గాని, ప్రకృతి విషయములను కాని చిత్రించునపుడు మన హృదయము నుండి అనేక భావము లుద్భవించును. అట్లే ఆధ్యాత్మికాదర్శములను, భగవద్రూపములను కల్పించునపుడు బాహ్యప్రకృతికి ఆంతరంగిక భావములకు సహయోగము సిద్ధించుచుండును. ప్రకృతి విషయమగు పుష్పమో, లతయో, పక్షియో, మృగమో లేకుండ ఏ దేవతామూర్తియు సృష్టింపబడలేదనుట సత్యదూరము కాదు.

భారతీయశిల్పశాస్త్రమున విగ్రహావయవ పరిమాణలక్షణములు నిరూపింపబడియున్నవి. ఈ పరిమాణ నిష్పత్తులను 'తాళమానము'లనెదరు. హైందవ శిల్పి విగ్రహశిరము నే ఆద్యప్రమాణముగ స్వీకరించెను. 'లియొనార్డో డావిన్సీ' తన గ్రంథములో తల కొలతనే ప్రమాణముగ గైకొని తక్కిన అవయవములు దానికి తగిన నిష్పత్తులలో ఉండవలెనని వ్రాసియున్నాడు.[1] ఇతరావయవ ప్రమాణముకన్న శిరోమాన నిష్పత్తికి ప్రాధాన్యమిచ్చుటలో భారతీయ శిల్పి ఇతరుల కాదర్శమైనవాడు. మూర్తులు చిన్నవైనను, పెద్దవైనను నిష్పత్తి మాత్రము ఒక్కటియే. అప్పుడు వ్యవహారమున నున్న పరిమాణము ననుసరించి మానవ శీర్షము ద్వాదశాంగుళప్రమాణమని తలచబడెను. అప్పటి ఒక అంగుళము నేటి 3/4 ఇంచికి సమానము. ఈ విధానమునే విష్ణుధర్మోత్తర పురాణమునందు వివరముగ చెప్పినారు. దీనిని దృష్టియందుంచుకొని శీర్ష ప్రమాణమునకు తగిన నిష్పత్తిలో ఇతరాంగము లుండునట్లు తీర్చునపుడు జాగ్రత్త వహించవలెను. విగ్రహము బాలకమును బట్టికూడా ఈ నిష్పత్తి మారుచుండునని భారతీయ కళాకోవిదు లెరుగుదురు. "చిత్రసూత్రము"న నిష్పత్తిభేదములు వివరింపబడినవి. చిత్రము నారంభించునపుడు గీచికొను రేఖలే ముఖ్యమని "చిత్రసూత్రము" చెప్పుచున్నది. రేఖారచనతోపాటు కళకు చిత్తాకర్షకములగు భావభంగిమల విన్యాసము కూడ ముఖ్యమే అనియు పై గ్రంథము తెలుపుచున్నది. ఒక కళాకృతిలో, విశేషాలంకారములుండవలెనని స్త్రీలు కోరినట్లే, అనేక వర్ణము లుండవలెనని సాధారణులు భావింతురు.

భారతీయ శిల్పకళ క్రీస్తుపూర్వము మూర్తిశిల్పమందును, క్రీస్తు తరువాత చిత్రశిల్పమందును విశేష ఖ్యాతిగడించుట గమనింపవలెను. హైందవ మూర్తిశిల్ప, చిత్రశిల్పములందు ముఖ్యకళాలక్షణములు పరిశీలించబడినపుడు ఎన్నో ఆలోచనలు వచ్చి నిలుచును. బుద్ధుని యొక్కయు, ఇతర దేవతల యొక్కయు ప్రతీకముల రచించునప్పుడాయా మనోభావముల నెలయించుటకై శిల్పిహస్తాంగుళీ ముద్రల వివిధ రీతులను దీర్చును. ఆయాముద్ర లాయాభావములకు సంకేతములై యుండును. డాక్టర్ స్టెల్లాక్రాంరిష్ ఈ ముద్రలను గురించి వివరించుచు "మూర్తి కల్పనలో హస్తముద్రలు ప్రధానమైనవి. ప్రసన్నభావముతో భక్తునకభయ మొసగుటను సూచించునప్పుడు తెరచుకొన్న హస్తముద్రయు; వరముల నొసగునపుడు క్రిందికి తిరిగిన హస్తముద్రయు తీర్చబడినది. ఈ విన్యాసము ఉదాత్తభావ స్ఫోరకమైనది. తెరచుకొన్న చేతులలో,

1. Treatise on Painting.

ప్రేళ్ళలో, నిండుతనమును జాపువంపులలో జీవకళ ఉట్టిపడుచుండును" అని చెప్పినది. 2 ఆమెయే మరొకచోట "ప్రతి అంగవిన్యాసము ఒక మనోహర భావవ్యక్తీకరణకు వాహకమై అర్థవంతముగ నున్నది. ఇదే కళాసృష్టికి పరాకాష్ఠ" 3 అనినది.

కళాకారుడాలోచించి గీచిన రేఖలు అనిర్వచనీయాధ్యాత్మిక భావములకు సంకేతములై మూర్తిశిల్ప, చిత్రశిల్పములకు విశేషశోభలు గూర్చుచున్నవి. బుద్ధునివంటి మహానుభావుని మూర్తిని కల్పించునపుడు మానవాతీతప్రశాంతతా ప్రసన్నతలు సుస్పష్టము కావలెను. ఆ మూర్తికి—కల్పించిన వాతావరణము ఆ భావనలకు తగినట్లుండవలెను. స్త్రీమూర్తిలో మాతృభావమును వ్యక్తీకరించు సందర్భమున నిండుదనముతో నొప్పిన స్తనములును, విశాలజఘనములును ప్రదర్శింపబడినవి. సరస్వతీమూర్తిని స్తనభారముతో వంగినట్లు రూపించిరి. ఇందలి రేఖలు కళాకారుని కౌశల్యమును గాక అతని దివ్యభావోపేత ధ్యానమూర్తిని దర్శింపజేయును. అనేక హస్తములు, శిరములు, నేత్రములతో నొప్పు మూర్తు లతిమానుషము లనియు, మహాశక్తి సంపన్నములనియు, దివ్యదృష్టియుతములనియు శిల్పి తన రూపకల్పనముచే లోకమునకు బోధించును. దుర్గాదేవి అనేక హస్తములతో, నేత్రత్రయముతో నొప్పియుండును. వివిధాయుధోపేతములైన కరములలో నొకటి శాంతిని, మరొకటి యభయమును సూచించి ముద్రలలో ఒప్పుచు ఆ అతిమానుష విధ్వంసక శక్తులు శాంతి సౌఖ్యముల వెలకొల్పుటకును, అమె మూడవకన్ను అంతర్దృష్టిని, త్రికాలజ్ఞానమును కలిగించి మానవుని ఊర్ధ్వపథాభిముఖునిగ ఒనర్చుటకును ఏర్పడియున్నవి. కొన్ని సమయములలో సామాన్య మానవాకారములు తీర్చబడినను అవి సజీవములగు భావములను వెదజల్లుచుండును.

ఈ విషయమును తెలుపుచు డాక్టర్ క్రామరిష్ "అది అవలోకనమున, ఆకారవర్ణనమున శాస్త్రీయము కాకున్నను భావోద్వేగతరంగముల ద్వారా చేతనామయ శరీరమున పూర్ణవ్యాపనము నొందును. నాడీమండలము, దేహసౌష్ఠవము పౌరాణికోద్రేక ప్రదర్శనము పూర్తిగా సడలింపబడినవి. ఇట్టి శాంత స్థితిలో అది సుప్త చేతనయై పడియుండును. ఎడతెగని జీవప్రవాహమును పరివేష్టించి దోహదమొనర్చుటకు సర్వసిద్ధముగ నుంచబడును. భావమునకు ప్రాధాన్యము సొసగినపుడు దేహసౌష్ఠవము మృగ్యమగును. ఊహాకల్పిత శరీరము శిల్పము ద్వారా దృగ్గోచరమగును." అనెను.

యవన శిల్పి అస్థులు, కండరములతో గూడిన దేహనిర్మాణమే భావమును ప్రకటించునని తలచెను. భారతీయ శిల్పి ఇందుకు భిన్నదృక్పథము కలవాడు. కేవల శరీరసౌష్ఠవము మార్పులకు లోనగుచుండు మనోభావములను గ్రహించుటకు చాలదనియు, ప్రసన్నభావమున దురంతవేదనాపరంపరను గెలుచుటకు వీలగుననియు అతడు తలచెను. బుద్ధుని దేహము జ్ఞానోదయమునకు ముందును తరువాతను ఒకే విధముగ నున్నను అతని శైఖరిమాత్రము జ్ఞానోదయానంతరము మొదటి కన్న మహత్తరముగ మారినది. సాధారణ పద్ధతిలో మలచబడిన అంగసౌష్ఠవము అంతఃప్రబోధమును ప్రకటింపజాలదు. ఉదాత్తభావవ్యక్తీకరణకు అంగవిన్యాసము నిమిత్తమాత్రమై యుండవలెను. క్రీస్తు, బుద్ధమూర్తులను జూచునపుడు వారి మెలిదిరిగిన కండరములను, రాటుదేలిన ఎముకలను చూచెము. ఆ మూర్తుల ప్రసన్నతాపూర్ణముఖభంగిమలనుండి వెలికివచ్చు దివ్యప్రకాశ సౌందర్యములను మాత్రమే దర్శింపగోరుదుము. భారతీయశిల్పి అంతశ్చైతన్యమును వెలిజిమ్ముటకు దేహనిర్మాణమును దానికి విధేయమొనర్చెను. చైతన్యభావమును ప్రకటించుటకు ఉచిత దేహనిర్మాణమవసరమనియు, అదియే కళాకారుని పవిత్రకర్తవ్యమనియు నతడు నమ్మెను.

సాధారణమనుజుని దేహమున కండరములు, నరములు, కీళ్లు ఒకేరీతిగ నుండవు. దీనికి కారణము సామాన్యమానవుని హృద్గత విషయములు : అభిరుచులు, భావనలు, ఆలోచనలు ఒక ఆదర్శసాధనకై ఉద్దేశింపబడి యుండవు. అవి బాహ్యాంతరాలోచనా ప్రచోదితములై తక్షణిక ప్రయోజనముల సాధింపనప్రయత్నముగా బయల్పడును. ఈ కోరికలు, ఉద్రేకములు, ఆలోచనలు తుపానువలె రేగి భౌతిక శరీరముపై తమ ప్రభావమును ముద్రించును. ఇట్టి మానవుని విషయమున కండరములు, నరములు ఆంతరంగిక వ్యాపారమునకు లొంగియుండును. బాహ్యప్రకృతి కీమనుజుడు ఆటవస్తువుగ నుండును. కావుననే అత డనుదినము సహజ పశుప్రవృత్తికి లోనగుచుండును. ఒక యోగి లేక ఒక దేవత యొక్క భౌతిక శరీరములు సాధారణ

2 Indian Sculpture Page 57.
3 Ibid Page 58.

మానవుని దేహము కంటె చాల భిన్నముగ నుండును. వారికిని అస్థులు, కండరములు ఉండునుగాని యోగి చంచలములగు నుద్రేకముల నణచి, ఇంద్రియములను స్వాధీన మొనర్చుకొని ఉండుట వలన సాధారణ మానవుని కంటె ఇతని అంగ నిర్మాణము ప్రత్యేక పద్ధతిలో ఉండవలెను. ఒక దేవతామూర్తి కూడా దివ్యసందేశముల నొసగుటకు సాంకేతికముగ నుండును, ఆధ్యాత్మిక భావముల నందుకొనుటకు సాధనముగ నుండు ఆ మూర్తికి సామాన్యమానవుని దేహరచన ప్రయోజన శూన్యము. ఒక విధముగా లతాపుష్పములలో నుండి ప్రకటనమగు జీవమునకును, పైన దెలిపిన జీవమునకును సామ్యమున్నది. తీవలు, మొక్కలలో నుండు జీవశక్తి సామాన్యనియంగువలె విపరీతముగ విజృంభించునదికాదు.

అందువలన జీవశక్తి ఒడిదుడుకులు లేక ఎన్ని వంపులు తిరిగినను ముఖ్యలక్ష్యమును సాధించుటకు తోడ్పడునట్లుండును. కావున అసామాన్య పురుషుని దేహకల్పన సామాన్యునివలె గాక ప్రత్యేకముగ నుండును.

ఈ విచిత్రాదర్శమును ముందుంచుకొని భారతీయశిల్పి సామాన్యరూపవ్యాకృతులను కూడ శరీర శాస్త్రము ననుసరించి తీర్పలేదని గ్రహింతుము. ఇంత మాత్రమున భారతీయులు శరీరశాస్త్రము నెరుగరనుట సాహసము. క్రీస్తుకు పూర్వము ఏడువందల సంవత్సరముల క్రిందట సుశ్రుతుడను భారతీయమహర్షి మానవ శరీర శాస్త్రమును రచించెను. కాని కళోపాసకులేల దీని నలక్ష్యము చేసిరో తెలిసికొనవలసియున్నది. అజంతా వర్ణచిత్రములలో సైతము మానవాకృతుల రచించుపట్ల శరీరశాస్త్రమును పాటింపకుండుట తరచుగా చూచుచుందుము. ఆ చిత్రములలో రాజులు, రాణులు, చెలికత్తెలు, వర్తకులు మున్నగు వివిధవర్గములకు చెందిన మానవులను చిత్రించుటకు చిత్రకారుడు ఆయా వ్యక్తుల భావములకు తగినట్లు ఉదాత్తతను, ప్రేమను, లుబ్ధత్వమును ప్రస్ఫుటముగ జూపి అవయవ నిర్మాణమును పూర్తిగ నిర్లక్ష్యము చేయును. రాజును చూపించుటకు ఉదాత్త భావప్రకటనకై కళాకారు డాతురపడెను కాని, అసమంజసోద్రేకమునకు తగినట్లు అంగములను ప్రదర్శించు ప్రయత్నము చేయలేదు. కావుననే రాజునకు తగిన ఆడంబరమును, వాతావరణమును కల్పించి చూపరుల కామూర్తిపై గౌరవభావము నెలకొనునట్లు చేసెను.

కావున భారతశిల్పి తన సృష్టి ఆత్మానుకృతి గాక ప్రతిసృష్టియని తలచెను. ఈ ప్రతిసృష్టిలో కళాకుశలుని ఆవేశముత్తమమై యుండవలెను. కళాకారులకు ప్రకృతి ననుకరించుట గాక సుందర మనోభావములను స్వచ్ఛందముగ వ్యక్తీకరించుట ఆదర్శమై యుండును. ఈ ఆదర్శము కేవల శిల్పులకు చిత్రకారులకే కాక కావ్యస్రష్టలకును అన్వయించును. ఈ అనంత సాహితీ ప్రపంచమున కవి యేక మాత్ర సృష్టి కర్త అని వక్కాణింప బడినది. అతడు తన అభిరుచులకనుగుణముగ, ఆదర్శమునకు తగినట్లుగ భౌతిక ప్రపంచమును మార్చి వేయగలడు. కళాతపస్వి ధ్యానసమాధిలో తన మనోనేత్రములచే దర్శించిన భావనలే భౌతిక రూపకల్పనకు మూలములు. కళాకారుడు తన భావములను ప్రదర్శించుటకు తనదే యగు లోకభాషను కల్పించుకొనెను. వర్ణచ్ఛాయల కలయిక సామరస్యము తరుచు నైసర్గిక సంబంధమును మీరుచుండును.

హిందూ బౌద్ధకళామయ ప్రతీకముల పరిశీలించిన ధ్వనిప్రధానములగు వీనిరేఖలే యభిప్రాయముల దెలుపుచున్నవో మనము గుర్తింపలేక పోవుచుందుము. ఈ సందర్భమున భారతీయ సంస్కృతి చరిత్ర యందు మతతాత్త్విక విషయములలో వైయక్తిక స్వార్థములకు తావొసగబడలేదని స్పష్టముగ చెప్పవచ్చును. సత్యము మారదనియు, స్థిరమనియు హైందవులు విశ్వసించిరి. మత తాత్త్విక విషయములకు సంబంధించిన వ్యక్తిగతానుభవము లన్నియూ లోక కల్యాణార్థమై ఉపనిషదృషులు వ్యక్తము చేసిరి. హైందవ శిల్పి మహర్షుల దివ్యభావముల కనుగుణముగ దేవతామూర్తులను తీర్చెను. పూర్వద్రష్టలు ఏరూపమును ధ్యానయోగమున దిలకించిరో దానినే శిల్పికూడ భావించి, దర్శించి ఆయా సాంకేతిక జ్ఞానమును పొందవలసియుండును. అంతేకాని, ఎంతవాని ఇష్టము ననుసరించి కాని దేవమూర్తికల్పన జరుగజాలదు. తపస్సంపన్నుల అనుభవసారములు, ప్రత్యక్షములవగు ఆధ్యాత్మిక సత్యములచే అపరిమితములగు భావములు పరిమితములై ఎట్టి విమర్శలకైన తట్టుకొనును. కళాకారు డొకవేళ బాహ్యవస్తుమయప్రకృతిని మరచినను మహర్షుల భావనామయ సత్యములను మరుగు పరచలేదు. ప్రత్యేకముగ నొకమూర్తిని ధ్యానింపదలచిన వారందరి యనుభవములు నొకే విధముగ ఉండుట విచిత్రము. అనేక దేవతల గుణరూపవర్ణముల గూర్చి ఋషుల

యనుభవము లోకైకవిషయముగ నుండుటవలన స్థిరమైన లక్షణములు నిర్ణయింపబడినవి. కావున కళాకారు డెంత ప్రతిభావంతుడైనను ఆ లక్షణముల నుల్లంఘింప జాలడు. అత డనుశ్రుతముగ వచ్చు దేవతా ప్రతిమలను రచించునపుడు నిర్ణీత లక్షణముల ననుసరింపక తప్ప లేదు. పరంపరగ వచ్చు సంప్రదాయము శిల్పియూహలకు అడ్డుదగులు చుండును. దేవతలను గూర్చి యతని కేర్పడిన భావములు ఆత్మదర్శనులగు మహర్షుల అనుభవములను బట్టి నిర్ణయించుకోబడినవి.

పూర్వకాలమున దేవమూర్తుల లక్షణములు, ముద్రలు, చిహ్నములు మున్నగు వానిని గురించి పరస్పరము చర్చించుకొనుచున్నందున కలాకారుని సృష్టి యందది భద్రపరచబడినది. కావుననే భారతదేశము నందలి మూర్తులు, అవి యే ప్రాంతమునందలివైనను, వైవిధ్యము లేక సమానలక్షణములు కలిగి, సర్వజన సమ్మతములై శతాబ్దములు గడచినను తమ వైశిష్ట్యమును చాటుచునే యున్నవి. దౌర్భాగ్యవశమున నేడు భారతీయులు అనూచానములగు సంప్రదాయముల నెరుగని వారై మూర్తిలక్షణములను, చిహ్నములను తెలిసికొన లేని దుస్థితియందున్నారు. అనేక పరిస్థితులు, ప్రభావములవలన లోనైనందున పూర్వాచారము సన్నగిల్లి దేవతాపూజలు, విశ్వాసములు నామమాత్రావశిష్టము లైనవి. కలాకారుడు మహాపురుషులతో, భక్తులతో, విజ్ఞానులతో కలిసి వారి దివ్యానుభూతులచే ప్రబోధితుడై శిల్పస్రష్ట యగుచున్నాడు. దేవప్రతిమలు ధ్యాన మూర్తులను పోలి స్తోత్రములలో వర్ణింపబడినట్లు తీర్చబడవలెనని పురాణములు తెలుపుచున్నవి. శాస్త్రము ననుసరించు ప్రతిభావంతులగు శిల్పులు అతిలోక సుందరములగు మూర్తులను వెలయించి అజరామర కీర్తి నార్జించుకొన్నారు. భారతదేశమందలి వివిధ ప్రాంతములలో విభిన్న కాలములకు సంబంధించిన కళాకృతులను పరిశీలించిన వివిధ విలక్షణరీతులు, కాలానుసారముగ కలిగిన దృక్పథముల మార్పులు మనకు స్పష్టముగ కానవచ్చును. ఈ సందర్భమున అభిరుచి భేదములు, ఆధునికాలోచనలు ప్రబలి కలాకృతుల శైలిలో చాల మార్పులు కలిగినవన్న విషయమును కూడ జ్ఞాపకముంచుకొనవలసి యుండును. సామాన్యముగ చిత్రకారులు, శిల్పులు తమ తమ ధ్యానముచే సాక్షాత్కరింపజేసుకొన్న దేవతామూర్తుల రూప సౌందర్య గుణములనే శిల్పించిరి కాని, శరీరశాస్త్ర దృష్టితో సృజింపరైరి. భారతీయ శిల్పసృష్టిలో దేవ మూర్తుల సంఖ్యయే మిగుల గొప్పది. శిల్పి తాను సృష్టింపబోవు మూర్తుల అధిష్ఠాన దేవతలు తన్నావేశించి నపుడు అత్యద్భుత కౌశలమును ప్రదర్శింపగలడు.

దేవతా స్వభావశీలములు శిల్పశాస్త్రములందును, ఇతర మతగ్రంథములందును సప్రమాణముగ నుల్లేఖింప బడినవి. ఒక వైపు భక్తు డీలక్షణముల ననుసరించి, ఆయా దేవతల నుపాసించి ఆంతరిక సత్యములను దెలిసికొనుటకు ప్రయత్నించును. మరొక వైపు కలాకారుడు వాని గుణశీలములు తన యందలి సుఖదుఃఖాత్మక జీవ ప్రవాహమున గలసి పారునని మనోనేత్రములతో దర్శింప దొరకొనును. దేవతాముఖ్యలక్షణములను, తద్గత భావములను విభిన్న సంకేతముల ద్వారా వ్యక్తము చేయనెంచెను. కేవలము శాస్త్రీయ లక్షణములను వెలయించుటలో కళాకారుడు తృప్తినొందక ఆత్మానుభవములగు ఆంతరిక ఆనందాదిభావోద్రేకములచే ఆ ప్రతీకములు ప్రభావితము లగునట్లు సృజించెను. కలాకారుని సృష్టి ఆదర్శములచే నుపలబ్ధమగు అలౌకిక దివ్య సుందర మూర్తిని ప్రకటింపగా అతనిచే సృజింపబడిన ప్రతీకములు ఆలోచనలు, కోరికలు, ఉద్రేకములతో గూడిన అతని వ్యక్తిత్వమును వెల్లడించునవై యొప్పినవి. ఈ కారణమువలన ప్రతిశిల్పియు తాను సృష్టించు వస్తువుల లక్షణము లొకే రీతిగ ఉంచవలసి వచ్చినను వానిపై తన వ్యక్తిత్వప్రభావమును స్పష్టముగ ముద్రించును.

విదేశీయప్రభావము చొచ్చుకొని వచ్చినను, లేక భారతీయశిల్పియే పరప్రభావమునకు లోబడినను పరంపరగ వచ్చు ప్రకృతిసత్యముల నతడు మరువ లేదనుట స్పష్టము. యవనబౌద్ధకళ లేక గాంధారకళ లోని మూర్తులు సుష్ఠుమానవాకృతులకై శిల్పులు వ్యయించిన శక్తిని చాటుచున్నవి. కళయొక్క సలక్షణములగు శాస్త్రీయభాగములు రేఖలచే గురుతింప బడును. శిల్పి మానవాకృతులను రూపించుట యందే గాక, పశుపక్షితరులతాదుల కల్పనమునందును తన ఆదర్శములను పాటించి శక్తిని ప్రదర్శించెను. మానవాకారములతోబాటు పక్షిమృగలతా పుష్పాదులను వన్నెలతో నలంకరించువిషయమునుగురించి "చిత్ర సూత్రము"న విశేషవివరణము కలదు. ఈ విధముగా భారతీయశిల్పి మనోభావములను, ఆంతశ్శక్తులకు శాస్త్రీయవర్ణవస్తుప్రకాశముల సహాయముతో ఉత్కృష్ట రూపకల్పన మొనర్చెను.

జీవించాలంటే...

శ్రీ మల్లాది సత్యనారాయణ

పాత్రలు

సూర్యం 20 సం. కేశవరావు తమ్ముడు
చంద్రం 16 సం. కేశవరావు తమ్ముడు
గోపాలరావు 45 సం. కేశవరావు పినతండ్రి
చక్రధరరావు 30 సం. ఒక నటకుడు
మూర్తిగారు 55 సం. రిటైర్డ్ టీచరు
రఘు 10 సం. కేశవరావు కొడుకు
సావిత్రి 25 సం. కేశవరావు భార్య
సౌభాగ్యం 18 సం. కేశవరావు చెల్లెలు

స్థలం : కేశవరావుగారి ఇంట్లో ఒకగది.

సమయం : సాయంత్రం 5 గం.లు లగాయతు 7 గం. వరకు.

మొదటిరంగం

సమయం సాయంత్రం 5 గం.

(కేశవరావుగారియిల్లు. దండెం, పాతకుర్చీ, పాత డ్రాయరు, పాత పడకకుర్చీ ఒక నులకమంచం ఉంటాయి. గోడని పాతబడిపోయిన క్యాలెండరు, తిథులు నక్షత్రాలు తెలిపేక్యాలెండరు, రాములవారిపటం ఉంటాయి.)

(చంద్రం కుర్చీలో కూర్చుండి కాళ్ళు డ్రాయరు మీదపెట్టి పజిలు కాగితాలు చూస్తూ మన్యమన్య దీక్షనరీ చూస్తూఉంటాడు.)

(తెరలేస్తుంది)

(వీధిలో భిక్షుకుని పాట వినిపిస్తూ ఉంటుంది)

చంద్రం: ఒరేయ్! ఏమిటిరా ఆ గోల.

(భిక్షుకుడు వినిపించుకోకుండా పాడుతూనే ఉంటాడు)

చంద్రం: (చిరాకుతో) ఒరేయ్! ఒరేయ్! ఎందుకురా చెవిగోసిన నక్కలా అల్లా అరుస్తావు. ఇవ్వాళ శీతాలొచ్చేరోజురా. కొంపలో బియ్యం ఉంటాయా? నువ్వే చెప్పు.

(లోపలనుంచి సౌభాగ్యం కొన్నిబట్టలు చ్చితె దండెంమీదవేస్తూ)

సౌభాగ్యం: ఉండు అబ్బీ!

చంద్రం: ఇంకేం ఉండరా! ధర్మంచేసే తల్లి బయలుదేరింది అత్తారి సొమ్ము అల్లుడు ధారపోశాట్ట.

సౌభాగ్యం: నీకేం! వడివ బియ్యం పెట్టమంది. (లోనికి వెడుతుంది)

చంద్రం: (లోనికిచూస్తూ) ఎందుకే అక్కా అంత కోపం వానిమీద (వీధిలోకిచూచి) ఒరేయ్ అబ్బీ ఉండరా బియ్యం పెట్టిస్తాను.

(వీధిలో భిక్షుకుడు) మారాజులు.

చంద్రం: మారాజు నా...హు...ఈపాటికి మహారాజునే అవుదునో వాడికి పై రాజునే అవుదునో. మరి క్రిందటిసెల పజిలు పంపించివుంటే... ఒక్కరూపాయి దొరక్క ఏభైవేలు పాడుచేసుకున్నాను ... ఏమిటీ ... ఏభైవేలు ... ఒకటా రెండా. నీకుమల్లే ముష్టికేనా బయలుదేరాలని లోచలేదు ఆ రూపాయికోసం.

సౌ : (చేటలో బియ్యంతోవచ్చి) నోర్ముయ్యి. ఏం మాటలవి, అన్నయ్య తెచ్చి పెడుతూంటే తినలేక.

చం : (అక్కవంకే చూస్తూవుంటాడు.)

సౌ : (వీధిలోకి వెళ్ళి బిచ్చంపెడుతుంది.)

(వీధిలో భిక్షుకుడు)

కడుపెడు బిడ్డల్ని గని సుఖంగా వుండుతల్లీ.

సౌభాగ్యం : (వెనక్కు తిరిగి వెడుతూ) దీవనలే నిజమయితే నాబ్రతుకు యిల్లా యెందుకు తగులడుతుంది.

(లోనికి వెళ్ళిపోయింది)

చంద్రం : (మళ్ళీ కుర్చీలో కూర్చుని కాళ్ళు డ్రాయరు మీద పెట్టి పజిలుకాగితాలు చూస్తూ మన్యమన్య డిక్షనరీ చూస్తూ ఉంటాడు.)

(క్షణం నిశ్శబ్దం)

రఘు : (స్కూలునుంచివస్తూ) ఎవరికి వారే యమునా తీరే! (పాడుకుంటూ వస్తాడు)

చంద్రం: ఛీ! ఛీ! వెధవగోల ఒరేయ్ రఘు! ఇప్పటిదాకా వాడు సంగీతం ఊదరగొట్టి వెళ్ళాడనుకుంటే మళ్ళీ నువ్వు మొదలుపెట్టావు.

రఘు: (వెళ్ళేవాడు వెనక్కి తిరిగి) ఏమిటిబాబాయ్?

చంద్రం: తగలేశావురా.

రఘు: ఏం తగలేశాను బాబాయ్?

చంద్రం: బంగారంలాంటి ఆలోచన కాస్తా బండగై చక్కాపోయింది.

రఘు: నేనేంచేశాను బాబాయ్?

చంద్రం: అది సరేగాని...రఘు...మనిషిగా జీవించాలి అంటే....

రఘు: అదే బాబాయి. మా మాస్టారు దానిమీదే కాంపొజిషన్ రాయాలి. ఆలోచించుకు రమ్మన్నారు.

చంద్రం: అయితే మీ మాస్టారు యీపజిలు పూర్తి చేస్తున్నాడన్న మాట. అప్పుడే నాకు పోటీయా. ఒరేయ్ రఘు! ఎంతమంది పూర్తిచేసినా మనం పూర్తిచేసింది ఆల్ కరెక్టురా...ఆ...

రఘు: ఏమిటది బాబాయ్?

చంద్రం: ఏమిటేమిటిరా యేభైవేలు...ఒకటా రెండా ..అది సరేగాని రఘూ! మనిషిగా జీవించాలి అంటే యేదిముఖ్యం అని.

రఘు: ఆ మాత్రం తెలియదా యేమిటి బాబాయ్. జీవించాలి అంటే ముందుగాలి ముఖ్యం.

చంద్రం: నీ మొఖం ఈపజిలులో ఉన్నది అదికాదు మరి.

రఘు: ఏముంది?

చంద్రం: మనిషిగా జీవించాలి.అంటే నీతి ముఖ్యమా? డబ్బు ముఖ్యమా? అంటాడు వీడు.

రఘు: ఒకపని చెయ్యి బాబాయ్.

చంద్రం: చప్పున చెప్పరా.

రఘు: ఏముంది? రెండూ ముఖ్యమే అని రాసెయ్యి.

చంద్రం: ఛీ! ఛీ! వెధవ ఆలోచన ఎప్పుడు చెప్పినా యిల్లాగే చెప్పావు.

రఘు: నన్నెప్పుడడిగావు బాబాయ్ మునుపలు?

చంద్రం: అవును. నిన్ను అడగలేదుగా...వెళ్ళు.

రఘు: (వెళ్ళబోయి వెనక్కి తిరిగి) పజిలు పంపుతావేటి బాబాయ్?

చంద్రం: ఆటంబాంబులాంటి ఆలోచనను కాస్తా పాడుచెయ్యక అవతలికి వెళ్ళు.

రఘు: పంపేయి బాబాయ్ పజిలు. వస్తుంది బహుమతి తప్పకుండా, బాబాయ్! వస్తే ఫిఫ్టీ ఫిఫ్టీ.

చంద్రం: ఛీ! పోతావా పోవా! (కొట్టబోతాడు)

రఘు: (పారిపోతాడు)

చంద్రం: (మళ్ళీ డ్రాయరుమీద కాళ్ళు పెట్టుకు కూర్చుని వ్రాసేసిన కాగితాలు చింపి పోస్తాడు)

సౌభాగ్యం: (లోపలినుంచి తుడుచుకుంటూ వస్తూ చంద్రాన్ని చూచి) ఇంక లేవొచ్చు, ఇల్లు తుడుచుకోవాలి. అస్తమానూ ఏకరాతే బ్రహ్మరాత.

చంద్రం: అదే అక్కా! ఆ బ్రహ్మరాతలో ఉన్న ధనరేఖతో హోరాహోరీ దెబ్బలాడుతున్నా.

సౌభాగ్యం: అంతే! మనం దెబ్బలాడుకోవాలి. లే బాబూ! బడి వదలిపెట్టేశారు. అన్నయ్యొచ్చే వేళయింది.

చంద్రం: నీదారిని నువ్వు తుడుచుకుపోరాదు అక్కా! నేనేం వద్దు వొచ్చాను చెప్పు నీకు.

సౌభాగ్యం: బాగానే వుంది. (అని చింపిన కాగితం ముక్కలన్నీ తుడుచుకుంటూ స్టేజీ చివరకంటా వెళ్ళి వెనక్కి తిరిగేసరికి చంద్రం మళ్ళీ కాగితాలు చింపిపోశాడు.)

సౌభాగ్యం: ఏమిటి చంద్రం యిది? తుడుస్తూంటే యిట్లాగే కాగితం ముక్కలు పోస్తూంటావా?

చంద్రం: లేదుగాని అక్కా! నీకెంతేనా పుణ్యముంటుంది ఇదొక్కటి చెప్పు అక్కా!

సౌభాగ్యం (తుడుస్తూనే) ఏమిటది?

చంద్రం: మనిషిగా జీవించాలి అంటే నీతి ముఖ్యమా డబ్బు ముఖ్యమా అంటాడు.

సౌభాగ్యం: రెండూ ముఖ్యమే తమ్ముడూ!

చంద్రం: అదినాకూ తెలుసక్కా.

సౌభాగ్యం. మరి నన్నెందుకడగడం!

చంద్రం: మరి యీపజిలులో యేదో ఒకటి వ్రాయాలిగా!

సావిత్రి: (లోపలినుంచి కూరగాయలకోసం వచ్చి నులకమంచంక్రింద చేటలో ఉన్న అరిటికాయలు అరింటిలో మూడు తీసుకుంటూ) ఏమిటది! ఏదో ప్రశ్నిస్తున్నారు చంద్రం బాబుగారు.

చంద్రం: సరిగ్గా సమయానికి వచ్చావు వదినా! ఈ పజిలులో...

సావిత్రి: ఓహో! పజిల్సుగొడవా?

చంద్రం: అదేమిటి వదినా! అల్లా అనేశావు.

సావిత్రి: మరిలేకపోతే మనకెందుకు బాబూ పజిల్సు. కష్టపడి సంపాదించుకోవడంకోసం ప్రయత్నించాలిగాని అప్పనంగా డబ్బు వస్తుందనుకోవడం పొరబాటు. ఒకవేళ వచ్చినా కష్టపడి సంపాదించినదే ఉండడంలేదు. ఇక అప్పనంగా వచ్చింది ఉంటుందా? (లోనికి వెళ్ళిపోయింది)

చంద్రం : అదికాదక్కా! వదినకి నా పజిల్సు అంటే కోపంగాని క్రిందటినెలలో పజిలు పంపడానికి ఒక్కరూపాయి యిమ్మని వదిన్ని బ్రతిమాలా నక్కా. వదిన యివ్వలేదు. నేను పజిలు పంపలేదు. రిజల్ట్సు వచ్చాక చూద్దునుగదా నేను పూర్తిచేసింది ఆల్ కరెక్టు...కట్టి ఉంటేనా!, ఏభై వేలు. ఒకటా రెండా? ఈపాటికి చంద్రం బాబు గారి పని యెలా ఉండేది?...అన్నయ్యకి యీ కష్టాలుండేవా? ఆ బడిపంతులు పనికి రిజైన్ యిప్పించెయ్యక పోయానా?

సౌభాగ్యం : నిజంగా ఏభైవేలు నీకు వచ్చిఉంటే అన్నయ్యకు కూడా యిస్తావా నువ్వు.

చంద్రం : నువ్వుకూడా అల్లాగే అనేశావా?

సౌభాగ్యం : ఏం? ఇంకా యెవరేనా అన్నారా?

చంద్రం : లేదులే. అప్పుడప్పుడు నేనే అనుకునే వాణ్ణిలే అల్లాగ.

సౌభాగ్యం : మరి యింకేం? ఇక్కడ నీతో కబుర్లు చెబుతూంటే పని అయినట్టే. అన్న యొచ్చే వేళయింది. (లోనికి వెళ్ళిపోయింది)

చంద్రం : ఒరేయ్ రఘూ! (పజిలువంక చూస్తూనే పిలుస్తాడు)

రఘు : (స్కూలుకు వెళ్ళవచ్చిన డ్రస్సు విప్పేసి బనీను నిక్కర్ తో వస్తూ బెల్టు బిగించుకుంటూ బాబాయివంక చూడకుండానే) ఏంబాబాయ్?

చంద్రం : (మాట్లాడడు. పజిలుమీదున్న దృష్టినుంచి తలకూడా పైకెత్తడు)

రఘు : (బాబాయివంకజూచి) ఎందుకు బాబాయ్ పిలిచావు?

చంద్రం : ఒరేయ్ నన్ను మాట్లాడించవద్దని చెప్పాను. ఆటంబాంబులాంటి ఆలోచన కాస్తా పాడుచేసేస్తున్నావురా.

రఘు : నన్ను నువ్వేకదు పిలిచింది బాబాయ్.

చంద్రం : పిలిచానా... అవును నేనే పిలిచాను. (దృష్టి పజిలుమీదే) పిలిస్తే వచ్చావుకదూ.

రఘు : అవును బాబాయ్.

చంద్రం : సరే వెళ్ళమంటున్నా వెళ్ళు.

రఘు : నీతో మాట్లాడడానికి నాకు మాత్రం ఖాళీ యెక్కడుంది. అడుకుందుకు పోవాలిగాని బాబాయ్... జీవించాలంటే అన్న విషయం ఆలోచించాక నాకుకూడా కాస్త చెప్పు బాబాయ్.

చంద్రం : ఏంకి? పట్టుకువెళ్ళి మీ మాస్టారికి చెప్పి రావడానికా!

రఘు : కాదు. కాంపోజిషన్ కోసం బాబాయ్.

చంద్రం : అరిచి చస్తే చెప్పను.

రఘు : పోనీలే బాబాయ్... వస్తా... బాబాయ్... జీవించాలంటే?... టా. టా. (వీధిలోనికి వెళ్ళిపోతాడు)

చంద్రం (యథాప్రకారం కాళ్లు రెండూ డ్రాయరు మీద పెట్టి పజిలుమీదే దృష్టిసించి) అవును. జీవించాలంటే?...

(మాటలోనే వచ్చాడు సూర్యం)

సూర్యం : వెరీగుడ్... ఇందాకట్నుంచి కొట్టుకు చస్తున్నాను. క్రొత్తగా రాసిన నాటకానికి ఏం పేరు పెడదామా అని... బాగుంది ఆ పేరు చంద్రం... జీవించాలంటే... వెరీగుడ్. (పడక కుర్చీలో కూలబడి ఫైల్ తీసి "జీవించాలంటే" అని వ్రాస్తున్నాడు)

చంద్రం : (రెండుకాళ్లు డ్రాయరుమీదనుంచి తీసి వెనక్కు తిరిగి అన్నగారి వంకజూచి) ఏమిట న్నయ్యా అదీ?

సూర్యం : నాటకం రాశానుగదురా. అది వచ్చేనెలలో యీవూళ్ళో ప్రోగ్రాం యేర్పాటుచేస్తున్నా. కలెక్టరు గారితో మాట్లాడివచ్చా. తప్పకుండా కొన్యాస్ చేయిస్తానన్నారు. కనీసం రెండువేల యినా కళ్ళజూస్తా. ఆ నాటకానికి యేం పేరు పెడదామా అని ప్రొద్దుటినుంచి కొట్టుకు చచ్చా... ఈ పేరు బాగుంది.

చంద్రం : ఏ పేరు?

సూర్యం : "జీవించాలంటే" అనే పేరు.

చంద్రం : అది యీ పజిలులోది అన్నయ్యా!

సూర్యం : అది యెందులోదైతే నాకేంగాని యీ నాటకం అర్జంటుగా ముందు ఫెయిర్ రాయాలి. కనీసం దస్తా తెల్లకాగితాలు కొనాలి... ఒరేయ్ చంద్రం.

చంద్రం : ఏం అన్నయ్యా!

సూర్యం : (ఫైలులోనే దృష్టి. వెనక్కు తిరిగి చంద్రం వంక చూడకుండానే) ఒక అర్ధరూపాయుంటే చూడరా.

చంద్రం : (మాట్లాడకుండా అన్నగారివంక ఒకసారి చూచి వెళ్ళి కుర్చీలో కూర్చుని కాళ్ళు యథా ప్రకారం డ్రాయరుమీద పెడతాడు.)

సూర్యం : వినబడలేదురా చంద్రం!

చంద్రం : రోలువెళ్ళి మద్దెలతో మొరపెట్టుకుందట.

సూర్యం : ఏం? నీకుకూడా డబ్బుతో ఏదేనా అవసరం వచ్చిందా యిప్పుడు!

చంద్రం : (లేచి) అవసరం అంటావేమిటి అన్నయ్యా! క్రిందటినెల పజిలు పూర్తిచేశానా... ఒక్క రూపాయి దొరక్క పంపలేకపోయాను. తీరా రిజల్ట్సు వచ్చాక చూద్దునుగదా నేను పూర్తి చేసింది ఆల్ కరెక్టు.

సూర్యం : సారీ. (చంద్రంవంక చూడకుండానే)

చంద్రం : సారీ అంటావేమిటి అన్నయ్యా! ఏభై వేలు... ఒకటా రెండా?

సూర్యం : అవునురా. ఆ బాపతుగా ఏదైనా సంపాదించాలిగాని అన్నయ్యమాదిరిగా ఉద్యోగం ఎలా చెయ్యగలవురా... ఎందుకూ యిప్పుడీ నాటకం ఆపలేనా? సరే కలెక్టరుగారు ఎల్లాగా కేన్వాస్ చేసి పెడతారనుకో. ప్రెసిడెంటుగారితో కూడా చెప్పాను. ఏకంగా టెక్స్టు పుస్తకాలు పంపించెయ్య అన్నాడు. కనీసం రెండువేలు కళ్ళ చూశావన్నమాటే... అయితే ఈ నాటకం ముందు అర్జంటుగా ఫెయిర్ చెయ్యాలి. అర్ధరూపాయి కావాలి కాగితాలకి.

చంద్రం : మరి అన్నయ్యని అడక్కపోయావా?

సూర్యం : అడిగా. ఇవ్వాళ జీతాలొస్తాయికదు. స్కూలునుంచి వచ్చి యిస్తానన్నాడు. ఇంకా రాలేదు. అయిదు దాటిపోయిందప్పుడే. (ఫైలులో కాగితాలు తిరగేస్తూ చూస్తుంటాడు)

(మాటలోనే గోపాలరావు వస్తాడు)

గోపా : అవునురా. అయిదు దాటిపోయింది. ఇంకా స్కూలునుంచి కేరేవ రాలేదూ. (నులకమంచం మీద కూలబడ్డాడు. ఎవరూ గోపాలరావు వంక చూడరు)

చంద్రం : లేదు బాబాయ్.

గోపా : (లోనికి చూస్తూ) అమ్మా సావిత్రీ!

సౌభాగ్యం : ఎందుకు బాబాయ్ (అంటూవస్తుంది.)

గోపా : వదిన లేదమ్మా.

సౌభాగ్యం : కూరవండుతోంది బాబాయ్.

గోపా : కాస్త కాఫీ కాచియిస్తుందేమోనమ్మా.

సౌభాగ్యం : కాఫీపొడుం అయిపోయింది బాబాయ్. అన్నయ్య వచ్చేటప్పుడు తెస్తానన్నాడు.

గోపా : సరే...పోనీలే...ఏమిటో ... నా డొక్కడి రెక్కలమీద...ఎన్నిటికని ఇదవుతాడు వాడు మాత్రం...పెద్దవాణ్ణి ఇంట్లోవుండికూడా యేమీ చెయ్యలేక పోతున్నాను.

సౌభా : ఏదో కంట్రాక్టు అన్నావుగా బాబాయ్ మరి.

గోపా : అదేనమ్మా. కాస్త పలుకుబడి ఏడిసిందిగా. అందులో ఆ ప్రెసిడెంటు నేను ఫైలుమేట్సుము. ఇప్పటిదా యీ స్నేహం...తప్పకుండా నీకే యిస్తా ఆ కంట్రాక్టు అని చేతిలో చెయ్యి వేశాడు. అయితే ఆ గుమాస్తాతో చెప్పి ఆ కాగితాలు బయటికి తీయించు అన్నాడు. వాడు ఇవ్వాళ శెలవుపెట్టాడు. వాడింటికివెళ్ళి యీ రాత్రికిరాత్రి ఆ కాగితాలు తీయించాలి. వాడిది యీ ఊరుకాదు. కనీసం ఒక సైకిలేనా అద్దెకు తీసుకొని వెళ్ళిరావాలి. అల్లాగయినా ఒక నాలుగణాలయినా ఉండాలి. నీదగ్గర ఏమైనా చిల్లరడబ్బులున్నాయమ్మా సౌభాగ్యం.

సౌభా : ఉహుం...నాదగ్గర డబ్బు లెక్కడివి బాబాయ్.

గోపా : అదేనమ్మా. అందరి దరిద్రాలు ఒక్కమాదిరిగానే ఉన్నాయి. ఎందుకూ యీ కంట్రాక్టు దొరయితే కనీసం మూడువేలయినా మిగులుతాయి. అందరి కష్టాలు గట్టెక్కుతాయి.

సౌభా : (లోనికి వెళ్ళిపోతుంది.)

(గోపాలరావు లేచి అటుయిటు తిరుగుతూంటాడు.)

చం : అది సరేగాని బాబాయ్?

గోపా : ఉండరా, బాబాయ్ లేదు ఏమీలేదు! మీ ఇద్దరిలో ఎవరిదగ్గరేనా నాలుగణా లున్నాయిరా?

చం : బాగానేవుంది. అదే నేను అడిగేదిని...జీవించాలంటే ఏం ముఖ్యం బాబాయ్?

గోపా : డబ్బురా...డబ్బు. వెర్రిమొగమా.

చం : కరెక్టు బాబాయ్. నా అయిడియా అదే.

సూ : అయితే మీయిద్దరు కలిసి నీతి అక్కర లేదంటారా?

చం : అవును బాబాయ్! పజలులో ఏమన్నాడంటే మనిషిగా జీవించాలి అంటే యేదీ ముఖ్యం అన్నాడు. నీతా...డబ్బా అని.

గోపా : డబ్బే అంటాను నేను.

సూ : కాదు. నీతిలేకపోతే మనిషిగా జీవించలేడేమో బాబాయ్.

గోపా : ఒరేయ్ సూర్యం...డబ్బుంటే...తర్వాత వాడెంత అవినీతిపరుడైనా ప్రజలదృష్టిలో ఆడబ్బే చేయిస్తుందిరా వాణ్ణి నీతిపరుణ్ణిగా. అంతేరా అబ్బాయి చంద్రం...అంతే. డబ్బే ప్రధానమని రాసెయ్యి నీకెందుకు ... అయితే ఏమిరా సూర్యం నీదగ్గరా లేవూ నాలుగణాలు?

సూ : చచ్చాంపో. నాలుగణాలంటే ఇంకేం? రెండో రకం కాగితాలయినా కొందును నాటకం ఫెయిర్ రాయడానికి,

సావి: (లోనుంచి కత్తిపీట తెచ్చి మంచం క్రింద పెడుతుంది.)

గోపా: ఏవమ్మా సావిత్రీ! మన కంట్రాక్టు విషయం రెటయ్యేటట్టుందమ్మా. ఆ గుమాస్తాదగ్గరకు వెళ్ళిరావాలి. కనీసం సైకిలుకి అద్దె నాలుగణా లయినా కావాలి. నీ దగ్గర చిల్లరడబ్బులేం లేవమ్మా?

సావి: నాదగ్గ రెక్కడివి మావగారూ!

గోపా: పోనీలేమ్మా లేకపోతేను.

సావి: (లోపలికి వెడుతూ.) రేపు రఘు పుట్టినరోజు, ఎల్లాగా అని నేను చూస్తున్నాను.

చం: అన్నయ్యకి ఈ వేళ జీతంవస్తుందిగా వదినా!

సావి: (చివరకంటా వెళ్ళినది చటుక్కున వెనక్కు తిరిగి) జీతంవస్తే ఎన్నిటికి సరిపోతుంది బాబూ! రఘుకి కొత్తబట్టలు కుట్టించడానికికూడా ఎక్కడొస్తుంది? మీఅన్నయ్య చేసేది బోర్డుస్కూలు మాస్టరీ...మీ నాన్న పైకి చెప్పించలేను తెల్పినింటుకు వెళ్ళను నేసరికి మీకుమల్లే వెళ్ళనని చెప్పిపెట్టకుండా కిక్కురుమనకుండా వెళ్ళాను గనుకనే ఈనాడు ఇట్లా బాధపడుతున్నాం. (లోనికి వెడుతుంది.)

గోపా: అవును. నాకు బాగాజ్ఞాపకం. మీ అన్నయ్య కూడా మీకుమల్లేనే ఆ బడిపంతులు పనిచెయ్యనని ఏడ్చాడు. అయితేం?...మీ నాన్న ఏమన్నాడో తెలుసా. బడిపంతులు కొడుకే బడిపంతులు పని చెయ్యకపోతే కలెక్టరు కొడుకు బడిపంతులుపని చేస్తాడా? అందరూ నీలా అనుకుంటే భావిభారత పౌరుల్ని తీర్చి దిద్దేవారెవరు? అని అడిగాడు. మళ్ళీ మాట్లాడ లేకపోయాడు మీ అన్నయ్య.

(క్షణంసేపు నిశ్శబ్దం...చంద్రం పజిలులో లీన మయ్యాడు. సూర్యం పడకకుర్చీలో నేఉండి ఫైల్‌లో లీనమయ్యాడు. గోపాలరావు అటూ యిటూ పచార్లుచేస్తున్నాడు.)

రఘు: (వీధిలోనుంచి ఆంధ్రపత్రికతో వచ్చి) తాతయ్యా!

గోపా: ఏంబాబూ! నాన్న యింకా రావటంలేదూ?

రఘు: లేదు గాని తాతయ్యా! మా మాస్టారు జీవించాలంటే అనే హెడ్డింగుమీద కాంపోజిషన్ రాయాలి ఆలోచించుకు రమ్మన్నారు తాతయ్యా! ఈ పేపరులో తాటికాయంత అక్షరాలతో ఏదోరాశాడు. ఇదేమైనా నా కాంపోజిషన్‌కి పనికివస్తుందేమోనని తెచ్చాను. చదవనా?

గోపా: చదువుబాబు చెబుతాను.

రఘు: (పేపరుచూస్తూ చదువుతాడు) హిందూ దేశంలో సంపాదించేవాడు ఒక్కడైతే వాడి మీద పడితినేవాళ్ళు పదిమంది. (ఒకేసారి సూర్యం చంద్రం రఘువంక తిరుగుతారు.)

సూర్య: (రఘు మాటలోనే) చచ్చాంపో.

గోపా: ఒరేయ్ రఘు. ఆ వ్యాసం రాసినవాడూ ఆ బాపతుగా ఒకడిమీదపడి తినేవాడే.

రఘు: నీకెట్లా తెలుసు తాతయ్యా!

సూర్యం: (లేచి) రఘు! తెలవడమేమిటి? అట్లాంటి వ్యాసాలు వ్రాసి పత్రికకు పంపితే పత్రిక వాళ్ళు ఏమైనా యిస్తారేమోనని వాడిఏడుపు. వాడూ ఏదో ఒకడిపార్టుమెంటులో హెడ్ క్లర్కు అయిఉంటాడు.

చంద్రం: (లేస్తూ) లేకపోతే రెక్కలుముక్కున్న వాడికి వ్యాసాలురాసే తీరుబడి యెక్కడుంటుంది... ఒరేయ్ రఘు.

రఘు: ఏంబాబాయ్! ఈ వ్యాసంలో నా కాంపోజిషన్‌కి పనికివచ్చేదేవీ లేదంటావా?

చంద్రం: ఏవీ లేదు. శుద్ధదండుగ ఆ పేపరు. కొంపదీసి కొనలేదుగద డబ్బులు తగలేసి.

రఘు: లేదులే బాబాయ్. ఎదురింటివాళ్ళదగ్గర పట్టుకొచ్చా.

చంద్రం: ఇచ్చెసిరా.

రఘు: కాస్సేపు చదువుకుని యిస్తాను బాబాయ్!

చంద్రం: నీతలకాయ. వెళ్ళు......ఆ వెధవపేపరేం చదువుతావు. పేపరు చదివితే బాగుపడ్డట్టే...

రఘు: అదేమిటి బాబాయ్ మా మాస్టారు రోజూ పేపరు చదవమంటారు బాబాయ్.

చంద్రం: పాడయిపోవడానికే.

రఘు: అంతే నంటావా బాబాయ్.

చంద్రం: అంతేబాబాయ్. లేకపోతే అకస్మాత్తుగా డబ్బులాభించే వ్యవహారం చూపించే యీ పజిలుకి పనికివచ్చేముక్క ఒక్కటేనా ఉందిరా అందులో?

రఘు: నీకెంతసేపూ పజిలు గొడవే బాబాయ్.

చంద్రం: కర్మంచాలక నెగ్గి యీ ప్రైజులువస్తే అప్పుడు మా చంద్రం బాబాయి చాలామంచివాడంటూ నువ్వేవస్తావు.

రఘు: ఒకవేళ నేనువచ్చినా నువ్వు రానిస్తావా బాబాయ్.

చంద్రం: నీకూ వచ్చిందా యీ అనుమానం?

రఘు: ఏం? ఇంకెవరికైనా వచ్చిందా బాబాయ్?

చంద్రం: లేదులే. అప్పుడప్పుడు నాకేవచ్చేది.

రఘు: మరియింకేం బాబాయ్! వరేగాని నా కాంపోజిషన్ సంగతి చెప్పవు బాబాయ్!

చంద్రం: ఒరేయ్ నన్ను విసిగించకు. ఆటంబాంబు లాంటి ఆలోచన్ని కొస్తా పాడుచెయ్యక వెళ్ళు అవతలికి... జీవించాలంటే ...... పజిలులో లీనమౌతాడు.)

రఘు: జీవించాలంటే ఏం సూర్యం బాబాయ్! నువ్వైనా చెప్పవు నాకు కాంపోజిషన్.

సూర్యం: ఇప్పుడు వన్నేమీ మాట్లాడించకు రఘు.

రఘు: పోనీలే బాబాయ్. అత్తయ్యా (అంటూ పేప రుతో లోనికి వెళతాడు.)

చంద్రం: ఒక్క రూపాయివుంటే ...... తప్పనిసరిగా యీ పజిలు పంపించివేద్దును.

గోపాల: ఒరేయ్ చంద్రం. ఏమిటి నీకు పజిల్సు పిచ్చ పట్టుకుందేమిటిరా.

చంద్రం: అదేమిటి బాబాయ్! క్రితంనెల పజిలు పూర్తిచేశాను. పంపలేకపోయాను. తీరా రిజల్సు వచ్చాకచూస్తే ఆల్ కరెక్టు. మరి నిజంగా పంపించివుంటే......

గోపాల: ఏమైనా బుర్రచెడగొట్టుకోవడంతప్ప యీ పజిల్సులో ఎవ్వరూ బాగుపడలేదురా.

చంద్రం: అదేమిటి బాబాయ్ అట్లా అనేశావు.

సూర్యం: బాబాయ్ కాదు. నేనూ అంటానురా చంద్రం.

చంద్రం: ఏమని?

సూర్యం: పజిల్సు గొడవ మంచిది కాదని.

చంద్రం: ఎందుచేత?

సూర్యం: అదోకరకం లాటరీ.

చంద్రం: మరి యింకేం? కొడితే యీ లాటరీలోనే కొట్టాలి ఛాన్సు.

సూర్యం: చచ్చాం పో.

చంద్రం: అంతే అన్నయ్యా! అప్పుడుగాని మన దరిద్రం తీరదు. అంతేగాని ఉద్యోగంచేసి ఏం సంపాదిస్తాం అన్నయ్యా! ఈ రోజుల్లో పొట్టకు మాడేవాడెవడయ్యా అంటే ఉద్యోగం చేసుకునే వాడే.

గోపాల: కలెక్టురా చంద్రం! ఇప్పుడు చూడరాదూ. మీ అన్నయ్య కేశవ మాస్టరీ వెలిగిస్తున్నాడా? ఎన్ని యిబ్బందులు పడుతున్నాడు చెప్పు. ఇప్పుడు నాబోటిగాణ్ణి ఉద్యోగం చెయ్యలేకా?.. నాకున్న పలుకుబడికి, నేను చేసిన దేశసేవకి యీ వయసులోనైనా ఎవడు పడితే వాడిస్తాడు ఉద్యోగం.. ఉద్యోగం చేయడం మొదలు పెడితే ఎదుగూ బొదుగూ ఉండదు రా జీవితం. ఎందుకూ? యీ కంట్రాక్టు రైటయిందా కనీసం మూడు వేలు. (చంద్రం పజిలులోను, సూర్యం ఫైలులోను లీనమవడం తనమాటలు వినకపోవడం చూచి) ఒరేయ్ చంద్రా!... ఇల్లా చూడు.. ఏమిటని నీ ఉద్దేశం... మూడు వేలు.. ఎన్నాళ్ళు ఉద్యోగం చేస్తే రాను మూడు వేలు...మాటలే... అయితేం.. ఒరేయ్ చంద్రం ఇప్పుడు నాలుగణాలు కావాలి. నీ దగ్గర లేవట్టే.

చంద్రం: (మాట్లాడడు.)

గోపా: ఏమిరా సూర్యం! నీదగ్గరా లేవట్టే.

సూర్యం: (మాట్లాడడు.)

గోపా: పోనీ అల్లా ఎవడిదగ్గరకేనా వెళ్ళేనా వస్తాను. (వెడుతున్నాడు)

చంద్రం: ఇంతకీ జీవించాలంటే ఏది ముఖ్యం అంటావో చెప్పావుకాదు బాబాయ్.

(వెనక్కు తిరక్కుండానే వెళ్ళిపోయాడు గోపాల రావు.)

సావిత్రి: (చంద్రంమాట విని దేలోపలినుంచి రఘుతో వస్తూ) అదే అదే చంద్రంబాబూ! చూడు జీవించాలంటే దానిమీద కాంపోజిషన్ రాయాలి. ఆలోచించుకు రమ్మన్నారట వీళ్ళ మాస్టారు. లోపలికొచ్చి నాదగ్గర యేడుస్తాడు వీడు. నాకేం తెలుస్తుంది చెప్పు.

చంద్రం: చెబుతాగాని వదినా! ఒక్క రూపాయి ఉంటే యియ్యివదినా! ఈ పజిలు పంపిస్తాను. ఇవ్వాళే ఆఖరిరోజు. ఈ రాత్రి మెయిల్ కేనా పంపించెయ్యాలి. క్రిందటి నెల నేను పూర్తి చేసిన పజిలు ఆల్ కరెక్టు అయ్యేసరికి పంపలేక పోయానే అని ప్రాణం ఉసూరుమంది వదినా!

రఘు: నేను చెప్పలే. బాబాయి కెంతసేపూ పజిల్సు గొడవే. నాకు కాంపోజిషన్ చెబుతాడా! (లోనికి వెళతాడు.)

చంద్రం: ఏం వదినా! యివ్వవూ!

సావిత్రి: బాబూ! నీ అమాయకత్వానికి నవ్వాలో ఏడవాలో తెలియడం లేదు. మీ అన్నయ్య సంపాదన నేను దాచుకుందుకు కూడా సరిపోతోందనుకున్నావా బాబూ! రూపాయలు రూపాయలే నాదగ్గర దాచుకుంటే చంటిపిల్లకు

పాలసీసా కొనకుండా ఉండగలనంటావా చెప్పు బాబూ!

సూర్యం: పోనీ చిల్లర డబ్బులు కూడా లేవు వదినా!

సావిత్రి: ఏం? నీకూ కావలసి వచ్చిందా డబ్బు.

సూర్యం: నాటకం ఫెయిర్ రాయాలి వదినా! ఒక దస్తా తెల్లకాగితాలు కొనాలి.

సావిత్రి: బాగానే ఉంది. మామగారికి పైకి లద్దకు డబ్బులు కావాలి. చంద్రంబాబుకి పజిలు పంపడానికి కావాలి. సూర్యం బాబుకి తెల్లకాగితాలు కొనుక్కుందుకు కావాలి. డబ్బు అక్కరేని దెవరికి? చంటి పిల్లకి పాలసీసా కొనడానికి డబ్బు కావాలి. రేపు రఘు పుట్టిన రోజు. క్రొత్తబట్టలు కుట్టించడానికి డబ్బు కావాలి....సౌభాగ్యం (లోపలికి చూస్తూ.)

సౌభాగ్యం: (వచ్చి) ఏం వదినా! పిలిచావా?

సావిత్రి: బట్టలు చిరిగిపోయాయి అన్నావు కదు.

సౌభాగ్యం: అవును వదినా (తలవంచింది సిగ్గుతో.)

సావిత్రి: ఎందుకమ్మా అలా సిగ్గుపడతావు. ఇవన్నీ అవసరం నీది అవసరం కాకపోయిందా! మీ ఆయన నిన్ను చూడక పోబట్టి నువ్వు మా యింటి దగ్గర ఉండవలసివచ్చింది. లేకపోతే నువ్వెందుకుంటావు. బట్టలకు నీకూ డబ్బు కావాలి. ఇవ్వాళ మీ అన్నయ్యకు జీతాలొచ్చేరోజు. ఆ జీతానికి అప్పులాళ్ళగాలి పోకుండా ఏ కొద్దయినా యింటికొచ్చి ఇందులో ఎవరి అవసరమో ఒకరి అవసరమేనా తీరితే కొంతసంతోషిద్దును. ఇంతమందికి డబ్బు అవసరముని కనిపిస్తూంటే...చంద్రం బాబూ! నీ పజిలు పూర్తి చేయడానికి ఆలోచిస్తావేం బాబూ!

చంద్రం: నువ్వుకూడా మనిషి జీవించాలంటే డబ్బే ప్రధానమంటావా వదినా?

సావిత్రి: కనిపిస్తోందిగా డబ్బెంత ముఖ్యమో.

చంద్రం: కాదుగాని వదినా! ఇంతమందిని పోషించలేక అన్నయ్య బాధపడుతూంటే బావ చూడరాదూ మంచిచెడ్డ లేకుండా అక్కయ్యని యిక్కడ వదిలేశాడు.

సౌభాగ్యం: (కళ్ళనీళ్ళు తిరిగాయి. తలవంచుకు లోనికి వెడుతుంది.)

సావిత్రి: చంద్రం! ఒకరితప్పులు ఎంచేముందు మన తప్పులుకూడా మనం చూచుకోవాలి.

చంద్రం: తప్పంటావేమిటి వదినా! ఏ ఉద్యోగమో చేసుకోక నేనూ ఒక సినీమా రచయిత నయిపోవాలని, లక్షాధికారి నయిపోవాలని ఆ మద్రాసులో కూర్చుంటే ఏమయినట్టు? పోనీ కూర్చుంటే కూర్చున్నాడు అక్కయ్యనికూడా తీసుకువెళ్ళకూడదూ?

సావిత్రి: బాధపడే వ్యక్తుల్ని మరికొంత బాధపెట్టడం మంచిపనేనా చంద్రం?

చంద్రం: ఇప్పుడు బాధపడేదెవరు?

సూర్యం: (పడకకుర్చీలోంచి చదువలేస్తూ) అహా! సౌభాగ్యమ్మక్కగారు బాధపడుతోందని చెబుతున్నారు వదినగారు.

సావిత్రి: ఏం? మీ చెల్లెలు ఏమీ బాధపడడం లేదంటావా సూర్యం?

సూర్యం: ఎందుకు బాధ? అన్నయ్య తెచ్చిపెడుతూంటే మెక్కుతింగా తినలేకా? వదిన చాకిరీ చేస్తూంటే చేయించుకోలేకా? ఎందుకూ బాధ?

సావిత్రి: నీ విజ్ఞానం అంతా ఏమైంది సూర్యం! అన్నయ్య తెచ్చిపెడుతేనూ వదిన చాకిరీ చేస్తూంటేనూ ఆడది సుఖపడుతుందన్న మాట. పస్తుపడుకున్నా భర్తదగ్గరుంటేనే స్త్రీకి ఆనందం అని, తిన్నది వంటపడుతుందని తెలుసుకోలేకపోయావు. పాపం మీ చెల్లెలు ఎంత కుమిలిపోతోందో నీకేం తెలుసు.

సూర్యం: అవును ఏంచేస్తుంది? అటు మొగుడికి బరువైంది. ఇటు అన్నయ్యకి బరువౌతోంది. ఎందుకొచ్చిన బ్రతుకు.

సావిత్రి: సూర్యం (కోపంగా) అన్నయ్యకేమీ బరువు కావడంలేదు. అనవసరంగా మాటలు అని ఆ పిల్లహృదయాన్ని బాధపెట్టకు.

సూర్యం: అన్నయ్యతో అనేకసార్లు చెప్పాను.

సావిత్రి: ఏమని?

సూర్యం: బావతో విడాకులిప్పించి చెల్లాయికి మళ్ళీ పెళ్ళిచేద్దామని.

సావిత్రి: సూర్యం! మన భారతభూమి కర్మభూమి అని తెలుసుకోలేకపోతున్నావు.

సూర్యం: అవును. పవిత్ర భారతభూమి అని, కర్మభూమి అని, ప్రాచీన సంప్రదాయాలని మన జీవితాల్ని మనమే నాశనంచేసుకుంటున్నాము. మనకాళ్ళకు మనమే బందాలు తగిలించుకుని ఎదుగూ బొదుగూ లేకుండా హరించిపోతున్నాం. పరువు మర్యాదలమాటున బ్రతుకుబాటనే భారంచేసుకుంటున్నాము.

సావిత్రి: అవునవును. నీలాంటి కవిపుంగవులు, సంస్కర్తలు సంస్కరణలంటూ దేశాన్ని ఎంత

నుందుకు తీసుకుపోతున్నారో అర్థం అవుతోందిగా.

సూర్యం: అవును వదినా!...లోకులంతా బావ వదిలేశాడని చెప్పుకుంటూంటే ... చెల్లాయి కుళ్ళి కృశిస్తూంటే, అన్నయ్య బ్రతుకు భారమవుతూంటే...

సావిత్రి: అందుకని...

సూర్యం: బావతో చెల్లాయికి విడాకు లిప్పించడమే.

సౌభాగ్యం: (కళ్ళనెంట నీరుగారుస్తూ వచ్చి సూర్యం వంక చూస్తూ నిలబడుతుంది)

సూర్యం: అవును చెల్లాయి! ఎందుకల్లా ఏడుస్తావు?

సౌభాగ్యం: ఎందుకా? నా గతికోసం యేడుస్తున్నాను. నా పూర్వజన్మ సుకృతంకోసం యేడుస్తున్నాను. అనవసరంగా మీకు భారం కలిగిస్తున్నానే అని యేడుస్తున్నాను. భగవంతుడు నాకింకా చావు ఎందుకు పెట్టలేదా అని యేడుస్తున్నాను. తెలిసిందా అన్నాయ్. నా చావు కళ్ళారా చూడదలుచుకుంటే అట్లాగే విడాకు లిప్పించు.

సావిత్రి: ఏమిటే సౌభాగ్యం! నీకు మతిపోతోందా?

సౌభాగ్యం: నీకు తెలియదు వదినా! అన్నాయ్! నీకంత యిష్టంలేకపోతే యింట్లోంచి పొమ్మని బయటికి గెంటెయ్యి. ఏ నుయ్యో గొయ్యో చూచుకుంటాను. అంతేగాని విడాకులని, మళ్ళీ పెళ్ళి అని నీ యిష్టంవచ్చినట్లు యింకోసారి అన్నావా నా శవాన్ని కళ్ళతో చూస్తావు.

సూర్యం: (కోపంగా) చెల్లాయి!

సౌభాగ్యం: (కోపంగానే) అవును.

సావిత్రి: ఎందుకు సూర్యం అనవసరం గొడవ... సౌభాగ్యం...నీకేమైనా మతిపోతోందా? లోపలికి నడు.

సౌభాగ్యం: మతిపోయినా బాగుండును. మనస్సుకు బాధ లేకుండా ఉండును. (ఏడుస్తూ) ఆ భగవంతుడు చావైనా పెట్టడంలేదు నాకు. చూసి చూసి నక్కడు ప్రాణాన్ని పోగొట్టుకోలేక పోతున్నాను. అందరికీ బరువుగా మొండి బ్రతుకు బ్రతికమని నా నుదుటను రాసిపెట్టాడు భగవంతుడు.

సావిత్రి: సరేలే లోపలకి నడు. నీకొచ్చిన లోటేమీ లేదు. మంచిరోజులు రాకపోవు. నీ సంసారము కుదుటపడకపోదు. చివరకి మిగిలేవి యీ మాటలే. (అని సౌభాగ్యాన్ని లోపలి వైపుకు త్రిప్పి లోపలికి గెంటుతోంది.)

సౌభాగ్యం: (లోపలి ప్రక్కకు తిరిగి) అవును. బావ వదిలేశారని లోకులంతా చెప్పుకుంటారు. ఆయన బాధలు లోకులకేం తెలుస్తాయి. ఒకప్పుడు యింతటి భావకవి లేడని పొగిడి సన్మానాలు, సభలు, జరిపి శాలువాలు కప్పి, ఏనుగులపై ఊరేగించిన యీ లోకులే యీనాడు ఆయన జీవితాన్ని గురించి ఆలోచించక ఆయన జీవితంమీద తలోరాయి విసురుతున్నారు.

సూర్యం: (రెండో ప్రక్కకు తిరిగి) బ్రతుకు తెరువును గురించి ఏ మానవునికా మానవుడే చూచుకోవాలిగాని లోకుల్నని యేంలాభం. హాయిగా బావ ఏదైనా ఉద్యోగం చేసుకోక......

సౌభాగ్యం: (వెళ్ళనెళ్ళని చటాలున వెనక్కు తిరిగి) అన్నాయ్! బావ బ్రతుకు తెరువును గురించి నీవేమీ సలహా యివ్వనక్కరలేదు. ఆయన్నెవరూ అర్థం చేసికోలేరు.

సూర్యం: అబ్బ! ఈవిడిగారికి కోపం వచ్చింది మొగుణ్ణనేసరికి. బ్రతకలేక కట్టుకున్న పెళ్ళానికి తిండెట్టలేక పుట్టింటి దగ్గర వదిలేసిన మొగాడు ఒక మొగాడనే చెబుతోంది.

సావిత్రి: (కోపంగా)సూర్యం!

సౌభాగ్యం: అన్నాయ్! బావని అంతవరకే అర్థంచేసుకున్నావు. గౌరవ మర్యాదలు పొంది పేరు ప్రతిష్ఠలు సంపాదించిన మధ్య తరగతి వ్యక్తి ఆ గౌరవ మర్యాదల భారంలో ఆ పేరు ప్రతిష్ఠలు నిలబెట్టుకునేందుకు జీవితంతో పోరాడవలసిన క్రొత్త సమస్య యెదురౌతుందని తెలుసుకోలేక నీ యిష్టంవచ్చినట్లు మాట్లాడుతున్నావు. ఒక్క సంగతి మరచిపోయావు. ఇది నీ యిల్లుకాదు. పెద్దన్నయ్య ఆదరిస్తే యీ యింట్లో ఉండగలుగుతున్నాను. నీ పోషణలో నేనులేను. అది మరచిపోయి మాట్లాడుతున్నందుకే కాస్త విచారంగా ఉంది.

సూర్యం: సరే అన్నయ్య ఆదరిస్తేనే ఉంటున్నావు. ఏం చేస్తాడు ఆదరించక ... చూసి చూసి పొమ్మనగలడా?

సౌభాగ్యం: అవును. అన్నయ్య మంచివాడు గనుకనే ఎవ్వరినీ పొమ్మనలేడు. సంపాదించకుండా గోళ్ళు గిల్లుకుంటూ కూర్చున్న మొగాళ్ళకీ పెడుతున్నాడు. దిక్కుమాలిన వాళ్ళకూ పెడుతున్నాడు.

సూర్యం: ఏమిటే నువ్వనేది చెల్లాయి.

సౌభాగ్యం: అర్థంచేసికుంటే నీకే తెలుస్తుంది. (లోనికి చురచురలాడుతూ వెడుతుంది)

సావిత్రి: ఎందుకొచ్చిన గొడవ సూర్యం యిది... ఎల్లాగో ఆయన కష్టాలు పడి తెస్తున్నారుగా. పెడుతున్నారు. ఆయనకు లేనిబాధ నీకెందుకు చెప్పునువ్వు. అహోరాత్రులు మొగుడు తీసి కళ్ళులేదని, అక్కడ ఆయన ఏమయిపోతున్నారో అని కంటికి మింటికి ఏకధారగా ఏడుస్తున్న సౌభాగ్యం మనస్సు మరింత క్షోభ పెడుతున్నావు.

సూర్యం: నేనేం క్షోభపెట్టలేదు. సంపాదించకుండా గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటున్నావని వదినా అందిగా. ఏ గుమాస్తావనో చేసుకుని నాపొట్ట నేను ఎల్లాగూ పోషించుకోగలను. ఇంతవరకు చదువుచెప్పించి పెద్దవాణ్ణిచేసిన అన్నయ్యకు యేదోవిధంగా సాయపడదామనే యింతవరకు ఆలోచిస్తున్నాను. లేకపోతే వాడిచుట్టు వాడిచుట్టు తిరిగి రేపు యీ నాటకం యెందుకు వేస్తున్నానంటావు. పాపం కలెక్టరుగారు గట్టిగా కాన్వాస్ చేసి పెడతానన్నారు. ఆయనకి నేనొక రచయితనని ప్రత్యేకాభిమానం. ప్రెసిడెంటుగారి మట్టుకు ప్రెసిడెంటుగారు నువ్వు పైకి రావలసిన వాడవోయి, అని అస్తమానూ భుజంమీదతట్టి మరీ చెబుతాడు. ఏదోవిధంగా సంపాదించి అన్నయ్యబరువు తగ్గిద్దామనే ప్రయత్నిస్తున్నాను గాని గోళ్ళు గిల్లుకుంటూ కూర్చున్నానంటావా చెప్పు వదినా!... చెల్లాయి దానిష్టమొచ్చినట్లు అనేసి వెళ్ళింది.

సావిత్రి: చిన్నపిల్ల, దానికేం తెలుసు ఏదో ఆవేశంలో అంది. అయినా దానిమనస్సు కుళ్ళిపోతోంది బాబూ. దాన్నేమీ అనకండి. ఏక్షణంలో ఏం అఘాయిత్యం చేసుకుంటుందోనని భయంగా ఉంది.

(లోపలికి వెళుతుంది)

(సూర్యం అటు యిటు పచార్లు. చంద్రం సూర్యంవంకే చూస్తూ ఉంటాడు.)

సూర్యం: (చంద్రంవంక చూడకుండానే) ఒరేయ్ చంద్రం!

చంద్రం: (దృష్టి అన్నయ్యమంచి తిప్పించి పజిలు లోనికి పోనిస్తాడు.)

సూర్యం: మాట్లాడవేమిరా చంద్రం?

చంద్రం: వినిపిస్తోందిగా.

సూర్యం: (చంద్రాన్ని చూచి) అది కాదురా. నేనిప్పుడు ప్రయత్నించేస్తే నా పొట్టకు సరిపడే ఉద్యోగం దొరుకుతుందంటావా దొరకదంటావా?

చంద్రం: ఎందుకు దొరకదు. (దృష్టి పజిలుమీదే.)

సూర్యం: అయినా వదినకుకూడా కొంచెం కష్టంగానే ఉందనుకుంటానురా నేను సంపాదించకుండా కూర్చుని తింటున్నానని.

చంద్రం: (చటుక్కున అన్నగారివంక తిరిగి) ఆ మాటంటే మాత్రం నేను ఒప్పుకోను అన్నయ్యా! వదిన మంచిదిగనుకనే ఇంకా మనమీ యింట్లో ఉండగలుగుతున్నాం.

సూర్యం: మరి చెల్లాయి అంతచక్కగా అంటించి వెళ్ళిందీ అంటే వదిన తర్ఫీదు కాదంటావా?

చంద్రం: (లేచి) అదీ నేను ఒప్పుకోను. అక్కయ్యని నీ యిష్టం వచ్చినట్లు పెట్టి పోషించేవాడిలా మాట్లాడావు.

సూర్యం: నే నేమన్నాను రా. నువ్వుకూడా అల్లాగే అంటావు.

చంద్రం: ఏమన్నావో నీకే తెలుసు. అక్కయ్య విడాకుల విషయం ఒకసారి అన్నయ్యతో నీవు చెబితే వంశమర్యాదకి మచ్చతీసుకు వస్తావా అని అన్నయ్య కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. జ్ఞాపకం లేదూ. ఆ విడాకుల విషయం అక్కయ్యదగ్గర ఎందుకు కదపడం?

సూర్యం: అయినా ఈ వేళ లేనిది వేళావిశేషం బాగుండలేదు. నాటకం ఫెయిర్ వ్రాయడానికి తెల్లకాగితాల నిమిత్తం అర్థరూపాయి దొరకలేదంటే యేమిటి?

(బయట చక్రధరరావు "కేశవరావుగారూ" అని పిలుస్తాడు)

సూర్యం: ఒరేయ్ చంద్రం! అన్నయ్యకోసం యెవడో వచ్చాడురా.

చంద్రం: (మళ్ళీ డ్రాయరుమీద కాళ్లు తిన్న పెట్టి కుర్చీలో తాపీగా కూర్చుంటూ) ఇంకెవడు ఏ కిరాణాకొట్టు మారయ్యో, పుల్లండితే ఎల్లయ్యో అయి ఉంటాడు.

సూర్యం: వచ్చాం పో. (పక్కకుర్చీలో కూలబడ్డాడు)

చంద్రం: ఇవ్వాళ జీతాలొచ్చేరోజని తెలుసుకుని ఉంటాడు. వసూలే యింటికొచ్చాడు. స్కూలుకు వెళ్ళలేదు.

(బయట చక్రధరరావు మళ్ళీ "కేశవరావుగారూ" అని పిలుస్తాడు)

సూర్యం: ఎవరు వారు?

(బయట) నా పేరు చక్రధరరావండి.

సూర్యం: (లేస్తూ) ఓహో! మీరా! లోపలికి రండి.

చంద్రం: ఎవరు అన్నయ్యా! (లేవకుండానే)

సూర్యం : ఒకప్పుడు గొప్ప యాక్టరులే.

చంద్రం : మరి యింకేం! నీ నాటకంలోకి పనికొస్తా డేమో చూడు.

చక్ర : (లోపలికివస్తూ) అన్నయ్యగారింకా స్కూలు నుంచి రాలేదు బాబూ!

సూర్యం : లేదండి.

చక్ర : ఈ పాటికి వచ్చేసి ఉంటారేమో ననుకున్నా.

సూర్యం : ఏమండి ఏమైనా పనుందా?

చక్ర : పనికేవుంది బాబూ! ఇవ్వాళ జీతాలొచ్చే రోజని తెలిసి...

చంద్రం : (చటాలున ఆయనవంక తిరిగి) ఏం? మా అన్నయ్య ఏమైనా బాకీ ఉన్నాడా మీకు.

చక్ర : లేదు బాబూ! నా బ్రతుక్కి ఒకరికి బదు లివ్వడం కూడానా నేను.

సూర్యం : మరెందు కొచ్చారు?

చక్ర : ఏదిటో మాచిపోదామని బాబూ!

సూర్యం : అంటే మీకూ ఏదేనా డబ్బుఅవసరం వచ్చి వచ్చారా యేమిటి?

చక్ర : అదేమిటి బాబూ! డబ్బు అవసరంలేనివా డెవడు.

సూర్యం : చచ్చాం పో.

చంద్రం : (చటుక్కున కుర్చీలోంచి) అయితే మని షిగా జీవించాలి అంటే?...

చక్ర : డబ్బు ఉండాలంటాను బాబూ!

చంద్రం : మువ్మాటికి.

చక్ర : ఆహా!

చంద్రం : అయితే నా పజిలులో డబ్బుకే వోటేం గక్కునై పోతాం దన్నయ్యా!

సూర్యం : అయితే మీ రిప్పుడేం చేస్తున్నట్టు?

చక్ర : నేనా? నాసంగతి మీకేం తెలియదన్న మాట.

సూర్యం : మా సంగతే మాకు తెలియక కొట్టుకు చస్తూంటే మీ సంగతి కూడా మా కెక్కడ తెలుస్తుంది. అయినా మీరు నటులని మాత్రం తెలుసు.

చంద్రం : (యథాప్రకారం కూర్చుండి పజిలులో లీన మవుతాడు)

చక్ర : అవును బాబూ! ఒకప్పుడు గుమాస్తాపని చేసు కునేవాణ్ణి. ఒకాయన నాటకం వ్రాసుకుని ఆడించుకుందుకు ఎవ్వరూ దొరక లేదని నన్నొక చిన్న వేషం వేసిపెట్టమని బతిమాలాడు. సరేనని వేశాను. ఇంక అక్కడినుంచి ఆ వేషం చాలాబాగుందని పొగడ్తలు, సన్మానాలు, ఇంకే ముంది. రోడ్డువెంట వెళ్ళడం భయం. పిలవడం టీలిచ్చేవారు, కాఫీలిచ్చేవారు, డ్రింకులిచ్చే వారు,...ఊ...పొందుతున్న యీ గౌరవ మర్యాదల కేం భంగం వస్తుందోనని గుమాస్తా పనిచెయ్యడానికి సిగ్గుపడి మానేశాను. క్రమంగా పెద్దయాక్టరునయ్యాను. అయితే సంపాదన బాగానే వుండేది. గౌరవంతోపాటు జీవన ప్రమాణంకూడా పెరిగింది. తెచ్చింది తెచ్చినట్లే మర్యాదలకోసం, గౌరవంకోసం, పరువుకోసం ఖర్చు పెట్టవలసివచ్చింది: జరిగినన్నాళ్ళూ బాగానే జరిగింది. చక్రధరరావు నాటకంలో వేషం వేస్తున్నాడు అంటే మూడువేలు బుక్కింగు అమ్ముడయ్యేదన్నమాటే.

చంద్రం : (ఆమాటలో ఉత్సాహంగా లేచి) ఐదువ మూడు వేలు క్రిందటినెల పజిలు నేను కట్టివుంటే ఏడువేలు ...ఒకటా రెండా...అంకెల్లో రెండెన్నెంతు చెప్పండి మూడువేలంటే...

సూర్యం : ఒరేయ్ చంద్రం! నువ్వు కాస్సేపు తగ్గరా.

చంద్రం : తగ్గా నన్నయ్యా. అయినా ఆయన చెప్పే దాంట్లో నాపజిలుకి పనికివచ్చేవిషయం ఒక్కటి లేదు. నాకెందుకు? (అని యథాప్రకారం కూర్చుండి పజిలు చూస్తూంటాడు.)

సూర్యం : ఆ! తర్వాత ఏమిటండీ చక్రధరరావుగారూ!

చక్ర : తర్వాతి కేముంది? జరిగినన్నాళ్ళూ అలాగే జరి గింది. తరువాత భూసంస్కరణల బిల్లుమూలంగా పొలాలమ్మేసి ప్రతిఊళ్ళోను ఒకొక్క సినిమా హాలు కట్టించడం వచ్చాక నాటకాలు మూల పడ్డాయి. ఆడించేవాళ్ళు లేరు. చూచే ఆడియన్సు లేరు. నాటకాలంటేలేవు గాని అపూర్వమర్యాద యొక్కడికిపోతుంది. ఎక్కడికివెళ్ళినా రమ్మ నడం, కూర్చోమనడం, కాఫీలు టీలు యివ్వడం, పాత నాటకాల చరిత్రఅంతా వాళ్ళు పొగడడం నేను వింటూ లోలోపల ఆనందించడం... అయితే పాటలెల్లాగ...పోనీ మళ్ళీ ఆ గుమాస్తా పని చెయ్యగలవాఅంటే చెయ్యలేను. ఇల్లాగే ప్రతినెలా జీతాలు వచ్చే రోజుకి మీ అన్నయ్యలాంటి సహృదయుల్ని కలుసుకుం టాను. ఎవరికి తోచినది వారిస్తారు. తినీ తినక రోజులు గడిపేస్తున్నాను. ఇది బాబూ నా చరిత్ర.

సూర్యం : చచ్చాంపో... ఒరేయ్ రఘు!

రఘు : (లోపలినుంచి వస్తూ) ఎందుకు బాబాయ్?

సూర్యం : ఇందాకటి పేపరుందా? ఇచ్చేసి వచ్చావా?

రఘు : ఉంది. ఇవ్వలేదు. నాకు కాంపొజిషన్ చెబుతావా బాబాయ్.

సూర్యం : అది పట్టుకువచ్చి ఇందాక చదివింది వారి కొకసారి చదివి వినిపించరా.

రఘు : ఓ! (లోనికివెళ్ళి పేపరుతెచ్చి) వీరికేనా బాబాయ్.

సూర్యం : ఆ! వారికే.

రఘు : వినండి. (చదువుతాడు) హిందూదేశంలో సంపాదించే వొక్కడైతే వాడిమీద పడి తినే వాళ్ళు పదిమంది.

సూర్యం : చాలులే రఘు... బాబూ! చక్రధరరావు గారూ! ఈసారి అర్థమైందా? ఇది అట్టే మంచి పనికాదు.

చక్ర : మరి యేం చెయ్యమంటారు చెప్పండి. పూర్వం లలితకళల్ని మహారాజులు పోషించేవారు. అందుచే నాబోటిగాళ్లకు ఏ బాధా లేక పోయింది. ఇప్పుడా పోషణ లేదుగా. మరి మీలాంటి కళాభిమాను లాదరించకపోతే మాబోటివాళ్లు బ్రతికే దెలా చెప్పండి.

సూర్యం : కొత్త దేశకాల పరిస్థితులు తెలుసుకోవాలండి చక్రధరరావుగారు. ఒకప్పుడెప్పుడో గొప్ప నటచక్రవర్తులయినంత మాత్రం చేత ఇప్పుడు మళ్ళీ గుమాస్తాపని చేసుకుంటే మీ ప్రిస్టేజీ కేమీ భంగకరంకాదు. ఇట్లా ఒకరిమీద ఆధారపడి వారికి బరువు కలిగించడం అట్టే మంచి పనికాదు. ఇప్పటికైనా మించిపోయిందేమీలేదు. ఎక్కడో ఒకచోట గుమాస్తాపని చేసుకోవడం చాలా మంచిది.

చక్ర : పోనీలెండి. మీ అన్నయ్యగారు వచ్చాకే వస్తాలెండి. మీతో నాకెందుకు? (వెనక్కు తిరిగాడు)

సూర్యం: అంతేగాని యీ ముష్టి మానవంటారు.

చక్ర : (చరున వెనక్కు తిరిగి) ఇది ముష్టి అంటారా?

సూర్యం : మరే మంటారు? పసిహారణాలముష్టి అంటారు. అందులోను ఘరానాముష్టి అంటారు. కళలపేరిట బురఖాలోపలి ముష్టి అంటారు. ఈవిధంగా కళలకికూడా అపచారం చెయ్యడం మీబోటి కళాకారులకు మంచి పనికాదంటాను. వెళ్ళండి.

చక్ర : సరే వెడతానుబాబూ. (స్టేజీ చివరకంటా వెడతాడు)

సూర్యం : చక్రధరరావుగారూ!

చక్ర : ఏంబాబూ! (అంటూ ఆశగా వెనక్కు తిరిగాడు)

సూర్యం : మీకో సలహాయిస్తాను. అలా చేస్తారూ?

చంద్రం : (తల పైకెత్తకుండానే) ఇందాకట్నుంచీ యిచ్చింది చాలకా అన్నాయ్.

సూర్యం : (చంద్రంవంక తిరిగి) నువ్వు నోర్మూయ్యి. ఏమండీ చక్రధరరావుగారూ!

చక్ర : ఏమిటి బాబూ?

సూర్యం : అహా! ఏమీ లేదు. మీ బాధకోసమే చెబుతూంట. నావల్ల ఏమీ పడేదికాదు.

చక్ర : చెప్పండిబాబూ! 'వినదగు నెవ్వరుచెప్పిన' అన్నారుగా.

చంద్రం : (చటుక్కున చక్రధరరావువంక తిరిగి) 'వినినంతనె వేగపడక వివరింపదగున్' అన్నాడండోయి ఆ పక్కనే. జాగ్రత్తబాబూ!

సూర్యం : (కోపంగా) నిన్ను నోర్మూయ్యమన్నాను.

చంద్రం : నాకెందుకు? ఇంతవరకు మీరు మాట్లాడు తున్నదానిలో నా పజిలుకి పనికొచ్చేది ఒక్క ముక్కలేదు. (యథాప్రకారం కూర్చుంటాడు.)

సూర్యం : ఏమీలేదు చక్రధరరావుగారూ! నేను ఒక నాటకం వ్రాశాను. అది వచ్చే నెలలో మన కలెక్టరుగారు మన గ్రామంలో ఆడించడానికి ప్లాను కున్నారు. అందులో మీరుగనుక వేషం వేస్తానూ అంటే...

చక్ర : ఎందుకు వద్దంటాను బాబూ! ఈవిధంగా మీరు యేదో కొత్త ముట్టజెప్పదలచుకున్నప్పుడు మీ మాట కాదంటానా?

సూర్యం : అక్కడే పొరబడ్డారు. కలెక్టరుగారు ఆడిస్తున్నారూ అంటే కేవలం కళాభిమానంతోనే. అందుచేత ఎవ్వరికీ డబ్బు యివ్వరు. యాక్టర్లందరు ఫ్రీగానే వేషాలు వెయ్యడం. ఇంక పోతే మాకు లబ్ధి ఏమిటయ్యా అంటారేమో? అనాయాసంగా కలెక్టరుగారి ప్రాపకం మీకు లభించడం ఒకటి. రెండవది యీ నాటకంద్వారా పాతబడిపోయిన మీ గౌరవ మర్యాదలు మరల నిలకొల్పబడడం, ఆ గౌరవ మర్యాదల ద్వారా నాటకరంగంలో మీ పేరు తిరిగి ప్రతిష్ఠించబడడం...

చక్ర : అర్థమైందిబాబూ! ఇంక చెప్పక్కరలేదు. ఇదివరకు వచ్చిన గౌరవమర్యాదలు ఎందుకు పనికివచ్చాయి అంటే మీరు యిందాక చెప్పిన ఘరానా ముష్టికి పనికివచ్చాయి. ఇక యిప్పుడు

యీ నాటకంలో వేషంవెయ్యడంవల్ల వచ్చే గౌరవమర్యాదలు ఎందుకు పనికివస్తాయీ అంటే ఘరానా ముష్టికోయి నిజంగా ముష్టి... అంటే 'అమ్మగారి లోగిళ్లు ధర్మ లోగిళ్ళు' అంటూ ముష్టి యెత్తుకుందుకు పనికివస్తాయి. చాలు సూర్యంబాబూ! మీకూ మీ గౌరవ మర్యాదలకు ఒక్క నమస్కారం. ఆ గౌరవ మర్యాదలే నన్నీస్థితికి దెచ్చాయి. ఆ గౌరవ మర్యాదలే సుఖంగా చేసుకునే గుమాస్తాపనికి ఆటంకం కలిగించాయి. ఆగౌరవ మర్యాదలే మీయింటికి మీరనుకున్న ఘరానా ముష్టికోసం త్రిప్పుతున్నాయి. గౌరవ మర్యాదల చాటున ఎంత కుళ్ళు ఉందో యీ నాడు అర్థమైంది. గౌరవ మర్యాదల పేరిట యెన్ని జీవితాలు నలుగురికీ ముఖంచూపించలేక నాశన మవుతున్నాయో అర్థంచేసుకున్నాను. వద్దు బాబూ! మీనాటకంలో వేషం గౌరవమర్యాదలకోసం ఆశపడే మరో నూతన వ్యక్తికి యివ్వండి బాబూ! (వెడుతున్నాడు.)

సూర్యం (చక్రధరరావు వంక చూస్తూ) ఆవేశాలు యెక్కువే......

చక్ర: (చటుక్కున వెనక్కు తిరిగి) అంటే మీ ఉద్దేశం చేతగానివాడికే ఆవేశాలు యెక్కువని కూడా అనుకుంటాను. ఆవేదనలు అధికమైతే ఆవేశాలుగా రూపొందుతాయని, ఆవేశంలో వ్యక్తి తన శరీరాన్ని తాను మరిచిపోతాడని చివరకు ఆత్మహత్య చేసుకుందుకు కూడా వెనుదియ్యడని గుర్తుంచుకో సూర్యం బాబూ. (వెడుతూంటాడు.)

సూర్యం: కొంపదీసి యిప్పుడు మీరు అనవసరంగా ఆత్మహత్యచేసుకు పోరు గనుక......

చంద్రం: (దృష్టి తిప్పకుండానే) ఏం? ఒక వేళ అలా ఆయన ఆత్మహత్య చేసుకుంటే ఆ కేసు నీపీక పట్టుకుంటుందని భయంగా ఉందా అన్నాయ్.

సూర్యం: నువ్వు నోర్మూయ్యి తమ్మాయ్.

చక్ర: ఆత్మహత్య చేసుకునేవాణ్ణయితే యెప్పుడో చేసుకుందును. దానికీ గుండెదిటవు కావాలి. ఒక వేళ చేసుకున్నా ఏడ్చేవారూ లేరు. లోకానికి లోటురాదు. వస్తా సూర్యంబాబూ!

సూర్యం: మళ్ళీ రావడం యెందుకు?

చక్ర: మీ అన్నయ్యగారిని చూడడానికి.

సూర్యం: ఆయన చెప్పేది నేను చెప్పిన సమాధానమే.

చక్ర: సరే బాబూ శలవు. (వెడుతూంటాడు.)

సావిత్రి: (లోపలినుంచివచ్చి) ఆగండి చక్రధరరావుగారూ! వారి మాటలకేంగాని మీరు కాస్సేపు ఆగిరండి. వారు వస్తారు. తోచినది యిస్తారు.

చక్ర: అల్లాగే నమ్మా.

సావిత్రి: ఏదో చిన్నతనం. మా సూర్యానికి ఆవేశం యెక్కువ. ఏవేవో అన్నాడు. ఏమీ అనుకోకండి.

చక్ర: అమ్మా! అంతమాత్రానికే కంగారు పడతానా?

సావిత్రి: వెళ్ళిరండి.

చక్ర: (వెడతాడు)

సావిత్రి: రఘూ! ఈ సారి ఆ పేపరు యిచ్చేసి రావొచ్చు.

రఘు: అలాగే నమ్మా. (అని వీధివైపునకు వెడుతూంటాడు)

సావిత్రి: (లోనికి వెడుతూ చటుక్కున తిరిగి) రఘూ!

రఘు: (వెనక్కు తిరిగి) ఏమమ్మా!

సావిత్రి: ఆ పేపరులో ఏముందో మళ్ళీ ఒక్కసారి చదువు.

రఘు: ఇందాక బాబాయి ఆ వచ్చిన ఆయనకి చదివి వినిపించమంటే వినిపించాను. ఇప్పుడెవరికి చదివి వినిపించాలి.

సావిత్రి: ఎవరికా?

సూర్యం: నాకు. (అని కోపంగా వదినవంక చూస్తూంటాడు)

సావిత్రి: (చిరునవ్వుతో సూర్యాన్ని చూస్తూ) అవును. బాబాయ్‌కి.

రఘు: (బాబాయి దగ్గరకువెళ్ళి చదువుతాడు) హిందూ దేశంలో సంపాదించే దొక్కడైతే వాడిమీద పడి తినేవాళ్ళు పదిమంది.

సావిత్రి: మనయింట్లో మొత్తం యెందరున్నారు రఘూ?

రఘు: (వేళ్ళుమడిచి లెక్కపెడుతూ) సూర్యం బాబాయ్, చంద్రంబాబాయ్, తాత, నువ్వు, నేను, అమ్మ, నాన్న, మొత్తం ఏడుగురం.

సావిత్రి: ఇందులో సంపాదించే దెవరు?

రఘు: నాన్నగారొక్కరేగా.

సావిత్రి: సూర్యం! ఇప్పటికైనా అర్థంఅయిందా!.. పాపం ఆ చక్రధరరావుగారికి పాఠంచెప్పి పంపించేశావు. నీ సంగతి యేకొద్దయినా ఆలోచించుకున్నావా? నీ మట్టుకు నువ్వు యింటర్ ఫేలయి యింట్లో కూర్చున్నావు. నీ తమ్ముడు

యస్. యస్. యల్. సి. ప్యాసయి యింట్లో కూర్చున్నాడు. చక్రధరరావుగారికి మీకూ తేడా యేమిటి? ఆయనవచ్చి పబ్లిక్ గాఅడిగాడు. మీారు ఘరానాగానే అన్నగారనే బంధుత్వం చాటున తినేవార్ని లెక్కలో కొస్తున్నారు. ఆయన మనసు యెంత నొచ్చుకుందో! నోటితో లేదనడం కన్న చేతితో లేదనడం మనహిందూ దేశ సంప్రదాయం ... (లోనికి వెళ్ళబోయి మళ్ళీ వెనక్కు తిరిగి) మీరంతా దేశకాల పరిస్థితులను గుర్తించే నడుస్తున్నారా? ఒకరి తప్పులు యెంచేముందు మనతప్పులు మనం గుర్తించుకోకపోతే యెట్లా బాబూ సూర్యం!

సూర్య : అదికాదు వదినా?.........

సావిత్రి : ఏదికాదు బాబూ! గుమ్మంలోకి అన్నయ్య కోపంవచ్చిన పెద్దమనిషిని పొమ్మనడం నీకొక్కటే మంచిపనికాదు బాబూ! అన్నయ్య చెప్తే వుంటారు సమాధానం. నీకెందుకు? దేవుడు వర మిచ్చినా పూజారి వర మివ్వడురా—అన్న మాటెత నీపట్ల యెందుకు స్థిరం చేసుకుం టావు...వస్తా...లోపల వంట ఏమవుతోందో (లోనికి వెడుతుంది.)

(క్షణం నిశ్శబ్దం)

(చంద్రం మళ్ళీ యథాప్రకారం కుర్చీలో కూర్చుని పజిలులో లీనమవుతుంటాడు.)

(సూర్యం పచార్లుచేసి పడకకుర్చీలో తాపీగా పడుకుంటాడు.)

రఘు : సూర్యం బాబాయ్! ఈ పేపరు యిచ్చేసి రమ్మంటావా? ఇంకెవరికేనా చదివి వినిపిం చాలా?

సూర్యం : (కోపంగా చూస్తాడు, మాట్లాడడు.)

రఘు : (పిల్లిలా చంద్రందగ్గరకువెళ్ళి) ఏం చంద్రం బాబాయి! సూర్యంబాబాయి ఎందుకో కోపంగా ఉన్నాడుగాని యీ పేపరు యిచ్చేసి రమ్మం టావా? ఇంకెవరికేనా చదివి వినిపించాలా?

చంద్రం : (కోపంగానే చూస్తాడు, మాట్లాడడు.)

రఘు : అందరికీ ఒక్కసారే కోపాలువస్తే యెట్లా బాబాయ్?

చంద్రం : లేదులే యిచ్చేసిరా.

రఘు : అల్లా చెప్పావు బాగుంది. (వీధిలోనికి వెడతాడు.)

సూర్యం : (తల తిప్పకుండానే) ఒరేయ్ చంద్రం!

చంద్రం : (మాట్లాడడు.)

సూర్యం : (చంద్రంవంక తిరిగి) మాట్లాడవేరా?

చంద్రం : వినబడుతోందిగా.

సూర్యం : నేను చెప్పింది యథార్థం అని ఒప్పు కుంటావా యీ సారి అయినా.

చంద్రం : అన్నయ్యా! నీకు కోపంవస్తే నేను చెప్ప లేనుగాని అనవసరంగా వదినతో వాదం వేసు కుంటావు.

సూర్యం : వాదన కాదుగాని ఒరేయ్ చంద్రం! ఆ పేపరులో ఉన్న విషయానికి మనకి సంబంధం ఉందంటావా?

చంద్రం : ఉండకపోవడం యేమిటి? మనంమాత్రం అన్నయ్యమీద పడి తినడంలేదు గనుకనా!

సూర్యం : అదే నన్నమాట, మనం కుటుంబం లెక్కలో కొస్తాం.

చంద్రం : ఏ లెక్కలో కొచ్చినా అన్నయ్యమీద పడి తింటున్నామంటావా లేదా?

సూర్యం : అది కాదురా మనం తినడం, పరాయివాడు తినడం ఒకటే నంటావా?

చంద్రం ; మరి లేకపోతే తేడా యేమిటి?

సూర్యం : ఏమిటా? రేపు పొద్దున్న మనం సంపా దించడం మొదలుపెడితే కుటుంబంలో పెడతావంటావా? పెట్టవంటావా?

చంద్రం : ఆ విషయం భగవంతుడికే తెలవాలి.

సూర్యం : చచ్చాంపో.

చంద్రం: కాకపోతే యేమిటన్నాయ్. ఎప్పుడో సంపా దిస్తావో లేదో. ప్రస్తుతం అన్నయ్యమీద పడి తింటున్నాము. వదిన మంచిది గనుక నువ్వ న్నన్నా పడుతుపోతోంది. ఏదో ఒకటి అంటావు. చక్కగా చెబుతుంది సమాధానం వదిన.

సూర్యం : అవును. ఆ మాటా నిజమే. సంపాదనలేని నా బోటిగాడు అనగి ఉండడంకూడా ఒక న్యాయమే అనుకుంటాను. ఎందుకూ...రేపు నాటకం ఆడించేవరకు అస లెవరితోనూ మాట్లాడ దలచుకోలేదు. తెలిసిందా...ఎందుచేత?

చంద్రం : ఏమో! నాకేం తెలుసు.

సూర్యం : చచ్చాంపో. చేతిలో దమ్మిడీ లేదు గనుక...

చంద్రం: కాబట్టి జీవించాలంటే ... ఏది ముఖ్యం అంటావు.

సూర్యం: డబ్బే ముఖ్యం అంటానురా.

చంద్రం: మరి యిందాక నీతి అని బాబాయితోను నాతోను వాదించావుగా.

సూర్యం: ఇప్పుడు తగ్గాను. తగ్గానురా తమ్ముడూ తగ్గాను.

(మూర్తిగారు వస్తారు)

మూర్తి: ఒరేయ్ సూర్యం! శేఖర యింకా రాలేదూ?
(సూర్యం చంద్రం ఇద్దరూ లేచి నిలబడతారు గౌరవంగా)

సూర్యం: రండి మాష్టారూ! ఇంకా రాలేదండి మా అన్నయ్య.

చంద్రం: (భయంగా పజిలు కాగితాలు దాచేస్తాడు.)

మూర్తి: స్కూలు వదిలిపెట్టి చాలా సేపయింది.

సూర్యం: అలా బజారుకు వెళ్ళాడేమోనండి. కూర్చోండి.
(రఘు మళ్ళీ పేపరుతో పరుగెత్తుకుంటూ వచ్చాడు.)

రఘు: బాబాయ్! పేపరు మళ్ళీ తెచ్చాను బాబాయ్!

సూర్యం: ఎందుకు?

రఘు: ఈ ముసలిమాష్టారికికూడా చదివి వినిపించమంటా వేమోనని.
(లోపల సావిత్రి) రఘూ!

రఘు: అమ్మా (అంటూ లోపలికి వెళతాడు)

మూర్తి: (కూర్చుంటూ) ఏమిటిరా ఆ పేపరు సూర్యం!

సూర్యం: ఆ! ఏమీ లేదండి. అందులో యేదో మంచి కథ పడిందండి. అది మాకందరికీ చదివి వినిపించాడు. ఇందాక ఆయనెవరో వచ్చారు. ఆయనకి కూడా చదివి వినిపించమన్నాం. వినిపించాడు. మీకుకూడా చదివి వినిపించమంటా వేమోనని...

మూర్తి: ఆహా! నే నేమనుకున్నానంటే నేను తెచ్చిన పేపరే వాడూ తెచ్చాడేమోనని. నేనొక పేపరు తెచ్చానులే మీ కిద్దామని. (పేపరు తీసి) చూడండీ వ్యాసం 'హిందూ దేశంలో సంపాదించే దొకడైతే వాడిమీద పడి తినే వాళ్ళు పదిమంది' చదవండిరా ఒకసారి వ్యాసం (పేపరు యిచ్చి). ఆ సరిగాని వదిన యేదీ?

సూర్యం: వదినా! (లోపలి ప్రక్కకు తిరిగి)

సావిత్రి: వస్తున్నా బాబూ! (వస్తుంది)

మూర్తి: అమ్మా! శేఖర వచ్చాడేమోనని వచ్చా! నేను వెళ్ళి డి. ఇ. ఓ. గారితో మాట్లాడా! ఏవేవో సంఘర్షణలు జరిగా యనుకో. మాస్టరు కొడుకులకు కూడా ట్రైనింగుసీట్లు యివ్వకపోతే యెట్లా? అని దెబ్బలాడా. ఊ...తప్పకుండా యిద్దరికీ రెండు సీట్లు వచ్చే యేర్పాటు చేసివచ్చా. శేఖర రాగానే చెప్ప ...ఒరెయ్ సూర్యం! మీరిద్దరు చెరో అప్లికేషను వ్రాసి డి. ఇ. ఒ. గారికి పంపించండి.
(ఇద్దరూ మాట్లాడరు)
ఏమిరా మాట్లాడరు?...ఇంకా మాసరీ చెయ్య కూడదనే పంతంమీదే ఉన్నారా యేమిటిరా? ......ఏవమ్మా సావిత్రీ!

సావిత్రి: (చిరునవ్వుతో) ఏమో! మీ శిష్యులే అడగండి.

మూర్తి: ఏమిరా......మంచి పని కాదబ్బాయి మీ అన్నయ్య ఒక్కడూ లేచింది మొదలుకొని పడుకో బోయేదాకా రెక్కలు ముక్కలు చేసుకుంటూంటే హాయిగా తింటూ యింట్లో కూర్చోవటం అట్టే మంచిపనికాదు. ఎందుకు చెప్పానో వినండి. మీ నాన్నగారు నేను ఒక బళ్ళోనే చేశాం మాష్టరీ ... ఆయన మీ గుండె అభిమానం చొప్పున చెబుతున్నా. ఇంకా మీ అన్నయ్య మంచివాడు కాబట్టి యింతవరకేనా మీకు చదువులు చెప్పించాడు. ...కానీ మాష్టరీ కాకపోతే మరో గుమాస్తా పనయినా చేసి మీ పొట్టలకి మీరు తెచ్చుకోవటం మంచిదబ్బాయి.

సావిత్రి: ఈ మాష్టరీలవల్ల, గుమాస్తా పనులవల్ల బ్రతకటం కష్టం. ఒక్కసారిగా యే బాపతు డబ్బైనా వచ్చి పడాలంటారు మా మరుదు లిద్దరూ మాష్టారూ! పెద్దాయన నాటకాలాడి రెండువేలు మూట కడతానంటాడు.

సూర్యం: (సిగ్గుపడి చెప్పొద్దని మాష్టారి వెనకనుంచి వదినకి సైగ చేశాడు.)

సావిత్రి: సరే, యిక చిన్నాయన పజిలు పంపి అమాంతంగా యాభైవేలు మూట కడతానంటాడు.

చంద్రం: (కంగారుగా) వట్టిదే మాష్టారూ! అసలు ఆ పజిల్సు గొడవేమిటో నాకు తెలియదు మాష్టారూ!

మూర్తి: బాబూ! మీకింకా చిన్నతనం. దూరపు కొండలు నునుపు అని పరుగులెత్తటం మంచి పనికాదు. మెరకనీరు పల్లానికే, పల్లం నీరు పల్లానికే అని అలాటివన్నీ, ఉన్నవాళ్ళకే గాని మనకేం రావు. ఈ పజిల్సు నాటకాలు కూడెడతాయా బాబూ! ఉన్నదానిలో నే తృప్తి పడాలి. ఉద్యోగం పురుషలక్షణం అన్నాడు. మీ అన్నయ్య వదిన మంచివాళ్ళుగనక యీ సంసారాన్ని యీదుకొస్తున్నారుగాని నాబోటి వాడయితేనా......అడిగావా......
పిచ్చి పిచ్చి వేషాలు వెయ్యక ఆ ట్రయినింగుకు అప్లికేషన్లు పెట్టండి. లేదంటారా ఏ గుమాస్తాపనో చూచుకోండి. అంతే గాని గోళ్ళు గిల్లుకుంటూ యింట్లో కూర్చోవటం అట్టే మంచిపనికాదు. వాడు మీకోసం యెన్ని బాధలుపడుతున్నాడో నాకు తెలుసు. అప్పుడప్పుడు మీ గొడవ వచ్చి అడిగితే 'పోనీలెండి మాష్టారూ! చిన్నతనంలోనే తల్లిదండ్రి పోయారు. నేను చూడకపోతే యెవరు చూస్తారు మాష్టారూ! వాళ్ళ

ముద్దు ముచ్చటలు మాత్రం తీరడం ఎట్లా? వాళ్ళకి తోచినప్పుడు వాళ్ళే చేస్తారు ఉద్యోగం. మీరుకూడా సంపాదిస్తేనే గాని వల్లగాదురా అని వాళ్ళతో నేను చెప్పలేను మాస్టారూ!' అంటాడు కేశవ. ఆ మాటతో నాకు కళ్ళు నీళ్ళు తిరుగుతాయి. ఇంక మాట్లాడలేను. అందుచేత మీరుకూడా ఆలోచించండి బాబూ! తొందరలో అన్నయ్య భారం తగ్గించడానికి ప్రయత్నం చెయ్యండి... లేకపోతే... వస్తానమ్మా. అబ్బాయి వచ్చాక చెప్పు.

(వెళ్ళబోయి వెనక్కు తిరిగి)

అయితే సౌభాగ్యం మొగుడిదగ్గర్నుంచి ఏమీ ఉత్తరాలు రావటంలేదు కదమ్మా సావిత్రీ!

సావిత్రి : లేదండి.

మూర్తి : గోరు చుట్టుమీద రోకలి పోటన్నట్లు బాగానే ఉంది...దాని కాపరం అదిచేసుకుంటూంటే అబ్బాయి కంత కష్టంలేక పోను... చిన్నతనమైనా భగవంతుడా ఓర్పు యిచ్చాడు గనుక యీడుకొస్తున్నాడు కేశవ యింత సంసారాన్ని...ఏ పొచ్చినా మన మధ్యతరగతి కుటుంబాలకే నమ్మా... ఇంతకీ దాని పరిస్థితి బాగుండాలే దనుకోవాలి. వస్తానమ్మా. (వెళ్ళి పోతాడు)

సావిత్రి : (లోనికి వెళుతుంది)

(క్షణం నిశ్శబ్దం)

చంద్రం : ఇంక యీ పజిలు పూర్తి చేసేస్తానన్నాయ్.

సూర్యం : ఏంటని పూర్తిచేస్తావు?

చంద్రం : ఏంట నేవిటి? మనిషిగా జీవించాలి అంటే డబ్బే ముఖ్యం అని.

సూర్యం : అబ్బాయి నేనొకటి చెబుతా విను. అనేక సమస్యలలో చిక్కుకుంటూ ఉంటాము. కొన్ని సమస్యలలో చిక్కుకున్నప్పుడు డబ్బు ప్రధానమని తోస్తుంది. కొన్ని సమస్యలలో చిక్కుకున్నప్పుడు నీతి ప్రధానమని తోస్తుంది. అందుచేత నిర్ధారణగా ఏదీ చెప్పలేమురా అబ్బాయి.

గోపా : (కంగారుగా వీధిలో నుంచి వస్తూ) ఒరేయ్ చంద్రం! నీ పజిలు సగం చెబుతాను. రాసుకోరా!

చంద్రం : (కంగారుగా) ఏవిటి బాబాయ్! ఎట్లా తెలిసింది బాబాయ్.

గోపా : తెలిసింది బాబాయ్.

చంద్రం : యస్. యస్. యల్. సి. పేపరు ఔటయినట్టు ఈ పజిలుకూడా యెక్కడైనా ఔటయిందా యేవిటి బాబాయ్. ఏ సైలుపెట్టెల మీదైనా అంటించారా?

గోపా : నీ మొఖం. రాసుకోరా అంటూంటే.

చంద్రం : చెప్పు బాబాయ్. జీవించాలంటే...అహా! మనిషిగా జీవించాలీ అంటే......

గోపాల : మానాభిమానాలు వదిలెయ్యాలిరా.

సూర్యం : దచ్చాం పో.

చంద్రం : అదేవిటి బాబాయ్.

గోపాల : అదేవి టేవిటెరా నీ తలకాయి. ఈరోజుల్లో మనిషిగా జీవించాలి అంటే మానాభిమానాలు వదిలెయ్యాలి. మానాభిమానాలున్నవాడు జీవించలేడురా.

చంద్రం : మరి వీడు నీతా డబ్బా అని అడుగుతాడు.

గోపాల : వీడికాడు వాడికేం తెలియదంటాను.

చంద్రం : నీకెట్లా తెలిసింది బాబాయ్!

గోపాల: అక్కడేఉంది కీలకం. అన్వేషణచేసి సత్యాన్ని తెలుసుకున్నానురా నా తాలూకు అంత ఆస్తి బుర్రగోరుగను అయిపోయినా నేనింకా మొద్దులా బ్రతుకున్నాను అంటే ఏవిటన్నమాట. నాకు మానాభిమానాలు లేవన్న మాట.

చంద్రం: అదికాదు బాబాయ్. ఇన్నాళ్ళనుంచీ తెలియని సత్యం యీనాడు యెట్లా కనిపెట్టగలిగావా అని.

గోపాల: అదేరా బాబాయ్ అదే చెబుతూంట. ఇక్కడి నుంచి సరాసరి జళ్ళాను ఆ వెధవ దగ్గరకి నాలుగణాలు యివ్వకపోతాడా అని. లేవు పొమ్మన్నాడు. మంచిచెడ్డ అక్కరలే. వెధవ వెధవాని...ఉద్యోగం కోసం నా కాళ్ళ చుట్టు తిరిగితే పోనీలే అని ఆ సెక్రటరీతో చెప్పి వేయించాను. వెధవ నాలుగణాలకోసం మొగం చూసుకున్నాడూ అంటే...

చంద్రం: ఎవడా వెధవ బాబాయ్?

సూర్యం: ఎవడైతేం పెద్దా నాలుగణాలు లేవన్నాక.

గోపాల: బాగా చెప్పావురా సూర్యం. నేను బ్రతికున్నరోజుల్లో వచ్చి అడిగిన వాణ్ణి వట్టిచేతులతో పంపానా యెప్పుడైనా?

సూర్యం: అందుకే యిప్పుడిల్లా తయారయ్యావు బాబాయ్. ధర్మానికి కూడా కొంచెం మంచి చెడ్డ ఉండాలంటాను. ఇందాక ఆ వక్రేశ్వర రావుగాడొస్తే పొమ్మన్నానని వదినకు కోపం వచ్చింది. ఏం పొయ్యేకాలం చెప్పు బాబాయ్ వాడికి, పోతులాగున్నాడు.

చంద్రం: అన్నాయ్! ఆ మాటకొస్తే ఇప్పుడు నువ్వు నాటకం ఫెయిర్ వ్రాయడానికి తెల్లకాగితాల కోసం అర్ధరూపాయి, నేను పజిలు పంపడం కోసం రూపాయి ఖర్చుపెడుతున్నామంటే

ఏమిటి చెప్పు మనం పోతుల్లాగ లేం గనకనా... అవసరా లన్నాయ్. అవసరాలు.

సూర్యం: అదేవన్నమాట. రేపు డబ్బురాగానే పారేస్తాం. ఈ నాటకంలో కనీసం రెండువేలు కళ్ళచూస్తాను. వెంటనే గిరగిరా త్రిప్పి ఎవళ్ళది వాళ్ళ మొఖాన్ని పారేద్దాం? పారేస్తాం... అయితేం యిప్పుడు మాత్రం వెల్ల కాగితాలు కొనడానికి మనీ వాంటెంగ్. ఓన్లీ హాఫ్ ఏ రూపీ.. అంటే ఒక్క ఎనిమిదణాలు.

చంద్రం: అంతేలే. యీదఫా ఆ భేడుకొంపలు వాడి దయవల్ల అన్నయ్య రూపాయిచ్చి యీపజిలు పంపవేమంటూ వచ్చి నెగ్గవేం అంటూవస్తే... వస్తే ఏమిటిలే... పంపవేం అంటూ ఉంటే నెగ్గావన్నమాటే... వెంటనే ఈ జుట్టు ఆ వెంకన్న బాబుకిస్తానని మొక్కుకున్నానుగా... వెధవ జుట్టుపోతే లెక్కేమిటి?... ఏభై వేలు... ఒకటా రెండా... ఇల్లాటి చక్రధరంపుల్ని వెయ్యి మందిని పోషిస్తాను. ఇల్లాంటి బాబాయిల ఆస్తి అల్లా హరించిపోతూంటే పోనిస్తావా? అమాంతంగా అడ్డంపడనూ.

సూర్యం : ఏమిటి నువ్వా?

చంద్రం : అదేమిటన్నాయ్! నువ్వుకూడా అల్లాగే అనేశావు.

సూర్యం : ఇదివర కెవరేనా అన్నారా?

చంద్రం : అక్క అందనుకో. అదిగాక ఒకొక్కప్పుడు నేనే అనుకునేవాణ్ని.

సూర్యం : ఏమని?

చంద్రం : ఏమనా? ఖర్మంచాలక యాభైవేలు నాకు వస్తే అప్పుడు నామనస్సు ఎట్లా ఉంటుంది? అందులోది ఒక్క రూపాయయినా తీసి ఎవరికేనా యివ్వడానికి చేతులు వస్తాయా?-అనుకునేవాణ్ని.

సూర్యం : మరి యింకేంరా అబ్బాయ్. సత్యాన్ని దాచకుండా చెప్పావుగా.

చంద్రం: అదేమిటన్నాయ్! ఈ నా సత్యంతో పాటు ఇంకో సత్యాన్నికూడా కనిపెట్టానన్నాయ్.

సూర్యం : అదేమిటి?

చంద్రం : ఏమిటా? నా యాభైవేలలోంచి ఒక్క రూపాయయినా ఎవరికీ యివ్వడానికి నాకు చేతులెట్లా రావో అట్లాగే, నీ నాటకం తాలూకు రెండువేలలోంచి, బాబాయికంట్రాక్టు తాలూకు మూడువేలలోంచి ఒక్క దమ్మిడీ కూడా ఇతరుల కివ్వడానికి మీమీ తాలూకు ప్రాణాలు అంగీకరించలేవనే సత్యాన్నికూడా గ్రహించగలిగాను.

సూర్యం : చచ్చాం పో.

గోపాల : కేశవ యింకా రాలేదు. పొద్దుపోతోంది.

సూర్యం : (పచార్లుచేస్తూ) ఏది ఏమయినా మనం యిద్దరం సంపాదించకుండా పోసుకుపోతుల్లా యీ యింట్లో పడి తింటున్నామని వదినకి చాలా కోపంగా ఉందని ఒప్పుకుంటావా ఒప్పుకోవారా చంద్రం?

సావిత్రి : (జంతికెలు మూడు ప్లేటులలో పెట్టి తెస్తూ) పాపం యిటు చెల్లెలితోను అటు వచ్చిన పెద్దమనిషితోను దెబ్బలాడి సూర్యం బాబూ! పజిల్సుతో దెబ్బలాడి చంద్రంబాబూ! అలిసిపోయారు. కొంచెం టిఫెను చెయ్యండి (ఇద్దరికి చెరియొక ప్లేటూ యిచ్చి మూడవది మావ గారికిస్తూ) తీసుకోండి మావగారూ!

చంద్రం : ఇవెక్కడివి వదినా!

సావిత్రి : రేపు రఘు పుట్టినరోజు కదూ. నా జేడు స్తూంటే వండాను బాబూ!

సూర్యం : ఇదేం పిండివంట వదినా! రఘు పుట్టిన రోజుకు ఏలడ్డూలో ఏ జిలేబీయో వండాలి గాని...

సావిత్రి : నువ్వు రేపునాటకం ఆడి రెండు వేలు యింటికి తెచ్చాక లడ్డూలు జిలేబీలు చేసి నీకు పెడతాను. ప్రస్తుతం అన్నయ్య సంపాదనలో ఈ జంతికలే వండగలిగాను... బాబూ సూర్యం ...నీకు ఆవేశం ఎక్కువ. ముందు ఉన్నదానితో తృప్తిపడటం నేర్చుకునేవరకు నీ మనస్సుకు శాంతి ఉండదు. నీ ఆవేశానికి అంతూ ఉండదు. అన్నయ్య వచ్చే వేళయింది. వచ్చే సరికి ఏవో గొడవలు తెచ్చిపెట్టక టిఫెనుచేసి మాట్లాడక కూర్చోండి... సౌభాగ్యం! మీ అన్నకి తమ్ముడికి బాబాయికి కావలసిన మంచి నీళ్ళు తెచ్చి యియ్యమ్మా. (అంటూ తిరిగి వెడుతుంది.)

సౌభాగ్యం : (మంచినీళ్ళగ్లాసులు తెచ్చి ముగ్గురి దగ్గరా పెట్టి లోనికి వెడుతుంది.)

సావిత్రి : తింటూ ఉండండి. ఇంతట్లో మేము చెరువుకి వెళ్ళి నీళ్ళు తెచ్చుకుంటాము. (బిందెతో వచ్చింది. చంద్రం తినకుండా పజిలువంక చూస్తున్నాడు.)

సావిత్రి : చంద్రం బాబూ! ఆ పజిలు నేనేనా పూర్తిచేసి పెడతాను ఆ జంతికెలు తిను.

(సౌభాగ్యం, సావిత్రి బిందెలతో బయటికి వెడతారు.)

(తెర.) (సశేషం)

నన్నెచోడుని దేశి ప్రయోగ వైచిత్రి

శ్రీమతి వి. రాజేశ్వరి

ఆంధ్ర సారస్వతమున మార్గ దేశి కవిత్వ విభాగమును గావించిన ప్రథమకవి నన్నెచోడుడేయని పలువురు విమర్శకుల యభిప్రాయము. కాని ఆ విభాగము నన్నెచోడుని కాలము నాటికే సారస్వత రంగమునందు ప్రచారములో నున్నది. దానికి ప్రబలమగు ఆధారము ఆకాలము నాటిదేయగు భీమయపండని (క్రీ శ. 1145) శాసనము1. ఈ శాసనమునందు భీమయపండడు, 'దేశిమార్గములు మట్టుపడం గవనంబులొప్ప వాద్యుల క్రియఁజెప్ప నేర్చిన' వాడని వ్రాయబడినది. అగ్యుల క్రియ యనుటలో భీమయపండనికి పూర్వమునుండియు కవిత్వమునందీ విభేదము పాటింపబడుచుండెనని స్పష్టపడుచున్నది. కావున శాసనాదులలో నీ కాలము నాటికే వాడుకలోనున్న కవిత్వపరమగు నీ మార్గ దేశి విభాగమును కవిరాజశిఖామణి ప్రప్రథమముగ గ్రంథస్థము గావించియుండవచ్చును. అటుచో కవిత్వపరముగ ఈ మార్గదేశి శబ్దములు వాడుటలో భీమయపండడు, నన్నెచోడులయొక్కయు, తత్పూర్వులయొక్కయు హృదయము మేమైయుండునని యూహించుటకు పూర్వాలంకారిక గ్రంథములందుగాని, గీర్వాణాంధ్ర సాహిత్యగ్రంథములందుగాని ప్రబలాధారము లేవియు లభ్యము గానందున నృత్య నృత్త సంగీతపరముగ వానికిగల ప్రసిద్ధార్థమును కవిత్వపరముగ సమన్వయించి చూచినచో తత్స్వరూపము కొంతవరకు తేటపడుటకవకాశము కనిపించుచున్నది.

"సంగీత దర్పణమునందు:

"గీతం వాద్యం నర్తనం చ త్రయం సంగీతముచ్యతే,
మార్గదేశి విభాగేన సంగీతం ద్వివిధం మతం.
ద్రుహిణేన యదన్విష్టం యదుక్తం భరతేన చ,
మహాదేవస్య పురతః స మార్గాఖ్యం విముక్తిదం.
తత్తద్దేశస్థయా రీత్యా యత్స్యాల్లోకానురంజనం,
దేశే దేశే తు సంగీతం తద్దేశీత్యభిధీయతే."

అని వివరింపబడెను. పయిశ్లోకమునందు పేర్కొనబడిన గీత వాద్య నర్తనములు మూడును సంగీత సామ్రాజ్యమునందలి వస్తువులు. ఈ సంగీతమునవని మార్గ, దేశి విభేదముచే ద్వివిధము. బ్రహ్మచే నన్విష్టమై ఈశ్వరుని సమక్షమున భరత మునీంద్రునిచే చెప్పబడినదియు, విముక్తిద2 మైనదియు మార్గ; వివిధ దేశములందు తత్తద్దేశస్థమైన రీతులచే రంజింపజేయు సంగీతము దేశి.

సంగీత రత్నాకరమునందు:

"మార్గో దేశీతి తద్ద్వేధా తత్ర మార్గః స ఉచ్యతే,
యో మార్గితో విరించాద్యైః ప్రయుక్తో భరతాదిభిః.
దేశే దేశే జనానాం యద్రుచ్యా హృదయరంజకం,
గానం చ వాదనం నృత్తం తద్దేశీత్యభిధీయతే.
యేషాం శ్రుతి స్వరగ్రామజాత్యాది నియమో నహి,
నానాదేశ గతిచ్ఛాయా దేశీ రాగాస్తు తే మతాః.
కామచార ప్రవర్తిత్వం దేశీరాగస్య లక్షణం,
నియమేన సతి త్వత్ర మార్గత్వ మనులక్షితం."

అనికలదు. దీనిని బట్టి లక్షణకర్తలచే నియమింపబడిన లక్షణానుసారియగు శాస్త్రీయసంగీతము మార్గ అనియు, ఆయా దేశములందు తత్స్థానిక ప్రజల మనోభీష్టమును బట్టి యథేష్టముగను, జనరంజకముగను పాడబడు సంగీతము దేశియనియు స్పష్టమగుచున్నది.

వాల్మీకి రామాయణమున

"తత స్తు తౌ రామవచః ప్రచోదితా
వగాయతాం మార్గవిధాన సంపదా"

(రా. బా. 4-30)

అని రామవచన ప్రచోదితులై కుశలవులు రామకథను మార్గవిధమున పాడిరని చెప్పబడినది; అనగా కుశలవులు వాల్మీకి మునీంద్రునియొద్ద (శాస్త్ర సమ్మతముగ) శిక్షణము పొంది శాస్త్రీయముగు సంగీతములో రామాయణమును గానముచేయుటచేత అది మార్గమాయెనని పయిమార్గశబ్దమునకు అర్థము చెప్పవచ్చును.

---

(1) No 103, l. 1 Vol. VI శకవర్షము 1067 క్రీ॥ శ 1145 చేబ్రోలు, గుంటూరుజిల్లా.

తల(ం)పు సవర్థ భావమున
  దిగ్గత సూక్తులఁగూడ వర్ణనల్
గొలుసు గొనంగ వ్రావకులు
  గోరిన భంగివచ్చి మువ్వటఁగో
ములగతి దేశిమార్గములు
  మట్టుపడం గవనంబు లొప్ప వా
ద్యుల క్రియఁ జెప్ప నేర్చె నృప
  ధూర్జటి భీమయ పండ డిమ్మహిన్:

2 ఇట విముక్తి శబ్దమునకు విగళిత వేద్యాంతర మగు రసానందమని యర్థము.

ఇక నాట్య విషయమున మార్గ, దేశి విభాగ మెట్లున్నదో చూతము. ధనంజయుని దశరూపకమున

"అన్యద్భావాశ్రయం నృత్యం
నృత్తం తాళలయాశ్రయం,
ఆద్యం పదార్థాభినయో
మార్గో దేశీ తథాపరం."

అని భావాశ్రయమై పదార్థాభినయమైన నృత్యము మార్గమనియు, తాళలయాశ్రయమైన నృత్తము దేశీయమనియు వివరింపబడినది. ధనంజయు మార్గానుగామియైన విద్యానాథుడు తన ప్రతాపరుద్రీయమున:

నాట్యం రసాశ్రయం,
భావాశ్రయంతు నృత్యంస్యాత్
నృత్తం తాలలయాన్వితం."

అని చెప్పగా, తద్వ్యాఖ్యాత కుమారస్వామి నృత్యము మార్గమనియు, నృత్తము దేశీయమనియు ధనంజయుని మార్గములో వివరించియున్నాడు.

ఇక అలంకారశాస్త్రమునందు ఆయా దేశములందు ప్రసాద, మాధుర్యాది గుణబంధములనుబట్టి వైదర్భీ, పాంచాలీరీతు లేర్పడినవనియు, అందు వైదర్భీ, గౌడీరీతులు మార్గమనియు చెప్పబడెను.3 కాని యందు దేశికి చెందిన రీతులేవో వివరింపబడి యుండలేదు. బహుశః వైదర్భీరీతి మార్గమని చెప్పుటచే తదన్యము దేశియని వారిభావము కావచ్చునేమో! ఏమయినను ఆలంకారికుల మతమున మార్గదేశి స్వరూపము స్పష్టపడి యుండలేదు.

సంగీత, నాట్యములందు చెప్పబడిన మార్గ, దేశి విభాగములనుబట్టి శాస్త్రసమ్మతమై, ప్రాచీనాచార్యులచే నంగీకృతమై, పండితైకవేద్యమైయొప్పు ఉదాత్తమగు పద్ధతి మార్గమనియు, భిన్న దేశములందు ఆయా దేశీయుల యభిరుచినిబట్టి మార్పులకు లోనగుచు సుఖసాధ్యమై సర్వజనసుబోధకమై యొప్పునది దేశియనియు స్పష్టము. అదేరీతిని వానిని సాహిత్యపరముగా సమన్వయించి చూచినచో సంస్కృతభాష కాని, సంస్కృత సంప్రదాయసిద్ధముగ సంస్కరింపబడినభాష కాని మార్గ మనబడును. ఆ పద్ధతిలో వ్యాసాదులు రచించిన సంస్కృతరచనములును, ఆంధ్రమునందలి నన్నయాదుల కృతులును మార్గకవిత్వమునకు చెందును. పల్నాటి వీరచరిత్రాదులు దేశి రచనలు కాదగును.

దేశియనునది ముఖ్యముగా పదములకును, సంప్రదాయములకును, ఛందస్సునకును, ఇతివృత్తమునకును చెందినది. వర్ణనలనుగూడ నొకవిధముగ నందు చేర్చుకొనవచ్చును. కాని వర్ణనలు సాధారణముగా నితివృత్తముపై నాధారపడియుండును. ఇతివృత్తము దేశీయమైనచో తత్సంబంధమగు వర్ణనలును దేశీయములు కాక తప్పవు. పల్నాటి వీరచరిత్రములో బ్రహ్మనాయని కాని, మాంచాలను కాని వర్ణించునపుడును, పల్నాటిప్రాంతమును వర్ణించునపుడును అట ప్రతిబింబించునది దేశియే.

పయిరీతిని పల్నాటి వీర చరిత్రాదులను దేశి రచనలుగా నంగీకరించినచో అందలి గాథ చారిత్రక పురుషుల యుదంతమగుటచే ఇతివృత్తము దేశీయము. అందలి ఛందము ద్విపద కావున నదియు దేశియే యగుచున్నది. ఇక భాషావిషయమున పదములు, పలుకుబళ్ళు అన్నియు జాతి వార్తాత్మకములగును.

దేశికవిత్వ విషయమున మరియొక సంగతి జ్ఞాపకముంచుకొనవలయును. మూల ద్రావిడమునుండి విడివడిన తెనుగు స్థానిక ప్రభావముచే వివిధ మాండలిక భేదములకు లోనయినట్లే మార్గకంటె భిన్నమైన దేశి ఆయా దేశీయాభిరుచులనుబట్టి పలు విధములుగా భాసించును. సాధారణముగా మార్గ మెల్లెడలను ఒకేవిధముగ నుండును. దేశి యట్లుకాదు. అది ఆయా దేశి సంప్రదాయములనుబట్టి మారుచుండును. అట్లని దేశి పూర్తిగా మార్గకు భిన్నమైనది కాదు. ఒక్కొక్కప్పుడు మార్గమందలి మార్గరీతులు కొంతవరకు సడలిపోగా నందు స్థానిక సంప్రదాయములు ప్రవేశించి ప్రముఖములై దేశి యగుచుండును. లక్ష్యమునుబట్టి లక్షణ మేర్పడినట్లే దేశిని సంస్కరించినచో నది మరల నొక విధముగ 'మార్గ'మే యగును. కావుననే మార్గ, దేశి పదములకు రెండిటికిని అవినాభావసంబంధము కలదనుట. అందువలననే కవిరాజశిఖామణి తన కావ్యమున "మార్గకు మార్గము దేశికు"—అనియు, "దేశి, మార్గములు దేశీయములుగా"—అనియు వ్రాసికొనినాడు.

నన్నెచోడుడు దేశిశబ్దమును పయియర్థమునందే కాక ఇంకను మరికొంత విశాలతరమగు నర్థమున వాడినట్లు గ్రంథమునందు ఆయా సందర్భములలో పలుచోట్ల కానవచ్చును. అందు కొన్ని యిచట నుదాహరింపబడినవి:

1. "మును మార్గకవిత లోకం
బున వెలయఁగ దేశికవితఁ బుట్టించి తెనుం
గున నిలిపి రంధ్రవిషయం
బునఁ జనఁ జాళుక్యరాజు మొదలుగఁ బలువుర్"
(1-28)

"సురవరులం గ్రమంబున న
చోమణిసంహతిఁ బూజసేసి మ
ద్గురు చరణారవిందముల
కుం దమ సమ్మతిఁ జేసి కొల్చి వి
స్తరమతులం బురాణకవి

3. ప్రతాపరుద్రీయము. నాటక ప్రకరణము పుట 86; నృత్త నృత్య వివరణ వ్యాఖ్య.

సంఘము నుత్తమమార్గ సత్కవీ
శ్వరులను దేశి సత్కవుల
సంస్తుతి కెక్కి మనోముదంబునన్" (1-24)

"మార్గము మార్గము దేశియ
మార్గము జగమందుఁ దమకు మది వదలక దు
ర్మార్గ పదవర్తు లనఁదగు
మార్గపులం దలఁప నలఁతి మహి సుకవులకున్" (1-28)

"మృదుకీర్తి మూర్తులిం పొదవింప మేలిల్లు
భావమ్ము నెలమి క్రీడావహముగ
మెఱుఁగుల గన్నులు మిఱుమిట్లు వోవంగఁ
గాంతి సుధామూర్తి కాంతిఁ జెనయ
వర్ణన లెల్లచో వర్ణన కెక్కంగ
రసములు దట్టకొత్తి రాలువాఱ
దేశి మార్గంబుల దేశీయములుగా న
లంకారములఁ దా నలంకరింప
నాదరించి విని సద్గతిశీయమున
బుధులు సన్నుతమున నిధులు నిలుప
వలవదే సమస్త వస్తుకవీశ్వర
మాత్మ రుచిర కావ్యరత్నపీఠి." (1-36)

ఈ సందర్భము లన్నిట కవి దేశి శబ్దమును దేశీయమగు భాష యను నర్థమున నే వాడినాడు.

2. అనులేపనములు మండనములు లేకయు
భాసురాంగము లింత దేశీయము నై
లలితాంబరములు మేఖలలు లేకయు హారి
జఘనంబు లింత మాసరములగు నై
వరహారములఁ బత్రవల్లికల్ లేకయు
వలి సన్నగవ లింత చెలువములగు నై
భ్రూలతా నటనంబు భావంబు లేకయు
విచలేక్షణము లింత రుచిరములగు నై
కమ్మనూనియ మెఱుఁగెక్కఁగల కురుల్వి
కగలు దీర్పకయుఁ గచభరము లింత
పొలుచు నేయని చూచె వాభూసురాధి
రాజకన్యలఁ బర్వత రాజకన్య." (6-62)

పయి పద్యమునందలి వర్ణనీయ వస్తువు ఋషి కుమారికల సౌందర్యము. అలంకారములు లేకయే వారి యవయవములు మనోహరముగ నున్నవని చెప్పుట కవి యుద్దేశము. ఆ సందర్భమున పయి పద్యమునందలి ద్వితీయ, తృతీయ, చతుర్థ పాదములందు వరుసగా 'జఘనంబు లింత మాసరములగు నై'—'వలి సన్నగవ లింత చెలువములగు నై'—'విచలేక్షణము లింత రుచిరములగు నై' అనుచు మాసరము, చెలువము, రుచిరము అను శబ్దములను అందమును పదమునకు పర్యాయముగ వాడినట్లే ప్రథమ పాదమునందు 'భాసురాంగము లింత దేశీయము నై' అను చోటను దేశిశబ్దమును అందమను నర్థములో వాడినట్లు స్పష్టముగున్నది. కావున దేశిశబ్దమునకిట అందము అనునర్థము చెప్పవచ్చును.

3. "నాసన గా శివాగమము
వర్ణన కెక్కఁ త్రయీ పదర్థముల్
దేశిక నాత్మశిష్యులకుఁ
దెల్పుచు సద్విధిమన్న నిక్కఁగా
భ్యాసము చందు లీనమగు
భావమునిల్పి వెలుఁగుచున్న స
ద్భాసుర ముఖ్య విప్రముని
పుంగవు జంగము మల్లికార్జునిన్" (6-79)

'త్రయీ పదర్థములు దేశిక నాత్మశిష్యులకుఁ దెల్పుచు' ననునప్పుడు దేశి శబ్దమునకు దేశభాష యనియు, తేటతెల్లమనియు నర్థము చెప్పవచ్చును. అయ్యది గురువు శిష్యులకు త్రయీ పదర్థములను తెల్పు సందర్భము. అందుచే దేశభాషలో చెప్పినను శిష్యుల కది తేటతెల్లమగుట వాంఛితార్థము కావున పయి రెండర్థములలో రెండవ యర్థమునకు సందర్భశుద్ధి యెక్కువగ దోచుచున్నది.

4. "నకు మన దింతి దన్నులత
నర్పున ముందఱు గానరాదు మా
కడుగికుచోటఁ గాలెనులి
వంతిన కానకు చెందమయ్యెకున్
దోడిఁబసఁజేయు మావలన
దోసము లేదని చెప్ప డాసినాఁ
గడు వెసఁగొందు గారి తెలి
గన్నులు పీనులడాపి దేశియై" (8-16)

ఇట పీనులడాపిన తెలికన్నులు దేశియైన వనగా విశాలములైనవని యర్థము. కావ నిట దేశిశబ్దము విశాలమను నర్థమున వాడబడినది. కన్నులు విశాలములైనవని చెప్పుటలో అందములైనవి అనునర్థము ప్రతీయమానమగుచున్నది.

కాగా కవిరాజశిఖామణి దేశిశబ్దమును పయిని పేర్కొనినట్లు ఇతివృత్తము, ఛందము, భాష, ఇత్యాదులు దేశీయములు కావలయునను నర్థమున నే కాక భిన్నార్థమునకూడ వాడినట్లు చెప్పవచ్చును. పూర్వోక్త దేశీయ లక్షణములన్నియు నాతని కుమార సంభవ కావ్యమునకు పట్టినవా యనునది ప్రశ్న. పయి లక్షణములలో కొన్ని మాత్రమే అతని కవిత్వమునకు పట్టినవనుట సమాధానము. ఏలయన, మార్గ స్పర్శలేని దేశిని మాత్రమే వాడి కవిత్వము చెప్పగునని యాతడు వ్రాసికొని యుండలేదు. "దేశి మార్గములు దేశీయములుగా" అను పద్యములో సయితము కవి దేశి మార్గ కవిత్వములను అందముగా కలుపుగునని చెప్పి, అట్లు కావించినాడు. కావున నే దేశీయత యనునది అతని కవిత్వమునందలి కొన్ని వర్ణనలయందు, కొన్ని పదములందు, కొన్ని సన్నివేశకల్పనలందు, మాత్రమే స్పష్టముగ కానిపించుచున్నది.

సాక్షాత్కారము

శ్రీ మోటూరి వెంకటరావు

స్వామీ! నా హృదయాభ్రవీథి దిమిరచ్ఛాయాంబుద శ్రేణులై
కామక్రోధ విషాద సంచలిత రేఖావ్రాతముల్ ప్రాకి ఏ
వో మాలిన్యగతుల్ రచింప, నవ విద్యుజ్జ్వాలలై మన్మనో
జీమూతాంతర కేళి సల్పెదవు సుశ్రీభవ్యలీలాకృతిన్.

కాంతి దళమ్ములం దొఱగి క్రమవికాసము కోలుపోయి హే
మంతములో గలంత వడు త్సూజముగా వసివాడ నేను, వా
సంత విలాస మాధురుల జల్లు నవోన్మిషితస్మితాంచితా
ద్యంత సువర్ణ రోచి వయి ఆస నసల్ విరచింతు వీ వాగిన్.

దుసికిలు దుఃఖబాష్ప హిమతోయము లాని మదీయ జీవిత
ప్రసవమునం దుషస్సుషమ పాసి కృశించెడు—కాని తావకో
చ్ఛ్వసిత సుగంధముల్ నవనవక్రమణ స్రవణమ్ములై లస
న్మసృణ తరంగమాలికల మంజుగతిం దొనకాడు నా యెదన్.

మండుటెడారిలో హృది శ్రమంపు భరాన దపింప, నా గళ
మ్మెండి దిశాంచలంపు మృగతృష్ణలకై పలవింపగా, బయో
మండిత శీతలాంక పవమాన చలన్మధుధాత్రివై సుధా
ఖండము లొల్కు నా యెడద కాశ నడంతువు వీకతో ప్రభూ!

ప్రేమరసార్ద్రి హాచు బ్రతిరేణువులో బ్రసరించి, దివ్య దీ
ప్తామృత వర్తివై ప్రతిహృదంతర సీమ నవాంశు నర్తనా
రామముగా దనర్చి, కనరాని ఎదో ఒకలీలగా సదా
స్వామి! భవత్కృపామయ శుభక్రియ నిస్తులభాతి భాసిలున్.

అంతట నిండి భూతనిచయాత్మవు నీ వయినందుకే నిన్
సుంత విలోకనమ్ముల గనుంగొన శక్యముగాక నే నపే
క్షింతును నీ దృగంత మధు శీకర వృష్టిని—కాని నీవు నా
స్వాంతములో నిరంతర విహార మొనర్చుట లో నెఱుంగుదున్.

కిన్నెర శృంగారము

శ్రీ సాళ్వ కృష్ణమూర్తి

కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు వ్రాసిన కిన్నెరసానిపాటలు, నండూరి సుబ్బారావుగారు వ్రాసిన ఎంకిపాటలు తెలుగునాట సుప్రసిద్ధములు. సాహితీరసికులందరకే కాక సామాన్యజనులందును అవి యెంతయో రంజకత్వము నెరపినవి. ఆ పాటల తొలినాళ్ళప్రమోత లీనాటికిని తెలుగువారి చెవులలో గింగురులు వోవుచునే యున్నవి. వాని నెవరైనపాడి వినిపించుట యొకయెత్తు; ఆ వ్రాసినకవులే పాడుట మరియొకయెత్తు. వారు పాడినచో ఆ పాటల ప్రాణశక్తికి తమ యాత్మశక్తిని జోడించి పాడుదురు. దానితో వానికొకదీప్తి, ద్రఢిమ, నిండుదనము వచ్చును. అది వారి వ్యక్తిత్వ ప్రభావము. మరి యా యిద్దరును సంగీత విద్వాంసులు గారనుట లోకమెరిగిన మాట.

కొన్ని యేండ్ల క్రిందట నేనుగూడ కిన్నెరసాని పాటలు విశ్వనాథవారు పాడగా, వింటిని. మరల ఇంక నెప్పుడో నండూరివారు పాడగా ఎంకిపాటలు వింటిని. ఆ వినుట రెండుసార్లును, అది యొక ఆనందానుభవముగా నుండినది. పిదప నెప్పుడో నా అనుభవ విశేషముల పరామర్శించి వింగడించుకొన ప్రయత్నింపగా ఆ రెండు సమయముల యనుభవములు వేరుగా నగపడినవి. కిన్నెరసానిపాటలు వినుచున్నంతసేపును అందరికివలెనె, నాకును ఏదో సెలయేటి ప్రవాహమువెంట పోవుచున్నట్లుండినది; వానియందలి నాదసౌభాగ్యమట్లుగా నన్ను ముంచియెత్తినది. ఎంకిపాటలు వినుచున్నపుడు శృంగార రసానందమనిపించినది.

నిజమునకు రసానుభవమునం దిట్టి భేదతనముండ రాదు సరికదా కనుపింపనుగూడరాదు. ఏలయన రెంటి యందును నాయికా నాయకులున్నారు; శృంగారమున్నది. మరి నాయనుభవమట్లు వేరుగా నగుటకు కారణమేమి?

ఆతప్పు నాయందే యున్నది. కిన్నెరసాని పాటలు వినుచున్నంతసేపును నే నాయనపాట తీరునే గమనించి యాస్వాదించుచుంటిని. ఆయన కంఠమాధుర్యము, గొంతుకలోని యొడుదుడుకులు, మలుపులు, విరుపులు, అలలుగా నాదమును తేలించుట, మొదలుగాగల విశేషములే నామనసు నాకర్షించినవి. పాటలలోని సాహిత్యగతమైన భావముతో సంవదించుట కప్పటి నామనసున కాభిముఖ్యముగాని వినుచున్న ఆ సమయమున వ్యవధిగాని చాలినవి గావు.

ఈ పాటలు మెచ్చుకొనువారు సాధారణముగ కవి చెప్పిన కథాకల్పనను మరచిపోదురు. అది యేదో కవి ఒక నిమిత్తమాత్రముగ చెప్పుకొన్నట్లను దానితో తమకు పనిదగులనట్లును ప్రవర్తింతురు; వానిలోని ఆ నిర్ఝరిణీ గమనవేగ ప్రసార వైఖరుల ప్రతిపాదించు నాదసౌభాగ్యమును మాత్రము కొల్లగొని విని యానందింతురు. దీనితో ఆ పాటల యందలి భావము వాని నుండి వికర్షితమై మరుగున కొదుగుచున్నది.

పాట వినెడిపట్టున శ్రోతకు పాడెడువానితో సంవాదమున్న చాలవరకు చాలును. కావ్యము విషయమున అట్లు కాదు. కావ్యముతోనే సంవాదము గలుగవలెనుగాని లౌకికుడగు కవితో కాదు. అప్పుడే కావ్యగతమగు కవి హృదయములో సంవాద మేర్పడు అవకాశమున్నది. శ్రవ్యకావ్యములను పౌరాణికులవలె చదివినచో ఏ చిక్కును లేదు; సంగీతముగా పాడినచో రాగముల సాగుదలయే కాని భావముల పేరుదల యుండదు. కిన్నెరసాని పాటలను మనము సాహిత్యముగ జూడవలసి యుండునే కాని సంగీతమునకుగా వలసిన వాగ్గేయకారుల రచనలవలె చూచుట అంత సరికాదేమో అని నాకనిపించెడు ఊహ. వానిలో నాదసౌభాగ్యమెంత విస్ఫుటముగ సుస్ఫుటముగనైన నుండవచ్చును; అది యెన్ని సొగసులైన విరియింపవచ్చును; ఆ కావ్యమును సంగీతశాస్త్రమున కొదుగని ఒక విలక్షణమగు దేశి మార్గమున వ్రాసెననుట మాత్రము నిజము; ఆపాటలు గూడ ఇతర 'పాటకుల' శక్తికంటె కూర్చివ్రాసిన కవి శక్తినే ఎక్కువగా కోరుచుండుననుట మరింతనిజము. ఈ కారణముచే యీ పాటలలో నాదసౌభాగ్యమే పరమప్రధానమను తాత్పర్యదృష్టి అనుభవమునకు బాధకమగునని నా యభిప్రాయము.

ఇక్కడనే చాలమంది చేసెడి పొరపాటు. నేను గూడ ఇచటనె తప్పుచేసితిని. ఆనాటి నా హృదయ సంవాదమంతయు విశ్వనాథతో నున్నదేకాని కావ్యగతమైన కవి హృదయముతో లేదు. సభలో సమ్మోహనశీలమైన ఆయనప్రతిభ పాటతో నా మనసు

నట్లుగా నిర్ణీతమైనది. ఇంక నేనేది కోరితినో నా కదియే భాసించినది. ఎంకిపాటల విషయమున నేను శృంగారము నాశించియే వింటిని. అందుచే నాకది శృంగార రసానందముగ గాన్పించినది. తేలిన దేమనగా అనుభవదశలో ఆనందమనునది ఒక్కటే యనియు, సర్వరసములు ఒకటేయగు ఆనందరూపము లనియు, అప్పుడు ఇది ఈ రసానందమని గాని ఇది నాదానందమని గాని వేరుపరుపరాదనియు ఆలంకారికు లెంతగా ఘోషించినను, మన నిత్యానుభవమున ఆ రసప్లుతి పొరలివచ్చిన మార్గమేదియో అదిమాత్రము మనసుకు దగులక మానదనుమాట నిజము. అట్టిభేదమే తెలియని ఆనందానుభవము ఎవరికో ఎక్కడనో సకృత్తుగా గలిగెడిదేకాని అందరకు అన్నివేళల అబ్బునదిగాదు. కిన్నెరసాని పాటలలో కవి రస నిర్వహణముతోపాటు దాని కుపస్కారకముగ నాద సౌభాగ్యమునుగూడ పోషింపగా యీ రెండిటిదాని యందలి ఒక విచ్ఛిత్తి విశేషము ప్రబలమై నా చేసిన తప్పునకు కారణమైనది. నేను శ్రోతనై గాయకునిగ నుండిన కవితో మాత్రమే సంబంధించితిని. కావ్యమును విడిచితిని.

ఆ తప్పునకు ప్రాయశ్చిత్తముగ కిన్నెరసాని పాటలయందలి శృంగారమును గూర్చి ఇంచుక వ్రాయుట ఇప్పటి నాఅభిమతము. దానికి ప్రాతిపదికగ నాలుగుమాటలు చెప్పుట అప్రస్తుతము కాదను కొందును.

శ్రోతకు మరి సాధారణముగ చదువరికి కావ్యముతో హృదయసంవాద ముండవలెననియు అట్లున్నచో కావ్యగతమగు కవిహృదయముతోగూడ కలుపుగోలు సంబంధము కలుగగలదనియు చెప్పితిని. అది యట్లు జరిగినపుడే కవి హృదయపు పొలిమేరలు గూడ ఎరుకపడుట సాధ్యము. అంతేగాని లౌకికునివలె కవి నెప్పుడును అయ్యా, మీ రీ కావ్యమున చెప్పిన దేమి? ఇందు మీహృదయము పెట్టిరని యడుగరాదు. అడిగినచో ఆయన చెప్పవచ్చును. చెప్పిన దేమనగా కావ్యగతమైన అర్థమునకు భావమునకు శిల్పమునకు పరిమితి యేర్పడును. 'ఇది యింతే' అనిపించును. అడుగుటవలన ఆలోచన కవకాశము సన్నగిల్లగా ఇంక చర్వణయు దానిలోని స్వాదుతాగుణమును ఎక్కడనున్నవి? తానుగా ఎరిగినచోట నే తాత్పర్య బుద్ధి ఎక్కువగానుండుట మనము వద్దన్నను మనల వీడని అహంకారపు బుద్ధి. శబ్దార్థములలో శాస్త్రవిషయములలో అడుగుటయు చెప్పించుకొనుటయు తప్పుగాదు. అది వ్యుత్పత్తివిషయము. ఆస్వాదనవిషయమున పాఠకు డీపని చేయరాదు. అది వాని అభిరుచి వికాసమును గూడ చంపును. ఇట్లింతగా చెప్పుట ఎందులకనగా

ఏ కావ్యమైనను శబ్దార్థములకు శాస్త్రవిషయములకు మాత్రమే పరిమితమై యుండునదికాదు. అందరి కొప్పుదలవంటిన శాస్త్రీయమగు వ్యాఖ్యాన మార్గమునకు గూడ నొదిగి యుండునది కాదు. మరేమన అంతకంటె ఎక్కువ వ్యాపృతిగుణము కలది. కావ్య నిర్మాణమున కవికెంతయో కష్టమున్నది. వస్తువు నేరుకొనుటలో అర్థముల బొదుగుటలో భావముల తీర్చుటలో కావ్యదోషముల మెలకువగ తప్పించుకొనుటలో, రసపోషణలో కవి కత్తిమీది సాముగా నడువవలసి యుండును. ఇట్లుగా నిర్మించిన కావ్యము పాఠకుని తన సంస్కారముకొలది వ్యుత్పత్తి కొలది ఊహ కొలది యెన్నియో విషయములు చర్వణ కందుకొనును. అట్టి అవకాశములు (Possibilities) అనంతముగ గలిగించుట మహాకవిశక్తి. కావ్యమునకు ప్రకృతమైన అర్థ భావముల బొదుగుచునే మహాకవి తాను పలికిన ప్రతి పలుకును మైనపు ముద్దగాచేసి పాఠకుని యీ అనేక భావముల చర్వణ కవకాశము కల్పించును; తాను త్రికాలజ్ఞుడై భూత భవిష్యత్తులను గూడ పలికించును. కవి హృదయము నెరుగక దానికి విరుద్ధముగ పాఠకుడు 'విరుద్ధమతి కృత్తులు' నాపాదించినను తప్పులేదని నే చెప్పవచ్చుటలేదు. కవి హృదయమును కనుచూపులో నుంచుకొనియే కావ్యము నడుపవలసియుండును. కాగా మనన శీలునకు చర్వణ సమయమునందు వాని యూహాగూడుటకు కావలసిన అవకాశమనంతముగ సత్కావ్యము నందుండుననియు, అట్టివేళ చదువరి అంతయో యింతయో స్వాతంత్ర్యము పూనుట రసికజన సమ్మతమనియు చెప్పుటయే నా యుద్దేశము. కాని నా యీ వ్యాసముకొఱకు మాత్రమే నేనీ చర్చను నేలేదని మనవి. సాహితీ రసాస్వాదన విషయమున పాశ్చాత్య సహృదయ ప్రపంచమునందిట్టి మార్గమొకటి ప్రాచుర్యము నందియున్నదనుటయు వారు వ్యక్తి స్వాతంత్ర్యమును సన్నగిలనీయక సాహిత్య రసికతకు స్వాతంత్ర్య రసికతను జోడించిరనుటయు క్రొత్త మాటలు కావు. మన వారిలో పాఠకులంత చొరవకు సాహసింపకుండుటకు మనుష్యునకు గావలసినది పురుషార్థ సాధనమనియు దానికి కావలసినంత విషయము వాక్యమున వ్యాఖ్యాన మార్గమున కావలసినంత దొరుకు ననియు అంత కెక్కువైన చొరవ అసలుకు మోసము తేవచ్చుననియు ఏర్పడిన భావములే కారణములు కావచ్చును. సరి. నా యీ వ్యాసమున నేను గూడ పై చెప్పిన స్వాతంత్ర్యమునించుక పూనదలచితిని. నా చెప్పు మాటల విషయమున పాఠకునకును

నాకును ఎంతగా భావైక్యము కుదిరిన అంత మేలు. కుదురని చోట మాత్రము రుచికోవ వేరని మన్నింప గోరుదును.

2

కిన్నెరసాని పాటలలోని కథా కల్పనమంతయు మనుష్య జీవన పరముగా నున్నది. అనగా మనుష్య పరముగా కొంత, జీవన పరముగా కొంత. ఇది వట్టి చమత్కారపు మాటకాదు. కిన్నెర తొలుత మనుష్య స్త్రీ. తరువాతివాగు—ఆమె మానవ వనితగా నుండిన మునుపటివాళ్ళ జీవితమును కవి యిట్లు కల్పించినాడు:

'కిన్నెర మహా పతివ్రత—అందరు తెలుగు కన్నెలవలె మల్లెనే ఉద్విగ్న హృదయ—ఎక్కువ తెలుగు కుటుంబాలకు సామాన్యమైన అత్తా కోడళ్ళ పోరాటం ఆ యింట్లోనూ వెలిసింది. కొడుకు సుఖ మెరుగని అత్తకు కిన్నెరమీద నింద లారోపించటం పని అయింది. ఒకప్పుడు ఆవిడ చేసిన నింద భరించటం కష్టమైంది. కిన్నెర హృదయం శోకంచేత ప్రళయ సముద్రం అయింది. కిన్నెర భర్త ఏం చేస్తాడు. తల్లిని కాదనాలేడు, భార్యను ఓదార్చుకోనూ లేడు—ఆవేశ హృదయంతో కిన్నెర అడవులవెంట పరుగెత్తింది. భర్తపోయి ఆమెను వద్దని కౌగిలించుకున్నాడు. ఆమె అతని కౌగిట్లోనే కరిగి నీరై వాగై ప్రవహించింది. అతను శోకించి శోకించి శిల అయినాడు.'

ఇది పూర్వ కల్పన. పాటలలో గాన వచ్చెడి ఉత్తర కల్పన మరికొంతయున్నది. కిన్నెర వాగైన తర్వాత ఆవేగముతో అక్కడే తిరిగి తిరిగి విలపించినది—మగనిప్రేమ తలచుకొని ఇంత ప్రేమ ఉన్నదని బ్రతికి ఉండగా తెలిసి ఉన్నట్లయితే ఇంకెంత చెలిమి యుండేదనుకొన్నది. తానుమరల మనిషి నగుదామని ఎంతగానో యోచించినది. నాయకుని నదిగా మారుమని బ్రతిమాలాడినది. ఈ రెండును సాధ్యముకావని తెలిసి 'నా కర్మ ఇంతే. ఈ జన్మకింక నాకు పతితోడి తగులు లేదనుకొన్నది. శిలగామారిన భర్తను పిలచి పిలచి, చివరకు పిలుచుటాపివేసినది. జలదేవతలువచ్చి ఆమెను తొందరపెట్టి క్రిందకు ప్రవహింపజేసినారు. నదిగా పారుచు కిన్నెర నడకలు నృత్యాలు సంగీతమెంతగానో నేర్చుకొన్నది. కిన్నెర పారివచ్చుచున్నదని విన్న కడలి వినుకలిపాలై తన పెద్ద తనము మరియాదయొక్క వెనుకత్రోచి ఆమె నాశించినాడు—ఉద్రేకంతో ఉవ్వెత్తు అలలుగా పొంగినాడు—మెల్ల వస్తున్న వైపునకు మిట్టి మిట్టి చూచినాడు. బుసంత మానుసులు కడలిపొంగు చూచి కలతపడినారు. కిన్నెర ఇది విని కలతపాలైపోయినది. 'నా తనువు ఇట్లు నానాజనములు కోరగానైనది' కదాయని దుఃఖించినది. కనపడిన రాయి రప్ప పట్టుకొని ఆ వైపు పోరాక ఉండవలెనని ప్రయత్నించినది. దానివెంట పురుగులు మృగాలు అన్నీ ఆమెపై జాలిగొన్నవి. గోదావరీదేవి కిన్నెర కాశ్రయమిచ్చి కడుపులో పెట్టుకొని కాచి రక్షించినది. కడలి తన ఇల్లాలి కనులముందు చిల్లరపనులు చెయ్యట మిష్టములేక చిన్నబుచ్చుకొని ఉండిపోయినాడు. కిన్నెర శీలరక్షణము చేసుకొని తెలుగులదైవము భద్రాద్రిరాముని చూడబోయే దారిలో 'తన జన్మ తరింపజేసుకుంటూ' కాచి ఉంది.

కథాకల్పనలో పూర్వభాగములోని కొన్ని విషయములు రచనలోని యుత్తరభాగమునకు ప్రాతిపదికలు. కిన్నెర మహాపతివ్రత—దానికి తగినట్టే ఆమె వాగైన పిదప కూడ మగని విడలేక విడలేక తిరుగుట. కిన్నెర ఉద్విగ్న హృదయ - ఆ గుణమే ఆమె నృత్యసంగీతముల దీర్పుటకు కవి కాంశికమైన ఆధారము. కిన్నెర మాటమాత్రముగ అత్త చేసిన నింద భరించలేకపోయినది—ఆ గుణమే కడలి పొంగు విని ఆమె దుఃఖించుటకు కారణము. అట్లే పూర్వకల్పనలోని 'కొడుకు సుఖ మెరుగని అత్త' అన్న కవి మాటలు ఈ కావ్యమందలి శృంగారమునకు బీజభూతమైన ప్రాతిపదిక. ఆ తయాను మాట కింద రెండు రకముల వివక్ష. సామాన్యముగ గురుజనత్వము—మూర్ఖత్వము. గురుజన సామాన్యమున శృంగారమున కావిష్కృతి లేదు. అందుచే నామెకు తెలియదు. అంతయో యింతయో తెలియకపోవునా యనుకొనుటకు సువప్వేత కొలవడిన మూర్ఖత్వము మరియొక కారణముగా నున్నది. ఇంక 'కొడుకు సుఖ మెరుగని' అనుమాటలకు కవియే చెప్పుచున్నాడు గనుక ప్రాధాన్య వివక్ష—ఆ యత్త గురుజనమున చేరినదనియు, మూర్ఖురాలనియు, అందుచే నామె కొడుకు సుఖమెట్టిదో ఎరుగదనియు కవి చెప్పుటచే నాయికానాయకుల ప్రణయము, శృంగారము అతివేలముగా నుండినదని ధ్వని.

ఎనిమిది శీర్షికలుగా ఏర్పరచి వ్రాసిన ఈపాటల పూర్వోత్తర కథాకల్పనమంతయు సహజముగ లోకవృత్తమును ప్రతిబింబించును. కిన్నెరపుట్టుకలో నాయిక భర్త కౌగిట కరగి వాగై పారుట చెప్పబడినది. నాయికపరముగ విప్రలంభము నిర్వహింపబడినది. కిన్నెర నడకలలో నాయిక విడలేక విడలేక పతిని విడుచుట, చనలేక చనలేక చనుట చెప్పబడినది. నాయికాదృష్టిలో విప్రలంభ మిందు నిర్వహింపబడినది. కడలిపొంగులో వినుకలిచే కిన్నెరాభిముఖమైన సముద్రుని రతిభావము వర్ణింపబడినది. కిన్నెర దుఃఖ

మున ఆమె శోక నిర్వేదములతీవ్రత. గోదావరీ సంగమమున నాయికా శీలరక్షణము ఆశ్రయలబ్ధి. కిన్నెరవైభవమున పార్శ్వకాలికమైన నాయికాప్రశస్తియు ఆమె తన జీవన తరణోపాయమునకుగా చేసిన ప్రయత్నమునకు సూచన. ఈభాగములందిట్లుగా కవి లోకవృత్తము నిమిడ్చినాడు.

ఇందలి ఎనిమిది భాగములలో ఆరు భాగము లట్లు పోగా ఇంక మిగిలినవి రెండున్నవి. కిన్నెర నృత్యము, కిన్నెర సంగీతము. వీనిలో కథకు బనికివచ్చు లోకవృత్తమేదియు కానరాదు. వట్టి వర్ణన. అయినచో కవి ఊరక ఆ వాగువనికల అందాలను మాత్రమే ఈ పాటలలో అనుకరించియుండునా లేక లోకవృత్తమును మరే మార్గమునైన నందు చూపించియుండునా అని సందేహింపవలసి యున్నది. కిన్నెరసానివాగు అందాలనపికల నలరించి మాపులకే కవి ఈ కావ్యము వ్రాసినాడను నమ్మిక నాకు గుదురలేదు-అందలి అనుగానునకే లోకము రంజితమైపోయినదనుట వేఱువిషయము. పైగా పాటలందాఱుభాగములలో లోకవృత్తమును ప్రతిబింబింపజేసిన కవి రెంటినిమాత్ర మూరక వదలి రచనలోని సాహితీసౌష్ఠవమును భంజించునా? కవియా రసమార్గావలంబి, శిల్పి. రసపోషణకు భావములు వానికాశ్రయముగ లోకము సాధారముగ గొన్న ఇతివృత్తము కావలెను—కనుక ఆ రసపోషణకు గావలసినదానిని కవి శిల్పమార్గమున ఒదిగించియుండ వచ్చునని ఒక యూహ తోచును. కవి స్వభావము నొప్పుకొన్నచో ఈ చిక్కునకు ఈ యూహకంటె పరిష్కారమార్గ మొకటి కనుపట్టదు. కనుక కిన్నెర నృత్యము, కిన్నెర సంగీతము లనువానియందు గూడా కవి యెట్లో సందు చేసికొని కొంత లోకవృత్తము నిమిడ్చియుండుట అనివార్యముగ గావచ్చును.

నాకు తోచిన దేమనగా కవి కిన్నెర పుట్టుక, కిన్నెరనడకలు అను శీర్షికల క్రింద స్పష్టముగ నాయికా నాయకుల విప్రలంభమును తీర్చినట్లే కిన్నెరనృత్యము కిన్నెర సంగీతము అనువానియందు గూడ కిన్నెర శృంగారమును తీర్చినాడని. మొదటి రెంట విప్రలంభ శృంగారమునకు ప్రసక్తి తీరిపోగా నీ చివరిరెంట సంయోగశృంగారమునకు ప్రసక్తి కల్పించుకొని యుండవచ్చునను నది రెండవ యూహ—ఆ సంయోగ శృంగారము కథాగతిలో ప్రకృతిమునకు ప్రసక్తమైనదే కాదు గనుక దానికి శిల్పమార్గనిక్షేపము. నా యూహ కాధారమంతియు కిన్నెరసంగీతమను శీర్షికలోని కడపటి పాట. అది యిట్లున్నది :

ముద్దుముద్దుగ నడచి ప్రౌఢవోలిక నాడి
మురిపెమ్ముగా పాడి ముగుద కిన్నెరసాని
యెడదలో, ఎదురైన
చెవిలో, కష్టాల
కడలియే కలగాంచెనో—కన్నీటి
కడవలే ప్రవహించెనో.

ఈ పాటలో కీలకప్రాయముగనున్నది సముద్రుని కిన్నెరాభిముఖమైన రతియు, దాని కామె గుఱుతించుటయు. ఈ కారణముచే మొదట చెప్పిన 'ముద్దుముద్దుగ నడచుట', 'ప్రౌఢవోలిక నాడుట', 'మురిపెమ్ముగా పాడుట' అనుమూడు దశావిశేషములను కిన్నెర శృంగారమునకు సంబంధించి యుండవలెననుట తప్పనిసరియగును. అదే కిన్నెర సంయోగశృంగారము.

3

ఈ కావ్యమున శృంగారమును తీర్చుటలో కవి దృష్టి నింకొక గమనింపవలెను. ఇందలి నాయికా నాయకు లిరువురు రాచబిడ్డలు కాకపోయినను ఉత్తమ ప్రకృతులు. కిన్నెరపుట్టుకలో కవి నాయికననుసరించి నాయకునిచే 'ఈవు రసాకృతి'వనిపించుట గమనింప దగినది. ఇంక సానిశబ్దము స్వామిని శబ్దభవము. కులీనతాద్యోతకమై అధికారిణి యందు రూఢము - గడిసాని, బాపనసాని, ఒత్తులసాని, యనుమాటలు నేటికిని రాయలసీమలో వ్యవహారమునందున్నవి. మరి కవి యీ మెఱుగని నాయిక నిర్మాణము నిర్విశేషముగా జెప్పుట, తెలుగుల సంసారములందింటిపెత్తనమున ఇల్లాలిదే పైచేయి యను చమత్కారదృష్టి. మంచికో చెడ్డకో ఉద్విగ్న స్వభావము కారణముగ బాహ్యజీవితమున ఇట్టి అక్రమపద్ధతి యేర్పడగా శృంగారజీవితమున గూడ ఆ ఉద్విగ్న స్వభావము ప్రతిబింబించు ననుటకు తెనుగుపడుచుల ప్రశస్తి కామశాస్త్రమునగూడ కానవచ్చుటయే నిదర్శనము.

ఇందు కవి తీర్చిన శృంగారమంతయు లోకమును బట్టి శాస్త్రమును ననుసరించి కావ్యసర్గము వాపాదించుకొని నడచినది. నాయికా నాయకుల జీవితమున ఒక అవాంతర సంఘటనఫలముగా విప్రలంభముతో కావ్యమారంభమగుచున్నది. కవి దానిని స్పష్టముగ నిర్వహించినాడు. ఈ శృంగారము ప్రత్యేక లేమిచే కరుణాభాసముల బహుదూరము సాగి యాగినది.

రచనలో స్ఫుటప్రతీతి నందివచ్చిన ఆ విప్రలంభమును ముందు పరిశీలింతము. మరి పాటలు లలితభావముల తీవ్రతకు దీప్తికి తగినవి కనుక వానిని పరిశీలించునపుడు అందలి భావముల తీవ్రతను దీప్తిని కొలువవలయుట న్యాయ్యము; అట్లు కొలుచుటయే వాదులేని పద్ధతి.

'కిన్నెరపుట్టుక' పాటలలో ప్రథమభాగము. ఇందు నాయక పరిగాను విప్రలంభము నిర్వహింపబడినది. అం

కారశాస్త్రము ననుసరించి ఇందలి స్థాయ్యాదుల నన్నింటిని ఇచట ప్రదర్శింప నవసరము లేదు గాని ఒకటి రెండు విషయములు మాత్రము గమనింపదగినవి. కవి యిందు నాయకునిగురించిన అనుభావవర్ణనము జోలి కంతగా పోలేదు. పోయినచోటగూడ ఆ మాట లన్నిటిని నాయకునినోటనే పలికించినాడు - భావము మాటిగ నావిష్కరింపబడినది. పాఠకుడు పద్యములను చర్వణ చేసినట్లుగ పాటలచేయనను ఒకానొక యూహాయు, పురుషుని విషయమున భావము ననుభావ ముఖమున తీర్చకపోయినను సౌందర్యమునకు లోటు రాదనియు, ఒకప్పు డిట్లు తీర్చకపోవుటయే పురుష స్వభావమును సహజముగ చూపించుననియు కవి తలచి యుండవచ్చును. వ్యభిచారి భావముల దీర్పుటలో కవి నాయకునకు అనిష్టదర్శనముతో గలిగిన జడతయను దానితో ప్రారంభించి చివరకు చేష్టాజ్ఞానము లెడలుట యనెడి ప్రళయముతో ముగించినాడు. ఇంక కావ్యము నించుక అనుసరింతము:

ఓహో కిన్నెరసానీ
ఓహో కిన్నెరసానీ
ఊహామాత్రము లోపల
నేల నిలువవే జవరాలా!

ఇది కావ్యారంభము. ఊహ నిలుపజాలక కావ్యముగా పాడుచుంటినని కవిమాట. మరి కథమాట? భర్త కౌగిటిలో కిన్నెర కరగి నీరైనది - ఆమె యేమైనదని ఆ యౌవనస్వరూపమును గ్రహించుననంతలోనె ఆమె నేలపై నిలువక పారుచున్నది. కిన్నెరసాని యను ద్వారా వృత్తి సంబద్ధి నాయకుని విప్రలంభరతి భావమున కాలంబనముగ నైనది. జవరాలా అన్నమాటగూడ అంతే.

కరగిపోతి నిలువెల్లను
తరలించితి నాజీవము
మరగిపోయి నాగుండియ
సురిగిపోయెనే ప్రియురాలా!

కిన్నెరను గురించిన భావన కవిని నిలువున కరగించి వైచినది. అతని జీవనాళములదాక ప్రాకినట్లయినది. నాయకపరముగ నీపాట అతని ఉత్తమప్రకృతిని ఆత్మికమగు ప్రణయమును బోధించుచున్నది.

వెన్నెలవలె తెల్లని నీ
వన్నని మేని పసందులు
కన్నులకును కనిపించెను
చిన్నితరగ చాలువోలె—ఓహో!
నీ యొయ్యారపు నడకలు
మాయూర! కనిపించెను పో
మలకలుగా ప్రవహించిన
సెలయేటి ధవళార్తికి
నీ నవ్వులు నురుగులుగా
నీ వళులవి తరగలుగా
నీ కన్నులు మీనులుగా
నీ కరణిని ప్రవహించెను—ఓహో!
నీ జఘనము నిసుకతిన్నె
గా జూచిన నా కన్నులు
ఊడిపడవు నేలపైన
మరిపిపోవు లోనెలోనె—ఓహో!

నాయకుడు నదీకన్యగా మారిన ప్రియురాలి రూపమునుజూచి ఆమె మునుపటి రూపముతో పోల్చుకొని వాపోవుచున్నాడు. ఆమె శరీరాంగముల సొంపు ప్రకృతిలో నిలచి యాతనికండ్లు ఆయా మారిన రూపములపై నిలచి కట్టుబడి కదలుటలేదు. ఆ మాఱ్పు నాయిక పూర్వసౌందర్యము నుద్ద్యోతించుచునే నాయకుని విప్రలంభమునకు దీప్తి గలిగించుచున్నది. 'నాకన్నులు ఊడిపడవు నేలపైన' అన్న నాయకుని మాటలు నాయికా సౌందర్యమున నాతని మనసునకెంత వ్యగ్రతయో చూపించుచునే అతని విపన్నతాభావమును గూడ వెలార్చి యతని ఆత్మికప్రణయమును చెప్పుచున్నవి.

"యద్యత్పశ్యామి తే గాత్రం శీతాంశు సదృశాననే
తత్ర తత్రైవ సుశ్రోణి చక్షుర్మమ నిబధ్యతే."

ప్రకరణము వేరుగా ప్రతినాయకుని నోటబడి వచ్చిన ఈ రామాయణ శ్లోకమునందలి భావతీవ్రత రెట్టింపై కనపడుటే పాటలోని భావతీవ్రతగూడ అట్టిదే. ఈ రెండుచోట్ల తీర్పబడిన భావముల పోలికనుబట్టి శ్లోకము నుదాహరించితి నే గాని మరి యేయితర సాదృశ్యమును లేదనుట నే తెలుపుదును. సరి.

పసగత్తెకు నీ వేణీ
బంధము పూనితి చేతను
కరమున వేణికి బదులుగ
కావ్రగట్టె నీటిపారలు—ఓహో!
ఎపుడుచేత నీ కొంగును
ఒడిచి పట్టుకొంటె చెలీ
తడిచేతను కొంగు లేక
తపబడితిని ప్రియురాలా—ఓహో!
నీ పాదమ్ములు సోకిన
నా ఫాలమ్మున చెమ్మట
ఈ పగిదిని వాగైన
నీపై ప్రేమము చూపెడి—ఓహో!

కిన్నెర ఆవేశహృదయముతో అనవులవెంట పరుగెత్తగా వచ్చి వద్దని కౌగలించుకొన్నాడు భర్త.

అతని కౌగిటిలోనే ఆమె వ్రాగై పారినది. నాయకున కామె ఇంతచేయునని తెలియదు. అతఁడామె కోపమును వలపుకోపము వంటిదిగా లెక్కకట్టుకొన్నాఁడు. కౌగిటిలోనుండి పొంగిపోవుచున్న భార్య జలబటి యాపబోయినాఁడు. చేతిలోనికి నీటిధారలు వచ్చినవి. కొంత పట్టి నిలుపఁబోయినాఁడు. తడిచేయి మిగిలినది. పాదములపై బడినాఁడు. ఫాలమున చెమ్మటపట్టినది. నాయికానుప్రపాదనమునకై చేసిన నాయకుని యీ ప్రయత్నము మనోహరమగు శాస్త్రమార్గమున తీర్చబడినది. చిన్నతప్పు చేసిన నాయకుఁడు కుపితయగు నాయికను వేణీ సాకర్షించి నిలుపవలెను. కొంచె మొకపాటి పెద్ద తప్పైనచో చేలాంచలాకర్షణము. పెద్దతప్పైనచో పాదావతి. ఆ పిమ్మట నాయకుఁడు దౌదాసీన్యము భజింపవలసినదే. ఇచట నాయకుని తప్పు—నాయిక చెప్పకయే—ఆమె కరగి వ్రాగై పోవుటతో కొంతంతగా తెలియుచున్నది. దానికీ శాస్త్రమార్గము కారణము. తన తప్పెంతటిదో ఊహకు తట్టిన నాయకుఁడు 'నేను తప్పే చేసితి ననుకొనుము. నీవలె నింత కఠినురాండ్రను స్త్రీ లెక్కడా కాన్పింపరని వాపోయినాఁడు.

కిన్నెర నిలచినది గాదు. అర్ద్రమూర్తియగు ఆమె భర్త 'ఈవు రసాకృతివి గనుక యిట్లు ప్రవహించి పోవుచుంటివి. నేను శిలాహృదయుఁడను. నీ వలె ఎట్లు కాఁగలను? నీ కన్నులు చూచి నీవు మానవజన్మమెత్తిన నదీకన్యకవని మునుపే అనుకొన్నాను. నేను దురదృష్టుఁడను. ఈ యపవులుగూడ నాదే తప్పని ఘోషించుచున్నవి. ఇంక నే నేమని ఏడ్తును. ఇదిగో గొంతెత్తి చేతులు చాచి ఊరక యేడ్చుచుంటిని. అయినను విన్పించుకొనక పోయితివిగదా!' అని ఎంతగానో శోకించినాఁడు. గొంతు సన్ననైనది. చూపు మందగించినది. కాయము కొయ్యబారినది. ఏడుపురొదలో అతని యొడలికి స్పర్శజ్ఞాన మెడలినది. ఆ యనురాగమూర్తి అచటనే శిలయైపోయినాఁడు. ఏడ్పి ప్రయోజనము లేదని తెలిసికూడ తనకుతాను ప్రళయము విధించుకొన్నాఁడు.

4

కిన్నెర నడకలలో నుచితమగు లలితాశ్రయముచె విప్రలంభ రతిస్థాయి నాయికాముఖమున వచ్చు శృంగారముగ రూపొందినది. నదీకన్యగా మారిన నాయిక విప్రలంభ రతిస్థాయికి కవి అశ్రు వేపథులను రెండు సాత్త్వికభావములనే నిపుణముగ విధించినాఁడు. అంతేకాక ఈ ఘట్టమున కవి వాడిన ఆవేగము చింత, శంక, విషాదము, దైన్యము, మోహము అను వ్యభిచారులు తీర్చుటకు శృంగారమున కెంతయుపయోగించునో అంతగా నదీప్రవహణక్రమమును తీర్చుటకు గూడ నుపయోగించునట అయా వాని లక్షణముల నించుక పరిశీలించిన తెలియఁగలదు.

ఇందలి నాయికాపరమగు విప్రలంభశృంగారమును కవి కొంతదాక ననుభావములమున తీర్చినాఁడు. కొంత సూటియగు భావము. తక్కినది ప్రకృతియను వ్యభిచారి సాహాయ్యమున నిర్వహింపబడినది. ఆ క్రమము ననుసరింతము:

పతికౌగిట నీరై వ్రాగై పారిన కిన్నెర 'పతి రాయివలె మారి పడియున్న చోటునే' విడలేక విడలేక తిరిగినది. వగఁజెంది తిరిగినది. గలగలా తిరిగినది. (ఇందు తొలుత ఆవేగమును వ్యభిచారియు 'గలగలా' యనుటలో ప్రస్తుతయను అనుభావమును చెప్పబడినవి. ఇట్లె తక్కిన వాని నరయునది) కిన్నెర తాను వడిగా వెంగుకై తివని లోన దాగిలినది. ఒకచోట నిలువలే కురికినది. మరల ఏయుపాయముచేతనైనా మనిసి కిన్నెరసాని వసుదాము అనిపించి ఆపలేనంత కోరిక చేత మొరసినది. ఇదివరకు తమకెప్పుడును ఎడబాటు కలిగినది లేదు. తనవిరహము నాతఁడు సహింపలేఁడు గాబోలు. బ్రతికియుండెగా నాతని ప్రేమ యింతయని తెలిసి లేయింకెంత చెలిమి ఉండేదో అనుకున్నది. అటువంటి భర్తతోడి కాపురము నిట్లు చేసుకుంటినే యని ఎక్కడా లేనంతగా వగజెంది వనరినది: తుదకేమి చేయను తోచక పతి రాయిగామారి పడియున్న గుట్టమీద కెరటాల చేతులు చుట్టి ఘోషించినది. కొండమ్రుదిగా పడియున్న తన నీటుకాణ్ణి కౌగిలించును. పలుకవా యని ప్రేమతోపడి పల్కరించును. పతిగుట్టపై తాను వ్రాలి యేడ్చును.

ఇందలి భావానుభావముల యోగపద్యమార్గము రమణీయము. రెండవదశలో కవి నాయిక చేత నిట్లు పలికించినాఁడు: 'ఓ నాథ ! ఓ నాథ ! నావలె నీవు గూడ నదివోలె పారరా ! మనమిద్దర మిట్లు కలసి పోదాము రా. ఇంక నీయందు నేను తప్పు చెయ్యను లేర. నీ యాజ్ఞ అణుమేరైన దాటను లేర ! ఇక జన్మలో ఎప్పుడు ఇట్లు కోపపడను లేర.' ఇందలి నాయికా పశ్చాత్తాపము, ఉపాయాంతరాలోచనము సాత్త్వికప్రణయమును చూపించును. 'నీ కిన్నెర కలగిపోయినదిరా, నలగిపోయినదిరా, బడలిపోయినదిరా' అన్న నాయిక మాటలామె దైన్యము నావిష్కరించును. నాయిక తాను మనిసి కాలేదు. అతఁడు నది కాలేఁడు. ఇద్దరకు ఈ విషయమున శక్తిచాలదు. నాయిక విషాదమునకు మేరలేదు. 'నీయందు నేను చేసినతప్పు ఎప్పటికైన తీర్చుకుంటాను. ఇపుడు నేచేయునది లేదు. నీ త్రోవ నీది. నా త్రోవ నాది. ఇక నాతో నీవు మాటాడబోవుగదా' అని విషాదపడును.

వియుక్తుని పిలచిపిలచి పిలుచుటాపివేయును. ఎంతకని పిలుచును. కిన్నెర బడలిపోయినది. చివరకు పడిపోయినది. మంచు కూరిన నిప్పువలెనైనది. రోదియాపగిన పావురా గొంతుకతో తనలో తాను 'నాకర్మ మింతే. నాకింక పతితోడి తగులు లేదు. చేతులార చేసుకొంటి'నని గొణిగికొన్నది; ఏడ్చినది.

ఇక్కడ నాయికానాయకుల పురావృత్తమైన శృంగారమును కవి నాయికనోట స్మృతి రూపముగా పలికించును.

నీలి మబ్బులబోలు
నిడివి నీచేతులు
వన్నెంక కౌగిలించగరావు కాబోలు
కడు ప్రేమతో చేరగా లేవు కాబోలు
నెమ్మదిగ నారొమ్మెల్ నిమురవు కాబోలు.

నాయిక యిట్లు వగచినది. ప్రకృతిస్థితిలో నాయికానాయకుల విషయమున ప్రకృతిసహజముగ నేర్పడిన అపతిక్రమణీయత నాయిక యొక్క ఈ భావమునకు శాశ్వతత్వము నిచ్చి యామె విప్రలంభమునకు దీప్తి గలిగించుచునే ప్రత్యాశ లేమిని సూచించుచున్నది. మునుపటి లలిత వృత్తము మనసున మెదలినదే గాని అదే మరింత బాధాకరమైనది.

పూర్వమెప్పుడో వలపుకోపము బూనిన తన్ను భర్త సేవించి ప్రసన్నురాలినిగ చేసుకొన్నాడు. నాయిక దానిని స్మరించుచున్నది:

నేను కోపమువహించి
నీ ప్రక్క నుండగా
వలదన్నకొద్ది నాపదము లొత్తుమనీవు
తెలచి కౌగింటిలో తేర్చుకుంటూ నీవు
నా బొమ్ముత్తల చేర్చగా రావుకాబోలు

శాకుంతలమున నాయకుడగు దుష్యంతుడొక సన్నివేశమున నాయికతో నిట్లన్నాడు:

కిం శీతలైః క్లమవినోదిభి రార్ద్రవాతాన్
సంచారయామి నళినీదళ తాళవృంతైః,
అంకే నిధాయ కరభోరు, యథాసుఖం తే
సంవాహయామి చరణా వుత పద్మతామ్రౌ.

దుష్యంతుడు నాయికానురంజనమునకుగా నీ మాటలన్నాడు. ఈశ్లోకమున ఉత్తరార్ధమునగల భావమే పాటలో పదిలో పదికొండుగా కానవచ్చును. అంతమాత్రమున దానికి తరుగు రాలేదు; మరి మెఱుగే వచ్చినది. ఉద్దేశ్యమాత్రమైన దుష్యంతుని భావమెంత నాజూకుగ నున్నదో చెప్పబనిలేదు. పాటలో ఆ భావమే క్రియగా పర్యవసించి నాయకుని ఆర్ద్రతను రుజావుచేసి నాయిక విప్రలంభమును దీపింపజేయుచున్నది. దుష్యంతుడు నాయికతో తామరాకు వీవనలతో వీతునా, తొడలపైనిడుకొని పద్మములవలె నెఱ్ఱనైన పాదముల నొత్తుదునా అని రెండు విషయములే అన్నాడు. కవికులగురువు రచనలోని పరిమితి క్రమ మిట్టిదేగదా! మరి పాటలో కవి మూడు విషయములు చెప్పించినాడు. నాయిక మునుపు వాని నెట్లాపి రాజనిష్ఠితిలో అనుభవించినదో అది మరల ఆమె స్మృత్యుత్స్ఖలనమార్గమున పాదాంతమునగల 'నీవు' అన్న ఆవృత్తితో కానబడుచున్నది. విశకలితభావముల పరిమితికి ఈ యూపిరాడని తనముతో సంఘాతము కలిగి వారి పురావృత్తమైన శృంగారము పారము ఎంతగనో పెరుగుచున్నది. ఇంక భావముల తీర్పులో పాత్రల సంస్కారము వ్యక్తిత్వము తత్కాలస్థితి యను వానినిబట్టి పైపూతలో మార్పు అగపడునే కాని ఆర్ద్రత రెంటను సమానమే. కాని ఒకటిమాత్రము నిజము. శకుంతల ముగ్ధయు మునికన్యయు నైనదిగనుక పరిపోయినదిగాని దుష్యంతుని మాటలలోని అతని చిత్తశుద్ధిని నేటి నాగరకయువతులవంటి వారైన- అన్యాయముగ నేకానింకు-నిర్ధరించుకొనుటకో పరీక్షించుకొనుటకో శంకింపబూనినచో ఆభావమునకు విలుకడ చాలదనుకొందును. పాటలో భర్తయాదరమును ఆర్ద్రతను అనుభవించిన నాయికయే అతని చిత్తశుద్ధికి సాక్ష్యము. నేటి లోకముమాటగా నేనిది చెప్పితి నంతే. అది యట్లుండె.

తలిరాకు వంటిమె
త్తని రొజ్జపెదవినో
తేర్చి నామోము సద్దగరావుకాబోలు
నారొమ్ముపల్ మిపుల సంపుకుప్పయనిచెప్పి
ఎల్ల తావులను ముద్దిడరావు కాబోలు.

ఇచట మరియొక శాకుంతల శ్లోకమును స్మరింతము. ఏకారణముచేతనైన వానిననుకొనుటయే మనసు పారవశ్యమునకు కారణముగదా!

అపరిక్షత కోమలస్య యావత్
కుసుమస్యేవ నవస్య షట్పదేన
అధరస్య పిపాసతా మయా తే
సదయం సుందరి గృహ్యతే రసో౽స్య.

దుష్యంతుని యీ మాటలలో నాగరకత, ఉపమానముతో ఊరించి చెప్పు ప్రౌఢత్వము, కుట్టినట్టుగ మాటాడి కోరిక గలిగింప నేర్పు నేర్పు ఎంతయో యున్నది. 'అపరిక్షత కోమల'మన్న మాటలలోని రుచి పాకము మార్దవములతో, 'సదయం' అని పట్న వాసపు

చెవులు మూసి 'రహో ఒప్య' అన్నచోట భావబంధురముగా పలికినాడు దుష్యంతుడు. కలికుల గురువును కాదనగలవాడెవడు? కలలోనైన కనబడినచో కాళ్లబడి మ్రొక్కనివాడెవడు? మరి పాటలో భావము పాత్రోచితముగ అకృత్రిమముగ—అనగా వాఙ్మాధుర్యపు పూతలేకుండ తీర్చబడినది. దుష్యంతునిది మాటల నేర్పు గల మధురభావము. పాటలో నాయకునిది పలుకొడు తెలుగక పరవశ్యత్రొక్కినది. భావోద్రేకము రెంటను సమానమే. దాని ననుభవించిన కిన్నెర ప్రకృతిలో నది యట్లె అకృత్రిమముగ నప్పుగ్రుడ్డినట్లు కానవచ్చుచున్నది. మాటలకంటె మనసు నెక్కువ నమ్మిన నాయిక విప్రలంభము బాధాలంలితమైన అర్ద్రతను చిమ్ముటలేదా? తలిరాకువంటి మెత్తని యొజ్జ పెదవి, తార్పి, అద్ది—అనుమాటల రసస్పర్శ, భావము యొక్క విస్తృతి నాక్రమించి చూపగల నేర్పు గమనింపదగినవి. విప్రలంభ శృంగారమున—నాయిక పరముగా చెప్పిన రెండు పాటలను సంయోగశృంగారమున నాయకుని పరముగా చెప్పిన రెండు శ్లోకములతో పోల్చితిని. ఇది పాఠకుని భావవ్యాపారమున యొక తమాషా పద్ధతి. ఏమనగా ఏ భావమునైనను అన్నవారి దృష్టితోను—అనుభవించిన వారి దృష్టితోను చూడవచ్చును; చూచి మనమును అనుభవింపవచ్చును. ఆలంబనము, ఆశ్రయము మారును. అంతేకాని భావము, దాని తీవ్రత, పరిమాణము ఒకటే. ఎట్లును పురుషుడు తాను నాయకుని దృష్టితోను, స్త్రీ నాయికాదృష్టితోను కావ్యాదుల ననుభవింతురు. నాయికా విరహమును గూడ పురుషుడు నాయకదృష్టితో ననుభవించునే కాని తానే నాయిక ననుకొని చదువడు. స్త్రీల విషయముగూడ ఇంతే. సామాన్యముగ పాత్రతో తాదాత్మ్యముండవలెననుట నిజమేకాని స్త్రీత్వ పురుషత్వరూపమైన వ్యక్తిత్వాహంకారములు అంత సులభముగ మాసిపోవునవికావు. విస్తరము చాలును. కథకు వచ్చి ఘట్టము ముగింతును.

కిన్నెరసాని సన్నగొంతుతో వదరినది. ఏదో గొణుగుకొన్నది. పల్లపు నేలకు డిగ్గి పడిపోయినది. జలదేవతలు వచ్చి చలపెట్టగా కిన్నెర మరిమరి పతిచుట్టు తిరిగి వలవల యేడ్చినది. విడలేక విడలేక వీడిపోయినది.

5

'కిన్నెర నడక'లను శీర్షికలో జలదేవతల ప్రసక్తి వచ్చినప్పటినుండి శృంగారచ్ఛాయలు కానిపింపవు. కిన్నెర ముగ్ధవలె ప్రసన్నముగ ప్రవహించుట మిగిలిన ఆ భాగమున చెప్పబడినది.

'కిన్నెర సంగీతము' అను శీర్షికలోని కడపటి పాటలో నున్న ముద్దుముద్దుగ నడచుట, ప్రోడవలె నాడుట, మరిపముగ పాడుట అనునవి కిన్నెర కులపాలికా ప్రణయమును సూచించునని తలచితిమి. ఆ విషయము నించుక పరిశీలింతము.

కవికి ప్రకృతమైన కథాగతి వలనను నాయికా నాయకుల విప్రలంభశృంగారమును తీర్చు అవకాశము గలిగినదే గాని సంయోగ శృంగారమును తీర్చుట కట్టి యవకాశము లేకపోయినది. కాని కావ్యమున విప్రలంభముతో నారంభమైన ఆ దంపతుల శృంగారమునకు పూర్వమే సంయోగమున్నది. విప్రలంభమును తీర్చుపట్టున ప్రకృతిగా దాని వింటుక యావిష్కరించినను అది అసమగ్రము. మరి వారి సంయోగ శృంగారమును కవి యేశిల్పమార్గముననైన తీర్చి పాఠకుని చర్వణ కందించినచో నీ ప్రకృతమైన విప్రలంభమునకు పుష్టి యేర్పడును. నాయిక జీవితమే—అనగా నామె కులపాలికా ప్రణయమే—ఈ కావ్యమున ప్రధానమైనది గనుక యిట్టి నిర్వహణతో దానికిని సమగ్రత లభించును.

'కిన్నెర నడకలు'లో కడపటి పదునైదు పాటలలో కవి కిన్నెరసాని నవవధువుగా మగని ఇంటికి వచ్చుట తీర్చినాడు. కిన్నెర నృత్యమున నాయిక ప్రౌఢ శృంగారము, కిన్నెర సంగీతమున తార్తీయ పురుషార్థ సాధన ఫలముగా నాయిక ప్రజావతి యగుట, ఈ మూడింటి నిట్లు కవి యుద్దేశపూర్వకముగా తీర్చినాడనియే నా నమ్మిక. ఈ సంవిధాన మంతయు ప్రకృతమైన కథాగతికి సంబంధించనిది గనుక శిల్పమార్గమున నిముడ్చవలసివచ్చినది.

ఇట్లుగా నున్న నాయిక కులపాలికాప్రణయమున కొంత పూర్వవృత్తము—ఒకింత కోరికగా మనసున ఒదిగి యుండెనదని తలపవచ్చును. ఏలనగా కిన్నెర ప్రజావతియా కాదా అన్న విషయమును కవి తన కథాకల్పనలో నెక్కడను తెలుపలేదు. పురుషునకంటె స్త్రీప్రకృతి ఎక్కువగా కామభావపరిలిప్తము. యౌవనమున నిది ఎట్లుగా విరిసినను దానియందు మాతృత్వవాంఛ యొకటి బీజభూతముగానుండి వయసు తేరిన పిదప ప్రసన్నతాపరిష్కృతియ నందును. ఈ రెండును తజ్జ్ఞు లెరుగుదురు. ఈ కారణముచే ముందు చెప్పిన నా యూహ నిజమైనను కాకపోయినను అనుభవమునకు ఒదిగివచ్చు ననుకొనుటలో తప్పు లేదనుకొందును. మరి, కిన్నెర సంతానప్రాప్తిని కవి కథాకల్పనలో తెలుపనేలేదుగదా అన్న ఆక్షేపణ తొలగును. నాయికా నాయకుల విప్రలంభము

ప్రత్యేకలేమి స్థిరపడి కరుణముగా మారుసరికి, ప్రకృతి సహజమై బలీయమైన మాతృత్వవాంఛ నాయికకు సిద్ధించినది కాదే యనిపించి ఆ కరుణమునకే ఉపస్కారకము కాగలదు. ఇట్టి యూహలతో మన మీ రాబోవు భాగముల జూడవలసి యుండును.

'కిన్నెరనడకలు' అను శీర్షికలోని పాటలు కావ్యమునందలి కథాగతికి ప్రకృతమైన రీతిగ నాయికయగు కిన్నెర భర్తవెంబడి రాయవలసివచ్చి విడలేక విడలేక పోలేక పోలేక పోవుటను వర్ణించును. ఇచట మనము కిన్నెర జీవితమున కలిగివచ్చిన ఒక దశావిపర్యాసమును మనసుకు తెచ్చుకొనవలెను. ఇప్పుడు విడలేక విడలేక పతినెట్లు విడిచి చనుచున్నదో అట్టే కిన్నెర మునుపటిదినాల నొకనాడు ముద్దరాలగు క్రొత్త పెండ్లికూతురుగ అమ్మనాన్నలను అన్నదమ్ములను అప్పలను చెల్లెలులను విడలేక విడలేక విడిచి రాలేక రాలేక మగని వీపుల వెంటబడి నడచి వచ్చినది. 'కిన్నెర నడక'లను శీర్షికగూడ దీనినించుక సూచించును. ఈ దశావిపర్యాసమును మనసున బెట్టుకొనియే కవి ఈ శీర్షికలోని చివరిపాటలలో విప్రలంభమును స్పృశింపక మాధుర్యమును ప్రసన్నతను తీర్చి చూపినాడు. అది నదీపరముగ ప్రకృతముగూడ. కనుక ఆ మాధుర్యము, ప్రసన్నత నాయిక పూర్వజీవితముతో ననుసంధానము చేయదగినవి. నాయిక జీవితమున దశావిపర్యాస మేర్పడినదంటిమి గనుక కిన్నెర నడకల లోని చివరిపాటతో ఆరంభించి విప్రలంభము కడసారిగా చెప్పబడినంతవరకు ఆయా భావముల ననుకొనుచు బోవలెననుట శిల్పధర్మము. అట్లే నదీపరమగు అన్వయమును విడువవలయుననుట గూడ శిల్పధర్మమే యగును.

మగనివెంట అత్తగారింటికి బయలుదేరిన క్రొత్త పెండ్లికూతురు కిన్నెర. కవి యామె నిట్లు వర్ణించుచున్నాడు:

ఎంత ఒయ్యారిమో ఎంత నెమ్మది చానో
అంత ఒయ్యారమ్ము అణుగడుగు పోయింది
అంత ఇల్లాలి నెమ్మదితనము మాపింది.

కిన్నెర సహజముగ ఒయ్యారము గలది. భర్త యెదుట క్రీడాకుంచితమైన ఆమె యంగముల యొదుగుల నా యొయ్యారము పైకుబికివచ్చినది. ఆమె నెమ్మదితనము గలది. సహజమైన నెమ్మదితనము తానిప్పు డిల్లాలి నను జ్ఞానముచే ప్రయత్నపూర్వకముగ సంభావితమై నాయికచే ప్రదర్శితమైనది. క్రొత్తగా పెండ్లియైన పడుచులు పెద్దతనము నభినయించుట చూడవలసిన ముచ్చట. ఆ మాధుర్య మిట తీర్చబడినది.

పతివంక చూచుచూ
పడతి కిన్నెరసాని
పోయేటి వేళలో భూమి తనంతగా
తోరమై విరియుచూ త్రోవగా చేసింది.

కిన్నెర నవవధువు. ఆమెకన్నులు మగని నోముచున్నవి. అతడామెకు సర్వవిధముల నాశ్రయము. ఆమెదృష్టిలో నాతడేకైకవీరుడు. అతని వీపులవెంట బడి నడచున దామె. అతని నడకల చాళ్ళలో బడి తాను నడుచుచుండగా దగ్గరితనముచే కాలిబాట ఆమెకు మహాత్స్ఫురితమై భూమి విచ్చుకొని దారియిచ్చినట్లుగ తోచినది. ఇట్టి యూహతో నామె మగనిమీది విశ్వాసమును దృఢపరచుకొని సంతోషించినది.

ఎంతదూరముపోరొ
నంతదూరముదాక
తెరవ కిన్నెర వెన్క తిరిగి చూచుచు పోరొ
పడతి కిన్నెర తిరిగి పతి చూచుచును పోరొ
నాతి కిన్నెర తిరిగి నాథు చూచుచు పోరొ.

కిన్నెర అత్తవారింటి ప్రయాణమున కొంతసేపు వెనుకచూపు, కొంతసేపు ముందుచూపు. తల్లిదండ్రులు అన్నదమ్ములు అప్పలు చెల్లెలులు తనయిల్లు తాను తిరిగి ఆడినచోట్లు తానున్నయూరు—ఇన్నింటి నామె విడచుచున్నది. మనస్సు వెనుక కీడ్వకెట్లుండును? ఆ ముందు నడచుచున్న మగనిమీదిమాపే ఆమె నట్లీడ్చుకొని ముందుకు పోవుచున్నది. అది ఎంత బలవత్తరమో చెప్పుటకే కవి దానిని ద్విరావృత్తము చేయుట.

కోకిలా తన గొంతుకొన విచ్చి పాడింది
పికిలిపిట్టలు మేలిరకముగా కూసినై
వనదేవతలు పూలు పైక్రుమ్మరించారు
భూదేవతలు ఎదురువోయి దీవించారు
వాయుదేవతలు రమ్యని పాట పాడారు.

ప్రయాణవేళ కొంతదూరము పోవువరకు శకునములు చూతురు. శకుని అనేది అమంగళసూచకముగా కూసెడి యొకపక్షి—దానిని గబ్బిలు గందురు. అట్టి అమంగళముల పరిహరించుటకే శకునము చూచుట. ఇచట కిన్నెరకు కోకిలపాట పికిలిపిట్టల యరపులు వనదేవతల పుష్పవృష్టి బ్రాహ్మణాశీర్వాదములు అనుకూలవాయువులు—అన్నియు శుభశకునములె. శాకుంతలమున చతుర్థాంకము జ్ఞప్తికిచ్చుచున్నది గదా!

పరికిణీ తొక్కాడు పదియేండ్ల కన్నెలా
చిన్నిగంతులు వేయు తెల్లనా బెయ్యలా
పసిపాప పెలవిహారిన బోసినవ్వులా

కిన్నెర నడచినది. 'ముద్దరాలి మనస్సు పొంగి వచ్చి'నది. నిర్జనమగు వనమార్గము—వట్టియుల్లాసపు గంతులుగా నడకసాగినది. గురుజనసామీప్యపు భయమేమాత్రమును లేని ఆ ప్రయాణముతీరది. అంతలో మనసు వెనుకకీడ్చి తలిదండ్రులు తలపునకు వచ్చినారు. తాళిబొట్టు తెలుసుగా తోచినది.

వదలగాలేక యీ ముదిత కిన్నెరసాని
తల్లి దగ్గరనుండి తన మెడకు పలుపోసి
లాగగా ఒడ్డటి లేగలా——

సాగినది.

విడలేక విడలేక పడతి కిన్నెరసాని
చనలేక చనలేక చానకిన్నెరసాని
పోలేక పోలేక బాల కిన్నెరసాని

తల్లిదండ్రుల విడలేక మగనివెంట పోలేక ఎట్లో నడకసాగించును. ఇట్లు నడక మందగించుట చూచి మగ డూరకుండునా? 'పదపద' మన్నాడు.

పదమంచు పదమంచు బలవంత పెట్టంగ
మరిమరీ పతిచుట్టు తిరిగి కిన్నెరసాని
వలవలా ఏడ్చింది. పలపలా కుందింది.

బీదవడిన తన మనసుకు తోడుగా మగడు పద పదమనేటికి దుఃఖము పొంగివచ్చినది. మొగము చాటుచేసుకొనుటకైన అడ్డములేదు—అతనినే చాటుగా చేసుకొని ఆవైపు ఈవైపుగా కదిలాడి వలవల ఏడ్చినది. పలపల కుందినది. ఎట్లో మనసు గట్టిచేసుకొన్నది. ఏడ్పు తగ్గించినది.

(అవి) సన్నగొంతుతో
నవరి కిన్నెరసాని
రొద యాడించిన పావురాగొంతుకవోలె
తనలోన తానె మెలమెల్ల రొదచేసి
కొనుచు పల్లపునేలకును దిగ్గి పడిపోయె.

ఏడ్పు నెట్లో ఎక్కిళ్లుగా చేసుకొని, కిన్నెర తనలో తాను కుములుచు ఆ యడవిమార్గాన లోయలోనికి దిగి నడచినది.

పదపదమన్నాడే కాని మగని కామె ఏడ్చినంత నే ఓదార్చుకొనవలెనని తెలియదు. అది తెలియక నే గదా చివర కాతడు పతిశీలరైన కిన్నెరను పోగొట్టుకొన్నాడు. కొంతదూరము నడచిన పిదప ఓదార్పవలెనను ఊహ వచ్చినది. అది కొంచెతగ్గు. ఆమె నడచి నడచి అలసి అతని ప్రక్కన నిలచినది. చేసిన తప్పునకు ప్రాయశ్చిత్తముగ మగడామెను ఎల్లని తన దీర్ఘ బాహువులలో పొదివి కొనబోయెను. ఒడలు నిమిరెను. ఆమె చిరుకోపము పూనెను. వలదన్న కొలది యామె పదములొత్తెను. ఆమె యందాలకుప్ప యని పొగడెను. ముద్దులాడెను. ఆమె తల నెదపై జేర్చికొని విశ్రమింపజేసెను. ఇది కిన్నెర కులపాలికా ప్రణయమున మొదటిఘట్టము - ఎక్కడో వనమార్గమున కొండతెగ్గుల చెట్లనీడల నెలసిన బాహ్యశృంగారము. గ్రామీణుల శృంగారవైభవము లిట్టులేగదా యుండును. ఇట్టి కిన్నెర దంపతుల ఈ శృంగారము వారి యుత్తమ ప్రకృతిచే ఉత్తరరామచరితమునందు సీతావనగమనాయాసమును రాముడు తీర్చుటను జ్ఞప్తి కెలయించుచున్నది. రాముడు చిత్రపటసందర్శనవేళ జ్ఞప్తికి దగిలిన ఆ యనుభవమును భవభూతి యిట్లు చెప్పించినాడు:

అలస లలిత ముగ్ధా న్యధ్వ సంపాతఖేదా
దశిథిల పరిరంభై ర్దత్త సంవాహనాని,
పరిమృదిత మృణాళీ దుర్బలా న్యంగకాని
త్వ మురసి మమ కృత్వా యత్ర నిద్రా మవాప్తా.

కిన్నెర దంపతుల పురావృత్తమైన శృంగారము నిట్లుదిద్దికొనుచు పోగా కవి విప్రలంభమార్గమున నాయికాస్మృతిగా వెలయించినదానితో లంకెపడుచున్నది. కిన్నెర నాడు తానట్లు వచ్చినది; నేడిట్లు పోవుచున్నది. ఆ తమ యిరువురిమధ్య నుండిన దాంపత్యబంధ మీ శృంగారము-ఈ కీలకము నెరిగియే కవి యిట్లు తీర్చుట.

6

'కిన్నెర నృత్య'ము'న కవి నాయిక ప్రోషితపు శృంగారము నొదిగించినాడు. అది కిన్నెర వాగైనప్పటి జీవితమునకు సంబంధించక పోవుటయే స్ఫుటప్రతీతికి లేబడకపోవుటకు గల కారణము. కవి వ్రాసినది పాటలు - నిరతిశయమగు ఆనందమో అనుభవమో పాటగా అభివ్యక్తమగును. ఈ కారణముచే కవి యింగు నాయిక అభ్యంతరశృంగారమును స్ఫురింపించినాడు. అట్లు లీలగా కాన్పించు నాయికాశృంగారము దాంపత్యధర్మమున పరినిష్ఠితమైన కేవలాభ్యంతరమార్గమునకు చెందినది. ఈ కారణములచే వ్యాఖ్యానము మాటయటుండగా వాజ్మాత్రమైన సూచనముగూడ నది సహింపదు. సూచించుట రసభంగమునకు కారణమగుటయే కాక ఉత్తమాభిరుచి పద్ధతియు గాదు. కవి ఈ పాటలలో వాడిన శబ్దజాలమునుబట్టి యీ శృంగారస్వరూపము

నూహింపవలసి యున్నది. అయినను నా యన్న మాట కాధారము నాపుకొనుటకై ఒకటి రెండు పాటల నుద్ధరించి బాధ్యత తీర్చుకొందును.

సోన జారుతూ నీటి
పస వాలుతూ అంబ
మున సోలుతూ కిన్నె
రటు చెదరి యిటు చెదరి
(చిన్నారి నడలతో పొన్నారి నవ్వుతో)
వన్నె చిన్నెలు పోయె నే- కిన్నెరా
క్రొన్నెలా తళుకొప్పె నే.

చంద్రకళ తళుకొప్పినదన్న చివరిమాట సంకేత మార్గమున నాయిక భావోదయస్థితిని సూచించుచున్నట్లుగా గ్రహించుటలో విప్రతిపత్తి యుండదనుకొందును.

తెలిమబ్బులో చెమ్మ
టలు చిమ్ముతూ అలస
టలు క్రమ్ముతూ కిన్నె
రటు సొక్కి యిటు సొక్కి
చిఱుమీనుకనులతో-శ్రమమీను కనులతో
సోగరేకములు వోయె నే- లోగొంతు
రాగాలు వెలయించె నే.

ఈ పాట భర్తృహరి శృంగారశతకములోని
ఉరసి నిపతితానాం స్రస్తధమ్మిల్లకానాం
ముకుళితనయనానాం కించిదున్మీలితానాం,
ఉపరిసురతఖేదస్విన్నగండస్థలానాం
అధరమధువధూనాం భాగ్యవంతః పిబంతి.

అను శ్లోకమును చూచాయగా మనసునకు దగులజేసి నాయిక అక్రమరతిని సూచించునని తలచుట అంత నిరాధారమైన తలంపు కాదని తజ్జ్ఞు లంగీకరింతు రను కొందును. ఇట్లె మిగిలినపాటలలో నెల్ల రసికులు యథాసంభవముగా సూచనల నందుకొనవచ్చును.

7

'కిన్నెర సంగీతము'న కోరికమాత్రముగా కిన్నెర మనసున గునిసియాడిన సంతానప్రాప్తి చెప్పబడినది. ఫలించని కిన్నెర కోరిక వాగైన యామె సంగీతపు టూత్పులలో నిట్లుగా విరిసినదనుట బాగుండును. కవి తెలుపక పోయినను కిన్నెర సంతానవతియే యను కొన్నచో నే తంటా లేదు.

లోకమున ఎల్లరకు కామతృప్తికంటె సంతాన ప్రాప్తి ఉదాత్తమగు నానందమునకు కారణము. అంతర్వత్ని యగు స్త్రీ నెలతప్పినదాదిగ అదియొక నిరతిశయానందము ననుభవించును. కూనిరాగములు పోవును. అట్టియానందమే యిందు గీతికారూపమున సంతరింపబడినది.

ఈ భాగమున గల పదునైదు పాటలలో కవి మధ్యనో చివరనో ఎక్కడో ఒకచోట కొన్ని భావముల బొదిగినాడు. వాని క్రమానుసంధానము అంతర్వత్ని జీవితమును లీలగా గోచరింపజేయును. మొదటి పాటలోని 'క్రొంగొత్త తేనెకాలువ లూరెనో అమృతంపు వానచినుకులు జారెనో' అన్నమాట లాధాన మార్గమునకు సూచకములు.

అంచకన్నియ పాట రొల్లు అడవి సాగినయట్లు
అతివ కిన్నెరపాట అతిసన్నగిలిపోవ
పొదలలో, సనసన్న
తెరలలో, చిఱుగాలి
యూపాట సాగించెనో-ఉయ్యాల
తోపాటు వూగించెనో.

తల్లి తనబిడ్డ నుయ్యాలలో వైచి గట్టిగ జోలపాడుట, అది దూరమునకు విన్పించి క్రమముగ సన్నగిలిపోవుట యిందలి వస్తువు. ఈ రెండు భావముల నడుమ అందాలరాక, జిలుగుగంటల మ్రోత, చిన్నారి బిగువునవ్వులు, వింతగా సిగ్గందుట, గొంతులో కోకిల కదలాడుట, తెలతెల్లనగుట, జరుగులాడుట, విరియుట, పాటతానమరుదుట, ఆనందజలధితో లోకాలు పులకితమగుట, 'చిలుక' తంగేటిజుంటితేనె చిక్కనవోని 'చిన్ని' పాట జీరపోవుట, పసిలేళ్లు బెదరుచూపులు చూచుట, మైనిగలు నదరుచూపుట—అను భావము లున్నవి. ఇవి యన్నియు స్వయముగనో సంకేతమార్గమునో శబ్దగంధముగనో అంతర్వత్ని జీవితదశాక్రమము నందించును. వాని యనుసంధానము నూహించునది.

ఇల్లాలు బిడ్డగన్నచో ఇంటిలో నామె యధికార మిబ్బడి యగును. ఆమెమాట ఆ యధికారముతో కంచుగీసినట్లు ఖంగున మ్రోగును. ఇల్లు పిల్లలతో ఆమె తన ఐహికాముష్మిక జీవితములు సాధింపబడిన వని తలచును. ఆ యానందమున తన్నుదాను మరచి పోవును. అట్టి చరితార్థతయే ఈ క్రిందిపాటలో సూచింపబడినది.

కంచుగీసినయట్లు కదలు తరగలతోన
మించె కిన్నెరపాట మేలిపోకల సొంపు
నిగ్గులో, అందంపు
జగ్గులో, వనమెల్ల
ఒకపాటయై పోయెనో—తనుదాన
వేఱుగ లేకె పోయెనో.

కిన్నెర శృంగారజీవితమున గల మేలిపోకల కిది కడమెట్టు. ఈ శృంగారమే కిన్నెర తాను కులపాలికగా సాధించిన, సాధింపదలచిన త్రివర్గఫలము.

అర్ధరాత్రివేళ

శ్రీ పి. గణపతిశాస్త్రి

అర్ధరాత్రివేళ ఒక
అభాగ్యరాలు! వృద్ధురాలు!
అమ్మా! అని అరిచి బిచ్చ
మడిగెను కడుపేదరాలు!

బ్రతికి చెడెను పాప మామె భర్త రోగి లేవలేడు
పదిమందికి తెలియకుండ పట్టెడన్న మడగలేక
దిగులు బరువు మోయలేక సగం చచ్చి చావలేక
దిక్కుమాలి ఒంటరిగా దిగాలుపడి దీనంగా

అమ్మా! అని పిలిచి అలిసిపోయె నామె నీడలీల!
అర్ధరాత్రి లోకమంత హాయిగ పవళించువేళ!

సుతు లెవ్వరు లేరేమో! గతకాలంనాటి గాథ
స్మృతిలో శూలం జీవితగతిలో ఎడతెగని బాధ!
ప్రతినిమిష మదే యాతన! బ్రతుకే దుర్భర వేదన!
మృతికే దయ కలిగినదో! గతించెనో! దీనురాలు!

అమ్మా! అని దినదినమ్ము మూల్గె నామె నిద్దురలో
అర్ధరాత్రివేళ నా హృదంతరాంధతామసిలో.

కాశీఖండము : కావ్యత్వము

శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రి

శ్రీనాథుడు కాశీఖండము రచించునాటికి పరిణత వయస్కుడు, పరిణత వచస్కుడు కూడ నైనాడు. ప్రౌఢ నిర్భర వయఃపరిపాకమున భీమనాయకుని గొనియాడునాటికే కవితోపహారముల నీశ్వరార్పనము సేయు కళ వన్నెలు తేరినది. ఇపుడు వయఃపరిపాక జనితమైన వివేకముతో వక్తకు శ్రోతకు శుభానంద పరంపరావహముగ, స్కాందపురాణాంతర్గత కాశీ ఖండమును కావ్యముగా సంతరింప సమకట్టినా డా కవిసార్వభౌముడు. ఆ విషయమును కృత్యాదిని దా నే యిట్లు నుడివియున్నాడు.

స్కాందపురాణ సంహితకు
 ఖండము లేబది వానిలోన నా
నందవనానుభావకథ
 నంబున శ్రోతకు వక్తకున్ శుభా
నంద పరంపరావహము నైజగు
 ణంబవు గాశిఖండ; మా
కందుకవయే తెలుంగి నను
 కట్టితి కావ్యముగా నొనర్పగన్.

పురాణసంహిత లన్నియు వినువారికి వినిపించు వారికి శుభానందపరంపర లొసగూర్చునవనుట సహజ సిద్ధమైన విషయము. అందును స్కాందపురాణాం తర్గతమై వారాణసీ మాహాత్మ్య ప్రతిపాదకమైన యీ కాశీఖండము ప్రశస్యతరము. ఆ విషయమును గ్రహించి శ్రీనాథు డట్టి కాశీఖండము నొక కావ్యముగా నొనర్ప సమకట్టెనని తెలియుచు నేయున్నది. అనగా పురాణఖండము నొక సమగ్ర ప్రబంధముగా సంతరింప దలపెట్టెననుట యిట వ్యక్తము. శ్రీనాథు డీప్రబంధ మును రచియింప దలపెట్టినను, యథామూలముగ నాంధ్రానువాదము సాగింపక తన రచన కుత్తము కావ్యత్వము సిద్ధించుటకు, దనకు గల భావనాప్రౌఢిని వెలువరించుటకు స్వేచ్ఛానువాదము సాగించుచు, మూలమునకు గొంతమార్పు చేర్పు సమకూర్చుచు నే యుండెను.

కాశీఖండమును యథామూలముగ ననువదించి యుండినచో నది పురాణఖండమే యై యుండెడిది. దీనికి గావ్యత్వ మాపాదించుటకై యాతడు ప్రకరణోచిత కథావస్తుసమున్మీలనము గావించుచు, రసభావ సము న్మేషము గావించుటకై కొన్ని పట్టులందు పెంచినాడు. కథాగమనకు విరోధము లేకుండ గొన్ని తావులందు వర్ణ నాంశములను పెంచినాడు. ఆనాటికి దనయనుభవము నకు గోచరమైయున్న వివిధ శాస్త్రవిషయముల నద వెలికి యుతికించుచు వచ్చినాడు. కావ్యమునకు బర మము బరమము నగు ప్రయోజనమైన కర్తవ్యాకర్తవ్యోప దేశమును కాంతాసమ్మితముగ గావించుచు వచ్చి నాడు. ఈ దృష్టితో బరికించిన నీ కాశీఖండమునందలి యుపాఖ్యానము లన్నిటను ఇన్నియో కొన్నియో విశే షములు గానవచ్చుచునే యుండును. ఈ కాశీఖండ కావ్యరచనాకాలము నాటి కాతని కలవడిన రచన పద్ధతియు గడు విలక్షణమైనది. దక్కని శయ్యాసౌభా గ్యముతోపాటు తెలుగు నుడికారపు దీగులీయములు గనుసుదీరినవి. ఎట్టి భావమునైనను శ్రుతిమధురముగ వినిపించు పరిపాకదశ రచన కలవడినది. ఇట్టి ఘటితిలో నాతడు వినిపించిన గుణనిధి చరిత్రము నొకమారు పరి కింతము.

వీడాఖ్యానములుగల యీ ప్రబంధములో గుణనిధి చరిత్రము చతుర్థాశ్వాసమున్నస్థితమై నాయకమణివలె నున్నది. కాశీఖండమును బఠించెడి పాఠకుల హృదయ ముల కీ చరిత్ర మొక ప్రత్యేకాకర్షకవిషయము. దీనికి ప్రధాన కారణముగా ఈ కుబేర వృత్తాంతమునం దొక్కటనే కావ్యమున కుండవలసిన సకలసామగ్రియు సమకూడియున్నది. ఇదియొక ప్రత్యేక కావ్య మనదగిన తీరున రసభావ సామగ్రి, నీత్యుపదేశము, రచనా చమ త్కారము, ఇతివృత్త విస్తృతియు నిందు జతకూడి యున్నవి. ఈ కావ్యమునకు శాంతము ప్రధానరసము. శౌద్రకరుణాద్భుతము లంగరసములు. తత్తద్రసోచిత వస్తుసమున్మీలనము భావోచితబంధనిబంధనముతో జాలు

వాఁడివని. శృంగార రసభావన సంపూర్ణ మేపాటియు దీనికి లేకుండుటయే దీనికిగల విశిష్టతలలో ముఖ్యమైనది. తత్తత్కృతి యెట్లు పొసగియున్నదో వివరించుటకు ముందు, ఈ వృత్తాంతమునందలి కథను సంగ్రహముగ దెలిపెదను.

కాంపిల్య నగరవాసియైన యజ్ఞదత్తుఁడను విప్రునకు గుణనిధి యను సుతుం డుదయించును. అతఁ డుపనీతుఁడై విద్యలు నేర్వక జూదరియై, ఇంటనున్న బహుమూల్యవస్తువులన్నియు వెచ్చపెట్టుచు తిరుగుచుండును. గుణనిధి తల్లి యాతని దుర్వృత్తమును దండ్రి తెలియకుండ మఱుఁగు నుంచుటచే నాతఁడు చెడిపోవును. యజ్ఞదత్తుఁ డొకప్పుడు రాజాలయము నుండి తన యింటి కేతెంచుచు, వీథిలో నొక జూదరి వ్రేల తన యంగుళీయక ముండుట చూచి, వానివలన తన పుత్రుని జూదరితనము నెఱింగి, యింటి కేతెంచి, యిల్లాలి నా యుంగరము దెచ్చి యిమ్మనును. అప్పటికిని నామె యసత్యముచే తెలుపుటచే యజ్ఞదత్తుఁ డాగ్రహించి మఱియొక భార్యను బరిగ్రహించును. గుణనిధి తన తండ్రికోపము నెఱిఁగి, యింటికిఁ జేరక, యూరు విడిచి పోవుచుండ, నూరు బయట నొకచోట శివలింగ స్థానమున శైవుఁడొకఁడు పూజోపహారముల సిద్ధము చేసికొనియుండును. క్షుధావ్యాకులుఁడైన గుణనిధి చౌర్యవృత్తిచే నా వంటకము గొనిపోవుచుండ, నర్ధరాత్రిసమయమున నచటివా రాతని చోరుఁడని యెంచి పట్టి చంపుదురు. నాఁడు శివరాత్రి యగుటచే, నాహారము లభింపకయైన నుపవసించుట, చౌర్యమున నన్నము నపహరించుటకై జాగరము సేయుట, అల వోగానైన నన్యులు చేసిన శివపూజ గాంచుట యను నీ సుకృతమువలన నాతఁడు శివదూతలచే గొనిపోఁబడి మఱుసటి జన్మమున కళింగాధిపతి యగును. ఆ జన్మమున శివాలయములలో ననంఖ్యముగ దీపదానములు చేయించుటచే దత్సుకృతమున దదనంతర జన్మమున విశ్రవస్సను మహర్షికి పుత్రుఁడై జన్మించి, కాశీక్షేత్రమున బదివేల వత్సరములు తపమాచరించి, కుబేరుఁడై పరమేశ్వరుని నెచ్చెలికాఁడై దిగధిపతి యగును. జూదరియైన యజ్ఞదత్తుని కుమారుఁడు కుబేరుఁడగుట యిందలి ప్రధాన కథావస్తువు.

ఇట్టి యీ యితివృత్తమునకు వివిధ రసభావ భావనాయోగ్యమైన కావ్యసామగ్రి కవిసార్వభౌమునిచే నేతీరున జతగూర్పఁబడినదో యోజింతము.

“మృగయా మద్య పైశున్య వేశ్యా చౌర్య దురోదర పరదారాభిగమనంబులను సప్తవ్యసనంబులు నవయౌవనారంభంబున సంభవించెనేని వాని బరావర్జింప నెవ్వరు నేర్తురు.” అను సార్వకాలికమైన యీ సూక్తి గుణనిధి ప్రథమ ప్రవృత్తిలో సమన్వితమైనది. గుణనిధి వేదవేదాంగ వేదార్థవిత్తముఁడైన యజ్ఞదత్తుఁడను శ్రోత్రియువంశమున జన్మించినను, గుణవృత్తిని గృహ్యోక్తవిధి నుపనీతుఁజేసి యాచార్యునొద్ద జదువఁబెట్టినను, నాతఁ డసేతి నిజాచారుఁడై, చదువుసంధ్య లుజ్జగించి, ద్యూతక్రీడారతుఁడై కితవులతోఁగూడి వీసం తయుఁ దిరుగుచుండెడివాఁడు. సజీవ నిర్జీవ ద్యూతంబుల నోడిన ధనంబులకై తల్లి మేని రత్నంబుల నమ్మి, కితవుల కిచ్చుచుండెడివాఁడు. యజ్ఞదత్తుఁడు తనపుత్రుని దుర్వృత్తము నెఱుఁగనేని చక్కఁ బెద్దగలవాఁడే. కాని రాజాలయమునకు రాకపోకలు సాగించుచు గృహకార్యధ్యంతరవ్యగ్రుఁడై కొడుకు వర్తనంబు పరామర్శింపకయుండెను. ఎప్పుడేని బుత్రుఁ డింట గానరాకుండుట చూచి, “కొడుకేమయ్యె?” నని తల్లి నడుగ, నామె యాతని దుర్వర్తనము భర్తకెఱుఁగనీయకుండ మఱుఁగుచుండెడిది. యజ్ఞదత్తుని యిల్లాలికి దనపుత్రుఁడు సన్మార్గవర్తనుఁడు గావలెనను నాకాంక్ష యున్నను, భర్తకు పుత్రుని వర్తనము నెఱుఁగనీకుండుటకు గల కారణ మీ తీరుగ జిత్రింపఁబడినది.

కొడుకీఁగి కన్న బిడ్డండు గావున
నొక్కఁడుండు గాన నుత్పలాక్షి
ధూర్తుఁడైన వాని దుశ్చేష్టితములెల్ల
నధిపు నెఱుఁగనీక యణఁచుచుండె.

ఏకాలమునందైనను తల్లులు పుత్రవాత్సల్యప్రేరితలై బిడ్డల యాగడములు తండ్రుల కెఱుఁగనీక వారు ధూర్తులగుటకు మూలకారణ మగుచుందురను విషయ మిట దెల్లమైనది.

“గురువచనం బతినిర్మలం బయ్యు సలిలంబునుం బోలె నధివ్యనకు శూల పుట్టించు.” ఇదియు గాలానపేక్షముగ సమన్వితమగు నీతి. పెద్దలు సేయు నుపదేశము నిర్మలమైనదియే యైనను దౌర్భాగ్యునకు, చెవిలోఁబడిన మంచినీటివలె పోటు పుట్టించును. గుణనిధితల్లి యాతని ధూర్తచేష్టితములు మాన్పించుటకు నుపదేశములు పెక్కులు చేసెను. “తండ్రీ! మీ తండ్రి కోపకారుఁగదా! నీవు చేయు దుశ్చేష్టిత మెఱిగిన గల్లలాడుమ గప్పి పుచ్చుచున్న

నన్ను జంపివేయును. నీవు పుట్టినకులమునకు గల మర్యాదను దలచి, రాజమాన్యుడు సదాచార సంపన్నుడు నగు నీజనకు దలచి, పతివ్రతయైన నన్ను దలచి, పరమేశ్వరానుగ్రహమున శ్రేష్ఠయింటి నెదారపై పుట్టి యిరువదియేండ్లు గడచిన నిన్ను, పదుదాఱేండ్లప్రాయముగల నీ భార్యను ఉత్తములైన యత్తమామలను గణించి, వివేకవంతుడవు కావేమయ్యా!" అని ముందుగ సౌమ్యముగ బోధించినది. మఱియు, "నీవిట్లు వెఱ్ఱివాడవై ధూర్తులతో గూడి చేయు ధూర్తకృత్యములను భూకాంతు డెఱిగెనేని ముందుగ సోమయాజికిచ్చిన వృత్తులన్నియు దీసివేసికొనును. నీ మూలమున నందఱము కూడుగుడ్డ లేనివార మగుదు"మని భయపెట్టినది. ఇంతియగాదు. నీవు చేయు కొఱ్ఱతనములు చూచి జనులు, ముందుగ నీతండ్రిని తరువాత నిన్ను వెగటాళి సేయుదురు. ఆ వెనుక దల్లిజాలు బిడ్డ డీతడని నిన్ను గూర్చి నన్ను నుదినము నిందింతురనియు, లేనిపోని యపవాదములు నాపైబడునని యు వెఱపించినది. చివర కిట్లు బతిమాలుకున్నది:

అవినయ నిధాన మగు నీ
నవయౌవన శైశవముల నడిమి వయసునం
గలిసెను వ్యసనోద్రేకం
బల గాఢము దీని మానుమయ్య కుమారా!

ఇది యొక యుత్తమమైన సూక్తి. నూతన యౌవనబాల్యముల నడుమ నుండెడి వయస్సు సకలావినయములకు నెలవు. ఈ సమయమునందే మానవుడును దుర్వ్యసనములకు బాల్పడును. ఆసమయమున మీద బడు వ్యసనోద్రేకమును మాన్పుకొనకున్న వాని జీవితము విషాదపర్యవసాయియగును. విద్యావినయవివేకములతో నా యవినయమును నణచికొనినవాని జీవితమే సుఖపర్యవసాయి కాగలదను సదుపదేశ మిట సువ్యక్తము.

గుణనిధికి దల్లి యెంతయు వివేకసహితముగ బోధించినది. కాని దురోదరవ్యసనమున బారము ముట్టిన యాతనికి పలుకు లేపాటియు జెవికెక్కలేదు. తల్లి యెంత మాటుపఱచినను దాగక యొకనాడాతని దుశ్చరితము బయటబడినది. యజ్ఞదత్తు డొకనాడు రాజాలయమునుండి యింటికి వచ్చుచుండ, వీథిలో నొక జూదరి వ్రేల దన యుంగరమును జూచెను. దానిని బాగుగ బరికించి, అది తన సొమ్మగుట యెఱింగి, అతఁడు క్రీడాశీలుని గదిసి, "ఇది నీ కెట్లు వచ్చెనో యున్నరూపు చెప్పు. లేకున్న భూపాలు నెదుటబెట్టి నిన్ను దండింతు"ననెను. ఆ జూదరి గుణనిధి జూదములో నెచ్చుపెట్టిన వస్తువులన్నియు సాంతముగ దెలిపి, అతఁడు క్రీడలో సోమయాజి యనుగుసుతుఁ డెంతగ గడుసుదేరినవాడో వివరించినాడు. ఆ వివృతిని శ్రీనాథు డెంతయో సరసముగ వినిపించినాడు.

అక్షధూర్తులలోన నీ యనుగుకొడుకు
దొరయు నంతటి యక్షధూర్తుండు లేడు
క్షితితలంబున యాగదీక్షితులలోన
కీర్తి నీయట్టి యాగదీక్షితుడు లేడు.

ఈ విధముగ వివరించుటతో గుణనిధి యక్షధూర్తత్వ మసదృశమని తెలుపబడినది. యజ్ఞదత్తు డక్షక్రీడారతుని వ్రేల గాంచిన యుంగరమునకు శ్రీనాథుడు ప్రత్యేకముగ నొక యితివృత్తమును గల్పించిపెట్టినాడు. కాళిదాసు శాకుంతలకావ్యమునం దభిజ్ఞాన వృత్తాంతమున కెంతటి ప్రాధాన్యము కల్పించినాడో, శ్రీనాథు డంతటి ప్రాధాన్యమును దీనికి గల్పించినాడు. ఈ యంగుళీయకమే యజ్ఞదత్తుని వైశ్రవణుని జేయుటకు నిదానము. ఆ కీలెఱిగిన శ్రీనాథుడు మూలములో కంటె దీని యాగమప్రకారమున నొక యితిహాసము కల్పించిపెట్టినాడు. ఈ ఘట్టమున మూల మిట్లున్నది.

శ్లో. నవరత్నమయీం మాతుః
కరతః పితు రూర్మికామ్,
స్వపత్యాః స్తేయకదాదాయ
దురోదర కరేఽర్పయత్.
ఏకదా గచ్ఛతా రాజ
భవనాన్నిజముద్రికా,
దీక్షితేన పరిజ్ఞాతా
దైవా ద్ద్యూతకృతః కరే.

గుణనిధి యొకప్పుడు నిద్రించియున్న తల్లి చేతి నుండి తండ్రి యుంగరమును గొనితెచ్చి జూదరిచేత బెట్టెను. ఒకనాడు రాజభవనమునుండి వచ్చుచున్న యజ్ఞదత్తుడు దైవవశమున జూదరిచేత దన యుంగరమును కనుగొనెనని యీ శ్లోకభావము. ఏత దంగుళీయ కాగమప్రకారము తత్ప్రశస్తియు నీక్రింది సీసములో నెట్లు చిత్రింపబడెనో పరికించిన దాని మహత్త్వము వ్యక్తమగును.

దర్శనం బిచ్చె సిద్ధాని గోమటి క్రొత్త
బొడసూప నేతెంచి భూభుజునకు

తనకిచ్చె నెద్దాని ధారాంబుపూర్వంబు
  పుణ్యకాలమునాడు భూమిభర్త
దానిచ్చె నెద్దాని ధర్మగేహినియైన
  సోమిదమ్మకు మనఃప్రేమ మలర
దఱి చూచి యిచ్చె నెద్దాని బిట్టికి దల్లి
  జూదమాడిన పైడి సుట్టికొనిన
యట్టి నవరత్నమయమైన యంగుళీయ
కంబు యజ్ఞావభృథపుణ్యకర్మసాక్షి
వీటిలో నొక్క జూదరి వ్రేల నున్న
జూచె గను ఱెప్ప వెట్టక సోమయాజి.

ఈ పద్యమున శ్రీనాథుని నాటి పరిపాటులు కొన్ని పరిస్ఫుటమైనవి. ఆనాడు ప్రభువు సెవ్వరేని క్రొత్తగ జూడవచ్చిన వారాతని దృష్టి నాకర్షించువస్తువును గానుకగా గొనిపోవుచుండెడివారు. ప్రభువులకైన దృష్టిప్రియమైన బహుమూల్యమైన వస్తువు లభించిన దఱిచూచి దానినాతడు భూసురులకు దానము చేయుచుండెడివాడు. ఆనాటివిప్రులుస్వర్ణ సంయుతమై, పవిత్రమైన యంగుళీయాదికమును యజ్ఞాది పుణ్యకర్మములందు జేత దాల్చుచుండెడివారు. ప్రణయాతిరేకమున ప్రియు నంగుళీయాదికమును ప్రేయసులు దాల్చు పరిపాటియు ఆనాడుండెడిది. ఈ పద్యము తుదిని కూర్చిన 'యజ్ఞావభృథపుణ్యకర్మసాక్షి' యనునది సాభిప్రాయ విశేషణము. మున్ముందు శ్రీనాథు డాసూత్రించెడి వస్తువైచిత్రి కిది యాలంబనము. ఆ విషయమును క్రమముగ నిరూపించెదము.

గుణనిధి దుర్వృత్తము ధూర్తునివలన విని లజ్జాక్రోధ వివశుడై ఇంటికేతెంచిన యజ్ఞదత్తుని యాకృతి శ్రీనాథుడు కడు మనోజ్ఞముగ చిత్రించియున్నాడు. "అనిన విని లజ్జాక్రోధంబులు ముప్పిరిగొన, యజ్ఞదత్తుం డూర్ధ్వముండితంబైన మూర్ధంబున నీర్కావి దోవతి పరిమురిఁ జుట్టికొని, ఇంటికేతెంచి, మొగంబు గంటువెట్టుకొని, సోమిదమ్మా! ఏమి చేయుచున్నదాన; నిటు రమ్ము. నీకొడు కెక్కడం బోయె? బోవుఁ గాకేమి? వినుము." అని యుపక్రమించెను. ఇప్పటి యీ వచన రచనాక్రమ మత్యద్భుతము. క్రోధావేశ వివశుడైన శ్రోత్రియ సోమయాజి మన కన్నులయెదుట సాక్షాత్కరించును. ఈ పలుకులలో క్రోధపూరిత భాషణ భంగీధ్వని సైతము ప్రతిధ్వనించుచున్నది. సోమయాజి మొగంబు గంటువెట్టుకొని పలికిన పలుకిది :

అంగోద్వర్తనవేళ నీవు దరహా
  సాంకూరముల్ లోచనా
పాంగప్రాంతములం దెరల్ప నొక స
  య్యాటంబు కల్పించి నా
యంగుళ్యాభరణంబు పుచ్చుకొనవా!
  యా యుంగరం బిప్పుడే
శృంగారింపనిచేత భావకునకుం
  జేయ న్హవిర్దానముల్.

దీనికి మూల మిట్లున్నది.

శ్లో. అంగోద్వర్తనకాలే యా
  త్వయా మేఽంగులితో ధృతా,
నవరత్నమయీం శీఘ్రం
  తా మానీయ ప్రయచ్ఛ మే.

అంగోద్వర్తనసమయమున నా వ్రేలినుండి తీసిన నవరత్నఖచితమైన యా యుంగరము శీఘ్రముగ దెచ్చి యిమ్మని యీశ్లోకభావము. పైపద్యమున సయ్యాటము కల్పించి యుంగరము గొనుట, ఆ యుంగరమును శృంగారించుకొననిదే నేనిపుడు హవిర్దానము చేయ ననుటలో భావావిష్కృతి పొడగినది. ఇట్టి భావమును బొడిగించుటకు వలయు బీజములు 'సోమిదమ్మకు మనఃప్రేమ మరల నిచ్చె'ననుటలో, 'యజ్ఞావభృథపుణ్యకర్మసాక్షి' యని యంగుళీకవృత్తాంతకల్పనములో నిమిడియేయున్నది. ఆ యుంగర మీనాటి కనేక పుణ్యకర్మలకు సాక్షిగా నుండెను గావున, నీనాడు చేయవలసిన పంచమహాయజ్ఞము లా యంగుళీయకము లేనిదే చేయననుట పొసగినది. మఱియు సోమిదమ్మ యింతదనుక దనపుత్రుని ధౌర్త్యమును మొఱగుచుండె గాన, నామె కల్లరితనమును బైటబెట్టుటకు వక్రోక్తి గతిని ప్రవృత్తమైన యీ ప్రశ్నపద్ధతి కిది కొంత శృంగారము నొదవింప జేసినది. కాని యీ తుదివాక్యమే సోమిదమ్మ తాత్కాలికముగ దన్ను దప్పించుకొనుటకు గొంత యవకాశమును గల్పించిపెట్టినది. "అనిన నద్దీక్షితాయని దీక్షితున కిట్లనియె—

మధ్యాహ్నసంధ్యాసమాగమం బిది తీర్థ
  మవధరింపుము సంధ్య యాచరింపు
మగ్నికార్యము దీర్పు మభవు బూజింపుము
  పంచమహాయజ్ఞ వరుస నడుము
మొగసాల నున్నారు జగతీసుపర్వులు
  గ్రాసార్థులగుచు పెక్కండ్రతిథులు
పక్వాన్నములు శాకపాకాదికంబులు
  చల్లనాఱిన యేని జవులు దప్పు
బదిలముగ మందసమునందు బరిణెలోన
నునిచి దాచినదాన నా యుంగరంబు

చీర యిప్పుడు పెట్టె శోధించి చూడ
నారగించిన పిదప నే నధిప యిత్తు.

ఈపద్యము మాలాతిక్రమణమున మధురగతిని గొంత ముందునకు సాగినది. దీనిలో శ్రీనాథుని నాటి నిత్యకర్మానుష్ఠానపరాయణులైన గృహస్థు లాచరింప దగిన అనుష్ఠానసరణి నిరూపితమైనది.

సోమిదమ్మచే నిట్లు చెప్పించుట యీ యదనున కంతయు దగియున్నది. జంట నే తనతలపై బడు నాప దను దొలగించుకొనుట కది సముచితోపాయమైనది. ఈ నిత్యకర్మానుష్ఠాన మంతయు ముగిసి, భుక్తిగొను నప్పటికి దీక్షితుని క్రోధావేశము సడలవచ్చునను నూహ సేయుట కిది పరిపడియున్నది. పుత్రవాత్సల్యప్రేరిత లైన వనితలు విషమావస్థలం దెట్లు తప్పుకొనుటకు యత్నింతురో యను విషయము కూడ నీపద్యమునం దభివ్యక్త మగుచున్నది.

ఇంతపదిలముగ సోమిదమ్మ పలికినపలుకులన్నియు సోమయాజి యాగ్రహమునకు మఱింత సముద్బోధకము లైనవి. అతడు కోపావేశంబున దత్తరించుచు, "ఔనె సత్పుత్రజనయిత్రి! ఔనె సాధ్వి! ఔనె సూనృతభాషిణి! ఔనె దేవి!" యని వక్రోక్తులతో సంబోధించి, "నీకొడుకు వేదమెప్పుడు చదువకున్నను చదువబోయెననుట, స్నానము సేయకుండఁ జేసె ననుట, సంధ్యవార్చకుండ వార్చెననుట, సమయమున హోమము సేయకుండినను జేసెననుట నీకు దగు నటవే? ఇట్లు కల్లలాడుటవలన నీకుఁ గలిగిన ఫలమేమి? మాటి మాటికి నేను నీమాటనమ్మి ప్రియసుతుని సరిగాఁ బరి కింపక భ్రష్టుఁజేసితి" నని యజ్ఞదత్తుఁడు పలవించి నాఁడు. ఇచటి యీ సంబోధనము లుక్తివక్రతతోఁ గూడి కావ్యమున కొక క్రొత్త శిల్పము నాపాదించి పెట్టినవి. ప్రకరణోచిత సముదాత్తభావ సమన్వితము లైనవి.

మఱియు యజ్ఞదత్తుడు తాను గష్టించి సమ కూర్చిపెట్టిన బహుమూల్య గృహోపకరణము లన్నియు వమ్మయిపోయినందులకు వాపోయిన తీరుకూడ మధురోదాత్త రచనలో నవతరించినది.

ఏడఁ బోయెనో గదా! వేసలో మంజిష్ఠ
  పెనుపందువను బైటఁ బెట్టనైతిఁ
దాకట్టువడదె యింతకు వైశ్యగృహమునఁ
  గనకబంగారు భృంగారకంబు
పట్టి సూత్రమయంబు పసిడి రెండ్డాణ మే
  యిగురుబోఁడి కటీర మెక్కెనొక్కొ?
శశికాంత పీఠకా స్తంభ లీలారత్న
  సాలభంజిక యెందు సాగెనొక్కొ?
యెచట నున్నదియొకో రత్నఖచితమైన
హంసతూలికడోలావిహారతల్ప

మాచముట్టుగ నీవు నీయింటి కొడుకు
బాడుచేసితి గృహము నిర్భాగ్యురాల!

ఇంటిలో చిరకాలమునుండి దాచియుంచిన బహుమూల్య వస్తువులు దుర్వర్తనమునకు బాలుపడిన పుత్రుని మూలముననె, ఆ వస్తువులకంటెను బహు మూల్యుడైన పుత్రుడు నిర్భాగ్యురాలయిన యిల్లాలి మూలమునను వమ్మయిపోయెనని పలవించినాఁ డా గృహ పతి. పిమ్మట నాతడు తన యాగ్రహావేశము నీ క్రింది విధముగ గొనసాగించినాడు.

చాలునింక నాపాలికి జచ్చినాడు
కొడుకు గుణనిధియనువాడు కులవిషంబు
తిలలు దర్భలు నుదకంబు దెత్తుగాక
యే నివాపాంజలులు వాని కిత్తు నిపుడు.

పుత్రుని దుర్వర్తనమునెడ గాన్పింపజేసిన వ్యథ కిది చరమసీమ. అతడు జీవించియుండగనే మృతునిగా నెంచి పరలోకక్రియలాచరించెద ననుట యాతని యాగ్రహావేశమునకు పరాకాష్ఠ. ఈ విషయము నిట్లు సమర్థించియున్నాడు. "కుపుత్రకత్వంబుకంటె నపుత్రకత్వంబు మేలు. కులపాంసనుడైన వీని నొక్కనిం ద్యజించి కులంబు రక్షించుట నీతియ కదా!" యనునంతటి దాతని ధార్మికదృష్టి. అంతటితో విర మింపక యాతడు పెదవు లదర గటతటంబులు చిటుల, భ్రూకుటి నిటలంబున నటింప గటాక్షంబుల గెంపు గదుర గటకటంబడుచు నాహ్నికంబైన క్రియాకలా పంబు నిర్వర్తించి, యాగ్రహంబు కృతార్థత్వంబు నొంద గొన్ని దినంబుల కొక క్రోత్రియుని పుత్రిం బెండ్లియాడి గృహస్థధర్మంబు నిర్వర్తించుచుండె.

ఇచటి యీ రచనలో రౌద్రరసభావావిష్కరణ యోగ్యమగు పరుషవర్ణసంయోజన మారభటీవృత్తి కనుకూలముగ జతగూడినది. యజ్ఞదత్తుని యాగ్రహము నిచట శ్రీనాథుడు పటిష్ఠముగ జిత్రించినాడు. యజ్ఞ దత్తాశ్రయముగ నిర్వహింపబడిన రౌద్రరసభావము లాతని ధర్మవీరమున కుపసంధికము లైనవి. యజ్ఞదత్తుడు గృహస్థధర్మసంరక్షణార్థమై పతివ్రతయైన గృహిణిని, కొనక గన్న సంతానమును బరిత్యజించిన మహావీరుడు. ఆ సోమయాజికి ధర్మసంరక్షణము నెడ గల శ్రద్ధ దార పుత్ర సంరక్షణము నెడ గానరాదు. ఇకమీద గుణనిధి చరిత్రము శాంతరసాశ్రయముగ వర్ణింపవలసియున్నది. తద్రసస్థాయిభావము నిర్వేదమున కీరౌద్రోపస్కృతి వీర రసముపష్టంభకముగా సమకూర్పదలచి, రసప్రాణ దృష్టితో నిర్వహించినాడు శ్రీనాథుడు. ఇంతదనుక కావ్యమునకు బరమ ప్రయోజనమైన నీతి కాంతా సమ్మితముగ నిరూపింపబడినది.

[సశేషము]

సుధా లహరి

శ్రీ దివాకర్ల వేంకటావధాని

[గతసంచిక తరువాయి]

వేకువయగువేళ వివిధ జీవులకును జైతన్యసంపద నంతరించి
సాయమ్మున యథేచ్ఛ జలధిగర్భముజొచ్చి నప్పు డయ్యది వెంట నపహరించి
రత్నసానువునకు రమణీయ మణిగణ సుషమాసమృద్ధిని జోడుకొలిపి
విసువులేక విరామ మనలె కాన్పింపక యనుదినవ్రతముగా ననుసరించి

నిరవధికమైనయట్టి భాస్కరునికాంతి
నయన సరణికి దూరమ్మునన్ జనించి
క్రమముగా నంతకంతకు గాఢమగుచు
మాకు బ్రత్యక్షమై మమ్ము మనుచుగాక!

వనజాతంబులు మంచుచేత నిబిడధ్వాంతంబునన్ గండ్లు యా
మినివల్లన్ ద్విజకర్మముల్ చెడుట సంప్రేక్షించి చాటయ్యు న
బ్ధిని వే వెల్వడి వాసవాశపయికిన్ వేంచేయు లోకైక మి
త్రుని దివ్యప్రభ నా దురాశలకు నంతున్ గూర్చి రక్షించుతన్!

చలికి నపారశోకము, శశాంకునకున్ గృశకాంతి, రాత్రికిన్
విలయము, చీకటిన్ వికృతి, నీరజపాళికి దెల్వి, కల్వపూ
వులకు విపత్తు, దిక్కులకు బోధముగూర్చి నభమ్మునందు దా
నలరును బ్రత్యహమ్మున దయామతి సూర్యుడు విశ్వబంధువై.

స్వాపాసక్తుల నిద్రరోగుల నిరాశల్ నేత్రపున్ జీకటుల్
పాపస్నిగ్ధుల పాపముల్ దొలచుచున్ బ్రాగాశపై కెక్కు వి
శ్వాపద్రక్షకుడైన సూర్యు డనిశప్రస్థాన జాతాబ్జినీ
కోపోచ్చాటన నర్మకోవిదుడు మాకున్ మేలు చేకూర్చుతన్!

సరిదంతర్జలమందు బింబితములై సమ్యగ్గతిన్ రత్న సుం
దర గీర్వాణనగోర్వి నంతయును బ్రత్యక్షంబుగావించి భూ
సుర సంధ్యాంజలి ధార కాకసములో జొప్పించి రత్నప్రభన్
ధరణిన్ బర్విన భాస్కరాంశువులు మన్మాంద్యంబు బోగొట్టుతన్!

[పండితరాయల కృతికి తెనుగు - వశేషము

ద్విపద భారతము: తిమ్మయ స్వతంత్రత

శ్రీ కొమ్మనమంచి జోగయ్యశర్మ

తంజావూరు సరస్వతీమహాలు తాళపత్ర గ్రంథాలయమునందు మన తెనుగుతో సంబంధించిన తాళపత్రప్రతులు సుమారు ఎనిమిది వందలున్నవి. అవి పద్యకావ్యములు, ద్విపదరచనలు, యక్షగానములు, వచనములు, కీర్తనలు, పదములు, చాటువులు మున్నగునవి. వీనిలో అముద్రితములు రమారమి రెండు వందల ముప్పదినాలుగు. ఆంధ్ర విశ్వవిద్యాలయము వారు వీనికన్నిటికిని ప్రత్యంతరములు వ్రాయించి కాలక్రమమున ముద్రించి ప్రకటించుచున్నారు. దీనిలో బృహద్గ్రంథమగు ద్విపదభారతము పదునెనిమిది పర్వములును నాలుగు సంపుటములుగా వెలువడినది. దీని స్వరూపస్వభావములనుగూర్చి ఆంధ్రమహాజనుల కెరుక సేయవలచి యీ రచన కుపక్రమించితిని.

వ్యాస ప్రోక్తమగు సంస్కృత భారతమును ఆధారము చేసికొని ఆంధ్రమహాభారత మవతరించినట్లే, ఆకవిత్రయ భారత మాలంబముగా ఈ ద్విపద భారత మావిర్భవించినది. ఇది అపరకవిత్రయ కర్తృకము. దీనికి నెల్లూరు మండలము జన్మస్థానము.

అతుకూరు, బట్టేపాడు అనునవి నెల్లూరు మండలములో[1] పరిసర గ్రామములు. వీనిలో బట్టేపాడు నివాసియగు తిమ్మయ ఆది అరణ్య విరాట ఉద్యోగ భీష్మ ద్రోణ పర్వములను ద్విపదీకరించినాడు. ఆ తరువాతి భాగములగు కర్ణ పర్వము మొదలు స్వర్గారోహణ పర్వాంతముగల పన్నెండు పర్వములను అతుకూరు వాస్తవ్యుడగు సోమన ఒక్కచేతిమీదుగా నిర్వహించెను. మధ్యమిగిలిన సభాపర్వమును బాలసరస్వతి పూరించెను.

వారిలో తిమ్మయ, విరాటపర్వమును బట్టేపాటి పాలకుడును పంటవంశ ప్రభువు నగు జంగాల ముమ్మయకు అంకిత మొనర్చెను. ఈ ముమ్మయ పాలమూరి కృష్ణభూపాలునకు కూతునిచ్చిన మామగారు. ఇతడు, పాండురంగ మాహాత్మ్య కర్తయగు తెనాలి రామకృష్ణుని వంశమువాడైన రామభద్రకవి రచించిన[2] 'ఇందుమతీ పరిణయ' ప్రబంధమునకు కృతిభర్త. ఈ కృష్ణభూపాలుడు క్రీ. శ. 1575 ప్రాంతమువాడని ఆంధ్రకవి తరంగిణి నిరూపించుచున్నది.

కాగా, ద్విపద భారతకవులలో ప్రధానుడగు తిమ్మయ 16 వ శతాబ్దము తుదివాడనియు, తక్కిన యిర్వురు ఇంచుమించు అతనికి సమకాలము వారనియు నూహింపబడుచున్నది. అనగా, ఈ ద్విపద భారతము రసవత్ కావ్యములు ముమ్మరముగా బయలువెడలుచున్న ప్రబంధయుగములో ఆవిర్భవించిన దన్నమాట.

పరంపరగా వ్యాసభారతము మాతృకయైనను, పదప్రయోగము వాక్య రచనావిధానము మున్నగు వాని ననుసరించియే గాక, చాలవరకు నందలి పద్యములకును కథాసంవిధానములకును అనువాద ప్రాయములు ఛాయారూపములు నగదగు భాగములే యిందగపడుచుండుటచే కవిత్రయ భారతమే ద్విపదభారతమునకు మూలమైనట్లు భాసగట్టుచున్నది. అనగా, కవిత్రయము వారు ఏ విధముగా వ్యాసభారతమందలి గహనముల వంటి విషయములను పరిత్యజించియు, సంక్షేపించియు, తక్కిన విషయములను మార్చియు కూర్చియు పెంచియు యథేచ్ఛగా తమ రచన సాగించిరో, ఆ తీరుననే యీ ద్విపద భారతకవులు ముగ్గురును ఆ కవిత్రయ భారతమందలి పర్వానుక్రమణికలు, శాస్త్ర ప్రసంగములు మున్నగువానిని పరిత్యజించియు, అవసరమైనంతవరకు మూలరచన ననుసరించియు అంతగా నక్కరలేనివి సంగ్రహించియు, సరసములగు కొన్ని పట్లు పెంచియు, మూలములో లేకున్నను పూర్వాపర సందర్భముల కుపయుక్తములని తోచిన విషయములను కొన్నిటిని గ్రంథాంతరములనుండి గైకొని యిందు చొప్పించియు, కావ్య నాటక ప్రబంధాదుల చదివి జీర్ణించుకొనిన వాసనాబలముచే కాబోలు నప్రయత్నముగా నాయా గ్రంథములందలి యింపైన భావములను సందర్భము ననుసరించి యనుకరించియు, కొన్ని రసవత్తరములగు సన్నివేశములు యథోచితముగా కల్పించియు, 'కేవలానువాదకులము గాము. వలయుచో

---

1. "ఉదయగిరి రాజ్యలక్ష్మికి
వదనము నెల్లూరు, అట్టె సాధ్వమణికిన్
వదనంబు కందుకూరగు
బదయుగళం బాత్మకూరు బట్టేపాడున్."
(చాటువు)

2. అముద్రితము.

ప్రత్యేక కావ్యరచనా సమర్థులముసుమా' యని తెల్పుటకో యన కొన్ని కొన్ని ఘట్టములను స్వతంత్రముగా వెలయించియు ఈ ద్విపదభారతమును సహజ సుందరముగా వెలయించిరి. అనగా, కవిత్రయ భారతము వ్యాసభారతమున కెంత స్వతంత్ర రచనమో, ఈ ద్విపద భారతము ఆ కవిత్రయ భారతమునకు అంత స్వతంత్ర రచనమే గాని యథామూలము మాత్రము గాదని రెండు గ్రంథములను చెరియొక చేత నిడికొని సూక్ష్మ పరిశీలనచే విమర్శింపగా గోచరించిన విషయము. ద్విపద భారతకవులు ముప్వురి రచనలనుండియు స్థాలీపులాక న్యాయముగా నొక్కొక్క పర్వమును మాత్రము గైకొని పైని పేర్కొనిన విషయములను సోదాహరణముగా నిరూపింతును.

వారిలో ఆదికవియగు తిమ్మయ అతి స్వతంత్రుడేమో యనిపించును. పైని సూచించిన విధానములన్నియు చాలవరకు నీతని రచనలో నుండుటయే అట్లూహించుటకు కారణము. ఈతని రచనావిధానమంతయు జాగరూకతతో పరిశీలింపగా తిమ్మయ, వ్యాసభారత మొకచేతను కవిత్రయభారత మింకొక చేతను పట్టుకొని, రెండింటి నొకదానితో నొకటి పరిపోల్చుకొనుచు తుదముట్ట చదివి, భారతాంధ్రీకరణ విధానమును బాగుగా గుర్తించి, అందలి పరమార్థము బాలగోపాల మందరి కందింపదలచి, చదువగల యక్షరాస్యులకును, ఒరులు చదివి వినిపింపగా వినెడి నిరక్షరాస్యులకును భారతకథ సులభ గ్రాహ్యముగా నుండవలయునను పూనికతో దేశీయమైన యీ ద్విపద రచన కుపక్రమించినట్లు తోచుచున్నది. ఆ యుపక్రమణములో నాతడు కొన్ని విధానము లవలంబించినట్లును గోచరించును. వానిలో మొదటిది కవిత్రయ భారతములోని గహనములవంటి కతిపయ విషయములను విడనాడుట.

I. పరిత్యాగము:- I భారతమునకు కేవల మనుక్రమణికలుగా నుండదగిన పర్వ—ఉపపర్వ—పర్వాంత విషయ వివరణములు, శమంత పంచక—అక్షౌహిణీ సంఖ్యాకథనము మున్నగు విషయమంతయు విడనాడి, నాందీప్రాయముగా పర్వములను మాత్రము పేర్కొని, ఆపై భారతకథను సంగ్రహముగా ప్రస్తావించి, ప్రధానకథకు పూర్వరంగప్రాయమగు సర్పయాగ సంకల్పమునకు సూత్రధారుడైన యుదంకుని జనమేజయు నాస్థానరంగమున ప్రవేశపెట్టుచు తిమ్మయ గ్రంథారంభ మొనర్చినాడు.

II. కురుక్షేత్రమందు జనమేజయుడు సత్రయాగ మొనర్చుచుండగా దేవశుని కుమారుడగు సారమేయుడను కుర్కుర కుమారు డటకు వచ్చుటయు, జనమేజయుని సోదరులు దానిని గొట్టుటయు, దేవశుని యందుల కలిగి 'అనిమిత్తాశుభములగు గాక' యని శపింపగా ఆ యరిష్ట పరిహారమునకై జనమేజయుడు సోమశ్రవసుని పురోహితునిగా జేసికొని శాంతిక పౌష్టిక క్రియ లొనర్చుటయు నాదిగాగల విషయము లిందు విడువబడినవి.

III. కొంతదూరము మూలకథ నడచినతరువాత ముఖ్యవిషయమునకంతగా సంబంధము లేని చ్యవనుని జన్మవృత్తాంతము, రురు ప్రమద్వరల చరిత్రయు పరిత్యజింప బడినది.

IV. అమృతాహరణ కథానంతరము తనతల్లియు తమ్ములును వినతయెడ చేసిన యపచారమునకు వెరచి శేషుడు బ్రహ్మను గూర్చి తపమొనరించి తాను భూభారము వహించునట్లు అతనివలన వరము వడయుట, తల్లి యొసగిన శాపము విని కొందఱు కాద్రవేయులు మంతన మొనర్చుట, పరీక్షితుని శాపకారణమును జనమేజయునకు మంత్రులు చెప్పుట ఆదిగాగల విషయములిందు గానరావు.

V. ఆదిపర్వ తృతీయాశ్వాసాంతములో దేవదానవుల ఉత్పత్తిక్రమము, వంశానుక్రమణికలు నిందు విడువబడినవి.

VI. కౌరవవంశ వివరణములో - అదితికశ్యపులకు వైవస్వతుడు పుట్టుట మొదలు యయాతి చరిత్రాంతము మధ్యగల వంశావతారిక లిందు విడనాడబడినవి.

VII. యయాతి చరిత్రలో పూరుడు రాజ్యాభిషిక్తుడైన తరువాత, జ్యేష్ఠుడగు యదువును విడిచి కనిష్ఠుని రాజుగా చేయుట అధర్మమని పలుతెరగుల ప్రజలు చెప్పగా యయాతి యందుకు తగిన ప్రత్యుత్తరము లిచ్చినట్లును, పూరునకు ధర్మోపదేశములు చేసి తానరణ్యమునకు వెడలి వానప్రస్థము స్వీకరించి చిరకాలము తపము చేసినట్లునుగల భాగముల నన్నిటిని విడనాడి, యయాతి పూరుని రాజ్యాభిషిక్తుని జేసి పుణ్యలోకములకు పోయినట్లు మాత్ర మిందు ప్రస్తావింప బడినది.

VIII. యయాతి యింద్రునిచే శపింపబడి నక్షత్రలోకమున కేగి, అచటనున్న తన దౌహిత్రులగు అష్టకాదులను చూచి వారు ప్రార్థింపగా ధర్మాధర్మములు సుగతి దుర్గతులు జీవుల గర్భోత్పత్తి ప్రకారము మున్నగు విషయములను గూర్చి చెప్పెను. అవియన్నియు నీ ద్విపదరచనలో వేలయని కాబోలు తిమ్మయ వానిని పరిత్యజించినాడు.

IX. శకుంతలోపాఖ్యానములో-దుష్యంతుడు తన్ను గాంధర్వమున చేపట్టిన సందర్భమే యెరుగని వానివలె నటింపగా రాజసభలో శకుంతల యొనర్చిన ధర్మప్రసంగములు విడనాడి ప్రధాన కథా రచనయే తిమ్మయ నిర్వహించినాడు.

X. భరతుని తరువాత శంతనునకు పూర్వము అతీతానాగతులు మున్నగు ననేక రాజులు జన్మచరిత్రలు నన్నయభారతములో గలవి యిందు లేవు. శంతను చరిత్రలో గంగ తొలుత ప్రతీపుని వరించినట్లును అతడంగీకరింపక తన కుమారునకు శంతనుని చెట్టపట్టుమని బోధించినట్లును గల విషయమంతయు వీడి ముఖ్యకథను మాత్రమే గైకొనినాడు.

Xi 'అనాథలగు రాజపత్నులు భూసురులవలన పుత్రులను బడసి కులము నిల్పుట' యాచారమని భీష్ముడు తల్లియగు సత్యవతికి ధర్మోపదేశము చేయు సందర్భమునందలి దీర్ఘతముని వృత్తాంతమును, ప్రసంగమున కంతరాయమని కాబోలు తిమ్మయ తాకనైన తాకలేదు.

Xii పతి యనుమతిచే నన్యులవలన ధర్మసంతానము వడయుట యాచారమైయున్నదని పేర్కొని వ్యుషితాశ్వ శ్వేతకేతుల చరిత్రను కుంతి పాండురాజుతో చెప్పినట్లు నన్నయ భారతము. ఇప్పుడా గొడవ యేలయని కాబోలు తిమ్మయ ఆ కథల జోలికే పోలేదు. ఇట్లు చాల్గా ఖ్యానముల రచన సాగినది.

Xiii ఇది మొదలు ప్రస్తుతాఖ్యానము సగమువరకు మూలకథనంతయు వదలుకొని పోయినాడు. తరువాత భార్గవు నూరుదేశమునుండి యౌర్వుడుదయించి 'తన బంధుజనులెల్ల నొక్కట బరలోకగతులగుటకు దుఃఖించి, సకలలోక ప్రళయమూర్తియుగా ఘోరతపము సేయ' దొడంగును. పితరు లాతని శాంతచిత్తుని జేయ యత్నింతురు. ఔర్వుడా సందర్భములో "మానితంబుగ నా తపోమహిమం బిలోక పరాభవం బేను జేయగ బూని చేసితి నిట్టి దొక్క ప్రతిజ్ఞమున్:" (నన్నయ. ఆది. 7-142) అదిగాగల తన ప్రతిజ్ఞను గూర్చి పితరులతో చెప్పిన విషయము ఇందు లేదు.

XIV. పాండవులు ద్రౌపదిని వివాహమాడి ద్రుపదుపురములోనున్న తెరగెరిగి దుర్యోధనుని బోధ వలన ధృతరాష్ట్రుడు వారి యెడ వెలుపల ప్రీతియు లోన నసూయయు గలవాడైయుండగా, సభలో భీష్మాదులు దుర్యోధనునకు నీతులు గరపుదురు. ఈ సందర్భములోని భీష్మునిప్రసంగము చాలవరకు క్లుప్తము చేయబడుటయే గాక, పెద్దలొకరు బోధించిన చాలాదా యాని యెంచి కాబోలు 'బహుగుణ మగు తమో తమము' (ఆది. అష్ట. ఆ. 34 - 49) అదిగాగల ద్రోణుని బోధయు విదురుని యుపదేశమును విడిచినాడు.

XV. పాండవులు ధృతరాష్ట్ర శాసనంబునను, భీష్మాదుల యనుమతంబునను వాసుదేవ సహితులయి ఖాండవ ప్రస్థమునకు చనినంత, "హరి యింద్రుదలచి, యింద్రుడు కరమునురాగమున విశ్వకర్మ బంచి" కట్టించిన యింద్రప్రస్థపుర నిర్మాణ విధాన స్వరూప స్వభావ వర్ణనమంతయు వీడి (ఆది. అష్టమ. ఆ. 70-79)

"...కృష్ణుడప్పురికి
గనిపురిగల సొంపు గలుగమి మాచి
కరము వేగము విశ్వకర్మ రావించి
సురపురంబునకంటె సొంపైనపురము
విరచింపుమా నీదు విద్యాబలమున
అనిన నింద్రప్రస్థమని యొకపురము
కనక రత్నమయంబుగా విశ్వకర్మ
నిర్మించిపోయిన నృపుడెంతు విడిసె"

అని యీ విషయమంతయు సూచనప్రాయముగా పేర్కొనినాడు.

XVI. ఇంద్రప్రస్థ ప్రవేశానంతరము ధర్మజుని పరిపాలనము గూర్చిన "అనఘు, వేదాన్యయు నాసక్తు" (ఆది. అష్టమ. ఆ. 82 ప) అదిగాగల విషయ మీతడు తాకనైన తాకినట్లు లేదు.

XVII. ద్రౌపది నేలుకొనుటలో నారదుడు పాండవులకు నియమము సేయు సందర్భమున నన్నయ సుందోపసుందోపాఖ్యానము చెప్పగా (ఆది. అష్టమ ఆ. 95 - 115 ప) ఇందా యుపాఖ్యానమంతయు వదలివైచి,

"సుందోపసుందులు సుదతికై కాదె!
ద్రుంగిరి తమలోన మర్యాదలేక.
కావున వత్సరక్రమమునగాని
యేవురు బాంచాలి నిటగూడరాదు" 3
(442 - పు)

అని సూత్రప్రాయముగా బోధింపజేసి తిమ్మయ నారదుని సాగనంపినాడు.

XVIII. నన్నయభారతములో ఖాండవదహనానంతరము మందపాలోపాఖ్యాన మొక పెద్ద ఘట్టము (ఆది. 8-294 - 318). తిమ్మయ అవిషయమంతయు విడిచి కథా సంధానమునకు మాత్రము:

" లావుక పిట్టయై లావుకియందు
బావుగా మును మందపాలుండు గనిన
మొలక రెక్కల పచ్చిముక్కలలోడ

3 ద్విపదల చివరనిచ్చిన సంఖ్యలన్నియు ద్విపద భారతము ఆదిపర్వమునందలి పుటలను దెలుపును.

పలువురు కొడుకులు, నాగేంద్రుఁ డొకఁడు
మయుఁడును దప్ప వన్యంబులో భస్మ
మయ్యె మరొక్క జంతుసామగ్రితో వనము"

అని (478. పుట.) సూచనాప్రాయముగా చెప్పి, ఖాండవ దహనమునకు సంతసించి శివుడు ప్రత్యక్షుడై కృష్ణార్జునుల ప్రశంసింపగా, నింద్రుడు వచ్చి యర్జును నభినందించి అతనికి దివ్యాస్త్రములు పారితోషిక మొసగుటతో ఆదిపర్వ రచనను ముగించినాడు.

ఇట్లు తగ్గింపదగినవి తగ్గించుచు ముఖ్యకథాంశమున కేమియు గలుగకుండ రచనసాగించుటలో తిమ్మయ యనుసరించిన రెండవ విధానము :

2. క్లుప్తీకరణము. — i. పర్వానుక్రమణికల దెలియజేయుటకు నన్నయ రమారమి రెండు యాశ్వాసములే ర్పాటుచేసెను. తిమ్మయ ఆభాగముల నన్నిటిని భారతకథాసంగ్రహము పర్వకథనరూపమున నాలుగు పుటలకు తగ్గించినాడు.

ii. ఆస్తీకుని చరిత్రలో జరత్కారునకును పితరులకును జరిగిన సంభాషణము చాలవరకు సంగ్రహింపబడినది. ఆస్తీకునిచేయు యజన ప్రశంస వ్యాస నన్నయల భారతభాగములలో బహుళముగా గలది. ఇందు చాలవరకు తగ్గించుటయే గాక, అతనిచే జనమేజయుని సర్పయాగము మానిపింపదలచి :

"చక్రిహింసిదియేల చక్రిధర్ముడవు;
విక్రమంబిదియేల ద్విజులు పన్నగులు;
గుహావొచ్చి పవనముల్ గ్రోలుచు జొక్క
తుహినాంశు నిజకాంతి దూకొని కలిగి
కంచుక పోతంబు గలుగు భోగీంద్రు
లించుక వ్రత్తి యోగీంద్రులుగారె !"

అని మూలములో లేని కొంత విషయము చమత్కారముగా ఆస్తీకునిచే జనమేజయునకు చెప్పించినాడు.

iii. ఆదిపర్వములో గణికుడు దుర్యోధనున కుపదేశించిన రాజనీతి ప్రసంగము అతి బహుళముగా నున్నది–ఇందు క్లుప్తము చేయబడినది.

iv. ద్రౌపదీ కల్యాణ సందర్భములోని పురవర్ణనము నన్నయభారతములో (8-218) విపులముగాగలది యిందు :

"కలయ న క్కాంపిల్య ఘనపట్టణంబు
లలిత వైఖరితో నలంకరింపించి" (428. పు)

అని యొక్క ద్విపదతో ముగింపబడినది.

ఈ తీరుగా నచ్చటచ్చట కొన్ని కొన్ని విషయములను తగ్గించుచు గ్రంథ రచనము సాగించుటలో మూలము ననుసరించి ద్విపదీకరించిన పట్టులు కొన్ని గలవు. ఆ యనుసరణము రెండు విధములుగా చూపట్టుచున్నది. రచనానుసరణము, భావానుసరణము. కవిత్రయ భారతమునందలి కథాక్రమము ననుసరించియే సర్వథా యీ ద్విపదభారతము రచింపబడుటచే ఆ విధానమునుగూర్చి వేరె వివరింప పనిలేదు. ఆ రచించుటలో నక్కడక్కడ నన్నయ రచననే తిమ్మయ యథాతథముగా ద్విపదలో వ్రాసినాడు. అట్టి పట్టొకటి రెండుమాత్రము చూపుదును.

3. అనుసరణము :—

i. "కయమున మ్రింగుడు గాలము
గ్రక్కు నెవ్వఁడు కంఠబిలము గ్రిందికిఁబోక
గ్రయ్యఁ బోలె లో దహించును
భయరహితా, వాని నెఱుఁగు బ్రాహ్మణుఁడుగా"

పై పద్యము నన్నయ భారతాది పర్వము ప్రథమాశ్వాసములోనిది. అమృతాహరణమునకై యేగు గరుడునకు ఆహార ముపదేశించునదై భక్ష్యాభక్ష్య వివేచన చేయుచు తల్లియగు వినత చెప్పిన వాక్యమిది. దీని ననుసరించి :

"పక్షీశ, బోయల భక్షించునపుడు
కుక్షిలోనిక్కఁ బోక కుత్తుకయందుఁ
జిక్కు గాలము క్రియఁ; జిచ్చువోలె
నిక్కలి మండుచు నెఱియుచునుండు
నని బ్రాహ్మణుని గుఱుతెంతయుఁ జెప్పి"
(73. పు)

అని తిమ్మయ యున్నదున్నట్లనువదించినాడు.

ii పై సందర్భములోనిదె యగు—

"విపులోదర కుక్షి నసంఖ్యము
నిషాద గణ ముండి ధారుణీ ప్రజకుఁగడున్
విపన్మమును జేయు, వారి ని
విపమున భక్షించి నను మమిత్రఘ్నంబీ"

అను పద్యమందలి భావమును మాత్రముగైకొని—

"సాహస బలుఁడా, నీ చన్ముద్రోదజలధి
లోఁ గిరాతాళి ప్రాలుమునుంగు; వారు
లోఁగక జనుల సుశ్లోకుల నెపుడు
గాడించి యేఁచుచుఁ గడుఁ గ్రొవ్వి గణన
మీటి దుర్వార్గ లమేయ ప్రతాపు
లగ్గల మెయుందు; రల కిరాతులను
భగ్గించి యుంపఋ భక్షింపు......"
(72. పు)

అని ఛాయామాత్రముగా ననుసరించినాడు. ఇట్టి పట్టెంకను అక్కడక్కడ మరికొన్ని గలవు. అట్లని రచనయంతయు నీరీతి నే నన్నయ యడుగుజాడలలోనే నడిపించినాడేమో యని భావింపగూడదు. కథాపరిధికి మూలమును ఎపుడపప ఛాయామాత్రముగా ననుసరించినమాట సత్యమే గాని, చాలవరకు రచన యంతయును స్వతంత్రముగనె నిర్వహించినాడు. ఆ స్వాతంత్ర్యములో మూలములో నున్నదానికన్న పెంచి వ్రాసిన తావులు పెక్కు గలవు. కొన్నిటిని మాత్రము నిరూపింతును. [సశేషము]

వార్తలు

శ్రీ డల్లెస్ కాలధర్మం

ఇటీవలివరకు అమెరికా విదేశాంగ మంత్రిగా ఉన్న జాన్ ఫాస్టర్ డల్లెస్ మే 24 ఉదయం వాషింగ్టన్‌లో వాల్టర్ రీడ్ ఆసుపత్రిలో ప్రశాంతంగా నిద్రిస్తూ నిద్రలోనే శాశ్వతంగా కన్ను మూశారు. ఈ 71 సంవత్సరాల అమెరికన్ రాజకీయవేత్త కాన్సర్ (పుట్టకురుపు), న్యుమోనియా జబ్బులతో కొంతకాలంగా బాధపడుతున్నారు.

ఫిబ్రవరి 13 వ తేదీన శ్రీ డల్లెస్‌కు అంత్రవృద్ధికి శస్త్రచికిత్స చేసినప్పుడు ఆయనకు కాన్సర్ వ్యాధి ఉన్నట్టు బయటపడింది. వైద్యులు ఆయనకు పెద్ద ఎత్తున రేడియేషన్ చికిత్స చేశారు. కాని జబ్బును ఆపలేకపోయారు.

అమెరికా విదేశాంగ మంత్రులలో 53వ వాడైన జాన్ ఫాస్టర్ డల్లెస్, అన్ని సంగతులూ క్షుణ్ణంగా తెలుసుకొని ఉండే వ్యక్తి అనీ, చాలా ఎక్కువగా (5 లక్షల మైళ్ళు) ప్రయాణం చేసిన విదేశాంగ మంత్రి అనీ, చాల కష్టించి పనిచేసేవాడని ప్రతీతి. శ్రీ డల్లెస్ జబ్బుతో ఆసుపత్రిలో ఉండికూడా ప్రెసిడెంట్‌కు విదేశాంగ వ్యవహారాలలో సలహాదారుగా ఉండటానికి అంగీకరించి తన ఆరోగ్యం అనుమతించినంతవరకు సలహాలు ఇస్తూ వచ్చారు. అర్ధశతాబ్దానికి పైగా ఆయనకు అమెరికా విదేశాంగవ్యవహారాలతో సంబంధం ఉన్నది, రెండు ప్రపంచయుద్ధాల అనంతరం జరిగిన శాంతి సంఘుల సంప్రతింపులలోనూ ఆయన పాల్గొన్నారు. ఐక్యరాజ్యసమితి ప్రణాళికారచనలో ఆయన తోడ్పడినారు. జపాన్ శాంతి సంధిని రచించారు. ఒక సంవత్సరంలోపల దాని గురించిన సంప్రతింపులు పూర్తి అయ్యేట్లు చేశారు. ఆయన తన వంశంలో అమెరికా విదేశాంగ మంత్రిగా పనిచేసినవారిలో మూడవ వాడు. ఆయన తాత, మేనమామకూడా పూర్వం ఈ పదవి నిర్వహించారు.

ఆయన వాషింగ్టన్ నగరంలో జన్మించారు. తండ్రి ఒక ప్రెస్బిటేరియన్ మతాధికారి (మినిస్టర్). విద్యార్థిగా ఉండగానే విదేశాంగ వ్యవహారాలు రుచి చూచారు. చైనా రాయబారవర్గానికి కార్యదర్శిగా ఆరోజుల్లోనే హేగ్ ద్వితీయ శాంతి మహాసభకు హాజరైనారు. తరువాత ఆ మహాసభ ప్రధాన కార్యదర్శులలో ఒకరైనారు. తరువాత మళ్ళీ చదువు సాగించి 1908 లో తన తరగతిలో వెలడిక్టోరియన్‌గా



పట్టభద్రుడైనారు. తరువాత పారిస్‌లో సార్బోన్‌లో చదివారు. అమెరికా తిరిగి వచ్చి జార్జి వాషింగ్టన్ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్ర పట్టభద్రులైనారు. న్యూయార్కులో సలివాన్ అండ్ క్రాంవెల్ లా సంస్థలో చేరారు. ఆ తరువాత చర్చిల ఫెడరల్ కౌన్సిల్ పాలసీ కమిటీ చైర్మన్ అయినారు. ఆయన రాజకీయాలలో రిపబ్లికన్. అయినా ఆయన జీవితమంతా విదేశాంగ విధానం ఉభయ పక్షాలూ కలిసి పనిచేసే సూత్రానికి కట్టుబడి పనిచేశారు.

ముగ్గురు డెమొక్రాటిక్ ప్రెసిడెంట్ల (విల్సన్, రూజ్‌వెల్ట్, ట్రూమన్) కాలంలో ఆయన ముఖ్య పదవులు నిర్వహించారు. ఆ తరువాత ప్రెసిడెంట్ ఐసెన్‌హోవర్ కాలంలో విదేశాంగమంత్రి అయినారు.

విదేశాంగమంత్రిగా డల్లెస్ రాజీవైఖరి చూపడని తరచు విమర్శకు గురైనా, బెదిరింపులకు లొంగక దృఢంగా నిలబడగల శక్తి, పదిలమైన ప్రపంచం వేపు పురోగమించగల దూరదృష్టి కలవాడు నిరాయుధీకరణ చర్యల గురించిన సమాలోచనల కోసం, ప్రపంచ ప్రజలందరి మీద ఆయుధాల భారాన్ని తగ్గించటం కోసం ఆయన ఎన్నో ప్రయత్నాలు చేశారు. వెనుకబడిన దేశాలకు ఆర్థిక సహాయం చేసే విషయంలో ఆయన స్థిరంగా పనిచేశారు. ఆయన విదేశాంగ మంత్రిత్వకాలంలో పరస్పర భద్రతా కార్యక్రమంలో సైనిక సహాయంనుంచి తులాదండం ఆర్థిక సహాయం వైపుకు మొగ్గింది.

హరివంశము : సంస్కృతి మాధుర్యము

శ్రీ మల్లంపల్లి శరభయ్య

గోపవృద్ధులు వచ్చి చూచిరి. కూలిన చెట్లతో వాకిలి చిన్నవోయి మంద రూపుచెడియుండెను. అవి బహువర్షవృద్ధములు. పల్లె సుఖదుఃఖములకు ఏకాంతసాక్షులు. అనేక ఝంఝా ప్రభంజనములకు ఒడ్డుకొని నిలిచినవి. వజ్రపాతములకు బీటువోనివి. గజయూథపతుల శుండాకర్షణములకు — కుంభకండూ సంఘర్షణములకు చెక్కుచెదరనివి. వర్షదినములలో యమున వరదల యూరవడులు తీసిన ఒరవడులు వాని కాండములపై గలవు. వాని చల్లని నీడలో తమ తలలు నెరసినవి. ఆ ఉన్నత క్షితిజాతములు అర్భకుని కేళీకర్షణమువలన కూలిపడినవనుట ఆశ్చర్యమును మించి వృద్ధులను చింతానిమగ్నుల నొనర్చెను. ఈ ఆభీర వృద్ధులు పరిణతబుద్ధులు. మంద యోగక్షేమము లరయుటలో బహువర్షములు పండి ముగ్గినవారు. చెట్లు కూలుటకుగల హేతువులు సంభావించిరి. అప్పటి దనికిని సంగతి పొసగలేదు. నిర్హేతుకముగ పచ్చని చెట్లుకూలుట పల్లెకేదో అనర్థముమూడుటకు సూచనమైన ఉత్పాతముగ వారికి తోచినది.

ఒక్కసారి వారి స్మృతివీథిలో ఆ యర్ధరాత్రమునందలి రాక్షసీకళేబరము — పట్టపగలింట విఘటితమైన ఆ శకటము మెఱసినవి. నాడవి అట్లగుటకు హేతువు తెలియరాలేదు. నేడీ చెట్లు కూలుటకును హేతువు తెలియలేదు. అవిదిత హేతువులైన ఈ అద్భుతముల సమాహాస్ఫురణచే వారు భయవిభ్రాంతులైరి. హేతువు తెలియమియే భయమునకు హేతువు. వీని అన్నింటికి హేతువొక్కడై యుండవలయును. ఆ హేతువునకు ఈ స్థలమునకు నేదో సంబంధ ముండియుండవలయును. తీవ్రహేతువైన భయము సర్వవ్యాపకము. ఇంక నిచ్చట యునికి మనకు మేలా — అనిపించి ఆశంకిత హృదయులైరి. ఆ పాలములలో ముదిసినవారు. వృద్ధులకు స్థలానుబంధ మెక్కువ. తీరిన బ్రతుకు పరిచితదేశమునందే వెళ్ళింపజూతురు. ఒక పట్టునకు విడిచిపోవుటకు ప్రాణ మొప్పదు. అట్లే సంగతిని పొదివికొని ఇండ్లకేగిరి.

రామకృష్ణులు అష్ట, సప్త, సమావయస్కులైరి. తొలినాటి అల్లరి కొంత తగ్గి కుదురువచ్చినది. నవనీత చౌర్యాధ్యాయము ముగిసినది. వ్రేతలకు వారికి సమాధానము కుదిరి వత్ససముదాయ సముదాయ పరిపాలనము నూత్నవినోదముగ ప్రమోదింపదొడగిరి. తూగియాడు చిఱుత కూకటులతో — గోపికలు కట్టి యిచ్చిన చేతి చలిది చిక్కములతో — పిలగోలలతో — కిఱ్ఱుచెప్పులు తొడిగి — కట్ట తడుపులు కట్టి — చేగవ పొలములకు పోయి విడిసి — అందు తోడెళ్ల తోలి యార్చుచు — పాడుచు — కూతలు పెట్టుచు మ్రాకుల కొఁబ్రాకి జున్నులు రేచి తేనెలు గోపకులకు పోయుచు — పాయసాన్నము చేతిముద్దలు వారగించుచు — సకల క్రీడారసము చూఱగొనిరి. ఇట్లు ఉపప్లవములు లేక కొంతకాల మేగెను.

జీవనములుగల గొల్లలకు తరముల తరబడి ఒక్కచోట నెలవు కుదురదు. తృణకాష్ఠజల సమృద్ధములైన భూము లరసికొనుచు కసువుల మేపికొనుచు పూర్వనివాసములు గళితసారములు కాగా నూత్న దేశములకు వలసలు తీయుచుందురు. స్త్రీలు పాడిచేసినను వృష వ్యాపారము వారి ముఖ్యవృత్తి. చిరనివాసమువలన వ్రేపల్లెయున్న ప్రాంతమెల్ల సారముడిగిపోయెను. ఒకనాడు పొలములెల్ల తిరిగి పాఱజూచి కృష్ణుడు బలరామునితో నిట్లనియెను.

"మనము పుట్టి బుద్ధి యెఱుంగుటమొదలు మన వారికీ తవను నివాసముగనున్నది. ఇంకీ చోటు మంచిదికాదు. పెద్దకాల మొక్కచోట నునికి గోపజాతికి మేలుకాదు. ఈ చిరనివాసమువలననే ఆ పొలమిప్పుడు—

ఎరువు తిప్పలుగొని యెల్ల మందలు నొను
    జెక్కి మేపులచోటు త్రొక్కఁబడియె
తరులోలి వఱక మొందకులు చిక్కంగ
    జొంపములేది జాలు వడిగెఁబోదలు
మనువులు పసులకాళ్ళఁడిఁ బుచ్చెదొరుగండి
    త్రంతలు పెనుఁరొంపి త్రంతలయ్యె
పూరిపంటలు చెడిపోయె రాయిడిఁ గ్రంప
    లోనుగా దవ్వులఁ గానిలేదు
పులుగు పూఁగెడు ప్రీఁపడి పొలములందు
మెలఁగి వెదకినఁ బుట్టవు మేకము లడఁగె

కూరగాయ కట్టెయు విల్చికొనఁగవలసి
యునికి వ్రేపల్లె వీటి పట్టునకు దొరసె.

ఇంక మన యిచ్చోట నివసించుట దుఃఖావహము. బృందావనమను కాననముగలదు. అందు గోవర్ధనమను యథార్థ నామధేయమైన కొండయును, అఖండ శాఖా మండలముతో నిఖిలవనమును నిండినదై ప్రచ్ఛాయ శిశిర శిశిరమైన భాండీరమను ప్రసిద్ధమైన మఱ్ఱిచెట్టును గలవు. ఆ యడవి మధ్యగా యమున పాఱుచుండును. అపహృత సారమైన యీ కాంతారమును విడిచిపోయి అచ్చట సుఖియింతము. మన పల్లెలోని ముసలులు మచ్చికవలన నిచ్చోటు విడువజాలకున్నారు. వేఱొక కారణము కల్పింతును చూడు"మని కొంతసేపు మిన్నకుండెను. జమిలిమద్దులు కూలిననాటినుండి అఖిల వృద్ధుల ముఖములలో ఉత్పాత భయరేఖను కృష్ణుడు గుర్తించెను. వృద్ధుల అనుమతి లేక మంద కదల్పుటకు వీలు లేదు. వారు కుఱ్ఱల మాట కనుమతించువారు కారు. వారా ప్రదేశమును వీడుటకు మున్ను వా రాశంకించిన భయోద్వేగమును కల్పింపవలయును.

గోపాల, గోకుల, గోవత్స, భయంకరములై తోడేళ్ళు గుంపులుకట్టి ఆ పాలమెల్ల వ్యాపించెను. అవి పది పదియేను ఇరువది ముప్పదియునై దాటువడి గోదగొని తిరుగుచు పసుల చంపుచుండ గొల్లలకెందును కదలరాని దశవచ్చెను. పల్లెలో నానాటికి వార్తల సందడి బలిసెను.

నీళ్ళల కేటిలోనికి డిగ్గగాఁ బెద్ద
    తెఱపి పెయ్యలఁబట్టి నఱిపె నేడు
వడిఁగూడి పాలకావళ్ళ దీరఁగ మంద
    వాండ్రను బోరిగొని వ్రచ్చె నేడు
వేఁకువ కడఁబోయి పోఁకు మేయఁగఁ బాడి
    యావుఁ బొదివి చెండాడె నేడు
పులికైనఁ జెలఁగి మార్కొలయఁ జాలెడు పోటి
    యాఁబోతునిట్టె యుక్కడఁచె నేడు
గొల్ల లేమఱినప్పుడు గొఱియకోడమ
నెత్తికొనిపోవు తోడేళ్ళకిట్టి సేఁత
లెందు వింటిమె! యని జనులెల్లఁదల్ల
డిల్ల వ్రేపల్లె తద్దయు డిల్లపడియె.

సరిగా పల్లెలలో నిట్టే అనుబ్బుగా చెప్పికొందురు. ప్రెగ్గడ తెనుగు జనపదముల జీవన మాధుర్య సర్వస్వము నెఱిగినకవి. భయాదులకు సంబంధించిన మానవ ప్రకృతి సర్వకాలములందును ఒక్క రీతిఁనే యుండును.

పగలు తోడేళ్ళయుపద్రవ మిట్లుండ పల్లెలో రాత్రులు పులుల గాండ్రింపులు సింహగర్జితములు వన వరాహ ఘోణఘోరఘుర్ఘుర రవములు! అభీరు లాబాలగోపాల మట్టుడికి—వృద్ధులు కదలివచ్చి నంద గోప సమేతముగ తమలో మంతనముండి బృందావనమునకు వలసతీయుటకు నిశ్చయించికొనిరి.

గొల్లల వలసప్రయాణపు సందడిని ప్రెగ్గడ యిట్లు వర్ణించెను.

బండ్ల మెట్టింపు! పైబరువు లెక్కింపుమీ!
    దళ్ళను బూన్పు! కావళ్లు సనుపు!
పదిలంబుగా నేతిపనసులు! క్రొత్తగోనియల
    బియ్యముపట్టు! నెమిలివన్లు
నొడివిరి ప్రాలును నోవరఁగఁబోసి
    చాపలు గుంచములుమీఁద బలియఁగట్టు!
దామెనలును వల్లెత్రాళ్ళను బలుపులు
    కవ్వముల్, కొడవలి, కత్తి, సూఁడుఁ
గొడుపు, వాదోళ్లు, మొదలుగాఁ జెనకయుండ
వలయు ముల్లెలఁదిమ్ము! గంటలపు లెడ్ల
నాయితము సేయు! ముదుసళ్ళ, నాదువారి
గంపమోపులు ముందరఁ గదలుఁడనుము!

అమర్పులోని నైపుణ్యమువలన వారి సంసారములన్నియును ఒక్క పీపములో నిమిడిపోయినవి. పెక్కు భంగుల రొలంగులు కలిసి రొర్పులుపరాక ఒక్క కోలాహలమై మందయెల్ల ఒక్కసారి కదలెను. లావు మానుసులు కదుపులను గొని ముందు నడచిరి. వారి వెనుక బండ్లు కదలెను. బండ్లజాడ తొక్కిన ప్రజ నడచెను. వారివెనుక తరుణ తరుణీజనములు ఒండొరుల తోడి మేలంపు టాలాపములతో ప్రమోదకరములగు వినోదములతో అదటుమీఱి కడచి చనిరి. వారివెనుక పంగ్వంధ జరఠ ప్రముఖులు క్రుస్సి ఓలాకుపడ నెడ నెడ కావలివారై తగువారు నడపించుచుండిరి. బండ్లు బృందావనము ప్రవేశించెను. గోపాలముఖ్యులు బండ్లు దిగి యుచిత ప్రదేశము నివేశముగ నిరూపించి నిలిచిరి. ఒక్క యోజనము మేర అర్ధ చంద్రాకృతిని బండ్లు విడిసెను. గొల్లలకు గృహ సన్నివేశ కల్పన క్లేశములు లేవు. అలవోకగా ప్రకృతితో అమరిపోయి మచ్చికపడి యుందురు.

గుడిసెలు వన్నియున్ ఘనని
    కుంజము లిండులుగాఁగఁ జొచ్చియున్
చెదఁగగు జొంపముల్గలిగి
    పేర్చిన మ్రాఁకుల క్రింద నుండియున్
గడఁకరొలగ్న దొడ్లకును
    గ్రంపలువైచియు నొక్కఁ నాటిలో
నదరఁగఁ బ్రాఁతకాపులయి
    రక్కడ గోపకుటుంబులందఱున్.

క్రొత్త ఆకాశమునకును గాలికిని భూమికిని విసంవాదములేక అంతిలో మచ్చిక పడిపోయి అమరియుండుట నాగరకులకు సాధ్యము కాని విషయము. ప్రదేశనూతనత్వము జనపదబంధువులకు ఔత్సుక్య

హేతువు. ప్రకాణపు బసలికలు తీఱి గోపికలు క్రొత్త అసవుల పూఁతో క్రొత్త విధములుగా కైసేసికొని ప్రియులకు క్రొత్తగా కనపడిరట.

శృంగారంబులు సేసి గోపికలు భా
సిల్లంగ, గోపాలు రు
త్తుంగాంగంబులతోడ నెల్లకడలం
గ్రుక్కొంగ, గోబృందముల్
మాంగల్యోత్కృతిఁ గాల, నెంతయును సా
మగ్ర్యంబునన్ బండులు
ప్పొంగన్, బల్లి, సముజ్జ్వలోత్సవములన్
బొంగారె నానాటికిన్.

శ్రీకృష్ణదేవుని శుభాలోక పర్యవేక్షణమున బృందావనమునకు వచ్చినది మొదలు గోపాలు రెల్లరును క్రమక్రమముగ శ్రీమంతులైరి. అచ్చట గోవులకు వేసవి యుంగును, ఘాసము పుష్కలము. ఎచ్చటఁ బడిన నచ్చట సమృద్ధమైన జలము. కృష్ణునివాస దేశమున తఱితో వానలు కురియును. క్రేపులు వర్ధిల్లుచుండెను. మొదవు లేటేట నీనుచుండెను. వృష వ్యాపారము అవ్యాహతమై కొనసాగుచు లాభకరమై యుండెను.

గతానుగతికమైన జీవితములో శీతాతప విస్తరణములతో ఋతువులు నవత్వమును మాధుర్యమును నింపి యాత్రను రమ్యముగ జేయును. వ్యవహారనిమగ్నమైన లోకము అయాచితముగ స్వచ్ఛందముగ కాల మొసఁగుచున్న యీ వికాసమునకు పరాఙ్ముఖమై చింతావిశీర్ణమై యుండును. ప్రత్యాశాపరిపూర్ణములై అనాదిగ ఋతువులు వాని త్రోవ నవి వచ్చుచు పోవుచు నున్నవి. వాని అభివ్యక్తికిని సంవాదమునకును అనువైన రహస్సు జనపదములలో అడవులలో నుండును. జానపదులును ఆరణ్యకులును దాని శోభ ముఖ్యముగల జీవులు. తరులతాగుల్మములయందువలె వ్యతికరము వారియందు స్ఫుటముగ గోచరించును. అంతస్సంవాద జనితమైన ఈ సంవలిత శోభను ప్రెగ్గడ కావ్యమునుండి దోసిళ్ళతో తీసి చూపవచ్చును.

వాసంతీ కుసుమావతంసకములు
ద్వ్యాపించి గోపాంగనల్
శ్రీ సంపన్నములైన పాటలములన్
సీమంత సీమన్ లలిన్
గైసేయం దగి ఫుల్లమల్లి కళికా
గర్వాంధమై పర్వ స
ద్వాసహోద్ధతి యయ్యె ఘర్మసమయం
బారంభసంభావ్యతన్.
గోపూర్ణ స్తనదుగ్ధ పానవిధులున్
గోవర్ధనాంతర్ఘన
వ్యాపారంబులు గోపతి ప్రియసుతా
వాఃకేళిలీలాస్ఫుర
ద్గోపీముగ్ధ కుచోపగూహనములున్
గోవింద సాంగత్యమున్
గోపశ్రేణికిఁ జూపెఁ దాపభయమున్
ఘోరంపుఘర్మంబునన్.

కృష్ణుని పర్యవేక్షణములో అనాకులముగ పెరుగుచున్న కదుపులకు విస్మయకరముగ వ్యాధులు వచ్చెను. అది వర్షా నిదాఘ సంధి.

వసికుడు రోమకోటి నిలు
వంబడి మేనులు దూలఁ గన్నులం
దుసికక బాష్పముల్ వడియు
చుంచు దలల్ దిగవైచి నోరవేఁ
సుడు దొంగంగ నెంతయును
క్రుస్సి ఖురంబులు క్రస్సి పుర్వులు
గ్గసువుగఁ గాఱఁ దద్దయును
గాలికుఁ బొండె వ్రజంబునన్ బసుల్.
వరిడి పుష్టి కప్ప నావురు గడుపూఁద
యాదరు దొక్క యావగ నిడిరి మఱియుఁ
దెవులు లెన్నియేనిఁ దవిలి యొంతియు మహో
గ్రంబులయ్యెఁ బసుగణంబులందు.

మంత్రౌషధహోమాదు లేవియును పట్టీయమిని గోపవృద్ధులు డిందుపడియుండిరి. యమునా తీరచరములైన సర్వప్రాణులు వ్యాధిపీడితములై మృతకల్పము లయ్యెను.

ఆ వ్యాధులు క్రమముగ గోపాలురయందును ప్రవేశించెను.

జ్వరవేగమునఁ దూలి పొరలిరి కొందఱు
సందుసందులు నొచ్చి సమసిపడిరి
కొందఱు విస రోమకూపంబు లన్నియు
నవసి నెత్తుటఁ గాఱ నవయువకులు
చీముల గట్టంగ శీర్ణంబులై దంత
ములు గదలంగ నెమ్ములు నొగులఁగఁ
గంఠ జిహ్వోదర ఘ్రాణ కర్ణంబులు
పాక్కులై యొక్కొడ నొక్కడైనఁ
ద్రావఁ దడియులేక తల చీరలెఱుఁగక
యార్తులైరి కొంద అంతవట్టు
గోప మందిరములు తాప దుర్గంధము
యంబులయ్యె వికృతి యగ్గలింప.

ఈ సాంఘాతిక వ్యాధికి యశోదానందులును అగ్గమైరి. బంధువులెల్లరును రోగార్తులైరి. అట్టి విషమ స్థితిలో కృష్ణుడు రామునితో విచారించి దీనికి ప్రతీకారము మన యీ చోటు విడిచిపోవుట తప్ప ఇంకొక మార్గము లేదని నిశ్చయించి కొంచెమడుగా క్రొత్తపెదు మేఁత యావలకు కతిపయ గోగణములతో పోయి నిలిచెను. అతని మాట విని కొందఱు గొల్లలచ్చటికి పోయి రోగరహితులై యుండిరి. 'ఇంతవుండి బంధువులతో

గ్రంథవిమర్శనము

నాట్యశాస్త్రము:
గుప్తభావ ప్రకాశికా సహితము

[అనువాదకులు : శ్రీ పోణంగి శ్రీరామ అప్పారావు, ఎం.ఏ., గవర్నమెంట్ ఆఫ్ ఇండియా రిసర్చి స్కాలర్, ఉస్మానియా విశ్వ విద్యాలయము, హైదరాబాదు] పుటలు : 1,000 వెల : 20 రూపాయలు. ప్రతులకు: డాక్టర్ పి. సాంబశివరావు, 306, 307, సీమ్‌కార్ బ్లాక్స్, చిక్కడపల్లి, హైదరాబాదు.]

ఇన్నాళ్ళకు కొఱగా ఈనాటికి మంచి తెలుగువారి సాహిత్య వ్యాసంగమున అనువాదరూపమున ఒక బృహద్గ్రంథము వెలువడినది. సంస్కృతమునుండి ఏ భాషలోనికిని ఇంత సమగ్రముగా అనూదితము కాని నాట్యశాస్త్రము తెలుగున అవతరించినది.

నాట్యశాస్త్ర మతి ప్రాచీన గ్రంథము. 'షట్సాహస్రీ'యని చెప్పబడుచున్న ఈ గ్రంథము 36 అధ్యాయములు. ఇంతవరకును దీనికి సవిమర్శముగ సంపాదింపబడిన అధికారికప్రతి అనుచు ఒక టేర్పడలేదు. ఉన్నంతలో కాశీ, బొంబాయి, బరోడా ప్రచురణములు మూడుపలభ్యమానములు. వీనిలో చివరి దసమగ్రము. ఆంగ్లమున డాక్టర్ మనమోహన్ ఘోష్ గారు 27 అధ్యాయములు మాత్ర మనువదించి ప్రకటించినారు. నాట్యశాస్త్రమును బరోడా ప్రచురణ కర్తలను స్మరించి కీ. శే. మానవల్లి రామకృష్ణ కవిగారిని స్మరింపక పోవుట అపచారము కును. నాట్యశాస్త్రమున కభినవ గుప్తపాదుల వ్యాఖ్యను వెలయించి, కొన్ని చోటుల స్వయముగ వ్యాఖ్యానించి, 'భరతకోశ' మను పారిభాషిక పదకోశమును సంతరించి యిచ్చిన కవిగారి దివ్యస్మృతికి లోక మెంతయో ఋణపడి యున్నది. అస్తు.

నాట్య మనగా అభినేయ దృశ్యకావ్య సమగ్ర ప్రయోగము. అది సమాహార కళ. "న తత్ జ్ఞానం న తచ్ఛిల్పం న సా విద్యా న సా కలా, నాసౌ యోగో న తత్కర్మ నాట్యేఽస్మిన్ య న్న దృశ్యతే" అన్నాడు మహర్షి. నాట్యాలంకారచ్ఛందోవ్యాకరణ శిల్ప సంగీతాది శాస్త్రముల కిది ఆటపట్టు. ప్రేక్షా గృహ నిర్మాణమునకుగా వాస్తువుకూడ యిందున్నదే.

ఇన్నింటి నాకళించుకొన్న నాట్యశాస్త్రమును ఏ భాషలోనికిగాని అనువదించుట కష్టమైన పని. ఏ యొక్కరికిని ఇన్నింట ప్రవేశపాండిత్యము లుండుట అరుదు. ఉన్న మహానుభావుల కొక రిద్దరికి ఊపిరాడని పనులుండును. వారి దృష్టికూడ ఉన్నవారి కూరివారితో నేమి పని యన్నట్లుండును. కాగా, జిజ్ఞాసువులె ఎవరో సాహసించి చేయవలసిన పరిస్థితి మనది. అదికూడ ఒక్కరికి సాధ్యపడునది గాదు. అయినను, డాక్టరేట్ పట్టమునకు వేరుగా పరిశ్రమించుచున్న శ్రీరామ అప్పారావుగారు నలుగురి చేతులమీదుగా జరుగవలసిన ఈ అనువాద కార్యమును తామొక్కరే శ్రమైకసాధ్యముగా నిర్వహించినారు. రిసర్చి వర్కునకు సంబంధించని కార్యమిది. 36 అధ్యాయములు తెలుగు చేయుటయే కాక "గుప్త భావ ప్రకాశిక" అను వ్యాఖ్యనుకూడ వెలయించినారు. అనువాదకుల యీ గొప్ప ప్రయత్నము శ్లాఘాపాత్రము.

అన్నిటికంటె ముఖ్యముగా అనువాదకుల వినయభరము, చిత్తశుద్ధి గొప్పవి. 'పండితుడ నసెడి అహంకారముతో' నా రనువాదమునకు పూనుకొనలేరు. మరి జిజ్ఞాసువులై ఈ పనిని చేపట్టినారు. ఆ వినయ—చిత్తశుద్ధి—జిజ్ఞాసలే అనువాద ప్రణాళికను తీర్చినట్లు కన్పించును. ముందుగా మూలమున కనువాదము, అనిష్పాచికలలో అవసరమైన చోట్ల అభినవుల వ్యాఖ్య నుద్ధరించుట, తామేమైన చెప్పదలచినచో ఆ మాటలు అభినవుల వ్యాఖ్యకు క్రింద విడిగ వ్రాయుట, ప్రతి అధ్యాయాంతమున 'విశేషాంశము'లను పేరున మతభేదములు, అవాంతరవిషయములు క్లుప్తముగ నిచ్చుట—ఇదీ ప్రణాళిక. దీనితో గ్రంథము పెరిగివచ్చిన మాట వాస్తవము. తెలియని దానినికూడ తెలిసినట్లుగ భాసింపజేసి లోకమును ప్రతారింప జూచెడివా రెక్కువగుచుండగా అనువాదకుల ఈ పద్ధతి విద్వాంసుల కెందరికో తృప్తికారణమగు ననుటలో సందేహము లేదు.

'విశేషాంశము'లలో భారతీయాలంకార శాస్త్రముతో పాటు పాశ్చాత్యుల సాహిత్యవిమర్శకూడ అవలోడనము చేయబడినది. మన నాట్యరంగమున తెర లొకటియా రెండా పూర్వ మనునది మొదలుగ ఎన్నియో విషయములు స్పృశింపబడినవి. అరిస్టాటిల్ వాడిన 'Imitation' అన్న పదము నిర్దేశవమై దాని కర్థము చెప్పుటకు బుచ్చర్ దొర కావలసి రాగా మన వారు "అవస్థానుకృతి ర్నాట్యమ్", "త్రైలోక్యస్య భావానుకరణమ్" ఇత్యాదిగ అనుకరణ శబ్దమును సవిశేషముగ వాడుట, అరిస్టాటిల్ "Catharsis" పదమునకు సరిగా మనవారి "లోకోత్తరాహ్లాదనము" అథవా "సాధారణీకరణము" అను మాటలు, అందలి దేశకాల వృత్తములను విక్రియయును మనవారు అంక, అంకచ్ఛేద రూపమున ఎట్లు సాధించినదియు గమనింపదగిన విషయములు.

అవును గాని ఈ నాటి మనకు ఏ నాటిదో అయిన నాట్యశాస్త్రము అనూదితమై వచ్చిన ఏమి లాభము? అను విషయ మించుక చూడవలెను. ఇందలి నాట్య సంగీతము లాదిగా గల శాస్త్రవిషయముల వదలి సామాన్యమగు దృష్టితో చూచినను సర్వులును పరిశీలింపదగిన వెన్నియో కలవు. నేటి మన సినిమా పరిశ్రమ, ఔత్సాహిక నాటక సంఘములు, నాట్యము నేర్చుకు కులీనులగు యువతీయువకులు, అభిరుచి పెరిగిన ప్రేక్షకవర్గము—వీరివి మనసున బెట్టుకొని తేలిక దృష్టితో చూచినను నాట్యశాస్త్రము తప్పక చదువ వలసిన గ్రంథము. ఔత్సాహిక నాటక సంఘముల వారు—సామాజికులు (troup), ప్రకృతి—పాత్ర వివేకము (casting), వాచికాభినయము (delivery of speech), కాకుస్వర విధానములు (intonations) ఆహార్యాభినయము (costumes), ఇంద్రియార్థాభినయము (expression of sensuous experience), మనోనిర్దేశము (mental directions), చిత్రాభినయము, రసభావాభినయము, పాత్రల రంగప్రవేశ నిష్క్రమణాదులు, గతిప్రచారములు (gaits), పాట లుంచవలసిన చోట్లు—మొదలగు వానిని పరిశీలించి అభ్యాసము చేయవచ్చును. ఇక ఏ నాటకమునకైన 'సిద్ధి' (success) ముఖ్యముగదా! నాట్యశాస్త్రము నందు ఆ 'సిద్ధి' స్వరూపము చర్చింపబడినది. నాటకము రక్తికట్టక పోవుటకు 'ఘాతములు' (short Comings) కారణములు—వాని స్వరూప పరిహార విధానములు చెప్పబడినవి.

ఇంకను చిత్రము! మన నాటకపు పోటీలకు కావలసిన విషయములు కూడ ఇందున్నవి. ఈ నాడు మనము నాటకపు పోటీలలో చేసి సంఖ్యగా ఎవరినో కొందరిని ప్రాశ్నికులు (Judges) గా నియమించుటయు వారేదో ఒకదానిని 'బాగున్న'దని తీర్పు చెప్పుటయు—జరుగుచున్న సంగతి. నాట్యశాస్త్రమున ప్రాశ్నికుల యోగ్యతలు, వారి సంఖ్య, వారి విధులు (rules), ఘాతనిర్ణయము చేయుపద్ధతి, ఒక నాటకమున నటులలోకెల్ల చక్కగా నభినయించిన వానిని నిర్ణయించి వానికి 'పతాక' (Kudos) నొసగుటను ఎట్లు తేల్చవలసినదియు చెప్పబడినది!

ఇన్ని సంగతులు గల నాట్యశాస్త్రము తెలుగులోనికి వచ్చుట సామాన్య పాఠకులకెల్ల సంతోషకారణమే. కాని ఈ అనువాదము నూటికి నూరుపాళ్లుగా సమగ్రము కాలేకపోయినది. క్లిష్టములైన సంగీతాధ్యాయములలో దాదాపు మూడువందల శ్లోకములదాకా విడువబడినవి. ఆ విషయమున అనువాదకుల ననవలసిన పనిలేదు. పండిత పరిశోధకులకు గూడ పని తల బట్ట కట్టించుచున్న వనుట—ఆంగ్లానువాదము చేసిన డాక్టర్ ఘోష్ గారి వాక్యముల జూచిన తెలియును :—"The chapters on music covering a little more than one fourth of Natya Sastra still remain to be done...... As the work on it, is progressing very slowly and it cannot be said definitely when it will be finished..." ఆంగ్లమున సంగీతాధ్యాయము లనూదితములు కాక నిలిచియుండగా తెలుగులో కొన్ని శ్లోకములు మాత్రము విడువబడినచో వచ్చిన కొఱత ఏమి?

కాని బొత్తిగా కొఱత లేదని చెప్ప వీలులేదు. అనూదితములు కాని శ్లోకములలో తాళాధ్యాయమున లాస్యాంగ ప్రయోగమును చెప్పెడి 110 శ్లోకములు మిగిలిపోవుట తెలుగువారి దురదృష్టము. ఏమన గా కేరళీయుల కథాకళిలో తాండవమున్నట్లే మన కూచిపూడి నాట్యమున లాస్యము ప్రధానము. తమిళుల భరతనాట్యమున రెండు నున్న వనుకొనుడు. కూచిపూడి నాట్యమునందలి ప్రత్యేకతను చాటుచు 'భామకలాపము' నందలి భరతోక్త పూర్వరంగ విధానము,

లాస్యాంగ ప్రయోగము, ధ్రువాగాన పద్ధతి అను వానిని వివరించు ఒక వ్యాసమును నా మిత్రులు శ్రీ మట్టూరి సంగమేశము గారును నేనును ఆంగ్లమున వ్రాసి ఔత్తరాహులకుగా ఢిల్లీనుండి వచ్చెడి "Thought" అను పత్రికలో ప్రకటించితిమి. కూచిపూడివారి తెక్కిన నాట్యములమీద కూడ ఇట్టి కృషి ఇంకను జరుగవలసి యున్నది. నాట్యశాస్త్ర మనూదితమైన ఈ సమయమున జాయన "నృత్తరత్నావళి" త్వరలో వెలుగు చూచి తెలుగులోనికి రాగలదని ఆశింతును.

నాట్యశాస్త్రమున సమస్యలకేమి పరిష్కృతముగా నున్నవి. గ్రంథమును జదువుచుపోగా నాకు గలిగిన కొన్ని సందేహములను అనువాదకులవిగా తోచిన ఆ శంకలను విమర్శలను ఇంచుక స్పృశించి నాకు తోచిన సమాధానముల సూచింతును. ఇందలి గుణదోష నిర్ణయము పెద్దలకు వదలి నేనును జిజ్ఞాసువునై ఈ పని చేయుచున్నాను :

1. మత్తవారణి : భరతునకు గాని అభినవగుప్తులు గాని మత్తవారణి ప్రయోజనమును నిర్దేశింప లేదని వ్రాయుచు అనువాదకులు దానికేదో ఒక ప్రయోజన ముండవలెనని ఆశంకించినారు. రంగపూజాధ్యాయమున అయా దేవతలకు బలి విధానమును తెలుపుచు మహర్షి మత్తవారణియందు వాస్తుదేవత లుండురని చెప్పినాడు. ప్రయోజనము కావలెనన్నచో నిదియొక ప్రయోజనము! నిజమునకీ శబ్దమునకు పరిశోధకులు కూడ మరవు చేసుకుని అర్థము చెప్పుకొని ఆలోచించిరే గాని అసలు మాట దేనికి సంబంధించిన దనికూడ చూడలేదు. చూచినచో పై సందేహము రాదు. 'మత్తవారణ మిద్భంతి దావక్లిన్నకట ద్విపే, మహా ప్రాసాద పీఠీనాం వరండే చాప్యపాశ్రయే' అని నిఘంటువు. మత్తవారణమనగా 'మేడ చోపాయొక్క కటకటాలు కట్టిన వరండాకును యింటిముందరి ఆవరణకును పేరు. 'నృపతిప్రాయము' లైన నాట్యములు రాజప్రాసాదమున జరుగవలదా? మత్తవారణ మున్ననే నాట్య రంగమునకు ప్రాసాదస్ఫూర్తి కలుగును. ఆవరణ సూచకమైన ఆ పదము బహువచనమున ఉండవలసిన దనియు, లేదనియు కొందరు పరిశోధకులు తలచుట మరింత చిత్రము. అభినవులు మాత్ర మా పదము నేకవచనముగనే గ్రహించిరి. ఇరువైపుల మత్తవారణ నిర్మాణమును చెప్పుట గమనార్హము.

2. ద్వితీయాధ్యాయమున నే దారుశిల్పమును గూర్చి చెప్పుచోట కొన్ని పదములకు అనువాదకులు 'ఇందలి పదముల అర్థములు సరిగా తెలియుట లేదు' అని డి. ఆర్. మాంకడ్ గారిచ్చిన అర్థముల ననుసరించి వ్రాసినారు. నేనుకూడ వానినిట ప్రదర్శింతును : 'సంజవనము = ప్రాంగణము, దీర్ఘ చతురస్రాకారము, నాలుగిండ్ల ఘటంతి'—సుర మేల కారాదు? 'నిర్యూహము = ద్వారము, అంతస్తు, వృత్తమును ఖండించు మరియొక వృత్తము.' 'నిర్యూహ శ్శేఖరే ద్వారే నిర్యాసే నాగదంతకే' అని నిఘంటువు. నాగదంతిక మని గ్రహింపవలసి యుండగా ద్వారమని గ్రహింపబడినది. నాగదంతిక మనగా 'కొణిగ కాధారముగ నాటిన కొయ్య...' 'కుహరము = కవాటము.' కాదు. కూడువంటిది, చెజ్జము (niche). 'వేదిక = అరుగు, ఇనుప చువ్వలతో కట్టిన అడ్డు.' 'వేది రంగుళి ముద్రాయాం బుధేఽలంకృత భూతలే' అని నిఘంటువు. దారుశిల్పమున అరుగులెక్కడివి? హస్తముద్రవంటి వ్రేళ్ళ తీరు కావచ్చును గదా? జాల గవాక్షము = ఆవు కన్నులవంటి రంధ్రములు గల జాలసహితమైన కిటికీ. గవాక్షము ఎద్దుకన్ను (Bull's eye) వంటిది గాని, ఆవు కన్నుల వంటిది గాదు. జాలకర్మ అనగా మూలలకు ఇటుకలలో దబ్బలలో తీర్పుటచే గండ్లుగండ్లుగా నేర్పడునట్లు చేయుట. 'రంధ్రములు కల జాలసహితమైన కిటికీ' ఏమిటి? "నాగదంతము = పాము పడగవలె నున్న కిటికీ; స్తంభముపై నుండెడి గజముఖమువంటి సాధనము.' 'నాగదంతో ద్విపరదే గృహాంతర్గత దారుణి' అని నిఘంటువు. ఇంటికి వేసిన దూలము. 'మందవాతాయనము = చిన్న కిటికీ'—కిటికీ మాత్రమె.

3. సమం రక్తం విభక్తం చ స్ఫుటం శుద్ధప్రహారజమ్,
నృత్తాంగగ్రాహి వాద్యజ్ఞై ర్వాద్యం యోజ్యంతు తాండవే.'

తాండవ సమయమున భాండవాద్యప్రయోగమును చెప్పుచున్నాడు. ఇందలి సమము, విభక్తము అనునవి వాద్య సంశ్రితములైన అలంకారములుగా అవనద్ధ వాద్యములను అధ్యాయమున కన్పట్టుచున్నవి. తక్కిన మాటలు విశేషణములా పారిభాషికములా? అభినవ భారతి వ్యాఖ్యగాని అనువాదకుల వివరణము గాని ఇచ్చియుండిన బాగుండెడిది.

4. భావాధ్యాయమున మహర్షి వ్యభిచారులైన స్థాయిభావములకు లక్షణము చెప్పినాడు. విశేషాంశములలో అనువాదకులు 'రసములుగా అభివ్యక్తమయ్యెడి స్థాయిభావముల లక్షణములు రసముల లక్షణము లందే గతార్థము లయినవనియు మహిమభట్టు 'వ్యక్తి వివేకము' నందు వ్యాఖ్యానించెను' అని వ్రాసి 'వాని' యభిప్రాయమును వివరించినారు. తరువాతి అధ్యాయమగు ఉత్తమాంగాభినయమున మహర్షి 8/9 రసదృష్టులను 8/9 స్థాయిభావ దృష్టులను చెప్పియుండుట గమనింపవలసినది గాదా?

5. వృత్తులనుగురించిన 20 వ అధ్యాయమున భారత్యాది నాలుగు వృత్తుల నొక్కొక్క దానిని నాలుగేసి విధములుగ వివరించి మహర్షి 'అష్టార్థ వికల్పమయిన భారతీవృత్తి పైవిధముగా నుండును' మొదలగు వాక్యములన్నాడు. ఘోష్‌గారు భారతీ వృత్తిలోని నాలుగు భేదములలో నవాంతర భేదముల నెంచి ఎనిమిదింటికి సరిపెట్టినారు. అవాంతర భేదములలో ఆది పదముండుటచే ఈ లెక్క యెట్లో ఊహింపరాకున్నది. అనువాదకులు తాటస్థ్యము పూనినారు. 'అష్టౌ నాట్యే రసాః స్మృతాః' అని కంఠోక్తిగ చెప్పిన మహర్షి 'అష్టార్థ వికల్ప'ము లనుట ఆ జ్ఞాపకముచేతనని నా తలంపు. వృత్తులకు రసములందు వినియోగము చెప్పు శ్లోకమున 'సాత్త్వతీ చాపి విజ్ఞేయా వీరాద్భుత సమాశ్రయా' యను పాఠమును 'శమాశ్రయా' అని శాంతరసవాదులు పఠించుట ప్రాయోభావ దృష్టికి నిలువ దనుకొందును. ఇంతకును పెద్దలు నిర్ణయింపవలసిన విషయమిది. అనువాదకుల తాటస్థ్యము చేల పేర్కొంటి ననగా 'సుప్రభావ ప్రకాశిక' అను వ్యాఖ్యాన కర్తృత్వ మొకటి అంతయో యింతయో యున్నది గనుక.

ఇంక అనువాదకులు రెండు మూడు చోట్ల మతభేదములను గూర్చి ప్రసంగించి నిర్ణయవాక్యములు పలికినారు. మత భేదములను సమన్వయింప యత్నించి వ్యాఖ్యానించుట శాస్త్రము సువ్యవస్థితమగుటకు కారణము. అది సంప్రదాయ దృష్టి—వీలు లేనిచోట ఊరకుండవచ్చును.

6. కార్యావస్థలు ఆధికారికేతివృత్తమునకు సంబంధించిన విభాగములు. మరి అర్థప్రకృతులున్నవి. 'ఇవికూడ ఇతివృత్త విభాగములే అని శారదాతనయుల అభిప్రాయము. అది సరికాదు.' అర్థమనగా ఫలము. ప్రకృతి అనగా ఉపాయము అని అర్థము చెప్పుకొని బీజబిందు పతాకా ప్రకరీ కార్యము లయిదింటిని ఫలసాధనోపాయము లనుట మాత్రమేమి సమంజసము? పతాకా ప్రకరుల వదలగా తక్కినవాని నెట్లు సమర్థింప వచ్చును? బీజమెట్లు ఫలసాధనోపాయము?

7. 'కావున అవస్థా—అర్థప్రకృతుల 'క్రమ' సమన్వయముచే సంధు లేర్పడుచున్నవనుట కుదరదు.' (595 పుట) ధనంజయుని దశరూపకముపై విమర్శ ఇది. 'అంతరైకార్థ సంబంధః సంధి రేకాన్వయే సతి' అని ధనంజయుని లక్షణం. 'ఏకేన ప్రయోజనేనాన్వితానాం కథాంశానా మవాంతరైక ప్రయోజన సంబంధః సంధిః' అని ధనికుల వ్యాఖ్య. అనువాదకులు 'క్రమ' సమన్వయమని విశిష్టముగా నొకమాట కల్పించినారు. అన్వయమనగా పూర్వాపరసంబంధము గలుగునది. ఎక్కడో ఒకచోట నే బీజ ప్రారంభములు కలిసి ముఖసంధి ఏర్పడుచున్నదన వీలులేదు గదా. అనువాదకు లన్నట్లు 'ఒక కథాభాగమంతయు' సంధి కాదగును. దీనికి విప్రతిపత్తి కాన్పింపదు.

8. 'పతాకాస్థానకమున కెంత ప్రాబల్యమున్నదనగా శారదా తనయులు దానిని ఇతివృత్తమునందొక భాగముగనే పరిగణించి ఆధికారిక ప్రాసంగిక పతాకాస్థానక భేదములచే ఇతివృత్తము మూడువిధము లని పేర్కొనియున్నారు. ఇది అతిశయోక్తి అని చెప్పవచ్చును.'

'ప్రాకరణికస్య భావినోऽర్థస్య సూచకం రూపం పతాకావద్భవతీతి పతాకాస్థానకమ్. తచ్చ తుల్యేతివృత్తతయా తుల్య విశేషణతయా చ ద్విప్రకారమ్. అన్యోక్తి సమాసోక్తి భేదాత్' ధనికుల ఈ దశరూపక వ్యాఖ్య చూడగా భావప్రకాశకారుడు అంత పెద్ద దాటు వేసినా వనిపించునా? పతాకాప్రకరులు లేకపోయినను బాధ లేదుకాని పతాకాస్థానకము లుండి తీరవలసిన చోట్లున్నవి గదా?

మనవి మాటలు

మనం తమిళసోదరులతో విడిపోయి, ప్రత్యేక రాష్ట్రం, ఆంధ్రప్రదేశ్ నెలకొల్పుకున్న తర్వాత కూడా పరిష్కారం కాని దావాలలో ఒకటి మద్రాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారంలోని లిఖిత వాఙ్మయం. గతం వర్తమానానికి, వర్తమానం భవిష్యత్తుకూ మూలబంధమైనట్టే ఈ లిఖిత వాఙ్మయం మనభావిసారస్వత సాంస్కృతిక వికాసానికి సువర్ణ సోపానం.

కర్నల్ కొలిన్ మెకంజీ, చార్లెస్ ఫిలిప్స్ బ్రౌన్, ఇలియట్ మొదలైన పాశ్చాత్య పండితుల సేవతో తలయెత్తిన మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారం ప్రాతస్స్మరణీయులైన మానవల్లి రామకృష్ణకవి, వేటూరి ప్రభాకరశాస్త్రి గార్ల కృషితో మూడుపూవులు ఆరుకాయలుగా వికసించిందనడం విద్వజ్జగద్విదితం. కనుక తెలుగుదేశంనుంచి సేకరించబడిన ప్రాచీనగ్రంథాలు, తెనుగు దేశచరిత్రకే ప్రధానమైన లోకల్ రికార్డులు ఈ పుస్తక భాండాగారంలో ఉండడం సహజం. ఇవేకాక ఫారసీ, అరబ్బీ, ఉరుదూ గ్రంథాలు సైతం పెక్కు ఆంధ్రప్రాంతంవి దీనిలో ఉన్నాయి.

ఇవన్నీ మనసొమ్ము. ఈ సొమ్ము మనరాష్ట్రానికి సంక్రమించాలని ఆశించడంలో అన్యాయమేమీ లేదు. ఉత్కళ రాష్ట్రం ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి విడిపోయినప్పుడు ఒరియా గ్రంథాలు, ఓఢ్ర లిపిలోని సంస్కృత గ్రంథాలు ఆ రాష్ట్రానికి చెందాయి. అదేవిధంగా ఆంధ్రదేశానికి సంబంధించిన గ్రంథ సముదాయం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెందడం అవసరం.

ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారంలో తెలుగు లిఖిత గ్రంథాలు దాదాపు 5600 ఉన్నాయి. తెలుగు దేశచరిత్రకు సంబంధించిన బ్రౌన్ లోకల్ రికార్డులు 62 సంపుటాలున్నాయి. 300 మెకంజీ రికార్డు సంపుటాలలో ఎక్కువ భాగం ఆంధ్రదేశానికి సంబంధించినవే.

భాండాగారం సంస్కృత గ్రంథాల అకారాది [illegible]లో ఉన్న 31412 సంస్కృత గ్రంథాలలోను [illegible]లిపివి దాదాపు 13300. తెలుగు లిపిలోనివి [illegible]లవడం ఆశ్చర్యం కాదుకదా! ఇక తెలుగు [illegible]చి సేకరించబడిన నందినాగరి (దేవనాగరికి తక్కు[illegible]ని) సంస్కృత గ్రంథాలు వేనకువేలు. నందినాగరి హెచ్చుగా వ్యాప్తిలో ఉన్నది తెనుగు, కన్నడ [illegible]లలోనే.

భాండాగారంలో ఉన్న ఉరుదూ, ఫారసీ, అరబ్బీ గ్రంథాలు దాదాపు 2000. వీటిలో ఎక్కువ భాగం తెలుగునాడునుంచి వచ్చినవే.

ఇవన్నీ మనవి—మనకు చేరాలి. ఈ దాయ విభాగంలో అన్యాయం జరుగకుండా చూడడానికి ఉత్కళ రాష్ట్రావతరణ తర్వాత ఉత్కళ ప్రభుత్వం నియమించినట్టు ఒక ప్రత్యేక సంఘాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించడం సముచితం. ప్రాచ్య లిఖిత పుస్తకభాండాగారం వారికి ప్రాచీన పుస్తక ప్రచురణకు సలహాలివ్వడంకోసం నియమితమైన నిపుణుల సంఘంలో శ్రీయుతులు నేలటూరి వెంకటరమణయ్య, ఎం. రామానుజరావునాయుడు, నిడదవోలు వేంకటరావు, మల్లంపల్లి సోమశేఖరశర్మ గార్లు ఉన్నారు. వీరితోపాటు ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రతినిధిని, ఆంధ్రసాహిత్య అకాడెమీ ప్రతినిధిని, ఒక పత్రికా ప్రతినిధిని నియమించినా చాలు.

ఏది ఏమైనా, తెలుగు ముద్రిత, లిఖితగ్రంథాలూ, తెలుగు లిపిలోని సంస్కృత గ్రంథాలు 13300, తెనుగుదేశంనుంచి చేరిన నందినాగరి సంస్కృత గ్రంథాలు, ఫారసీ, అరబ్బీ, ఉరుదూ లిఖితగ్రంథాలూ, తెలుగు దేశచరిత్రకే విశేష సంబంధమున్న మెకంజీ, బ్రౌను రికార్డులు మనకు చేరకతప్పదు.

"పరులసేరల కాసపడను నేను,
సూదిమోపినయంత చోటు వదల,
పోరుకోరను, కలిసిన నూరకుండ
ఏది ఎట్లున్న ధర్మమే పాడుదీశు."

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna, at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street. Madras—1. Editor: S. Sambhu Prasad